

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 37

మంగళవారం 29-4-2025



72 ఏళ్ల వయసులో... కిలిమంజారోపైకి

- IIలో



మూడో పంటగా సౌర విద్యుత్తు

- IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాహసపథం



72 ఏళ్ల వయసులో... కిలిమంజారోపైకి

'వయసు పరిమితులు' అంటుంటాం.

అయితే క్రమశిక్షణ, సంకల్పబలం ఆ పరిమితులను తొలగించి గెలుపుదారిని చూపుతాయి.

అందుకు తాజా ఉదాహరణ విద్యాసింగ్.

72 ఏళ్ల వయసులో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఓల్డెస్ట్ ఇండియన్ ఉమన్‌గా చరిత్ర సృష్టించింది...

విద్యాసింగ్ పారిశ్రామికవేత్త, దాత, అథ్లెట్‌గా ప్రసిద్ధురాలు. 2013 నుంచి ట్రెక్కింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. భారతదేశం, భూటాన్, దక్షిణ అమెరికా... 19 ట్రెక్కింగ్‌లను పూర్తి చేసింది. విజయనగరం రాజకుటుంబానికి చెందిన విద్యాసింగ్ మద్రాస్‌లో పెరిగింది. చర్చ్ పార్క్, స్టెల్లా మేరీస్ కాలేజి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదువుకుంది.

ఆమె తండ్రి గోల్ఫ్, టెన్నిస్ క్రీడాకారుడు. గుర్రపు స్వారీ చేసేవాడు.

తల్లి అద్భుతమైన టెన్నిస్ క్రీడాకారిణి.

పదమూడు సంవత్సరాల వయసు నుంచే తల్లితో కలిసి టెన్నిస్ టోర్నమెంట్‌లలో పాల్గొనేది విద్యాసింగ్. 'టోర్నమెంట్ గెలిచిన తల్లీకూతుళ్ల జట్టు' అని పత్రికల పతాక శీర్షికలలో వచ్చేది.

మద్రాస్ యూనివర్శిటీ మహిళల టెన్నిస్ జట్టుకు విద్యాసింగ్ కెప్టెన్‌గా వ్యవహరించింది. మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలు గెలుచుకుంది. ప్రతి వారాంతంలో తన బృందంతో కలిసి 50–60 కిలోమీటర్‌లు సైక్లింగ్ చేస్తుంది.

మారథాన్‌లలో పాల్గొనడం, గుర్రపు స్వారీ చేయడం ఆమెకు ఇష్టం.

కిలిమంజారో 'ట్రెక్కింగ్ శిఖరం' అయినప్పటికీ తీవ్రమైన పరిస్థితులు, తీవ్రమైన ప్రమాదాలు పొంచి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని చెన్నైకి చెందిన 'గెట్ అప్ అండ్ గో' అనే ట్రెక్కింగ్ కంపెనీతో కలిసి ట్రెక్కింగ్ చేసింది. ఈ బృందంలో 10 మంది ట్రెక్కర్లు ఉన్నారు.

ఆరో రోజు రాత్రి 10.30 గంటలకు పర్వతారోహణ ప్రారంభమైంది.

గంటల తరబడి కఠినమైన పర్వతారోహణ తరువాత తెల్లావారేసరికి ఈ బృందం స్టెల్లా పాయింట్‌కు చేరుకుంది. ఆపై మరో 45 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి కిలిమంజారో ఉహురు శిఖరానికి చేరుకున్నారు.

'రోజంతా ఆకాశంలో గడపడం అద్భుతంగా అనిపించింది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి' అని ఆరోజును గుర్తు చేసుకుంది విద్యాసింగ్.

వయసు పరిమితిని అధిగమించి విద్యాసింగ్ అపూర్వ విజయాన్ని సాధించడానికి కారణం ఏమిటి?

ఆమె మాటల్లో చెప్పాలంటే...

'గుడ్ జీన్స్'

ఇంకా చెప్పాలంటే క్రమశిక్షణతో కూడిన జీవనవిధానం, క్రమం తప్పని వ్యాయామాలు.

● ఘనత

ఎనర్జిటిక్ హేమంగి



న్యూక్లియర్ సైన్స్‌లో మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మకమైన మేరీస్క్లోడోస్కా–క్యూరీ ఫెలోషిప్ ప్రోగ్రామ్(ఎంఎస్‌సీఎఫ్‌పీ)కు ఇండియన్ స్టూడెంట్ హేమంగి శ్రీవాస్తవ ఎంపికైంది.

మాస్కో పవర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎంపీఈఐ)లో హేమంగి ఎలక్ట్రానిక్స్ అండ్ నానో ఎలక్ట్రానిక్స్‌లో మాస్టర్స్ చేస్తుంది.

2023లో రష్యాలో నిర్వహించిన 'వరల్డ్ యూత్ ఫెస్టివల్'కు హాజరైన హేమంగి అక్కడ ఒక మహిళా ప్రొఫెసర్ నోటినుంచి న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యత గురించి విన్న మాటలు 'ఎంపీఈఐ'కి దరఖాస్తు చేయడానికి స్ఫూర్తిని ఇచ్చాయి. తాను ఎంచుకున్న సబ్జెక్ట్ గురించి 'సైన్స్, ఆర్ట్‌ల సమ్మేళనం' అంటుంది హేమంగి. మరింతమంది మహిళలు న్యూక్లియర్ సెక్టర్‌లోకి రావడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడానికి ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఏఈఏ) మేరీస్క్లోడోస్కా–క్యూరీ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టింది.

హిమాచలంలో ఉమెన్ పవర్

పర్యాటక ప్రేమికులకు సుపరిచితమైన పేరు... లాహౌల్ స్పితి. చుట్టూ హిమాలయ పర్వతాలతో మంత్రముగ్ధులను చేసే ప్రకృతి అందాలతో కనువిందు చేసే ఈ జిల్లా హిమాచల్‌ప్రదేశ్‌లో ఎక్కువ మంది సందర్శించే ప్రాంతం. దేశంలోనే అతి తక్కువ జనాభా ఉన్న జిల్లాల్లో ఒకటి.



కిరణ్ బదన, కలెక్టర్



ఇల్మా అఫ్రోజ్, ఎస్.పి



ఆకాంక్ష శర్మ, ఎస్‌డీఎం

ఉపాధికోసం పురుషులు ఎక్కువగా వలస పోవడంతో ఈ ప్రాంతంలో మహిళల జనాభా ఎక్కువ. 2024 ఉపఎన్నికల్లో అనురాధ రాణా శాసనసభ్యురాలిగా ఎన్నికైంది. జిల్లాలో ఆమె రెండో మహిళా శాసనసభ్యురాలు. రాజకీయాల్లో పెరిగిన మహిళల ప్రాతినిధ్యానికి ఆమె విజయం అద్దం పడుతుంది.

ఇక జిల్లా పాలనా యంత్రాంగం విషయానికి వస్తే... జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్... ఇల్మా ఆఫ్రోజ్, ఐఏఎస్ ఆఫీసర్ కిరణ్ బదన జిల్లా కలెక్టర్, ఆకాంక్ష శర్మ 'సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్'గా కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తున్నారు... ఇలా ఎంతోమంది మహిళలు జిల్లా పాలన యంత్రాంగంలో కీలకమైన స్థానాల్లో ఉన్నారు.

కఠినమైన వాతావరణం, సుదూర ప్రాంతం కారణంగా పోస్టింగ్‌కు ఎక్కువమంది ఇష్టపడని జిల్లాగా ఒకప్పుడు లాహౌల్ స్పితికి పేరుండేది. అయితే ఆ తరువాత సంప్రదాయ ఇమేజ్ చెరిగిపోవడం మొదలైంది.

దీనికి కారణం... మహిళా అధికారులు.

వృత్తిపరమైన సంతృప్తి,ప్రత్యేకమైన సవాళ్లను ఇష్టపడే మహిళా అధికారులు ఎక్కువగా ఇష్టపడే జిల్లాగా 'లాహౌల్ స్పితి' గుర్తింపు పొందింది.

● ట్రెండ్

ఖాదీ కమ్ బ్యాక్



సాంస్కృతికపరంగానే కాదు వాణిజ్యపరంగా కూడా ఖాదీ పునర్జీవనం హైలెవెల్లో ఉంది. ఖాదీ గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు 2024–25 నాటికి అనూహ్యంగా రూ.1,70,551,37 కోట్లకు పెరిగాయి.

గ్రామీణ భారతంలో ఖాదీ జీవనోపాధి వనరు, పట్టణాల్లో మాత్రం ప్రతీకాత్మక వస్త్రధారణగా మారింది. ప్రత్యేక సందర్భాల్లో ఖాదీ దుస్తులు ధరించే వారి సంఖ్య పెరుగుతోంది.

ఎంతోమంది ఫ్యాషన్ డిజైనర్‌లు ఖాదీతో ఎక్స్‌పెరిమెంట్స్ చేయడం విశేషం. ఫ్యాషన్ ఇండస్ట్రీలో 'న్యూ ఖాదీ ఫర్ ది న్యూ ఇండియన్' ధోరణి వేళ్లూనుకుంది. 'న్యూ ఖాదీ ఫర్ న్యూ ఇండియన్' నినాదాన్ని తమ ప్రచారానికి వాడుకుంటుంది లూనా బ్రాండ్. ఆధునిక మార్కెట్ కోసం ఖాదీని పునర్నిర్వచిస్తున్న బ్రాండ్‌లలో బెంగళూరుకు చెందిన లూనా బ్రాండ్ ఒకటి. కొత్త బ్రాండ్‌లు ట్రెండ్ ఆధారిత ఫ్యాషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

'ఖాదీకి ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా విలాసవంతమైన, నైతిక, పర్యావరణ హితమైన భవిష్యత్తుకు పునాది వేయవచ్చు' అంటున్నారు ఖాదీని ఇష్టపడే ఫ్యాషన్ డిజైనర్‌లు.

కిచెన్ టిప్స్

కిచెన్‌లో నూనె ఒలికిపోతే వెంటనే నూనె మీద గోధుమ పిండి చల్లాలి. ఐదు నిమిషాల తరువాత పేపర్‌తో తుడిస్తే నూనె పడిన ప్రాంతం జిడ్డులేకుండా శుభ్రం పడుతుంది.

● కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై మరకలు ఉంటే.. బేకింగ్ సోడా వేసిన నీళ్లతో తుడిస్తే వెంటనే తొలగుతాయి. దుర్వాసనా ఉండదు. దీన్ని శుభ్రం చేసేందుకు బ్లీచింగ్, అమోనియా లాంటివి అస్సలు వాడకూడదు. ఇవి ఉపయోగిస్తే క్యాబినెట్‌కున్న రంగులు, టైల్స్ దెబ్బ తింటాయి.



జుట్టుకు హెల్దీ జెల్

బ్యూటిప్స్



కప్పు అవిసె గింజలను తీసుకుని నాలుగు కప్పుల నీళ్లపోసి బాగా మరగనివ్వాలి. అవిసె గింజలు ఉడికిన తరువాత నీటిని వడగట్టి నాలుగు చుక్కలు ఆలివ్ ఆయిల్, టీస్పూను కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో పోసి పదిహేను రోజుల పాటు రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి. పదిహేను రోజుల తరువాత ఇది జెల్‌గా మారుతుంది. అప్పుడు రెండు టీస్పూన్ల జెల్‌కు విటమిన్ ఈ ఆయిల్ క్యాప్సూల్ ఒకటి కలిపి తలకు పట్టించి మర్దన చేయాలి. అరగంట తరువాత షాంపూతో తలంటి పోసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల కుదళ్లకు పోషణ అంది జుట్టు పెరుగుతుంది. చుండ్రు సమస్య వదిలి మాడు శుభ్ర జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.

సాగుబడి

భరణి కార్తె : ఏప్రిల్ 27 నుంచి

రెండు అద్భుత వంగడాలు!

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండు అద్భుత వంగడాలను రూపొందించింది. కరువును తట్టుకునే మునగ వంగాన్ని, మగ మొక్కల సంఖ్యను తగ్గించే బొప్పాయికి సంబంధించి గ్రాఫ్టింగ్ టెక్నాలజీని రూపొందించింది.

అధిక దిగుబడినిచ్చే పికెఎం–1 మునగ రకాన్ని దేశవ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్నారు. దీని సీజన్ మార్చి నుంచి ఆగస్టు వరకు. అయితే, కరువు ప్రాంతాల్లో వేసవిలో ఈ పంటను రక్షించుకోవటం రైతులకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కరువును తట్టుకునే మూలనూరు /కరుంబు మునగ వేరుకాండానికి పికెఎం–1 రకాన్ని విజయవంతంగా అంటుకట్టినట్లు కోయంబత్తూరులోని టిఎన్ఎయు ఉద్యాన కాలేజీ–పరిశోధనా స్థానం డీన్ డా. ఇరెనె వెత్తమోని ప్రకటించారు. క్షేత్ర పరీక్షల్లో ఇది 67% సక్సెస్ అయ్యింది.

బొప్పాయి మొక్కలు నాటిన రెండు,మూడు నెలల తర్వాత పూత వస్తుంది. అప్పటికి గానీ ఏ మొక్క మగ లేదా ఆడ అని తెలీదు. తోటలో 20 ఆడ మొక్కలకు ఒక మగ మొక్క ఉంటే చాలు. మిగతా మగ మొక్కల్ని పీకెయ్యాల్సిందే. బొప్పాయిలో నేల ద్వారా సోకే తెగుళ్లు కూడా ఎక్కువే. ఈ సమస్యలను అధిగమించేందుకు అడవి బొప్పాయి వేరుకాండానికి ఆడ మొక్కలను గ్రాఫ్టింగ్ చేసే సాంకేతికతను టిఎన్ఎయు రూపొందించింది. సక్సెస్ రేటు 52%. చెట్టుకు 1.3 కిలోల దిగుబడి వచ్చిందట.

మెట్ట భూముల్లో సోలార్ ప్యానెళ్లను నేలపైనే ఏర్పాటు చేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయటం తెలిసిందే. అయితే, వ్యవసాయ భూమిని ఇలా సోలార్ ప్యానళ్ల మయం చేస్తూ పోతే సాగు విస్తీర్ణం తగ్గిపోతుందన్న భయాందోళనలు లేకపోలేదు. **అందుకే, పంటలను సాగు చేస్తూ అదే పొలంలోనే సోలార్ ప్యానళ్లతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తే మేలు కదా!** ప్యానళ్ల ఏర్పాటులో కొన్ని మార్పులు చేసుకుంటే పొలాల్లో పంటలతో పాటు పనిలో పనిగా సౌర విద్యుత్తును కూడా నిక్షేపంగా పండించుకోవచ్చని విదేశీ అనుభవాలు చెబుతున్నాయి. వ్యవసాయ రంగంలో **ఇది సరికొత్త ట్రెండ్.** అదే 'అగ్రివోల్టాయిక్స్'! ఏడాదికి రెండు (ఖరీఫ్, రబీ) పంటలతో పాటే అదే పొలంలో **మూడో పంటగా సౌర విద్యుత్తు ఉత్పత్తిపై మన దేశంలోనూ ప్రయోగాలు జరుగుతున్నాయి.** అనేక చోట్ల పైలట్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. **ఆ సంగతులేమిటో చూద్దాం..!**



సోలార్ ప్యానళ్ల మధ్య పంటల సాగు

బోరు రీఛార్జి :: ప్రశ్నోత్తరాలు-2



ప్రశ్న: వ్యవసాయ పొలంలో ఒకటి కన్నా ఎక్కువ సంఖ్యలో బోర్లు ఉన్నప్పుడు, రీఛార్జి కట్టడం నిర్మాణానికి అనువైన బోరు బావిని ఎలా ఎంపిక చేసుకోవాలి?

హైడ్రాలజిస్ట్ రామ్‌మోహన్: కొన్ని పొలాల్లో ఒకటి కన్నా ఎక్కువ బోర్లు ఉండవచ్చు. వాటిని తవ్విన సంవత్సరం వాటి లోతు, అవి తోడే నీటి పరిమాణం వేర్వేరుగా ఉండవచ్చు. అలాంటి పరిస్థితి ఉన్నప్పుడు, అన్ని బోరుబావులకు 'ట్యాంకర్ టెస్ట్' చేయాలి. ఆయా బోరుబావుల్లో ట్యాంకర్ నీరు పోసిన తరువాత నీటి మట్టం తిరిగి స్థిర నీటిమట్టం చేరడానికి ఎంత సమయం పడుతోందో లెక్కించాలి. ఆ సమయాలను పోల్చి చూసి, రీఛార్జి చేయడానికి అనువైన బోరుబావిని ఎంపిక చేయవచ్చు.

ఇది కాకుండా మరికొన్ని ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు, బోరు బావికి ఉన్న నీటి పరివాహక ప్రాంతం, బోరుబావి కట్టడం వైపునకు సహజ రీతిలో వాననీటి ప్రవాహానికి అవకాశం ఉండటం, చెత్తా చెదారం పడటానికి అవకాశం లేకుండా చెట్ల నీడ లేని బోరుబావి, లోతు తక్కువ ఉన్న బోరు బావిని గనుక రీఛార్జి కోసం ఎంపిక చేసుకుంటే, రీఛార్జి కట్టడం ద్వారా ఆ పక్కనున్న బోరు బావులకు కూడా నీరు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ప్రశ్న: 'ట్యాంకర్ టెస్ట్' ద్వారా అప్పటికే ఉన్న బోరుబావి (ఎగ్జిస్టింగ్ బోర్‌వెల్) ఎంపిక అవడానికి ఎంతమటుకు అవకాశాలు ఉంటాయి?

హైడ్రాలజిస్ట్ రామ్‌మోహన్: గ్రానైట్‌తో కూడిన గట్టి రాతి నేలల విషయంలో గత అనుభవాలను పరిశీలిస్తే, 50% నుంచి 60% మాత్రమే బోరు బావులు రీఛార్జి చేయటానికి అనువుగా తేలాయి. అందుకని, బోరుబావులను రీఛార్జి చేసే ముందు ట్యాంకర్ టెస్ట్ చేయడం తప్పనిసరి. అదే రీతిలో, తక్కువ లోతులో ఉండే మూయబడని అక్వాఫెర్లు (అన్‌కన్‌ఫైన్డ్ అక్విఫెర్), స్థానికంగా పరిమిత వైశాల్యంలో విస్తరించిన అక్విఫెర్లు ఉన్న ప్రాంతాల్లో లోతు తక్కువగా ఉన్న బోర్లను రీఛార్జి కోసం ఎంచుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయని తేలింది. మూయబడిన అక్విఫెర్లు ఉన్న ప్రాంతంలో, బాగా లోతుగా ఉండే బోరుబావుల్లో రీఛార్జి స్థాయి కొంత తక్కువగా ఉంటుంది.

ఇతర వివరాలకు: వాటర్ అండ్ లైవ్‌లిహుడ్స్ ఫౌండేషన్ సీనియర్ హైడ్రాలజిస్ట్ రామ్‌మోహన్ – 94401 94866.

మూడో పంటగా సౌర విద్యుత్తు!

సౌర విద్యుత్తు ప్యానళ్ల మధ్యలో, నీడలో పంటల సాగు | దేశంలో అనేక చోట్ల ప్రయోగాత్మకంగా సాగు

సోలార్ ప్యానళ్ల పక్కన పంటలు

నేలకు ఒకటి, రెండు అడుగుల ఎత్తులో గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్యానళ్లను వరుసలుగా ఏర్పాటు చేసుకొని, ఆ వరుసల మధ్యలో ఎక్కువ దూరం ఉండేలా చూసుకొని.. ఆ ఖాళీలో పంటలను పండిస్తున్న సంస్థలు ఉన్నాయి. కేరళలోని కొచ్చిన్ విమానాశ్రయంలో, గుజరాత్‌లోని సర్దోయ్‌లో కూడా ఇలాంటి ప్రయోగాత్మక సోలార్‌లో అంతర సాగు జరుగుతోంది. ప్యానళ్ల వరుసల మధ్యలో గోరింటాకు మొక్కలు సాగు చేస్తున్నారు. బలమైన గాలుల నుంచి సోలార్ ప్యానళ్లను రక్షించడానికి కూడా ఈ మొక్కలు ఉపయోగంగా ఉన్నాయంటున్నారు. ప్యానళ్లను కడిగే నీటిని ఈ మొక్కలకు మళ్లిస్తూ నీటిని పునర్వినియోగిస్తున్నారు.

ప్యానళ్ల నీడలో పంటలు

మహారాష్ట్రలోని పర్బనిలో 5 ఎకరాల్లో ఒక మోస్తరు ఎత్తున ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్ల కింద తక్కువ ఎత్తు పెరిగే అల్లం, పసుపు, పెసలు, బెండ వంటి పంటలు పండిస్తున్నారు. 50 మెగావాట్ల ప్రాజెక్టును సన్‌సీడ్ ఎపివి, కనొడా ఎనర్జీ, జీఐజెడ్ జెర్మన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉమ్మడిగా నెలకొల్పాయి. 'సోలార్ ప్యానళ్ల కింద మేం పెట్టిన పంటలు బాగానే పెరుగుతున్నాయి. మామూలు పొలాల్లో సమానంగానే దిగుబడి వస్తోంది. అయితే, చెరకు వంటి బాగా ఎత్తుగా పెరిగే పంటలను సోలార్ ప్యానళ్ల కింద పెంచలేం' అన్నారు ఈ క్షేత్రాన్ని నిర్వహిస్తున్న యువ రైతు గోవింద్ రసవె.



ఎలివేటెడ్ సోలార్ ప్యానళ్ల నీడలో ఉద్యాన పంటల సాగు

ప్యానళ్ల కింద పశువుల పెంపకం

మారుమూల ప్రాంతాల్లో వ్యవసాయానికి విద్యుత్తు దొరకదు. సోలార్ ప్యానళ్ల కింద పంటలు పండించుకుంటే, విద్యుత్తు సమస్య తీరుతుంది, పంటలపై కూడా ఆదాయం వస్తుంది. ఆ విధంగా రైతులకు అగ్రివోల్టాయిక్స్ ద్వారా అనేక ప్రయోజనాలు నెరవేరుతాయని మహేశ్ సంతృప్తిగా చెప్పారు. ఎలివేటెడ్ సోలార్ ప్యానళ్ల కింద పంటలనే పండించాలనేం లేదు, పశువులను కూడా పెంచుకోవచ్చు. ఢిల్లీ పరిసరాల్లో 2.5 ఎం.డబ్ల్యూ. సామర్థ్యం గల ఎలివేటెడ్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, అందులో పశువులను మేపితే మంచి ఆదాయం వచ్చిందని రుజువైందని ఆయన అన్నారు.

ద్రాక్ష తోట కూడా..

మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉన్న దేశంలోనే అతి పెద్ద రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పిఓ) సహ్యాద్రి ఫామ్స్ కూడా ప్రయోగాత్మకంగా సోలార్ సేద్యం చేస్తోంది. ఒక ఎకరంలో సోలార్ ప్యానళ్లను 3.75 మీటర్ల ఎత్తున ఏర్పాటు చేసి, వాటి నీడన రకరకాల పంటలను సాగు చేస్తోంది. 250 కె.డబ్ల్యూ. సామర్థ్యంతో కూడిన బై–ఫేసియల్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్యానళ్ల కింద ద్రాక్ష తోటలు పెంచుతున్నారు. ప్రత్యేకంగా పందిళ్లు వేయాల్సిన అవసరం లేకుండా ప్యానళ్ల కోసం ఏర్పాటు చేసే ఫ్రేమ్‌లకే ద్రాక్ష తీగలను పాకించవచ్చు. కీర, టొమాటో వంటి పంటలకు కూడా ప్రత్యేకంగా స్టేకింగ్ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉండదు. ఆ ఖర్చు తగ్గుతుందని సహ్యాద్రి ఫామ్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ మహేశ్ షెల్కె చెప్పారు.

బెండ, సొర, కొత్తిమీర..

రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌లో కేంద్రీయ మెట్ట ప్రాంత వ్యవసాయ పరిశోధనా సంస్థలో, గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాలోనూ 3 మీటర్ల ఎత్తున పెట్టిన సోలార్ ప్యానళ్ల నీడన బెండ, సొర, కొత్తిమీర, గోరుచిక్కుడు పండిస్తున్నారు. శీతాకాలంలో టొమాటోలు, కీరదోస, జుకిని, మిరప పంటలు పండిస్తున్నారు. మరో పద్ధతి ఏమిటంటే.. సోలార్ ప్యానళ్లను బల్లపరుపుగా కాకుండా, నిట్ట నిలువుగా ఏర్పాటు చేసి, వాటి మధ్యలో ధాన్యపు పంటలు పండించుకోవటం. మహారాష్ట్రలో ఇటువంటి వర్టికల్ బైఫేషియల్ సోలార్ అగ్రివోల్టాయిక్స్ ప్రాజెక్టును నెక్స్ట్2సన్, వాట్‌కార్ట్ సంస్థలు నెలకొల్పాయి. ఇలా 90% భూమిలో పంటలు పండించుకోవచ్చు. పది శాతం నేల మాత్రమే సోలార్ ప్యానళ్లకు సరిపోతుంది.



వర్టికల్ సోలార్ ప్యానళ్ల మధ్యలో ధాన్యపు పంటలు

రైతులకు రిస్క్ లేదు

సన్‌సీడ్ ఎపివి సంస్థ అధిపతి వివేక్ సరఫ్ మాట్లాడుతూ 'ఈ అగ్రివోల్టాయిక్స్ ప్రాజెక్టులో రైతులకు ఎటువంటి రిస్క్ లేదు. పెట్టుబడి మాది. పెట్టుబడి రిస్క్ మాకే ఉంటుంది. భూములు కౌలుకు ఇచ్చిన రైతులకు రిస్క్ ఏమీ లేదు. సాధారణ పంటలు సాగు చేస్తే రైతుకు ఎకరానికి ఏడాదికి రూ. 50 వేల వరకు వస్తాయి. అగ్రివోల్టాయిక్స్‌కు ఇస్తే ఆ పంట దిగుబడులతో పాటు కౌలు రూ. 50 వేల వరకు అదనపు ఆదాయం వస్తుంది. ఈ వ్యవసాయ పనులు చేసే రైతులకు ఇంకా అదనపు ఆదాయం కూడా వస్తుంది' అన్నారు. అయితే, విడిగా రైతులు దీర్ఘకాలిక కౌలుకు ఇవ్వాలంటే వెనుకాడతారు. రైతులు బృందంగా, ఎఫ్‌పిఓగా ఏర్పాడితే అప్పుడు ఆ సంకోచం ఉండదు అన్నారాయన. సౌరవిద్యుత్తు ఉత్పత్తితో పాటు పంటల సాగులో వున్న సమస్యలు మున్ముందు తీరిపోతాయి. రైతులకు ఏటా రెండు పంటలతో పాటు సౌర విద్యుత్తును మూడో పంటగా పండించుకోవటం సులభ సాధ్యమవుతుందని, రైతుల ఆదాయం పెరుగుతుందని ఆశిద్దాం.


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 37

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మంగళవారం 29-4-2025



100 రోజుల ట్రంపరితనం

ట్రంప్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టి మంగళవారానికి 100 రోజులు. 'పూటకో మాట, రోజుకో వైఖరి' అన్నట్టుగా పదే పదే నిర్ణయాలను మార్చుకుంటూ నవ్వులపాలవుతున్నారు.

- వివరాలు 6లో ▶




జేఎన్‌యూలో పట్టునిలుపుకున్న వామపక్షం

ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో వామపక్షాలు సత్తా చాటాయి. కీలకమైన నాలుగు పదవుల్లో మూడింటిని కైవసం చేసుకున్నాయి.

- వివరాలు 6లో ▶

వైభవోజ్వల సెంచరీ



- ఐపీఎల్‌లో 'శత'క్కొట్టిన వైభవ్ సూర్యవంశీ
- 35 బంతుల్లోనే సెంచరీ చేసిన రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్
- టి20 చరిత్రలో సెంచరీ చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు

12లో

న్యూస్‌రీల్

లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణం



లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, ఉపలోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్‌లో వారితో ప్రమాణం చేయించారు.

- వివరాలు 3లో ▶

ముష్కర మూకలకు ముచ్చెమటలు



పహల్గాంలో ఉగ్రవాదుల రాక్షసకాండ తర్వాత కోపంతో రగిలిపోతున్న భారతసైన్యం ఏక్షణంలోనైనా పీఓకేలోని ఉగ్రవాదుల శిబిరాలపై దాడి చేయొచ్చనే భయానుమానాలు పాక్ సైన్యంలో ఎక్కువయ్యాయి.

- వివరాలు 6లో ▶

సెటప్ చేయడానికే ఏడాది

కేసీఆర్ వల్లే అన్ని అనర్థాలు... ఇప్పటివరకు ప్లానింగ్‌కే సరిపోయింది

మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్

- రాష్ట్ర ఖజానా అంతా కేసీఆరే లూటీ చేశారు
- నేను సీఎం అయినప్పుడే ఆయన గుండె పగిలింది
- ఎల్కతుర్తి సభలో తన అక్కసు అంతా వెళ్లగక్కాడు
- రాష్ట్రంలో ఉన్న పథకాలు దేశంలో ఎక్కడా లేవు
- లాంచింగ్, క్లోజింగ్ పథకాలు నాతో కాదు.. షోపుటప్ స్కీంలు పెట్టను
- రాష్ట్ర ప్రజలు మాకు కూడా పదేళ్లు అవకాశం ఇస్తారు
- ఇంకా ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటానన్న సీఎం



జానారెడ్డి నివాసంలో ఆయనతో పాటు కేశవరావుతో భేటీ అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న అన్ని అనర్థాలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే కారణమని, రాష్ట్ర ఖజానా అంతా లూటీ చేసింది ఆయనేనని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ రజతోత్సవం పేరుతో ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభలో ఆయనలో ఉన్న అక్కసునంతా వెళ్లగక్కాడని విమర్శించారు. వాస్తవానికి తాను ముఖ్యమంత్రిని అయిన రోజునే కేసీఆర్ గుండె పగిలిందని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక.. అంతకుముందు పదేళ్లలో కేసీఆర్ చేసిన విధ్వంసాన్ని సెట్ చేయడానికే ఏడాది కాలం సరిపోయిందని, ఇప్పుడంతా స్ట్రీమ్‌లైన్ (క్రమబద్ధీకరణ) చేస్తున్నామని చెప్పారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి నివాసంలో రేవంత్‌రెడ్డి మీడియాతో ముచ్చటించారు. బీఆర్‌ఎస్ సభ, మావోయిస్టుల సమస్య, కేసీఆర్ పాలన, తన పనితీరు, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, రాహుల్‌గాంధీతో తనకున్న మైత్రి తదితర అంశాలపై మాట్లాడారు.

ఎవరో అడుగుతున్నారని అరెస్టులు ఉండవు

'కేసీఆర్ ప్రసంగంలో పస లేదు. బీఆర్‌ఎస్ ఎల్కతుర్తి సభ కంటే నేను గజ్వేల్‌లో పెట్టిన సభే హైలైట్. ఖమ్మంలో జరిగిన రాహుల్‌గాంధీ సభకు బీఆర్‌ఎస్ హయాంలో కనీసం బస్సులు కూడా ఇవ్వలేదు. కానీ మేం బీఆర్‌ఎస్ నేతలు అడిగినన్ని బస్సులు ఇచ్చాం. తద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా వచ్చింది. హరీశ్, కేటీఆర్‌లు చిన్నపిల్లలని నేను అసెంబ్లీలో మాట్లాడిన విషయాన్నే కేసీఆర్ ఎల్కతుర్తి సభలో చెప్పాడు. మరి పిల్లగాళ్లను అసెంబ్లీకి ఎందుకు పంపిస్తున్నాడు? కేసీఆర్, మోదీ వారి అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతుంటారు. కేసీఆర్ తరహాలో నేను చట్టాన్ని అతిక్రమించి పనిచేయను. ఎవరో అడుగుతున్నారని అరెస్టులు చేసే పరిస్థితి ఉండదు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడేది లేదు. చట్టప్రకారమే

మిగతా 2వ పేజీలో ▶

ఘనంగా పద్మ అవార్డుల

ప్రదానోత్సవం

పురస్కారాలు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులు పద్మ పురస్కారాలు అందుకున్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డులు–2025 ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొత్తం నలుగురు అవార్డులు అందుకున్నారు. వైద్యరంగంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్ రెడ్డి (పద్మ విభూషణ్), కళా రంగంలో నందమూరి బాలకృష్ణ (పద్మ భూషణ్), మాడుగుల నాగఫణిశర్మ (పద్మశ్రీ), మిరియాల అప్పారావు (పద్మశ్రీ) తరఫున ఆయన కూతురు యడవల్లి శ్రీదేవి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జి.కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్‌తోపాటు ఏపీ మంత్రి నారా లోకేశ్ దంపతులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మవిభూషణ్ పురస్కారాన్ని స్వీకరిస్తున్న డా.నాగేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్-జగిత్యాల

హైవేకు ఓకే

అటవీ, పర్యావరణ అనుమతులు జారీ... త్వరలో టెండర్లు

16లో

భూదాన్ భూముల కేసులో

ఈడీ దాడులు



- నిందితుల ఇళ్లపై వేకువజాము నుంచి సాయంత్రం దాకా ఏకకాలంలో సోదాలు
- రూ. 9.5 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, కీలక పత్రాలు, సుమారు 40 లగ్జరీ కార్లు స్వాధీనం
- ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అమోయ్ కుమార్ సహా పలువురిని విచారించిన ఈడీ

13లో

వన్నెతగ్గుతున్న .. పాలిటెక్నిక్ విద్య

దేశవ్యాప్తంగా తగ్గుతున్న ప్రవేశాలు



సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్య వన్నె తగ్గుతోంది. ఓవైపు ఏటికేటికీ తగ్గుతోన్న ప్రవేశాలు..కళాశాలల్లో అధ్యాపకుల కొరత.. ఉపాధి సామర్థ్యాన్ని పెంచడంలో వెనుకబాటు.. మరో వైపు కొత్త పుంతలు తొక్కుతోన్న అధునాతన ఇంజినీరింగ్ కోర్సులు..వెరసి పాలిటెక్నిక్ ఉనికికి సవాల్ విసురుతున్నాయి. పాలిటెక్నిక్ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా కల్పించేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) ప్రవేశపెట్టిన పథకాన్ని పరిశీలిస్తే విషయం స్పష్టమవుతోంది. ఈ స్వయం ప్రతిపత్తి విధానాన్ని రెండేళ్ల కిందట అమలు చేయగా...ఇప్పటిదాకా మహారాష్ట్ర, కర్నాటకలోని 5 కళాశాలలే అర్హత సాధించడం గమనార్హం.

59 శాతం ప్రైవేటు యాజమాన్యాలే..

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు సైతం క్రమంగా తగ్గుతున్నాయి. దీనికి తోడు సీట్ల సంఖ్య కూడా క్షీణిస్తూ వస్తోంది. ముఖ్యంగా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలో ప్రైవేటు సంస్థలే కీలకంగా వ్యవహరిస్తున్నాయి. 2024–25లో ఏఐసీటీఈ ఆమోదించిన సంస్థల జాబితా ప్రకారం దేశంలో 3566 పాలిటెక్నిక్ కళాశాలలు ఉంటే వాటిలో 59 శాతం ప్రైవేటు యాజమాన్యాల చేతిలో ఉండటం గమనార్హం.

ఆదర్శం..ఆ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు

పాలిటెక్నిక్ విద్య ప్రారంభంలో ప్రభుత్వ హయాంలోనే నడిచేది. కాల క్రమేణా ప్రైవేటు పరం చేయడంతో కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కేవలం వ్యాపారకోణంలోనే కాలేజీలు నడిచేవి. దీంతో పాలిటెక్నిక్ విద్య నాసిరకంగా మారింది. అయితే ఇప్పటికీ కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వమే నడిపిస్తోంది. వాటిలో గోవా, అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, లక్షద్వీప్, దాద్రా–నాగర్ హవేలీ ఉన్నాయి. ఇక్కడ పాలిటెక్నిక్ విద్య ప్రైవేటీకరణ జరగలేదు.

ఏటా క్షీణిస్తున్న ప్రవేశాలు..

పాలిటెక్నిక్‌లో ఏటా సీట్ల భర్తీ కోసం కళాశాలలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే 2017–23వరకు ఐదేళ్ల కాలంలో దాదాపు ఐదో వంతు (19.7శాతం) సీట్లు తొలగించినట్టు తెలుస్తోంది. మరోవైపు ప్రవేశాలు పూర్తయిన తర్వాత కూడా భారీ సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయి. ఇటీవల ఏఐసీటీఈ పరిశ్రమలకు అనుగుణంగా పాఠ్యాంశాలు సవరించినప్పటికీ ఫలితం కనిపించట్లేదు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యను ఢిల్లీ మాదిరిగా కొన్ని రాష్ట్రాలు నైపుణ్య వర్సిటీల కిందకు తీసుకురావాలని భావిస్తున్నాయి. మరోవైపు ఫీజులు పెరగడంతో విద్యార్థులు ప్రత్యామ్నాయ కోర్సుల వైపు మరలుతున్నారు.

మెరుగుపడాలంటే..

- పాలిటెక్నిక్ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి అంశంలో ఏఐసీటీఈ, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి.
- ప్రభుత్వాలు కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు పెంచాలి.
- స్వయం ప్రతిపత్తి హోదాకు నిర్దేశించిన అంశాలను సంతృప్తి పరచడంలో చాలా విద్యా సంస్థలు విఫలమవుతున్నాయి. దీన్ని అధిగమించాలి.
- ముఖ్యంగా అధ్యాపకుల కొరత పాలిటెక్నిక్ విద్యను ప్రభావితం చేస్తోంది. ఈలోటును భర్తీ చేయాలి.
- లైబ్రరీలు, ప్రయోగశాలలు, తగినన్ని వనరుల కల్పనపై దృష్టి సారించాలి. అలాగే వర్క్‌షాప్‌లు నిర్వహించాలని నిపుణులు సూచిస్తున్నారు.

కేసీఆర్‌కు ఎందుకు దుఃఖం?

- కాళేశ్వరం గుట్టు రట్టయినందుకా?.. ధరణి భూ బాగోతం బయటపడిందనా?
- ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు మేలు జరుగుతున్నందుకా?
- భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి పొంగులేటి ధ్వజం



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన మంత్రి పొన్నం తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్/వర్గల్ (గజ్వేల్): 'బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల పేరిట ఎల్కతుర్తిలో సభ నిర్వహించిన కేసీఆర్.. పదేపదే తనకు దుఃఖం వస్తోందన్నారు. ఎందుకు ఆయన దుఃఖం వస్తోంది? ఉద్యోగం ఊడిందనా? కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి బటయపడిందనా? ధరణి పేరిట చేసిన బాగోతం తెలిసి పోయిందనా? లేక ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు మంచి పథకాలు అందుతున్నందుకా? సన్న బియ్యం ఇస్తున్నందుకా? ఎందుకు వస్తోంది దుఃఖం.. 'అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో పేదల ఉసురు పోసుకుని, ఇప్పుడు ఇందిరమ్మ పాలనలో వారికి మేలు జరుగుతుంటే సహించలేకపోతున్నారని అన్నారు. పాముకు తలలో విషముంటే ఆయనకు నిలువెల్లా విషమేనని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మను, కాంగ్రెస్ పార్టీని విలన్ అనటానికి నోరెలా వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ భారతి–2025 చట్టంపై సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో, సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారంలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు చేస్తున్నాం: అసెంబ్లీలో తమ పిల్లలు అడిగిన ప్రశ్నలకే బదులివ్వడం లేదని కేసీఆర్ అన్నారని, ఆ ఇద్దరూ పిల్లలు కాదని, అచ్చోసిన ఆంబోతులని..అసెంబ్లీలో భూభారతి బిల్లు పెడితే తనపై, స్పీకర్‌పై దాడికి పాల్పడ్డారని పొంగులేటి ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే.. పథకాల అమలులో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందనడం సరికాదన్నారు. పేద ప్రజలకు న్యాయం జరిగేందుకే భూభారతి చట్టం తెచ్చామని, ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో అమలు చేస్తున్నామని, జూన్ 2 నుంచి అన్ని గ్రామాల్లో అమలు చేస్తామని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, దరఖాస్తు ఖర్చు కూడా లేకుండా అధికారులే ఇల్లిల్లూ తిరిగి భూ సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతులకు భూమి అంటే ఆత్మగౌరవం..విశ్వాసమని అన్నారు. రైతులకు ఉన్న భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి హక్కులు కల్పిస్తుందని చెప్పారు. సదస్సులో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కలెక్టర్లు ప్రావీణ్య, మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎల్కతుర్తి సభ రేవంత్ పాలనపై రెఫరెండం

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ఎల్కతుర్తి సభ సీఎం రేవంత్ పాలనపై రెఫరెండం లాంటిదేనని, ప్రజలంతా కేసీఆర్ వైపే ఉన్నారని రుజువైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. రజతోత్సవ సభ కాంగ్రెస్ పార్టీకి కేవలం ట్రైలర్ మాత్రమేనని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు కిషోర్‌గౌడ్, ఉపేంద్రాచారి, డాక్టర్ కురువ విజయ్ కుమార్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సభ విజయవంతం కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ తెలంగాణకు విలన్ నెంబర్ వన్ అని కేసీఆర్ అనడంలో తప్పేమి లేదన్నారు. సభలో రేవంత్‌రెడ్డి పేరు ఎత్తలేదని ఆయన అన్నం తినకుండా పడుకున్నారని, నలుగురు మంత్రులను బీఆర్ఎస్ పార్టీపై పురిగొల్పాడని, మంత్రులు ఇష్టారాజ్యంగా కేసీఆర్‌పై విమర్శలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ సభ సక్సెస్ తర్వాత వాళ్లు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని, రేవంత్ సిద్ధం చేసుకున్న స్క్రిప్టును మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎందుకు కుదేలైందో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్తారా అని శ్రవణ్ ప్రశ్నించారు.

రేవంత్ భయానికే కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లడం లేదు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి భయానికే మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లడం లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళితే రేవంత్‌రెడ్డి తనను కడిగేస్తాడనే ఆలోచన కేసీఆర్‌కు ఉందని, అందుకే ఆయన అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. ఒక్కసారి అసెంబ్లీలో రేవంత్‌కు కేసీఆర్ ఎదురుపడితే అప్పుడు తెలంగాణ పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉనికిని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఆ సభలో గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడిన మాటలు ఆశ్చర్యంగా అనిపించాయన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, రాహుల్‌గాంధీని ఉద్దేశించి నోరుజారినందుకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని చెప్పిన కేసీఆర్ తన మాటకు విలువ లేకుండా ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నాడన్నారు. కేసీఆర్ తెలంగాణ నినాదం నుంచి వెనక్కి తగ్గాలనుకున్నప్పుడు ఆయన్ను వెనుక ఉండి నడిపించింది కాంగ్రెస్ నేతలేనని చెప్పారు.

తెలంగాణకు తొలి, చివరి విలన్ కేసీఆరే

- విలేకరుల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- కేటీఆర్, హరీశ్, కవిత మూడు ముక్కలాటతో ఆయనకు మతిభ్రమించిందని విమర్శ
- ఎవరి పాలన ఫెయిల్ అయిందో బీఆర్ఎస్ చర్చకు రావాలని సవాల్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు తొలి, చివరి విలన్ బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. సోమవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కేసీఆర్‌కు గుండెల్లో గుబులు మొదలైందన్నారు. కుటుంబంలోని కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఆడుతున్న మూడు ముక్కలాటతో ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కొట్లాటను వేగలేక రజతోత్సవ సభ పెట్టి హంగామా చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభలో మహిళలే కనిపించలేదని.. సభకు వచ్చిన జనాల కంటే విస్కీ బాటిళ్లే ఎక్కువగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పాలన ఫెయిల్ అని కేసీఆర్ మాట్లాడుతున్నారని, ఎవరి పాలన ఫెయిల్ అయిందో, ఎవరు ఏం అభివృద్ధి చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. సమయం, వేదిక బీఆర్ఎస్ నేతలే నిర్ణయించాలని.. ఎక్కడకు రమ్మన్నా వస్తానన్నారు. సభావేదికపై కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్ ఫ్లెక్సీతో అల్లుడు హరీశ్ రావు, కూతురు కవితల మనసుకు మరోమారు గాయమైందని, చిలకా ఏతోడు లేక అంటూ కవిత, బ్రజమానం భజగోవిందంలా హరీశ్‌రావు పరిస్థితి మారిందని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ శకం ముగిసింది..

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసిందని, ఆయన్ను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని చెప్పారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా కేసీఆర్ దుస్సాహసానికి పాల్పడ్డారని.. ఇందుకు కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మహేశ్‌గౌడ్ హెచ్చరించారు. జన్మభూమి గురించి కేసీఆర్ మాట్లాడారని.. మరి ఆయన పార్టీ పేరు నుంచి తెలంగాణ అనే పదాన్ని తొలగిస్తున్నప్పుడు జన్మభూమి కేసీఆర్‌కు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. కేసీఆర్‌కు పదేళ్లలో అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రైజింగ్, కేటీఆర్ రైజింగ్, కవిత రైజింగ్, హరీశ్ రైజింగ్ అయితే కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైజింగ్, దళిత్ రైజింగ్, ఉమెన్ రైజింగ్, హైదరాబాద్ రైజింగ్, ఉపాధి రైజింగ్ అని మహేశ్‌గౌడ్ చెప్పారు.

కేసీఆర్ సభ అట్టర్‌ఫ్లాప్: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఎల్కతుర్తిలో నిర్వహించిన కేసీఆర్ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, డా.పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్‌లతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సభతో తెలంగాణలో బీఆర్ఎస్ కథ వాడిసిన ముచ్చటేనని తేలిపోయిందన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి నాశనం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పాలన దోపిడీకి, నియంతృత్వానికి, నిర్బంధానికి, అవినీతికి, వైఫల్యాలకు నమూనా అని ఏలేటి ఎద్దేవా చేశారు.

కేంద్ర నిధులపై చర్చకొస్తారా?

రాష్ట్రానికి కేంద్ర నిధులపై కేసీఆర్ చర్చకొస్తారా అని ఏలేటి సవాల్ విసిరారు. తెలంగాణకు మోదీ సర్కారు ఏమీ ఇవ్వలేదనడం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు ఫ్యాషనైపోయిందన్నారు. ఏటా రూ. లక్ష కోట్ల చొప్పున 11 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం రూ. 11 లక్షల కోట్ల అభివృద్ధి పనులు, నిధులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో అక్రమాలకు ఆయన కుటుంబాన్ని వెయ్యేళ్లు జైల్లో పెట్టాల్సి ఉంటుందని.. కానీ కేసీఆర్‌ను ఒక్క రోజు కూడా జైల్లో పెట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డికి ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు.

సెటప్ చేయడానికే ఏడాది

▶ మొదటి పేజీ తరువాయి

అన్నీ జరుగుతాయని..' ముఖ్యమంత్రి అన్నారు.

ఏ పథకమైనా అర్హులందరికీ లబ్ధి చేకూరాలి

'కేసీఆర్ తరహాలో లాంచింగ్, క్లోజింగ్ పథకాలు నేను పెట్టలేను. షోపుటప్ స్కీంలు నాతో కాదు. ఒక పథకాన్ని ప్రారంభిస్తే అర్హులందరికీ లబ్ధి కలిగేంతవరకు పనిచేస్తా. రేవంత్‌రెడ్డి చెప్పిందే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో కలిగేలా పనిచేస్తా. ఇప్పటివరకు ప్లానింగ్‌కే సమయం సరిపోయింది. ఇప్పటివరకు చేసిన కార్య క్రమాలను చెప్పుకోవడంలో కూడా మేము వెనుకబడ్డాం.

ఏడాదిన్నరలోనే ఎన్నో పథకాలు

ఏడాదిన్నర కాలంలోనే ఎన్నో పథకాలు తీసుకువచ్చాం. ఇప్పుడు వాటన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్నాం. మేము అమలు చేస్తున్న పథకాలు ఏ రాష్ట్రంలోనూ లేవు. బీఆర్ఎస్ తరహాలో మాకు కూడా ప్రజలు పదేళ్లు అవకాశమిస్తారు. వాస్తవానికి నా పాలన, పథకాల అమలుపై ఎన్నికలకు 6 నెలల ముందు నుంచే చర్చ జరుగుతోంది..' అని రేవంత్ చెప్పారు.

రాహుల్‌తో మంచి సంబంధాలున్నాయి

'రాహుల్‌గాంధీతో నా స్నేహం గురించి నాకు తెలిస్తే చాలు. ఎవరో ఏదో చెబితే వినాల్సిన పనిలేదు. ఆయనతో నాకు మంచి సంబంధాలున్నా యి. మా ఇద్దరి గురించి బయటి వారు ఏం మాట్లా డుకుంటున్నారనేది నాకు అవసరం లేదు. ప్రపంచంలో ఇందిరాగాంధీకి మించిన రాజకీయ యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఆమెది.

వేరే ఆప్షన్ లేకే ఆ అధికారుల కొనసాగింపు

పాలన అవసరాలను బట్టి అధికారులను వినియోగించుకుంటాం. కొందరు అధికారుల గురించి అన్ని విషయాలు తెలిసినా వేరే ఆప్షన్ లేకపోవడంతో కొనసాగించాల్సి వస్తోంది. కలెక్టర్లను మార్చుకునే వెసులుబాటు ఉంది కనుకనే మారుస్తున్నాం.

సీపీఐ, ఎంఐఎంకు అండగా ఉన్నా..

నేను ఇంకా ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటా. నన్ను నమ్ముకున్న వారిని ఎప్పుడూ మర్చిపోను. నన్ను నమ్మిన సీపీఐకి, ఎంఐఎంకు అండగా ఉన్నా. అద్దంకి దయాకర్‌కు పదవి ఇప్పించగలిగా. దయాకర్ ఓపికతో ఉన్న కారణంగానే పదవి వచ్చింది. ఓపికతో ఉంటేనే నాకు కూడా బాధ్యత ఉంటుంది. అవకాశాలు వస్తాయి. అలా కాదని బయటకు వచ్చి స్లీపింగ్ రిమార్కులు చేస్తే నాపై భారం తగ్గించినట్టే అవుతుంది. పదవి ఇవ్వలేని పరిస్థితికి, వారి మాటలకు చెల్లుకు చెల్లు అయినట్టు నేను ఫీల్ అవుతా..' అని సీఎం అన్నారు.

ఎంత చెప్పినా కొందరు ఎమ్మెల్యేలు వినడం లేదు

'కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో సరిగా పనులు చేసుకోలేకపోతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వారు హైదరాబాద్ వదిలి వెళ్లలేకపోతున్నారు. మీడియా చుట్టూ తిరిగేందుకే పరిమితం అవుతున్నారు..' అని సీఎం వ్యాఖ్యానించారు.

మావోయిస్టులపై పార్టీ నిర్ణయమే ఫైనల్

'ఆపరేషన్ కగార్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. మావోయిస్టుల విషయంలో పార్టీ నిర్ణయమే ఫైనల్. అధిష్టానం నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వ విధానాన్ని ప్రకటిస్తాం..' అని రేవంత్ తెలిపారు.

జానా నివాసంలో 'కగార్'పై చర్చలు

లోకాయుక్త, ఉప లోకాయుక్త పదవీ స్వీకార కార్యక్రమానికి సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి నుంచి నేరుగా మాజీ మంత్రి కె.జానారెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ జానారెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డిలతో సమావేశమయ్యా రు. ఆపరేషన్ కగార్ గురించి చర్చించారు. మావోయిస్టుల సమస్యకు సంబంధించి శాంతి చర్చల కమిటీ ఆదివారం తనతో సమావేశం కావడాన్ని, తాను చొరవ తీసుకుని కేంద్రాన్ని శాంతి చర్చలకు ఒప్పించేలా చూడాలని వారు కోరిన విషయాన్ని తెలియజేశారు. గతంలో మావోయిస్టులతో చర్చలు జరిగినప్పుడు జానారెడ్డి హోంమంత్రిగా, కేశవరావు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో.. శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనలపై ఏం చేయాలన్న దానిపై వారితో చర్చించారు. అక్కడి నుంచే ఏఐసీసీ సీనియర్ నేతలు దిగ్విజయ్‌సింగ్, చిదంబరంలతో సీఎం మాట్లాడారని సమాచారం. కాగా శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనను పార్టీ అధిష్టానానికి పంపాలని సమావేశంలో నిర్ణయించారు.

దోచుకున్న డబ్బుతో కేసీఆర్ సభ



పట్టణ శివారులో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న కోమటిరెడ్డి, ఉత్తమ్

- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆరోపణ
- పదేళ్ల కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ధ్వజం
- మంత్రి కోమటిరెడ్డితో కలిసి నల్లగొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండ: పదేళ్ల దోచుకున్న డబ్బుతో బీఆర్ఎస్.. వరంగల్‌లో సభ నిర్వహించిందని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నల్లగొండ నియోజకవర్గంలో మూడు లిఫ్టులకు, కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ నిర్మాణ పనులకు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీలు కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, బాలునాయక్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాలా తీయించారని ధ్వజమెత్తారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం..

రాష్ట్రంలో ఏడాది కాలంలో 2.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని.. సన్నాలకు బోనస్ ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. దేశంలో పేదలకు సన్న బియ్యం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. అలాగే అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వడంలో బీఆర్ఎస్ విఫలమవగా తాము అర్హులందరికీ కార్డులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా జలాలను ఆంధ్రాకు అప్పగించారని.. 512 టీఎంసీలు ఏపీ తీసుకుంటే, తెలంగాణకు 299 టీఎంసీలే వచ్చేలా ఒప్పందం చేసుకున్నారని ఉత్తమ్ విమర్శించారు. కానీ తామిప్పుడు 500 టీఎంసీలను తెలంగాణకు ఇవ్వాలని కొట్లాడుతున్నామని చెప్పారు. తమ పాలనలోనే ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

నాడు సోనియా కాళ్లు మొక్కి.. నేడు కాంగ్రెస్ విలన్ అంటావా: కోమటిరెడ్డి

తెలంగాణ ఇచ్చిన తల్లి అంటూ కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కిన కేసీఆర్ నేడు కాంగ్రెస్ పార్టీనే విలన్ అనడం ఎంత వరకు సమంజసమని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. సోనియా వల్లే తెలంగాణ వచ్చిందని అసెంబ్లీ సాక్షిగా చెప్పి నేడు అదే నోటితో కాంగ్రెస్‌ను విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. దళితుడిని సీఎం చేస్తాన ని చెప్పి కేసీఆర్ మాటమార్చి మోసం చేశారని దుయ్యబట్టారు. అవినీతి డబ్బుతో మీటింగ్ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు.

ఉత్తమ్, వెంకట్‌రెడ్డిలది సీఎం స్థాయి: రాజగోపాల్‌రెడ్డి

కేసీఆర్‌కు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని.. పదేళ్లు ఆయన ఏం చేశారో సమాధానం చెబుతామని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మంత్రులైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం స్థాయిలో ఉన్నవారన్నారు. కోమటిరెడ్డి పదవుల కోసం పాకులాడలేదని.. తెలంగాణ కోసం పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు.

ఇదం జగత్



వీళ్లు ఐదురూపాయలు బిచ్చమేశార్రా! దీంతో వైజాగ్‌లో ఐదెకరాల భూమి కొనేయవచ్చు... మనకూ 'ఉర్సా' లాంటి కంపెనీ ఉంటే!

బీఆర్ఎస్‌లో రజతోత్సవ జోష్

- రేవంత్ సర్కారుపై వ్యతిరేకత ఉన్నందునే జనం తరలివచ్చారనే భావన
- కేసీఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని సంకేతాలతో కేడర్‌లో కొత్త ఉత్సాహం
- మరిన్ని సభలు నిర్వహిస్తే స్థానిక ఎన్నికల్లో లబ్ధి జరుగుతుందనే భావన




సాక్షి, హైదరాబాద్ బీఆర్ఎస్ రజతోత్సవ సభ..పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పైగా పార్టీకి పూర్వ వైభవం వస్తుందనే ఆశలు రేకెత్తించింది. ఎల్కతుర్తి వేదికగా జరిగిన భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో పార్టీ యంత్రాంగంలో నయా జోష్ కనిపిస్తోంది. రాష్ట్రంలో రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఈ సభలో ప్రతిబింబించిందని పార్టీ భావిస్తోంది. ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నందునే పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారనే భావన పార్టీ నాయకత్వం వ్యక్తం చేస్తోంది. తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగు పెడతానని సభావేదికగా కేసీఆర్ చేసిన ప్రకటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పార్టీ ఆవిర్భావ సమయంలో నిర్వహించిన వరుస బహిరంగ సభలు పునాదులను బలోపేతం చేసిన విషయాన్ని పార్టీ శ్రేణులు గుర్తు చేస్తున్నాయి. అదే తరహాలో మరిన్ని బహిరంగ సభలు నిర్వహించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరిన్ని సభల నిర్వహణ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కలుగుతుందని నేతలు భావిస్తున్నారు. ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభకు తరలివచ్చిన వారిలో యువత ఎక్కువగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ ఈ సభ పార్టీకి క్షేత్ర స్థాయిలో కొత్త నాయకత్వం ఇస్తుందని పార్టీ అంచనా వేస్తోంది.

కేటీఆర్ కేంద్రంగా ఎల్కతుర్తి సభ

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎల్కతుర్తి సభ నిర్వహణలోనూ అన్నీ తానై వ్యవహరించారు. ఇటీవలి కాలంలో పార్టీ నిర్వహించిన అతిపెద్ద బహిరంగసభ...బీఆర్ఎస్ భవిష్యత్ వారసుడు అనే సంకేతాలను పంపింది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా కేటీఆర్ సభా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. కొన్ని జిల్లాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించి రజతోత్సవ సభ విజయవంతానికి దిశా నిర్దేశం చేశారు. పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్‌ల నిర్వహణ మొదలుకొని సభ జరిగే మైదానంలో పార్కింగ్, సభా వేదిక నిర్మాణం తదితరాలను పర్యవేక్షిస్తూ వచ్చారు. సభా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తెలంగాణభవన్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సభను విజయవంతం చేయడంపై పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు కేటీఆర్‌ను అభినందించారు. సభా మైదానంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, భారీ కటౌట్లలో కేసీఆర్‌తోపాటు కేటీఆర్‌కు ప్రాధాన్యం ఇచ్చారు.

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం: కేటీఆర్

- సభకు తరలివచ్చిన జనం ఇచ్చిన సందేశం ఇదే
- ప్రభుత్వ అన్యాయాలను మరింత ఎండగడతాం



సాక్షి, హైదరాబాద్: ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ స భకు భారీ ఎత్తున హాజరైన ప్రజలు కేసీఆర్ నాయకత్వంపై అచంచల విశ్వాసం ప్రకటించారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రజతోత్సవ సభ ద్వారా బీఆర్ఎస్ మరోమారు రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని స్పష్టత వచ్చిందన్నారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఎల్కతుర్తి రజతోత్సవ సభ చిరకాలం గుర్తుండి పోతుందన్నారు. సోమవారం పార్టీ కేడర్‌తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన కేటీఆర్.. సభను విజయవంతం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు యంత్రాంగం విఫలమైనా సభ ప్రారంభానికి ముందు లక్షలాది జనం ప్రాంగణానికి చేరుకుని తమ నిబద్ధత చాటుకున్నారన్నారు. 'అక్కడ బిగిసింది పిడికిళ్లు కాదు పిడుగులు.. అవి స్వరాలు కాదు భాస్వరాలు. నాడు చెరల పడిన తెలంగాణ విముక్తి కోసం, నేడు చెరబట్టిన తెలంగాణ విముక్తి కోసం. లాఠీలు, తూటాలు కేసులు, జైళ్లు, ఈ నేలకు కొత్త కాదు. నాడు స్వాతంత్య్ర సమరం నుంచి సాయుధ రైతాంగ పోరాటం వరకు.. నాన్ ముల్కీ ఉద్యమం నుంచి 2014 తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఈ పిడికిళ్లే పిడుగులై గర్జించాయి. ఈ అరాచక, అసమర్థ కాంగ్రెస్ పాలనను పారద్రోలే వరకు... గర్జిస్తూనే ఉంటాయి'అని 'ఎక్స్'వేదికగా కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కొద్దిరోజులు విశ్రాంతి

వైద్యుల సూచన మేరకు కేటీఆర్ కొద్దిరోజులపాటు విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 22న జిమ్‌లో వ్యాయా మం చేస్తున్న సమయంలో వెన్నెముక డిస్క్‌కు స్వల్ప గాయమైంది. మరుసటి రోజు ఎల్కతుర్తి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో నొప్పితో బాధపడ్డారు. గత నాలుగైదు రోజులు సభ పనులతో తీరిక లేకుండా గడపడంతో వెన్నెముక నొప్పి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో సోమవారం కేటీఆర్ మరోమారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొద్దిరోజులపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని, త్వరగా కోలుకొని తిరిగి వస్తానని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

కేటీఆర్‌కు ఊరట

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావుపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో దాఖలు చేసిన కేసును హైకోర్టు కొట్టివేస్తూ ఊరటనిచ్చింది. కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి వసూలు చేసిన రూ.2,500 కోట్లను సీఎం రేవంత్ ఢిల్లీకి పంపారంటూ 2024, మార్చి 27న కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీకి చెందిన బి.శ్రీనివాసరావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు రేవంత్ పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాజకీయ కక్షలో భాగంగా ఈ కేసు పెట్టారని.. దీన్ని కొట్టేయాలని కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. సోమవారం తీర్పునిచ్చారు. పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ, కేటీఆర్ పిటిషన్‌ను అనుమతించారు.

క్లుప్తంగా...

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ వైస్ చైర్మన్, డీజీగా శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) వైస్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈనెల 30న ఆమె సీఎస్ పదవిలో పదవీ విరమణ చేయనుండగా, ఆ వెంటనే ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపింది. దీంతో పాటు ఆమెకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్

ఏసీబీకి పట్టుబడిన శామీర్‌పేట ఎస్సై



లంచం తీసుకుంటూ దొరికిన ఎస్సై పరశురాంనాయక్

శామీర్‌పేట: శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ చీటింగ్ కేసులో.. స్టేషన్ బెయిల్ మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటూ ఓ ఎస్సై సోమవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. కేసు వివరాలను ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు. ఈ నెల 20న శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదుకాగా, నిందితులు ఎస్సై పరశురాం నాయక్‌ను సంప్రదించి స్టేషన్ బెయిల్‌ను మంజూరు చేయాలని కోరారు. దీంతో ఎస్సై రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేయగా, ఈ నెల 21న రూ. 2 లక్షలను ఎస్సై పరశురాంకు కారులో ఇచ్చారు. అయితే అదనంగా మరో రూ. 25 వేలు కావాలని ఎస్సై డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం రూ. 22 వేలను స్టేషన్‌లోని తన చాంబర్‌లో ఉన్న చెత్తబుట్టలో వేయాలని ఎస్సై నిందితులకు సూచించాడు. దీంతో ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్-2 అధికారులు పరశురాంను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరు పరిచారు.

లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణ స్వీకారం

- జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, జగ్జీవన్‌కుమార్‌తో ప్రమాణం చేయించిన గవర్నర్
- సీఎం రేవంత్‌రెడ్డి హాజరు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, ఉపలోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లో వారితో ప్రమాణం చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై ఇద్దరికీ అభినందనలు తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు ఈ నెల మొదటి వారంలో జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, జగ్జీవన్‌కుమార్‌లను ఎంపిక చేస్తూ కేబినెట్ గవర్నర్‌కు పంపగా.. జిష్ణుదేవ్ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే.



ప్రమాణస్వీకార కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, బీఎస్ జగ్జీవన్ కుమార్

దేశ ఆర్థిక నిర్మాణంలో వ్యవసాయ భాగస్వామ్యం తగ్గుతోంది!

- రైతులు ఆహార భద్రత, సాంస్కృతిక వారసత్వ సంరక్షకులు
- కేరళ మహాసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: భారతదేశ ఆర్థిక నిర్మాణంలో వ్యవసాయ భాగస్వామ్యం క్రమంగా తగ్గుతోందని, ఇది ఆందోళన కలిగించే విషయమని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ భాగస్వామ్యం 2016లో 17.5 శాతం కాగా, ప్రస్తుతం అది 14 శాతంగా నమోదైందని, అయినప్పటికీ దేశంలోని సగం జనాభా వ్యవసాయరంగంతోనే పెనవేసుకుని ఉన్నారని తెలిపారు. సోమవారం ఆయన కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతులు, కార్మికుల మహాసభలో ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. రైతులు మన ఆహార భద్రత, సాంస్కృతిక వారసత్వానికి సంరక్షకులు అని అన్నారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో వ్యవసాయం ఒక జీవన విధానం అని, అలాంటి వ్యవసాయరంగం నేడు అకాల వర్షాలు, పెరిగిన పెట్టుబడులు, మార్కెట్ ధరల్లో తీవ్ర హెచ్చు తగ్గులు, మారిన వాతావరణ ప్రభావం వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని భట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి నేతల సారథ్యంలో హరిత విప్లవం సాకారం అయిందని తెలిపారు. ఈ చర్యల మూలంగా ధాన్యం ఉత్పత్తి 55 మిలియన్ టన్నుల నుంచి 1978– 79 నాటికి 131 మిలియన్ టన్నులకు పెరిగిందని గుర్తు చేశారు. రైతులను స్వతంత్రులను చేసేందుకు రుణ మాఫీ అవసరం అని గుర్తించి 2008లో మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం 71,000 కోట్ల రుణాలను మాఫీ చేసిందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటివరకు రూ. 21 వేల కోట్ల రుణాలు మాఫీ చేయడంతో పాటు రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ. 12,000 పెట్టుబడి మద్దతుగా అందిస్తున్నట్లు వివరించారు. ఆత్మీయ రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఎకరానికి 12 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీ ఆంటోని జోసఫ్, ఎమ్మెల్యే సన్నీ జోసెఫ్, డీసీసీ అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు అమెరికాకు డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం రాత్రి అమెరికా బయల్దేరి వెళ్తున్నారు. ఆయన తన కుమారుడి స్నాతకోత్సవంలో పాల్గొనడానికి వెళ్తున్నట్లు సమాచారం. వచ్చేనెల 6వ తేదీన తిరిగి రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం.



సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పద్మ భూషణ్ అవార్డు అందుకుంటున్న సినీ నటుడు నందమూరి బాలకృష్ణ

ఈఆర్సీ సభ్యులుగా రఘు, శ్రీనివాసరావు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కె.రఘు, చెరుకూరి శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) సభ్యులుగా కంచర్ల రఘు, చెరుకూరి శ్రీనివాస రావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. గరిష్ట పదవీకాలం 5 ఏళ్లు లేదా అంతకముందే 65 ఏళ్ల వయసుకు చేరితే అప్పటి వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసెస్(ఐఆర్ఏఎస్)కి చెందిన శ్రీనివాస రావు 2016 జూలై 26 నుంచి ట్రాన్స్‌కో జేఎండీగా కొనసాగుతున్నారు. అంతకు ముందు ఆయన టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా పనిచేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కంచర్ల రఘు విద్యుత్ రంగ నిపుణుడిగా గుర్తింపు పొందారు. 2017–22 మధ్యకాలంలో ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఏపీ స్థానికత కలిగిన విద్యుత్ ఉద్యోగులను సుప్రీం కోర్టు ఆదేశాలతో తెలంగాణ ట్రాన్స్‌కోలో చేర్చుకోవడంతో సీనియారిటీ కోల్పోయిన ఆయన డబుల్ డిమోషన్ పొంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ అయ్యారు. సబ్ స్టేషన్లు, లైన్ల నిర్మాణం, నిర్వహణ, మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ రంగ విధానాలు, ఈఆర్సీ రెగ్యులేషన్స్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ వంటి అంశాల్లో ఆయన నిష్ణాతులు. విద్యుత్ రంగంపై పలు పుస్తకాలను రాశారు. తాజా నియామకంతో ఈఆర్సీలో ఖాళీలు భర్తీ అయ్యాయి.

ఏ ఈఆర్సీ ముందు హాజరు కావొద్దని చెప్పారో...

ఈఆర్సీ నిర్వహించే బహిరంగ విచారణల్లో రఘు నిత్యం పాల్గొని ప్రజలకు భారంగా మారే ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం భవిష్యత్తులో ప్రజలకు గుదిబండగా మారనుందని ఓ బహిరంగ విచారణలో తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో గత ప్రభుత్వ ఒత్తిడితో ఈఆర్సీ అప్పట్లో ఓ సర్క్యులర్ జారీ చేసింది. విద్యుత్ సంస్థల యాజమాన్యాల అనుమతితోనే విద్యుత్ ఉద్యోగులు ఈఆర్సీ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో నాటి నుంచి ఈఆర్సీకి వెళ్లకుండా రఘు దూరంగా ఉంటున్నారు. ఇప్పుడు అదే ఈఆర్సీ సభ్యుడిగా ఆయన నియమితులు కావడం గమనార్హం.

భూభారతి చట్టం చరిత్రాత్మకం

- సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టం–2025 చరిత్రాత్మకమైందని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ వ్యాఖ్యానించారు. భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యల పరిష్కారం మరింత సులువవుతుందని అన్నారు. సోమవారం సీసీఎల్ఏ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులకు భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. చట్టం అనివార్యతను తెలియజేయడంతో పాటు చట్టంలోని ప్రతి నిబంధన గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా భూభారతి చట్టం రూపకల్పనలో కీలకపాత్ర పోషించినందుకుగాను నవీన్ మిత్తల్, సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్‌లను తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. అనంతరం నవీన్ మిత్తల్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కోశాధికారి మల్లేశ్, సీసీఎల్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంబాబు, పలువురు ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాన సమాచార కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి!

- మరో ఏడుగురు కమిషనర్ల నియామకం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదం?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు సమాచార కమిషనర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కూడిన ఎంపిక కమిటీ ఇటీవల సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వీరి నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించినట్లు సమాచారం. నేడో, రేపో సమాచార కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది. సమాచార కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్‌రావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, కప్పర హరిప్రసాద్, న్యాయవాది పీఎల్ఎన్ ప్రసాద్‌తో పాటు రాములు, వైష్ణవి, మొహిసిన్ పర్వీన్ పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించినట్టు సమాచారం. ప్రస్తుతం ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమితులు కానున్న చంద్రశేఖర్‌రెడ్డి సీఎం కార్యదర్శిగా సీఎంఓలో పనిచేస్తున్నారు. మరో రెండు నెలల్లో ఆయన ఐఎఫ్ఎస్‌గా పదవీ విరమణ చేయాల్సి ఉంది. కాగా, బోరెడ్డి అయోధ్యరెడ్డి సీఎం కార్యాలయంలో చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారిగా పనిచేస్తుండగా, కప్పర హరిప్రసాద్ గాంధీ భవన్ పీఆర్వోగా పనిచేస్తున్నారు.



నగ్నంగా ఉండే సత్యం అత్యంత అందమైనది.
- ఆర్థర్ షోపెన్‌హవర్

సాక్షి
మంగళవారం, 29 ఏప్రిల్ 2025

పాక్ పాచికల్ని పారనీయొద్దు!

పహల్గామ్‌లో 26 మంది నిండు ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనన్న అభిప్రాయం రోజురోజుకూ దేశంలో బలపడుతుండగా పాకిస్తాన్ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడుతోంది. మొదటి నాలుగు రోజులూ ఉలకని, పలకని ఆ దేశం అటుతర్వాత 'తటస్థ దర్యాప్తు' రాగం అందుకుంది. ఆ మర్నాడే అణు బెదిరింపులకు దిగింది. మరోపక్క భద్రతా మండలిలో చడీచప్పుడూ లేకుండా లాబీయింగ్ సాగించి తన పాచిక పారేలా చూసుకుంది. ఇక్కడే మన లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని 'తీవ్రంగా' ఖండిస్తున్నట్టు తీర్మానం చెబుతున్నా అందులో దాడికి కారణమైన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) సంస్థ పేరు ప్రస్తావనే లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. చైనా ఎప్పటిలాగే పాకిస్తాన్ వాదనతో శ్రుతి కలిపింది. కానీ మనకు చాలా సన్నిహితుడనుకున్న డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి అమెరికాలో మొదలైనా పాక్‌తో ఆ దేశం అంటకాగుతున్న వైనం దిగ్భ్రాంతికరం కాదా? ఈమధ్యకాలంలో బలూచిస్తాన్‌లో రైలును దారిమళ్లించి అనేకుల్ని హతమార్చిన ఉదంతంలో భద్రతామండలి అందుకు కారణమైన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పేరు ప్రస్తావించింది. 2019లో పుల్వామాలో జరిగిన ఉగ్రదాడి ఉదంతంలో సైతం జైషే మొహమ్మద్ (జేఈఎం) ప్రమేయాన్ని మండలి తీర్మానం ఎత్తిచూపింది. కానీ ఇప్పుడేమైంది? ఇక్కడికొచ్చేసరికి ఈ నీళ్ల నములుడు దేనికి? అమెరికా రూపొందించిన తీర్మానంలో తొలుత ప్రస్తావనకొచ్చిన టీఆర్ఎఫ్ పేరు ఎందుకు ఎగిరిపోయింది? ఏ సంస్థనూ మాటమాత్రంగానైనా ఖండించటానికి ముందుకురాని తీర్మానం 'అంతర్జాతీయ శాంతికీ, భద్రతకూ విఘాతం కలిగించే ఉగ్ర ఘాతుకాలపై అన్నివిధాలుగా పోరాడతాం' అని బడాయి పోవటం చిత్రం కాదా! ఆ ఘనకార్యం మేమే చేశామని విర్రవీగిన సంస్థ పేరెత్తటానికి మండలికున్న అభ్యంతరమేమిటి? అఫ్గాన్‌లో సోవియెట్ సైన్యాన్ని ఎదుర్కొనటానికి అమెరికా ఆశీస్సులతో ఉగ్రవాద శిబిరాలు నడిపిన పాపిష్టి చరిత్ర తమకుందని ఈమధ్యే పాక్ రక్షణమంత్రి అంగీకరించాడు. తాజా పరిణామాల నేపథ్యంలో అలాంటి లాలూచీ ఇంకా కొనసాగుతున్నదనుకోవాలా?

ప్రధాని నరేంద్ర మోదీ మొన్న బిహార్‌లో కావొచ్చు... తాజాగా 'మన్ కీ బాత్'లో కావొచ్చు, పహల్గామ్ ఉదంతంలో బాధితులకు సరైన న్యాయం దక్కేలా చేస్తామని స్పష్టం చేశారు. పాత్రధారుల్ని, సూత్రధారుల్ని తీవ్రాతితీవ్రంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. మంచిదే. అయితే ఈ కృషి బహుముఖాలుగా వుండాలి. ఉగ్రవాదుల్ని పట్టి బంధించటానికి ప్రయత్నించటంతో పాటు అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకిని చేయటానికి కృషి చేయాలి. ఉగ్రసంస్థల్ని కిరాయి ముఠాలుగా వాడుకుంటున్న దాని నైజాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టాలి. పాకిస్తాన్ తెరవెనకుండి భద్రతామండలి తీర్మానంలో చేయించిన మార్పులు చిన్నవేమీ కాదు. ఉగ్ర సంస్థ టీఆర్ఎఫ్‌తో పాక్ సర్కారు ఎంతగా చెట్టపట్టాలు వేసుకున్నదో మండలిలో జరిగిన పరిణామాలే తేటతెల్లం చేస్తున్నాయి. తీర్మానంలో టీఆర్ఎఫ్ ప్రస్తావన లేకుండా చేసిన క్షణాల్లోనే ఆ ఉగ్ర సంస్థ తన పాత ప్రకటన 'అధికారికమైనది' కాదంటూ స్వరం మార్చటం గమనించదగ్గది. దాడి జరిగిన వెంటనే తామే అందుకు కారకులమని చెప్పిన ఆ సంస్థ మండలిలో పాక్ వాదనకు అనుగుణంగా ఆ ప్రకటన తమది కాదనటమే కాదు... నింద మోపటం కోసం భారత సైన్యం కావాలని చేసిన పనిగా ఆ ఉదంతాన్ని వక్రీకరించే ప్రయత్నం చేసింది. లష్కరే తోయిబా విషపుత్రిక అయిన టీఆర్ఎఫ్ 2020 నుంచీ జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు పాల్పడుతోంది. ఆ సంస్థను మన దేశం నిషేధించింది కూడా!

ఏదో విధంగా మన దేశాన్ని ఇబ్బందులపాలు చేయటం కోసం ఏళ్ల తరబడి స్వయంగా నిర్మించిన ఉగ్రవాద సాలెగూటిలో తానే చిక్కుకుని పాకిస్తాన్ తరచు విలవిలలాడుతోంది. 2015లో పెషావర్ కంటోన్మెంట్ ప్రాంతంలోని పాఠశాలపై ఉగ్రవాదులు ఒక్కుమ్మడిగా విరుచుకుపడి 140 మంది బాలబాలికల్ని కాల్చిచంపారు. ఆ మరుసటి ఏడాది క్వెట్టాలో పోలీసు శిక్షణ కేంద్రం ఆవరణలోకి ప్రవేశించి 60 మందిని హతమార్చారు. ఒక యూనివర్సిటీపై దాడికి దిగి ప్రొఫెసర్‌తోపాటు 20 మంది విద్యార్థుల ప్రాణాలు తీశారు. ఈ మాదిరి ఉదంతాలు ఎన్నెన్నో. అయినా పాకిస్తాన్ వైఖరిలో ఆవగింజంతైనా మార్పు లేదు. పశ్చాత్తాపం అసలే లేదు. పహల్గామ్ దాడిని ఖండించకుండా పర్యాటకులు ప్రాణాలు కోల్పోవటం విచారకరమంటూ ప్రకటన చేసి చేతులు దులుపుకుంది.

పాకిస్తాన్ తీరు మారదని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దబాయింపు చూస్తే తెలుస్తుంది. ఉగ్రదాడిపై ఆయనగారికి 'తటస్థ, పారదర్శక, విశ్వసనీయ' దర్యాప్తు కావాలట! అసలు తన ఎన్నికే సంశయాస్పదమైంది. పాక్ సైన్యం అండదండలతో అందలమెక్కిన చరిత్ర షెహబాజ్‌ది. 2016నాటి పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఇరు దేశాల సంయుక్త దర్యాప్తును నీరు గార్చిందెవరు? పాక్ ప్రతినిధులు మన దేశం వచ్చి దర్యాప్తులో పాల్గొని వెళ్లగా, మన ప్రతినిధి బృందాన్ని మాత్రం పాక్ గడ్డపైకి అనుమతించని వైనం, తాము సేకరించిన సాక్ష్యాలను భారత్‌తో పంచుకోని తీరు షెహబాజ్ మరిచారా? 2008 నాటి ముంబై పేలుళ్ల ఉదంతంలో ఇచ్చిన సాక్ష్యాధారాలకు ఏ గతి పట్టించారో గుర్తులేదా? అణ్వాయుధ దాడికి సిద్ధమంటూ బెదిరింపులకు దిగుతున్న పాక్ దుష్ట పన్నాగాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలి. అందుకు దౌత్యపరంగా మరింత కృషి చేయాలి. దాంతోపాటు అన్నివిధాలా సంసిద్ధతలు పెంపొందించుకోవాలి. సామాజిక మీడియాలో కశ్మీరీలపై విద్వేషాన్ని కక్కే అవాంఛనీయ శక్తుల ఆటకట్టించాలి. ఇది కలసికట్టుగా నిలబడాల్సిన కాలమని చాటాలి.

విభేదిస్తే వ్యతిరేకించాలా?

అభిప్రాయం



అభయ్ మోకాశీ

'అధికారం చెడగొడుతుంది. సంపూర్ణ అధికారం సంపూర్ణంగా చెడగొడుతుంది.' లార్డ్ జాన్ డల్బర్గ్ 1887లో చెప్పిన మాట ఇది. అధికారం అహంకారం కూడా తెస్తుంది, సంపూర్ణ అధికారం సంపూర్ణ అహంకారం తెస్తుంది... ఇది నేటి మాట. ఈ అహంకారానికి అవమానించే గుణం తోడవుతోంది. అహంకారులు భిన్నస్వరాన్ని భరించలేరు. అణచివేస్తారు. ఇండియాలోనే కాదు, అమెరికా తదితర అనేక దేశాల్లోనూ ఈ ధోరణి ప్రబలుతోంది.

స్వేచ్ఛ కాగితాలకే పరిమితమా?

అధికార పార్టీ నేతల పట్ల వ్యతిరేక భావాలు వ్యక్తం చేస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అలాంటి వారిపై భౌతిక దాడులు జరుగుతాయి. ప్రభుత్వ ఏజెన్సీలు వారిని వేటాడతాయి. తప్పుడు కేసుల్లో ఇరికిస్తారు. రాజకీయ, సామాజిక రంగాల్లో అసమ్మతి ప్రకటించే వారి పట్లే ఈ తృణీకార ధోరణి ఇంతకాలం పరిమితమైంది. కానీ ఇప్పుడిది ఎల్లలు దాటింది. ఆఖరికి న్యాయవ్యవస్థను కూడా వదిలిపెట్టని దుఃస్థితి దాపురించింది. తమ మాటకు తలొగ్గని వారు ఎవరైనా వారికి ఒకటే. న్యాయస్థానాలు, న్యాయమూర్తులు ఇందుకు మినహాయింపు కాదు. తమతో విభేదించిన న్యాయవ్యవస్థ వారి అవమానానికి గురవుతోంది.

చిన్నప్పుడు మనకు స్కూల్లో ఏం చెప్పేవారు? చట్ట సభలు ప్రజాస్వామ్య పీఠాలనీ, సభ్యులకు అక్కడ భయం లేకుండా మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందనీ చెప్పేవారు కదా! నిజానికి అవన్నీ కాగితాలకే పరిమితం. ప్రజలెన్నుకున్న ప్రతినిధులు చట్టసభల్లో అధికార పక్షంతో విభేదించి తమ గొంతు వినిపించగలుగుతున్నారా? అధికార పార్టీ సభ్యులు గానీ, అధ్యక్ష స్థానంలో ఉన్నవారు గానీ వారిని అందుకు అనుమతించడం లేదు. శాసన నిర్మాణ సంస్థల స్థాయి పెరిగే కొద్దీ వాటిలో ఈ ధోరణీ హెచ్చుతోంది.

ప్రతిపక్ష సభ్యుల గొంతు వినబడకుండా అరుపులు కేకలతో పాలకపార్టీ సభ్యులు వారిని నిరోధించడం సర్వసాధారణమైంది. ఒకవేళ వారా పని చేయలేకపోతే, సభాధ్యక్షులు జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యుల మాటలను రికార్డుల నుంచి తొలగిస్తారు, మైకులు కట్ చేస్తారు. లేదంటే మాట్లాడే అవకాశం ఇవ్వరు. ఇచ్చినా తగినంత సమయం కేటాయించరు.

తటస్థత చూపనక్కర్లేదా?

అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం, దిగువ సభ స్పీకర్, ఎగువ సభ చైర్మన్ తమ రాజకీయ అనుబంధాలను పక్కన పెట్టి విధి నిర్వహణలో తటస్థంగా ఉండాలి. కానీ చాలా సందర్భాల్లో ఇలా జరగటం లేదు. ఈ సంప్రదాయం నుంచి వారు వైదొలగుతున్నారు. కింది స్థాయి చట్టసభల్లోనే కాదు, లోక్‌సభలో, రాజ్యసభలో సైతం ఇదే జరుగుతోంది. ఉదాహరణకు, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను చూడండి. బీజేపీతో ఆయన తన అనుబంధాన్ని వీడలేకపోతున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ పదవిలో ఉన్నప్పుడు కూడా ఇలాగే వ్యవహరించారు. ఇప్పుడూ అదే ధోరణి కొనసాగిస్తున్నారు.



◆ చట్టసభల్లో ప్రతిపక్ష సభ్యుల గొంతు వినబడకుండా అరుపులు కేకలతో పాలకపార్టీ సభ్యులు వారిని నిరోధించడం సర్వసాధారణమైంది.

◆ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆర్టికల్ 142ని అణు క్షిపణిగా పేర్కొనడం ... శాసన, న్యాయ వ్యవస్థల నడుమ ఉండాల్సిన అధికార సమతుల్యతను తిరస్కరించడమే!

◆ 'శాసన, కార్యనిర్వాహక అధికారాలు ఒకే వ్యక్తి చేతిలో ఉంటే స్వేచ్ఛ బతకదు. వాటి నుంచి న్యాయాధికారాన్ని వేరు పరచాలి. మూడు అధికారాలూ ఒకే సంస్థ చలాయించేట్లయితే అన్నీ నాశనమవుతాయి' అన్నారు ఫ్రెంచ్ తత్వవేత్త మాంటెస్క్యూ.

ఆయన కళ్లన్నీ రాష్ట్రపతి పదవి మీదున్నాయి. అధినాయకుడి అనుగ్రహం ఉంటేనే ఆ కల నెరవేరుతుంది. అందుకోసం ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ఆయనొక్కడే కాదు, అలాంటివారు పార్లమెంటులో చాలామంది ఉన్నారు. తగిన అర్హతలు లేకున్నా అధినాయకుడి పట్ల విధేయత అనే ఒక్క అర్హతతో వారు మహనీయమైన ఉన్నత పదవులు పొందగలిగారు. గొప్ప మేధావులు ఎందరో ధన్‌ఖడ్‌కు ముందు ఆ పదవిని అలంకరించారు. అత్యున్నత ప్రజాస్వామిక విలువలతో వారంతా తమ పదవికి వన్నె తెచ్చారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ని అణు క్షిపణిగా పేర్కొంటూ ధన్‌ఖడ్ ఈ మధ్య ఒక తూటా పేల్చారు (సంపూర్ణ న్యాయం చేయడం కోసం సుప్రీంకోర్టుకు విస్తృత విచక్షణాధికారాలను కట్టబెట్టే ఆర్టికల్ ఇది). ఇది కేవలం ఒక రాజకీయ ప్రకటన మాత్రమే! ఆ అధికరణంపై సమగ్ర సమీక్ష, అవగాహనతో చేసిన వ్యాఖ్య కాదు! తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన ప్రకటన వెలువడింది. గవర్నర్లు చట్టసభలు చేసిన బిల్లులకు తప్పనిసరిగా సమ్మతి ఇవ్వాలన్నది తీర్పు సారాంశం. ఈ మధ్యకాలంలో చాలా మంది గవర్నర్లు కేంద్రానికి పక్క వాద్యకారులుగా పని చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ధన్‌ఖడ్ సైతం ఇలాగే చేశారు. కాబట్టి, అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం సబబే! ఆయన ఆర్టికల్ 142ని అణు క్షిపణిగా పేర్కొనడం... శాసన, న్యాయ వ్యవస్థల నడుమ ఉండాల్సిన అధికార సమతుల్యతను తిరస్కరించడమే అవుతుంది. ఇలా వ్యాఖ్యానించి, రాజ్యాంగ నిర్మాతల విజ్ఞతకు ఆయన సవాలు విసిరారు. ఇది మరీ తీవ్రమైన అంశం.

నైతికత సారథులుగా వ్యవహరించాలి!

రాష్ట్రపతి మూడు నెలల్లో బిల్లుపై నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు గడువు విధించడాన్ని ధన్‌ఖడ్ తప్పు పట్టారు. అయితే, మనం ఉన్నది రాజరిక వ్యవస్థలో కాదనీ, మనది ప్రజాస్వామ్యం అనీ ఉప రాష్ట్రపతి గుర్తు పెట్టుకోవాలి. రాష్ట్రపతి పౌరులకు జవాబుదారీ కనుక, న్యాయవ్యవస్థకు లోబడి ఉండాలని మర్చిపోకూడదు. చట్టం తు.చ. తప్పకుండా అమలయ్యేట్లు చూడటంతో పాటు, ఆ శాసన ఆదేశాల ఉద్దేశం ఏమిటో గ్రహించడం కూడా న్యాయ వ్యవస్థ విధి.

శాసన, న్యాయ వ్యవస్థల నడుమ అధికార విభజన గురించి స్పష్టంగా చెప్పిన వాళ్లలో మాంటెస్క్యూ ఒకరు. 'ద స్పిరిట్ ఆఫ్ లా' (1748) పుస్తకంలో ఆయన దీన్ని గురించి చర్చించారు: శాసన, కార్యనిర్వాహక అధికారాలు ఒకే వ్యక్తి వద్ద లేదా న్యాయాధికారుల బృందం చేతిలో ఉంటే స్వేచ్ఛ బతకదు. అందుకే వాటి నుంచి న్యాయాధికారాన్ని వేరు పరచాలి. మూడు అధికారాలు ఒకే వ్యక్తి లేదా ఒకే సంస్థ చలాయించేట్లయితే అన్నీ నాశనమవుతాయి... ఇదీ ఆయన సిద్ధాంతం.

దేశంలో 'సివిల్ వార్'కు సుప్రీంకోర్టు బాధ్యత వహించాలని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వ్యాఖ్యానించారు. ధన్‌ఖడ్ ప్రకటన వెలువడిన వెంటనే ఆయన ఈ మాటలన్నారు. హిందూ రాష్ట్ర స్థాపన తమ ధ్యేయమని బీజేపీ నాయకత్వం పదేపదే ప్రకటిస్తోంది. ఈ సందర్భంగా, బీజేపీ నాయకత్వం శామ్యూల్ టేలర్ కొలరిజ్ రాసిన 'ద స్టేట్స్‌మన్స్ మాన్యువల్' చదివి తీరాలి. రాజకీయ నాయకులు తమ నిర్ణయాలు నైతిక, ఆధ్యాత్మిక విలువలకు అనుగుణంగా ఉండేట్లు జాగ్రత్త వహించాలి. తమను తాము నైతికత సారథులుగా భావించాలి. కేవలం వ్యావహారిక నైపుణ్యం, ప్రయోజకత్వం మీద ఆధారపడే రాజకీయాలను ఆయన విమర్శిస్తాడు. బదులుగా, పవిత్ర గ్రంథాల్లోని దివ్యజ్ఞానం ప్రాతిపదికగా ఉండే సూత్రప్రాయ విధానాలను అనుసరించాలని కొలరిజ్ సూచిస్తాడు. తద్వారా రాజనీతిజ్ఞులు ప్రజలకు సమర్థమైన పాలన అందించడంతో పాటు సమాజాన్ని నైతికంగానూ ఉన్నతస్థితికి చేర్చగలరని హితవు పలికాడు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, మీడియా ట్రెయినర్

ఎడిట్ పేజీ ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

సోషల్ మీడియా

విడగొడితే సరి!



పాకిస్తాన్‌తో జగడం ఆగాలంటే ఇండియాకు ఉన్న మార్గాలు ఏమిటి? పశ్చిమ పంజాబ్, బలూచిస్తాన్, సింధ్, ఇంకా పఖ్తూనిస్తాన్‌లను కలిగివున్న అవశేష పాకిస్తాన్ మీద ఇండియా చర్య తీసుకోవాలి. అవన్నీ ప్రస్తుతం తిరుగుబాటులో ఉన్నాయి. ఇండియాకు ఉన్న మార్గం 'పాకిస్తాన్'ను నాశనం చేయడమే. ఇక అప్పుడు మిగిలేది 'బాకిస్తాన్' మాత్రమే!

- సుబ్రహ్మణ్య స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఎవరు ప్రత్యర్థి?



చైనా అమెరికాతో పోటీ పడాలనుకుంటోంది. ఇండియా పాకిస్తాన్‌తో పోటీ పడాలనుకుంటోంది. రెండూ గెలుస్తున్నాయి.

- శంకర్ శర్మ, ఇన్వెస్టర్

కష్టమే సుమీ!



పిల్లల్ని ఎలా పెంచాలి అనే విషయంలో కన్నా, ఒక మైక్రోవేవ్ ప్యాకేజ్డ్ ఆహారాన్ని ఎలా వాడుకోవాలో చెప్పేందుకు మనుషులకు ఎక్కువ సూచనలు దొరుకుతాయి.

- ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

లెజెండ్



దేశంలోని గొప్ప దర్శకుడు - సినిమాటోగ్రాఫర్ షాజీ ఎన్ కరుణ్ మరణంతో సినిమా ప్రపంచం ఒక ఐకాన్‌ను కోల్పోయింది. భారీ అభినయంతో కాకుండా, చిన్న, దాదాపు అదృశ్య గుండె పగుళ్ల ద్వారా ఆయన సినిమాలు (మలయాళం) వేదనను పలికించాయి.

- వర్షా సోమరాజ్, జర్నలిస్ట్

బాగుండటమంటే...




ఫిట్‌నెస్ అనేది పరిమాణం, ఆకృతి గురించి కాదు ; బరువు గురించి అసలే కాదు. వయసుకు తగినట్టుగా మన శరీరం అన్ని కార్యాలనూ సవ్యంగా నిర్వరిస్తున్నదా అన్నది!

- రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

ఆదిమ వారసత్వం నృత్యం

వినసొంపైన సంగీతం వినబడితే శరీరం అప్రయత్నంగా లయబద్ధంగా కదులుతుంది. దానినే 'నృత్యం' అంటారు. 1760లో రచయిత, ఆధునిక ఫ్రెంచ్ నృత్య నాటికల సృష్టికర్త అయిన జీన్ జార్జెస్ నోవెర్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని యునెస్కో ఏప్రిల్ 29ని 'అంతర్జాతీయ నృత్య దినోత్సవం'గా ప్రకటించింది. నృత్య కళారూపాలను నివేదించడానికీ; ప్రపంచీకరణను, రాజకీయ, సాంస్కృతిక, జాతి అడ్డంకులను అధిగమించడానికీ... నృత్య రీతులు గల ప్రజలందరినీ ఒకే చోటికి తేవడానికీ కృషి చేయడం ఈ దినోత్సవ లక్ష్యం. ఇంటర్నేషనల్ డ్యాన్స్ కమిటీ ప్రవేశపత్రం ఆధారంగా ప్రతీ ఏటా ఒక అద్భుతమైన నృత్య దర్శకుడు లేదా నర్తకుడిని ఎంపిక చేసి ఆ రోజు వారి సందేశాన్ని అందించడానికి ఆహ్వానిస్తారు.



ఆదిమ సంస్కృతికి చిహ్నం నృత్యం. అదివాసీలు ప్రకృతిని, సూర్యుని, చంద్రుని దేవుళ్ళుగా భావించేవారు. కొన్ని తెగల వారు ప్రత్యేకించి (గోత్రం పరంగా) కొన్ని జంతువులను మాత్రమే దేవుళ్ళుగా పూజిస్తూ వాటి మాంసాన్ని ముట్టరు. రాతి యుగం నాటి ఫ్రాన్స్, స్పెయిన్, ఇండియా వంటి దేశాలలోని కొండ గుహలలో ఆదిమ మానవుల వేట, నాట్యం, దృశ్యాలు కన్పిస్తున్నాయి. వీటిని బట్టి ఆదిమ కాలం నుండి నాట్యం అనేది ప్రస్తుత మానవునికి వారసత్వంగా లభించిందని చెప్పవచ్చు.

నృత్యం లేకుండా ఆదివాసీలలో ఏ సంబురాలూ జరుగవు. మన తెలుగు రాష్ట్రాల్లోని ఆదిమ తెగలలో థింసా, గుస్సాడీ, రేలా, దండారీ, కొమ్ము నృత్యాలు ప్రసిద్ధి. అయితే భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, మణిపురి, మోహినీ ఆట్టం వంటి భారతీయ శాస్త్రీయ నృత్యాలుగా పిలిచేవాటికే ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. భారతీయ నాట్య ప్రపంచంలో చిందు బాగోతుల వారు ఆడే ఆట, పులి నృత్యం వంటి ఎన్నో జానపద నృత్యాలూ ఉన్నాయి. అయితే అనేక నృత్య రీతులు ఇప్పుడు కనుమరుగవ్వడం విచారకరం. భారతీయ సంస్కృతి - సంప్రదాయాలలో భాగమైన నృత్యకళను రక్షించుకోవాలంటే సంబంధిత నృత్య కళాకారులకు ప్రభుత్వం సరైన జీవన భృతి కల్పించాలి.

- గుమ్మడి లక్ష్మీనారాయణ, సామాజిక రచయిత
(నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం)

ఈ ప్రశ్నకు జవాబు ఉందా?

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ఒక సీజనల్ పొలిటీషియన్ ఎంత 'లోతు' తక్కువ రాజకీయాలు చేయగలిగితే, అంతలా వేగంగా మాటలు మారుస్తూ, ఎన్నాళ్ళు అయినా ఎలాగోలా అధికారంలో ఉండగలడు. అయితే ఒక లీడర్‌గా వారి స్థాయి ఏమిటి అనేది రేపు చరిత్ర ఎటూ రికార్డు చేస్తుంది. తమదొక 'పొలిటికల్ ఫిలాసఫీ' అని ఇటువంటివారు నమ్మబలికితే, 'అదేమని' ఎవరూ ప్రశ్నించరు. అదేమిటో చెప్పలేకపోయినా, అదేమిటో ఎవరికీ తెలియకపోయినా, అప్పటికే దాని నుంచి ఫలాలు కోసుకునే వర్గం వారి వెనుక తమ 'టర్న్' కోసం కనిపెట్టుకుని ఉండి గుంపుగా తయారై ఆ నాయకునికి సమర్థన కూడా మొదలవుతుంది. విషయాల లోతులు మనకు అక్కరలేనప్పుడు, ఆ మేరకే మన ఎంపికలు కూడా ఉంటాయి. అక్కడ ఎక్కువ ఆశించడం తప్పు. ఇటువంటి చోట - 'నువ్వు నన్ను నమ్మనప్పుడు, నిన్ను నేను మాత్రం ఎందుకు నమ్మాలి?' అనే లాజిక్ నాయకునికి ఎటూ ఉంటుంది. ఇలా పరస్పర విశ్వాసాలు లేకుండానే ఎన్నికయిన నాయకులకు ఈ అధికారం, తమకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని వారు అనుకోరు కనుక ఇప్పటికి ఇదే ప్రస్తుతం.

బ్రిటిష్ పాలన తర్వాత కూడా యాభై-అరవై దశకాల్లో భూమి-నీరు-వ్యవసాయం కేంద్రితంగా మన రాష్ట్ర రాజకీయాలు ఉండేవి. కారణం ప్రజలు జీవన సంస్కృతి ఆ రెండింటి చుట్టూనే ఉండేది. అయితే, డెబ్బై దశకంలో వచ్చిన 'జై ఆంధ్ర' ఉద్యమ రూపంగా పొడచూపిన 1972 నాటి సాంఘిక సంజ్ఞను సకాలంలో మనం అర్థం చేసుకోలేకపోయాం. అప్పుడే దాన్ని గుర్తించి దాన్ని 'అడ్రెస్' చేసి ఉంటే, మన పరిస్థితి మరోలా ఉండేది. అప్పట్లో ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు మొదలైన రైతు కుటుంబాల యువత ఉపాధి వలసల తీవ్రత తగ్గేది. ఆ వలసల ఒత్తిడితో ఆ దశకం చివర 1978లో కొత్తగా రంగారెడ్డి జిల్లా ఏర్పాటు అవసరం అయింది. రంగారెడ్డి ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ వద్ద ఆంధ్రుల రద్దీతో విషయం అర్థమయినా అప్పటికే ఇక్కడ కొత్తగా మహిళా కళాశాలలు కూడా మొదలయ్యాయి. ఏమైంది, గుప్పిట్లోని ఇసుకలా కాలం కళ్ళముందు అలా జారిపోయింది. వెనక్కి తిరిగివచ్చి చూసుకుంటే, ఒకప్పటి తయారీ రంగం ఉపాధి అవకాశాల్ని 'సర్వీస్ సెక్టార్' ఆక్రమించాక, మూడు దశాబ్దాలుగా ఎక్కడా నిలకడ లేని ఉపాధిరంగం మిగిలింది. ఇప్పుడు ఉన్నది భుజానికి సంచి (షోల్డర్ బ్యాగ్ ఎంప్లాయ్‌మెంట్) ఉపాధి. ఇక్కడ ఉద్యోగే కాదు, కంపెనీ అధిపతిది కూడా అమూర్త (రూపం తెలియని) స్థితే. ఎవరు ఎవరి కోసం పనిచేస్తున్నారో అది ఎన్నాళ్ళో తెలియని స్థితి.



అయినా 'లీడర్' అంటే ప్రజలు-ప్రాంతము పక్షంగా నిలబడి, అక్కడి సామాజిక పర్యావరణానికి తగిన 'జియో-ప్లానింగ్'తో అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కల్పన వాతావరణం సృష్టించాలి. మన ప్రయోజనాలు కాపాడుకుంటూనే, మనవి కాని బయట పవనాల వేగాన్ని అతడు ఎదుర్కోవాలి. అది లేకపోగా ముప్పై ఏళ్ళుగా ఏదొచ్చినా అదంతా నా వల్లనే అని 'క్లెయిం' చేసుకునే పరిస్థితి. ఇక్కడే అస్సలు ఒక నాయకుడి మూలాలు ప్రశ్న అవుతున్నాయి. అప్పట్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు (74) కాలం చూస్తే, 1995 నుంచి తొమ్మిదేళ్లు; మధ్యప్రదేశ్ దిగ్విజయ్ సింగ్ (78) 1993 నుంచి పదేళ్ళు, శరద్ పవార్ (84) మహారాష్ట్రలో 1988 నుంచి 1995 వరకూ కనిపిస్తారు. వీరిలో చంద్రబాబుది తప్ప మిగతా ఇద్దరిదీ రాజకీయ కుటుంబ నేపథ్యం. దిగ్విజయ్ సింగ్ తండ్రి 1951లో శాసనసభ్యులు, శరద్ పవార్ తండ్రి 1937-1952 మధ్య మూడుసార్లు జిల్లా బోర్డు సభ్యుడు, ఖాదీ, సహకార చక్కెర రైతు సంఘాల రాష్ట్ర నాయకుడు.

అయితే, ఈ కాలంలో స్వయం ప్రతిభతో ఎదిగిన నాయకుడు లాలూప్రసాద్ యాదవ్. పట్నా యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా చేస్తూ 1977లో 29 ఏళ్లకే ఎంపీగా పార్లమెంట్‌లోకి వెళ్ళిన అరుదైన చరిత్ర ఆయనది. బిహార్‌పై వీరి బలమైన ప్రభావం 1990-1997 వరకూ ఉంది. ఆయన సతీమణి రబ్రీదేవి ప్రభావం 2000-2005 వరకూ కనిపిస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశం గురించి సమీక్ష అంటే, దాన్ని మండల్ కమీషన్ నివేదిక అమలు, పి.వి. నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ఈ పూర్వరంగంలో విధిగా చూడాలి. అలా 'లాలూ-బిహార్' లోతుల్ని కనుక వెతికితే ఏముంది? ఒకప్పుడు ఆసియా జ్ఞాన కేంద్రాలకు నెలవైన బిహార్‌లో 'రీ మ్యాపింగ్ ఇండియా' మొదలై- జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ అనే మరో రెండు కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి.

వీరితో పోల్చినప్పుడు జగన్ మోహన్ రెడ్డికి సీఎంగా గత అనుభవం లేదు, అయినా 'జై ఆంధ్ర' ఉద్యమ 50 ఏళ్ళ చరిత్ర తర్వాత, జరిగిన రాష్ట్ర విభజన వల్ల 'పరిపాలన-అభివృద్ధి-సంక్షేమం-ఉపాధి' రాష్ట్రం అంచులకు చేరేలా 'జియో-ప్లానింగ్' చేశారు. మరో 13 జిల్లాలు ఏర్పాటు చేసి, 26 జిల్లాలతో తన వికేంద్రీకరణ పని మొదలు పెట్టారు. ఆ పాలనలోని మంచి-చెడులు గురించి ఎవరి అభిప్రాయాలు వారికి ఉండొచ్చు. అది సహజం కానీ, పార్టీలకు రాజకీయాలకు బయట ఉండి రాష్ట్ర ప్రజల మేలు కోసం ఆలోచించేవారు, ఏపీకి కీలకమైన కాలంలో తాము ఎంత బాధ్యత కలిగిన పౌరసమాజంగా ఉన్నాం? అనే ప్రశ్నకు మాత్రం జవాబు వెతుక్కోవలసి ఉంటుంది.

వ్యాసకర్త అభివృద్ధి-సామాజిక అంశాల వ్యాఖ్యాత

ఆదర్శం

ఆదర్శం అంటే దర్శనం చేయించేది: 'చూపించేది' అని అర్థం. మహనీయుల జీవితం మనకు సరైన నడవడిక ఎలా ఉండాలో చూపుతుంది కనుక అది మనకు 'ఆదర్శం'.

దస్తూరీ మెరుగు పరుచుకునేందుకు రాసే 'కాపీ' పుస్తకంలో, పేజీలో పైన ముద్రితమై ఉండే నమూనా పంక్తి- 'మేలు బంతి'-ని చూసుకుంటూ, దాన్ని అనుకరిస్తూ కింద పదిసార్లు రాస్తే చేతి రాత బాగవుతుంది. ఆ నమూనా పంక్తిని కూడా ఆదర్శం అంటారు.

ఏదయినా జటిలమైన శాస్త్ర విషయానికి, ఆ శాస్త్రం బాగా నేర్చిన పండితుడు విపులంగా, సరళంగా వ్యాఖ్య రాసి పెడితే; అది ఆ శాస్త్రం తాలూకా కిటుకులకూ, మర్మాలకూ అద్దం పట్టి మనకు చూపుతుంది. కాబట్టి అలాంటి వ్యాఖ్యాన గ్రంథాలు కూడా ఆదర్శాలే. ఉదాహరణకు కావ్య లక్షణాల గురించి దండి రచించిన గ్రంథం పేరు 'కావ్యాదర్శం'.



జ్యోతిర్మయం

వేదాంతవేత్తలు వివిధ సందర్భాలలో మనసునూ, బుద్ధినీ, చైతన్యాన్నీ అద్దంతో పోలుస్తారు. రజోగుణ సముద్భవమైన కామ-క్రోధాలు అనే లక్షణాలు... శుద్ధమైన మనిషి బుద్ధిని, స్వచ్ఛమైన అద్దాన్ని; మాలిన్యమూ, మసీ కప్పివేసినట్టు ఒక్కొక్కప్పుడు కప్పివేస్తాయి. అప్పుడు బుద్ధి సరిగా పనిచేయదు. అలాంటప్పుడే మనిషి పాపకర్మల ఫలాలు దారుణంగా ఉంటాయని తెలిసి కూడా పాతకాలు చేస్తాడు. నవ్వుతూ చేసిన పాపాల కర్మలను తర్వాత ఏడుస్తూ అనుభవిస్తాడని భగవద్గీత బోధిస్తుంది.

మనం చూసే విశ్వమంతా 'దర్పణ దృశ్యమాన నగరి' (అద్దంలో కనిపించే నగరపు ప్రతిబింబం) లాంటిది అన్నారు ఆది శంకరులు. బాహ్య ప్రపంచంలో విశేషాలన్నీ మన అంతఃకరణలో ప్రతిబింబించడం వల్లనే మనకు గోచరిస్తున్నాయి. మన చేతోదర్పణంలో బాహ్య ప్రపంచపు విశేషాలు ప్రతిబింబించకపోతే వాటి రూపురేఖలూ, లక్షణాలూ మనం గ్రహించలేం. ఈ అద్దం లేకపోతే ఆ విశ్వం మనకు గోచరించదు. అద్దం మీద మోహమూ, భ్రాంతీ, అజ్ఞానమూ అనే మురికి పేరుకుపోతే కూడా మనకు మన కట్టెదుట ఉన్న సత్యం యథాతథంగా కనిపించదు. ఉన్నది కప్పబడి, లేనట్టుతోస్తుంది. అద్దం మీది మాలిన్యం వల్ల లేనిదేదో ఉన్నట్టు కనిపిస్తుంది. బుద్ధి అద్దానికి మకిలి పడితే మనం భ్రాంతిలో జీవిస్తూ ఉంటాం.

'చేతో దర్పణ మార్జనమ్' (బుద్ధిని శుద్ధి చేసే సాధనం) శ్రీకృష్ణ నామ సంకీర్తనం' అని చైతన్య మహాప్రభువుల 'శిక్షాష్టకం' అంటుంది. దానివల్లనే 'సమ్యక్ దృష్టి' కలుగుతుంది.

- ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.విదియ రా.8.33 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** కృత్తిక రా.9.51 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ప.10.39 నుండి 12.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు తదుపరి రా.10.50 నుండి 11.36 వరకు, **అమృత ఘడియలు:** రా.7.40 నుండి 9.07 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.14.

మావోల ఉచ్చులో బలగాలు!

కర్రి గుట్టల్లో కూంబింగ్‌కు అనుకూలంగా లేని పరిస్థితులు
- సుదీర్ఘ సమరానికి సిద్ధమవుతున్న బలగాలు
- దాడుల కంటే బేస్ క్యాంపు ఏర్పాటుకే మొగ్గు


సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కర్రి గుట్టలు ఏరియల్ వ్యూ ఫొటో

సాక్షి, హైదరాబాద్ /సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కర్రి గుట్టల్లో భద్రతా దళాలు ఊహించినట్టుగా మావోయిస్టుల భారీ సంఖ్యలో ఉన్నారా ? లేకపోతే మావోయిస్టులు పన్నిన మరేదైనా వ్యూహమా..? అన్న కోణంలోనూ చర్చ జరుగుతోంది. ఆపరేషన్ కగార్ తర్వాత భద్రతాదళాల దూకుడుకు కర్రి గుట్టల్లోనే బ్రేక్ పడిందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కర్రి గుట్టలపై కూంబింగ్‌కు పరిస్థితులు అంత అనుకూలంగా లేవు. యాంటీ నక్సల్ ఆపరేషన్స్‌లో భాగంగా ఈనెల 21న 'బచావో కర్రి గుట్టలు' మొదలైంది. ఈ ఆపరేషన్‌ను నిర్ణయాత్మక పోరుగా భద్రతాదళాలు అభివర్ణించాయి. ఈనెల 24న జరిగిన ఎదురుకాల్పుల్లో గుర్తు తెలియని ముగ్గురు మహిళా మావోయిస్టులు చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. ఆ తర్వాత 26న ఈ గుట్టల ప్రాంతంలో ఓ భారీ గుహను భద్రతా దళాలు కనుగొన్నాయి. ఇవి మినహాయిస్తే ఇప్పటివరకు వారు సాధించిన చెప్పుకోదగ్గ విజయం లేదనే అభిప్రాయమే వ్యక్తమవుతోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. జవాన్లు కొండపైకి ఎక్కే విషయంలో దూకుడు ప్రదర్శించడం లేదు. దిగువ భాగంలో కూంబింగ్‌కే ఎక్కువగా పరిమితం అవుతున్నట్టు సమాచారం. కొండ పైభాగంలో హెలికాప్టర్, డ్రోన్ల సాయంతోనే నిఘా పెట్టినట్టు తెలుస్తోంది.

మావోల దాగుడుమూతలు..

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. హెలికాప్టర్లు, డ్రోన్లు, శాటిలైట్ చిత్రాలను విశ్లేషించినప్పుడు కర్రి గుట్టలపై మావోల కదలికలు ఉన్నట్టు తెలుస్తోంది. వారు తమ స్థావరాల నుంచి అప్పుడప్పుడూ బయటకు వచ్చి తిరిగి అడవుల్లోకి వెళుతున్నట్టుగా తెలుస్తోంది. సాధారణంగా కొండ ప్రాంతాల్లో కాల్పులు చోటుచేసుకున్నప్పుడు కొండ మీద ఉన్న వారికే అదనపు ప్రయోజనం ఉంటుంది. పైగా కర్రి గుట్టల ప్రాంతం మావోలకు కొట్టిన పిండి. దీంతో ఎదురుకాల్పులు మొదలైతే ఇరు వైపులా భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశముంది.

శాంతి చర్చలపై ఒత్తిడి..

శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించారు. కాల్పుల విరమణకు ఓకే అంటున్నారు. తెలంగాణలో ఉన్న ప్రజాసంఘాలు, మేధావులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ సైతం శాంతి చర్చల పట్ల సానుకూల స్పందన తెలియజేశారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి, కే కేశవరావులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శాంతి చర్చలపై గళం విప్పుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు కూడా ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ తరుణంలో కర్రి గుట్టల ఆపరేషన్‌లో భద్రతా దళాలకు ఏ కొద్ది స్థాయిలో ప్రాణనష్టం జరిగినా, కేంద్ర ప్రభుత్వం చిక్కుల్లో పడుతుంది. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి రావొచ్చు. దీంతో నిన్నా మొన్నటి వరకు ఏకపక్షంగా దూసుకుపోయిన భద్రతా దళాలకు, ఇప్పుడు ఆచితూచి అడుగులు ముందుకు వేయాల్సిన పరిస్థితి ఎదురైంది.

లక్ష్యం మారిందా?

కర్రి గుట్టలపై దాడులు చేస్తే ఇరువైపులా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో భద్రతా దళాలు తమ వ్యూహాన్ని మార్చుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఎండల తీవ్రత..ప్రతికూల వాతావరణం భద్రతా దళాలకు సైతం తీవ్ర ఇబ్బంది కరంగా మారింది. వారం రోజులుగా కర్రి గుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్‌లో డీహైడ్రేషన్‌తో అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికే వంద మంది వరకు జవాన్లు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కర్రి గుట్టల ప్రాంతాన్ని మావోయిస్టుల ప్రభావం నుంచి విడిపించేందుకు దాడుల కంటే బేస్ క్యాంపుల ఏర్పాటే మేలైన పరిష్కారమని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు చర్ల మండల పరిధిలో తాత్కాలిక వసతి ఏర్పాట్ల పనిలో పారా మిలిటరీ ట్రూప్స్ నిమగ్నమయ్యాయి.

సేఫ్‌జోన్‌కు అగ్రనేతలు?

కర్రి గుట్టలపై బాంబులు అమర్చామని బహిరంగ ప్రకటన చేసి మరీ భద్రతా దళాలను మావోయిస్టులు ఇక్కడకు రప్పించారు. అయితే, తమ అగ్రనేతలను దండకారణ్యం నుంచి సేఫ్‌జోన్‌కు తరలించేందుకు ఈ బాంబుల ప్రచారం వ్యూహాత్మకంగా మావోయిస్టులు తెర మీదకు తెచ్చారనే వాదనలు వినిపిస్తున్నాయి.

కర్రి గుట్టల్లో 150 మందుపాతరల గుర్తింపు

చర్ల: కర్రిగుట్టల్లో సోమవారం భద్రతా బలగాలు 150 మందుపాతరలను గుర్తించాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని అదే ప్రాంతంలో నిర్వీర్యం చేశారు. సోమవారం రాత్రి బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గలగం–నడుపల్లి గ్రామాల సమీప గుట్టల్లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని సమాచారం.

క్లుప్తంగా...

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


శివ

కేశంపేట: ఇంటర్మీడియెట్ (ఒకేషనల్) పరీక్షలు తప్పడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేములనర్వలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అలుగోండ యాదగిరి, లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు. చిన్నకొడుకు శివ (18) షాద్‌నగర్‌లోని మణికంఠ ప్రైవేట్ ఒకేషనల్ కళాశాలలో ఎలక్ట్రీషియన్ టెక్నాలజీ (ఈటీ) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో శివ నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

పెన్‌పహాడ్: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని మేగ్యాతండాకు చెందిన ఆంగోతు నాగేశ్వరరావు (38) తన కున్న 2.20 ఎకరాల భూమిలో వరి పంట సాగు చేశాడు. అయితే, పంటకు నీరందక పూర్తిగా ఎండిపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పంట నష్టం తట్టుకోలేక ఈ నెల 21న క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని కొంతసేపటికి తన తల్లికి చెప్పగా వెంటనే.. అతడిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం నాగేశ్వరరావు మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపీకృష్ణ తెలిపారు.


ఊపిరితిత్తుల్లో వేరుశనక్కాయ ఇరుక్కుని..
- లష్కర్‌గూడలో విషాదం


తన్విక

అబ్దుల్లాపూర్‌మెట్: ఊపిరితిత్తుల్లో వేరుశనగ కాయ ఇరుక్కోవడంతో ఓ చిన్నారి ప్రాణం కోల్పోయింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడకు చెందిన బండారి శ్యామ్‌సుందర్, మహేశ్వరి దంపతుల కూతురు తన్విక (4) ఆదివారం సాయంత్రం వేరుశనగ కాయలు తింటుండగా.. ప్రమాదవశాత్తు ఓ కాయ ఊపిరితిత్తుల్లో ఇరుక్కుంది. దీంతో శ్వాస తీసుకునేందుకు చిన్నారి ఆయాస పడింది. వెంటనే తల్లిదండ్రులు ఆమెను చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే తీయించిన వైద్యులు తన్విక ఊపిరితిత్తుల్లో వేరుశనగ కాయ ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ ద్వారా తొలగించాలని సూచించడంతో తల్లిదండ్రులు ఇందుకు అంగీకరించారు. సోమవారం శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయం 7.55 గంటల సమయంలో బాలిక మృతిచెందింది. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వ బలగాలు మావోయిస్టులను చంపడాన్ని వెంటనే నిలిపివేసి, చర్చలకు పిలవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ. రాఘవులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మావోయిస్టు పార్టీని అంతం చేయాలని, ఛత్తీస్‌గఢ్ దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో బలగాలను మోహరించి వారిని తుడిచిపెట్టాలని కేంద్రం ప్రకటించడం, చివరి మావోయిస్టులను చంపేదాకా వదిలిపెట్టబోమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడటం ప్రజాస్వామిక దేశంలో అత్యంత అభ్యంతరకరమన్నారు. ఆపరేషన్ కగార్‌లో తెలంగాణలోని రెండు మండలాలు కూడా ఉన్నా యని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 370 పేజీల ఎన్‌డీఎస్‌ఏ నివేదిక తీవ్రమైన లోపాలు, పలు కీలక అంశాలను ఎత్తిచూపిందన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి దానిపై సమగ్రంగా చర్చించాలని కోరారు.

వీడీసీ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి : జాన్‌వెస్లీ



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక తరగతుల వారిని సామాజిక అణచివేతలకు, సాంఘిక బహిష్కరణకు గురి చేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీ)లపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని బాధితులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఫార్మాసిటీ ప్రాంతంలో రైతుల నుంచి భూములను లాక్కోవడాన్ని సీపీఎం ఖండిస్తోందన్నారు.

ఆ ముగ్గురిది పీఎల్‌జీఏ బెటాలియన్

- మృతి చెందిన మహిళా మావోయిస్టుల వివరాలు వెల్లడించిన ఎస్పీ

చర్ల: కర్రి గుట్టల ఆపరేషన్‌లో భాగంగా ఈనెల 24న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ముగ్గురు మహిళా మావోయిస్టులను గుర్తించారు. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేందర్‌కుమార్ యాదవ్ సోమవారం ఆ వివరాలు వెల్లడించారు. మృతులను పీఎల్‌జీఏ బెటాలియన్–1కు చెందిన సింధు, హుంగీ, శాంతిగా గుర్తించారు.

24 మంది లొంగుబాటు

బీజాపూర్ జిల్లాలో సోమవారం 24 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ చెప్పారు.

'శాంతి చర్చలు జరపండి'

చర్ల: కాల్పుల విరమణ ప్రకటించి.. శాంతిచర్చలు జరపాలని.. అందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, దండకారణ్య అధికార ప్రతినిధి అభయ్ వెల్లడించారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని ఆయన సోమవారం విడుదల చేసిన లేఖలో కోరారు. 'కగార్' పేరుతో వందలాది మావోయిస్టులు, అమాయక ఆదివాసీలను చంపారని, ఇది ఇంకా కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధమేనని తనతోపాటు దండకారణ్య ఉత్తర, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో రూపేశ్ పేరిట 3 ప్రకటనలు విడుదల చేశామని గుర్తు చేశారు. దళాల సాయుధ కార్యకలాపాలను నిలిపివేయాలని తమ నేతలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలకు ఆహ్వానించాలని, మావోయిస్టుల ఏరివేతకు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ముందుకు రావాలన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు, సూచనలు తీసుకోవాలని, కేవలం చర్చల ద్వారా మాత్రమే శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కాల్పులతో మావోయిస్టులను అంతం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వపు విధానం సరికాదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో అనేక మంది నక్సలైట్లు సరెండర్ అయ్యారని, కేసీఆర్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాల వల్ల ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి కూడా తెలంగాణలో నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిశారని కవిత గుర్తుచేశారు. కేసీఆర్ విధానాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని, సరెండర్లను ప్రోత్సహించి వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు.

రూ.2.5 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్


అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి, హైదరాబాద్: గంజాయి రవాణా ముఠాలు.. పోలీసులు, ఎక్సైజ్ అధికారుల దాడుల నుంచి తప్పించుకోవడానికి కొత్త, కొత్త ఎత్తులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సుమారు రూ.2.5 కోట్ల విలువైన గంజాయిని పనస పండ్ల మాటున తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. కొందరు వ్యక్తులు ఏపీలోని పలాస నుంచి విశాఖపట్నం, విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు ఆ ముఠాను అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.2.5 కోట్ల విలువైన 410 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన డ్రైవర్ గణేశ్ రామస్వామి, రత్నాభాయ్ అనే గంజాయి వ్యాపారి, విజయ్ శంకర్ కులకర్ణి అనే మరో డ్రైవర్ ముఠాగా ఏర్పడ్డారు. గంజాయి రవాణా కోసం ఒక మినీ వ్యాన్‌ను కూడా కొనుగోలు చేశారు. అప్పటికే గంజాయి అక్రమ వ్యాపారంలో ఆరితేరిన రత్నాభాయ్ సహకారంతో ఒడిశాలోని గంజాయి సరఫరాదారులతో పరిచయం చేసుకొని అక్రమ వ్యాపారానికి తెరలేపారు. కాగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది 20 రోజుల పాటు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో సోమ వారం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ కలిగిన మహేంద్ర మినీ వ్యాన్‌ను అధికారులు గుర్తించి ఆపారు. దీంతో పలాస నుంచి పనస పండ్లను మార్కెట్‌కు తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. వాహనంలో గంజాయిని నింపి ఎలాంటి అనుమానం రాకుండా పైన పనస పండ్లతో భర్తీ చేశారు. అయితే అధికారులు తనిఖీ చేయడంతో గంజాయి బయట పడింది. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఒడిశా నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో నిందితులను అరెస్టు చేయడంతో పాటు రూ. 2.5 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కొడుకు పట్టించుకోవడం లేదు.. న్యాయం చేయండి

- తొర్రూరు ఆర్డీఓకు వృద్ధురాలి వినతి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట వినతిపత్రంతో వృద్ధురాలు

తొర్రూరు: సోదరుని భూమిని అమ్ముకోవడమేకాక, తన యోగక్షేమాలు చూడకుండా చిన్న కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తనకు న్యాయం చేయాలని ఓ వృద్ధురాలు అధికారులకు మొరపెట్టుకుంది. సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆ వృద్ధురాలు ఆందోళనకు దిగింది. అనంతరం ఆర్డీఓకు వినతిప్రతం అందజేసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన యెల్డి సుశీలకు వెంకన్న, రమేశ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి 18 ఎకరాల భూమిని సమానంగా పంచి ఇచ్చింది. కాగా, పెద్ద కుమారుడు తనకు వచ్చిన భూమిలో ఆరున్నర ఎకరాలకు మాత్రమే తన పేరిట పట్టా చేయించుకున్నాడు. మిగతా రెండున్నర ఎకరాలకు ఇంకా చేయించుకోలేదు. ఈ నేపథ్యంలో చిన్న కుమారుడు రమేశ్ ఆ రెండున్నర ఎకరాలు తన పేరిట పట్టా చేయించుకున్నాడు. ఇదేమని ప్రశ్నించిన తల్లిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. ఇటీవల ఆ రెండున్నర ఎకరాల భూమిని అమ్ముకున్నాడు. దీంతో 70 ఏళ్ల వృద్ధురాలు సుశీల న్యాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. సోదరుడి భూమిని అమ్ముకోవడమేకాక, కనీసం తనకు అన్నం పెట్టకుండా, ఆరోగ్యం, బాగోగులు చూడని చిన్న కుమారుడికి పట్టా చేసిన భూమిని రద్దు చేసి, తన పేరిట పట్టా చేయాలని ఆ వృద్ధురాలు ఆర్డీఓను వేడుకుంది.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

- యూనిట్–1లో బాయిలర్ నుంచి భారీగా ఆయిల్ లీక్
- సమీపంలో వెల్డింగ్ చేయడంతో నిప్పు రవ్వలు పడి ప్రమాదం


వైటీపీఎస్ యూనిట్-1లో మంటలు

సాక్షి, హైదరాబాద్/మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) యూనిట్–1 బాయిలర్‌లో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో విద్యుత్ కేబుల్ వైర్లు, పైపులు కాలిపోయాయి. దీని వల్ల యూనిట్–1 ట్రయల్ రన్ మరికొద్ది రోజులు వాయిదా పడనుంది. వివరాల్లోకి వెళితే.. వైటీపీఎస్‌లో 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 5 యూనిట్లు ఉండగా, వీటిలో 2, 3వ యూనిట్లలో విద్యుదుత్పత్తిని ఇటీవల ప్రారంభించారు. 1, 4, 5 యూనిట్ల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. 1వ యూనిట్‌లో ట్రయల్ రన్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బాయిలర్ పొడవు సుమారు 90 మీటర్లు ఉండగా. భూ భాగాన వాల్వ్‌ల నుంచి ఇంధనం లీక్ అయ్యింది. మరోవైపు సమీపంలో వెల్డింగ్ పనులు చేయడంతో నిప్పురవ్వలు లీకై ఇంధనంపై పడ్డాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. అగ్నిమాపక దళాలు అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ఘటనలో కేబుల్‌వైర్లు, వాల్వ్‌లు, ఐరన్ పైపులు కాలిపోయాయి. బాయిలర్ పొడవు 90 మీటర్లు కాగా, 20 మీటర్ల వరకు మంటలు వ్యాపించాయి. ఆయిల్ లీకేజీ వల్ల ప్రమాదం జరిగినట్టు టీజీ జెన్‌కో అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందించారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీజీ జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, బీహెచ్‌ఈఎల్ సీఎండీ సదాశివమూర్తి, వైటీపీఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని వారు ఆదేశించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం వైటీపీఎస్ యూనిట్–1 బాయిలర్ వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రమాదంలో స్వల్పనష్టం జరిగిందని మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

పర్యవేక్షణ లేకనే ప్రమాదం...

వైటీపీఎస్ ప్లాంట్ నిర్మాణం పూర్తి కావొస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో అవసరమైన ఇంజనీర్లు, ఇతర సిబ్బందిని జెన్‌కో యాజమాన్యం నియమించలేదు. విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు రాత్రింబవళ్లు జరుగుతుండగా, పర్యవేక్షించేందుకు తగిన సంఖ్యలో ఇంజనీర్లను నియమించలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంజనీర్ల కొరత ఉండటంతోనే పనుల్లో ఆలస్యం జరుగుతోందని ఇటీవల జరిగిన సమీక్షలో వివరణ ఇచ్చిన ఓ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా సస్పెండ్ చేసినట్టు చర్చ జరుగుతోంది. ఇంజనీర్లను నియమించాలని నిర్మాణ సంస్థ బీహెచ్‌ఈఎల్ సైతం జెన్‌కోకు పలుమార్లు లేఖలు రాసిందని అధికారులు పేర్కొంటున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే ఆయిల్ లీకైనా ప్రాంతానికి దగ్గర్లో కార్మికులు వెల్డింగ్ పనులు చేశారని, దీంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు అంటున్నారు.

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టి మంగళవారానికి 100 రోజులు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తున్నాననే మిషతో రోజుకోటి అన్నట్టుగా ఈ మూడు నెలల్లో ఆయన లెక్కలేనన్ని అనాలోచిత చర్యలకు దిగారు. 'పూటకో మాట, రోజుకో వైఖరి' అన్నట్టుగా పదేపదే నిర్ణయాలను, విధానాలను మార్చుకుంటూ నవ్వులపాలవుతున్నారు. అంతర్జాతీయ సమాజం దృష్టిలో అమెరికాను పలుచన చేయడమే గాక వ్యక్తిగతంగా జీవితకాలానికి సరిపడా అప్రతిష్ఠ మూటగట్టుకున్నారు. అక్రమ వలసదారులకు అడ్డుకట్ట సాకుతో తలా తోకా లేని నిబంధనలతో అంతర్జాతీయ విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. పొదుపు పేరిట ఉద్యోగులను భారీగా తొలగించడం వంటి చర్యలతో అమెరికన్లను కూడా ఎన్నడూ లేనంత అభద్రతా భావంలోకి నెట్టేశారు. దాదాపుగా ఈ మూడు నెలల్లో ట్రంప్ తీసుకున్న అన్ని నిర్ణయాలూ న్యాయ వివాదాలకు దారితీయడం విశేషం. అమెరికా ద్రవ్యోల్బణానికి ముకుతాడు వేస్తానన్న వాగ్దానం నిలుపుకోవడంలోనూ ట్రంప్ ఘోరంగా విఫలమయ్యారు. నిత్యావసరాల ధరలు చుక్కలు తాకుతున్నాయి. చివరికి గుడ్ల ధరలు చూసి సగటు అమెరికన్ గుడ్లు తేలేసే పరిస్థితి నెలకొంది! ఇష్టారాజ్యపు నిర్ణయాలతో అటు ప్రపంచాన్ని, ఇటు అమెరికాను కూడా ఆర్థికంగా ప్రమాదపుటంచుల్లోకి నెట్టిన ట్రంప్, ఆ మంటల్లో తీరిగ్గా చలి కాచుకుంటున్నారు...

మతిలేని టారిఫ్‌ల యుద్ధం

ఈ 100 రోజుల్లో ట్రంప్ చేపట్టిన చర్యలన్నింట్లోనూ అత్యంత వివాదాస్పదమైనది, అనాలోచితమైనది టారిఫ్‌ల యుద్ధమే. అమెరికాపై భారీ టారిఫ్‌లు విధిస్తున్నాయంటూ చాలా దేశాలపై అంతర్జాతీయ వాణిజ్య సూత్రాలకు విరుద్ధంగా ప్రతీకార చర్యలకు దిగారు. అగ్ర రాజ్యాలు మొదలుకుని చివరికి అసలు జనమే ఉండని అంటార్కిటికా వంటి ప్రాంతాలపై కూడా ఎడాపెడా టారిఫ్‌లు పెంచి నవ్వులపాలయ్యారు. పైగా వాటిని రోజుకోలా మారుస్తూ అత్యంత చంచల ధోరణి కనబరిచారు. ఇక చైనా విషయంలోనైతే టారిఫ్‌లను రోజురోజుకూ అంతకంతకూ పెంచుతూ వేలంపాటను తలపించారు. చివరికి 145 శాతం దాకా తీసుకెళ్లి దాన్నో కామెడీ వ్యవహారంగా మార్చేశారు. టారిఫ్‌ల భయంతో ప్రపంచ మార్కెట్లన్నీ కుప్పకూలి కోలుకోలేని రీతిలో లక్షలాది కోట్ల రూపాయల మేర నష్టాలను చవిచూశాక తీరిగ్గా వాటి అమలును మూడు నెలల పాటు వాయిదా వేశారు. టారిఫ్‌లకు ప్రతీకారంగా అరుదైన ఖనిజాల ఎగుమతిని చైనా పూర్తిగా నిలిపేయడంతో అమెరికా దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది.

వలసలపై మొట్టికాయలు

అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపే పేరిట వలసదారుల గుండెల్లో ట్రంప్ రైళ్లు పరుగెత్తిస్తున్నారు. పగ్గాలు చేపట్టిన కొద్ది రోజులకే అక్రమ వలసదారులను భారీ ఖర్చుతో ఏకంగా సైనిక విమానాల్లో స్వదేశాలకు పంపారు. సుదీర్ఘ ప్రయాణం పొడవునా ఒళ్లంతా సంకెళ్లు వేసి విమర్శలు మూటగట్టుకున్నారు. తర్వాత వారిని గ్వాటెమాలా తదితర సమీప దేశాలకు తరలించి నిర్బంధంలో ఉంచడం మొదలుపెట్టారు. దీనిపై కోర్టుల మందలింపులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక విదేశీ విద్యార్థుల విషయంలోనైతే ట్రంప్ అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. ఐదారేళ్ల చరిత్రను తవ్వుతూ ఎక్కడ ఏ చిన్న తప్పిదం కనిపించినా దేశం వీడాలని ఆదేశిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన చిన్నాచితకా కారణాలకు కూడా వీసాలు రద్దు చేసి వెనక్కు పంపిస్తున్నారు. ఈ విషయంలో కోర్టులతో పదేపదే మొట్టికాయలు తింటూ వస్తున్నారు.



❝ నా టారిఫ్‌ల దెబ్బకు అన్ని దేశాలూ వణికిపోతున్నాయి. నాతో చర్చలకు బారులు తీరుతున్నాయి
- ట్రంప్

100 రోజుల ట్రంపరితనం

- అన్నీ అస్తవ్యస్త విధానాలే
- మూణ్నెల్లలోనే ముచ్చెమటలు
- టారిఫ్‌లపై పూటకో మాట
- అన్ని దేశాలతోనూ గిల్లికజ్జాలు
- మతిలేని వలస విధానం
- విద్యాసంస్థలపై ఉక్కుపాదం
- అమెరికన్లలోనూ అసంతృప్తి
- బాగా పడిపోతున్న ఆదరణ

విద్యాసంస్థలపై ఉక్కుపాదం

తన మాట వినడం లేదంటూ యూనివర్సిటీలపై ట్రంప్ కన్నెర్రజేశారు. ప్రపంచానికే తలమానికం వంటి అమెరికా విద్యా సంస్థల పునాదులనే పెకిలించే పనిలో పడ్డారు. వాటికి బిలియన్ల కొద్దీ ప్రభుత్వ నిధులను నిలిపేశారు. దారికొస్తే తప్ప వాటిని విడుదల చేసేది లేదంటున్నారు. అలా కొలంబియా వంటి వర్సిటీలను లొంగదీసుకున్నారు. కానీ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ మాత్రం ట్రంప్ తీరును తూర్పారబట్టింది. అణచివేత చర్యలకు తలొంచేది లేదని ప్రకటించింది. 300 కోట్ల డాలర్లకు పైగా నిధులను నిలిపేసినా 'డోంట్ కేర్' అనేసింది.

డోజ్.. ఓవర్ డోస్

దుబారా వ్యయానికి కళ్లెం వేసేందుకంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సారథ్యంలో తీసుకొచ్చిన డోజ్ పనితీరు అమెరికన్లలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. లెక్కలేనన్ని ఉద్యోగాలను డోజ్ ఒక్క దెబ్బతో పీకిపారేసింది. కనీసం రెండు లక్షల కోట్ల డాలర్లు ఆదా చేస్తానని గొప్పగా చెప్పుకున్న మస్క్, ఓ రెండొందల కోట్ల డాలర్ల కంటే ఆదా కష్టమంటూ చివరికి చేతులెత్తేశారు. పైగా డోజ్ ముసుగులో అమెరికా ప్రభుత్వానికి సంబంధించిన కీలక, రహస్య డేటానంతా మస్క్ చేజిక్కించుకున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జెలెన్‌స్కీకి అవమానం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని చర్చలకంటూ పిలిచి వైట్‌హౌస్‌లో మీడియా సాక్షిగా ట్రంప్, ఆయన డిప్యూటీ జేడీ వాన్స్ ఘోరంగా అవమానించిన తీరు చరిత్రలో నిలిచిపోయింది. దేశాధ్యక్షుడనే కనీస గౌరవం కూడా లేకుండా సూటిపోటి మాటలతో ఇద్దరూ రెచ్చిపోయారు. జెలెన్‌స్కీ ఎక్కడా తగ్గకుండా వాళ్లకు మాటకు మాట బదులిచ్చి శెభాష్ అనిపించుకున్నారు. చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ చివరికి ఆయన్ను వైట్‌హౌస్ నుంచి అవమానకర రీతిలో వెళ్లగొట్టిన తీరు చూసి ప్రపంచ దేశాలన్నీ షాక్‌కు గురయ్యాయి. ట్రంప్, వాన్స్ ప్రవర్తన వైట్‌హౌస్‌కే తీవ్ర కళంకమంటూ ఈసడించుకున్నాయి.

ఆదరణ అట్టడుగుకు

ట్రంప్ పట్ల అమెరికన్లలో వ్యతిరేకత నానాటికీ పెరిగిపోతోందని పోల్స్ అన్నీ ముక్త కంఠంతో చెబుతున్నాయి. అధ్యక్షుల తొలి 100 రోజుల పాలనకు జనామోదం విషయంలో ట్రంప్ గత 70 ఏళ్లలోనే అట్టడుగున నిలిచారు! ఆయన పాలనను గట్టిగా సమర్థిస్తున్న వారి సంఖ్య ఏకంగా 22 శాతానికి పడిపోయినట్టు సీఎన్ఎన్ పోల్ తేల్చింది. గట్టిగా వ్యతిరేకించేవారి సంఖ్య 45 శాతానికి పెరిగింది. ముఖ్యంగా మార్చి నుంచి ట్రంప్ ఆదరణ శరవేగంగా అడుగంటుతూ వస్తోంది. టారిఫ్‌లపై ట్రంప్ తీరును 35 శాతం అమెరికన్లు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఆర్థికంగా దేశాన్ని ఆయన గట్టెక్కిస్తారని నమ్ముతున్న వారి సంఖ్య కూడా డిసెంబర్‌తో పోలిస్తే ఏకంగా 12 శాతం తగ్గింది. మతిలేని చర్యలతో దేశాన్ని ట్రంప్ ప్రమాదంలోకి నెడుతున్నారని 57 శాతం మంది భావిస్తున్నారు. ఆయన విదేశీ విధానాన్ని 60 శాతం మందికి పైగా తీవ్రంగా తప్పుబడుతున్నారు. వలసల విధానాన్ని కూడా 47 శాతం మంది ఆక్షేపిస్తున్నారు. ఉద్యోగ కల్పనలో ట్రంప్ తీరుతో 58 శాతం మంది పెదవి విరుస్తున్నారు. అధ్యక్షునిగా అధికారాన్ని బాధ్యతాయుతంగా వాడతారన్న నమ్మకం లేదని 54 శాతం మంది అమెరికన్లు అంటుండటం విశేషం. సరైన నాయకత్వం అందిస్తారని నమ్ముతున్నది 50 శాతమే. ఆయనకు ఓటేసి తప్పు చేశామని 20 శాతం మంది వాపోతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది!

దేశాలపై నోటి దురుసు

కెనడా మొదలుకుని పలు దేశాలపై నోటి దురుసు వ్యాఖ్యలతో ట్రంప్ పరువు పోగొట్టుకున్నారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా విలీనమైతే మేలంటూ అనవసర వ్యాఖ్యలు చేసి కెనడాతో శత్రుత్వాన్ని కొనితెచ్చుకున్నారు. పైగా ఆ దేశంపై విధించిన అడ్డగోలు టారిఫ్‌లతో అంతిమంగా అమెరికాకే నష్టం జరిగింది. అంతేగాక అమెరికాను ఇక జీవితంలో నమ్మేది లేదని కెనడా నాయకత్వంతో అనిపించుకున్నారు. గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించేసుకుంటామని ప్రకటించి మరో వివాదాల తేనెతుట్టెను కదిపారు. గాజా నుంచి పాలస్తీనియన్లను పూర్తిగా తొలగించేసి దాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామంటూ తలాతోకా లేని ప్రకటన చేసి మొత్తం ముస్లిం ప్రపంచం ఆగ్రహానికి గురయ్యారు. ఉక్రెయిన్‌కు చేసిన యుద్ధ సాయానికి బదులుగా ఆ దేశ ఖనిజ నిల్వలను అమెరికాకు కట్టబెట్టాల్సిందేనంటూ భీష్మించుకున్నారు. రష్యాను ఒప్పించి ఒక్క రోజులో యుద్ధాన్ని ఆపిస్తానన్న ట్రంప్ ప్రకటన కూడా ఉత్తదేనని తేలిపోయింది. 'పుతిన్‌కు యుద్ధం ఆపే ఉద్దేశమే లేనట్టుంది' అంటూ ఇప్పుడాయన తీరిగ్గా నిట్టూరుస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకం చేసి పెన్నులను విసిరేస్తున్న ట్రంప్



వైట్‌హౌస్‌లో భుజాలపై కుమారునితో మస్క్ మాట్లాడుతుంటే తీరిగ్గా వింటూ...



వైట్‌హౌస్ భేటీ సందర్భంగా జెలెన్‌స్కీని హెచ్చరిస్తూ...



బహిరంగ సభలో మాట్లాడుతూ ఉన్నట్టుండి డ్యాన్స్ చేస్తూ...

ప్రధానితో రాజ్‌నాథ్ భేటీ

సైనిక సన్నద్ధతను వివరించిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ప్రధాని మోదీని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సోమవారం కలిశారు. ఢిల్లీలోని 7, లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని మోదీ అధికారిక నివాసంలో ఈ భేటీ జరిగింది. సైన్యం సన్నద్ధత గురించి మోదీకి రాజ్‌నాథ్ వివరించినట్లు తెలుస్తోంది. దాదాపు 45 నిమిషాలపాటు జరిగిన ఈ భేటీలో రాజ్‌నాథ్‌తోపాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సైతం పాల్గొన్నారు. దాడి తర్వాత పాకిస్తాన్‌పై అమల్లోకి తెచ్చిన ఆంక్షలు, వాటి పరిణామాలపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ విషయంలో తీసుకోబోయే తదుపరి నిర్ణయాలపై రాజ్‌నాథ్‌కు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ పలు అంశాలను వెల్లడించిన మరుసటి రోజే మోదీతో రక్షణమంత్రి భేటీకావడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవ్యతిరేక చర్యలను ముమ్మరం చేయడం వంటి అంశాలను మోదీకి రాజ్‌నాథ్ వివరించారు. ఈ భేటీలో ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది సైతం పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో అదనపు బలగాల మొహరింపుపై ద్వివేది మోదీకి ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గత మంగళవారం బైసారన్‌లో ఉగ్రవాదుల పాశవిక దాడి తర్వాత భారత ప్రభుత్వం పలు కీలక భేటీలను నిర్వహిస్తూ సంచలన నిర్ణయాలు తీసుకోవడం తెల్సిందే.

నాలుగో రోజూ కాల్పులు

జమ్మూ: పాకిస్తాన్ ఆర్మీ వరుసగా నాలుగో రోజూ కవ్వింపు చర్యలను కొనసాగించింది. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్, కుప్వారా జిల్లాల పరిధిలోని నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు పాల్పడింది. గతవారం చోటు చేసుకున్న పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతుండటం తెల్సిందే. ఈ నెల 27వ అర్ధరాత్రి నుంచి తక్కువ శ్రేణి ఆయుధాలతో కాల్పులు కొనసాగాయని రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు. భారత బలగాలు తగు రీతిలో బదులిచ్చాయన్నారు.

బీబీసీది పక్షపాత రిపోర్టింగ్

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆగ్రహం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడిపై బీబీసీ కవరేజ్ పట్ల కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీబీసీది పక్షపాత రిపోర్టింగ్ అని విమర్శించింది. పాక్ జాతీయుల వీసాల రద్దుపై బీబీసీ రాసిన కథనంలో ఉగ్రదాడిని మిలిటెంట్ అటాక్‌గా పేర్కొనడంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇది దేశం మనోభావాలను దెబ్బతీస్తుందని బీబీసీ ఇండియా హెడ్ జాకీ మార్టిన్‌కు విదేశాంగశాఖ లేఖ రాసింది. బీబీసీ రిపోర్టింగ్‌ను విదేశాంగ శాఖ పర్యవేక్షిస్తుందని లేఖలో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సరిహద్దు వెంబడి తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే సందేశాలను నిరోధించడానికి 16 పాకిస్తాన్ యూట్యూబ్ చానళ్లను భారత్ నిషేధించింది. నిషేధానికి గురైన చానళ్లలో పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ యూట్యూబ్ ఛానల్ ఉండటం గమనార్హం.

ముష్కర మూకలకు ముచ్చెమటలు

- పీఓకేపైకి భారత్ ప్రతిదాడి చేయొచ్చని అనుమానాలు
- ముందుజాగ్రత్తగా ఉగ్రవాదులను సరిహద్దు నుంచి దూరంగా పంపేస్తున్న పాక్ సైన్యం
- పీఓకేలో 42 ఉగ్రస్థావరాలను గుర్తించిన భారత సైన్యం

శ్రీనగర్: పహల్గాంలో ఉగ్రవాదుల రాక్షసకాండ తర్వాత కోపంతో రగిలిపోతున్న భారతసైన్యం ఏక్షణంలోనైనా పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాదుల శిబిరాలపై దాడి చేయొచ్చనే భయానుమానాలు పాక్ సైన్యంలో ఎక్కువయ్యాయి. దీంతో ఇన్నాళ్లూ తాము పెంచి పోషించిన ఉగ్రవాదులను పాక్ సైన్యం వెంటనే ఆయా 'లాంచ్‌ప్యాడ్'ల నుంచి సురక్షితంగా దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ముందస్తుగా ఆ ముష్కరులను తమ సైనిక శిబిరాలు, బంకర్లలోకి పంపేస్తున్నట్లు తెలుస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారత సరిహద్దు వెంట ఉన్న లాంచ్‌ప్యాడ్‌లను ఖాళీచేయిస్తోంది. ఈ లాంచ్‌ప్యాడ్లు క్రియాశీలకంగా ఉన్న విషయాన్ని భారత సైనిక నిఘా వర్గాలు పసిగట్టడంతో ముందుజాగ్రత్తగా పాక్ సైన్యం అప్రమత్తమై అక్కడి ఉగ్రవాదులను వేరే చోట్లకు పంపేస్తోంది.

ఇవన్నీ కీలక స్థావరాలు

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని కేల్, సర్దీ, దుధ్‌నియాల్, అథ్‌ముఖాన్, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహూతా, కోట్లీ, ఖుయిరాట్టా, మంధార్, నిఖాయిల్, ఛమన్‌కోట్, జాన్‌కోటేలలో ఈ ఉగ్రస్థావరాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాలన్నింటి నుంచీ ఉగ్రవాదులు తాత్కాలికంగా వెళ్లిపోతున్నట్లు వార్తలొచ్చాయి. వాస్తవానికి ఇవన్నీ ఉగ్రవాదులకు కీలక స్థావరాలు(లాంచ్‌ప్యాడ్). వాస్తవాధీన రేఖ గుండా భారత్‌లోకి చొరబడటానికి ఉగ్రవాదులు ఈ స్థావరాల నుంచే బయల్దేరతారు. ఇక్కడే వీళ్లకు నెలల తరబడి ఉగ్రశిక్షణ ఇస్తారని తెలుస్తోంది. పీఓకేలో క్రియాశీలంకంగా ఉన్న 42 లాంచ్‌ప్యాడ్‌లను ఇటీవల భారత భద్రతా బలగాలు గుర్తించాయి. పహల్గాం దాడి ఉదంతం తర్వాత ఆగ్రహావేశాలతో ఊగిపోతున్న భారతసైన్యం ఏ క్షణంలోనైనా దాడి చేయవచ్చనే ఉద్దేశంతో ఉగ్రవాదులను పాక్ సైన్యం హుటాహుటిన ఇతర ప్రదేశాలకు పంపేస్తోంది. ఇలా తరలిస్తున్న ఉగ్రవాదుల సంఖ్య 150 నుంచి 200దాకా ఉంటుందని తెలుస్తోంది. అయితే ఇప్పటికే హిజ్బుల్ మొజాహిదీన్, జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా ఉగ్రసంస్థలకు చెందిన దాదాపు 60 మంది విదేశీ కిరాయి ఉగ్రవాదులు కశ్మీర్‌లోకి చొరబడ్డారని జాతీయ మీడియాలో కథనం వెలువడింది. వీరిలో 17 మంది స్థానికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత సైన్యం సరిహద్దు వెంట గాలింపును మరింత ఉధృతంచేసింది.

మీ అమ్మను చంపినప్పుడూ ఇలాగే మాట్లాడారా?

బిలావల్ వ్యాఖ్యలపై అసద్ ఫైర్

న్యూఢిల్లీ: రక్తం ఏరులై పారుతుందంటూ పాకిస్తాన్ నేత బిలావల్ భుట్టో జర్దారీ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. తన తల్లి, పాక్ మాజీ ప్రధాని బేనజీర్ భుట్టోను చంపిందెవరో గుర్తుకు తెచ్చుకుని మాట్లాడాలని హితవు పలికారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా సింధూ నదీ జలాల ఒప్పందం నుంచి వైదొలగాలని భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బిలావల్ తప్పుబట్టారు. సింధూ నది మాది. మాకే చెందుతుంది. నదిలో మా నీళ్లు పారాలి. లేదా వాళ్ల రక్తం ప్రవహిస్తుంది'అంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలను పార్టీలకతీతంగా నేతలు ఖండించడం తెల్సిందే. సోమవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన ర్యాలీలో అసదుద్దీన్ మాట్లాడారు. 'బిలావల్ తన తాత జుల్ఫికర్ అలీ భుట్టో, తల్లి బేనజీర్ భుట్టోను చంపిందెవరో తెలుసుకుని మాట్లాడాలి. ఆమెను టెర్రరిస్టులే చంపారు. మీ అమ్మను చంపితే టెర్రరిజం. మా తల్లులు, కూతుళ్లను చంపితే మాత్రం కాదా? చిన్న పిల్లాడిలా మాట్లాడొద్దు'అని తీవ్ర స్వరంతో అన్నారు.



అణుబాంబు దాడి గురించి మాట్లాడే పాక్ నేతలనూ ఆయన వదల్లేదు. 'పరాయి దేశంలోకి ప్రవేశించి అమాయకులను చంపుతుంటే ఎవరూ ఊరుకోరు. అధికారంలో ఎవరున్నా సరే, మౌనంగా ఉండిపోరు. మతమడిగి కాలుస్తారా? మీరు మాట్లాడేది ఏ మతం గురించి? మీరు ఖవారిజ్ కన్నా హీనం. ఐసిస్ మద్దతుదార్లు మీరు'అంటూ నిప్పులు చెరిగారు. ఆ దేశంపై సైబర్ దాడులు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆత్మరక్షణ కోసం ఇలా చేయొచ్చని ఐరాస చార్టర్ కూడా చెబుతోందన్నారు. పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ నిషేధ జాబితాలో చేర్చాలన్నారు.

మేలో 3 రోజుల కాల్పుల విరమణ

విక్టరీ డేను పురస్కరించుకుని ప్రకటించిన పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌మే నెలలో మూడు రోజులపాటు కాల్పుల విరమణను ప్రకటించారు. రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్, దాని మిత్రదేశాల విజయానికి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మే9న విక్టరీ డేను పురస్కరించుకుని కాల్పుల విరమణ పాటించనున్నట్లు సోమవారం ప్రకటించారు. కాల్పుల విరమణ మే 8 అర్ధరాత్రి నుంచి మే 10 వరకు కొనసాగుతుందని తెలిపారు. మానవతా దృక్పథంతో యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేయాలని అధ్యక్షుడు ఆదేశించినట్లు క్రెమ్లిన్ ప్రకటించింది. ఈ మూడు రోజుల పాటు సైనిక చర్యలన్నీ ఆగిపోనున్నాయి. ఉక్రెయిన్ కూడా ఇదే అనుసరిస్తుందని రష్యా నమ్ముతోందని తెలిపింది. ఉక్రెయిన్ దళాలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా రష్యా సైన్యం నుంచి ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు సిద్ధ మని పుతిన్ గతవారం మాస్కోలో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్‌కు తెలిపినట్లు క్రెమ్లిన్ ప్రకటించింది.

బంతి మా కోర్టులో లేదు..

తమ దేశం చర్చలకు సిద్ధంగా ఉందని, కానీ బంతి మా కోర్టులో లేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ సోమవారం వ్యాఖ్యానించారు. ప్రత్యక్ష చర్చలను ప్రారంభించాల్సిన బాధ్యత ఉక్రెయిన్‌పై ఉందన్నారు. అంతేకాదు.. నాటోలో చేరకుండా ఉక్రెయిన్‌ను నిరోధించాలన్న డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు.

జేఎన్‌యూలో పట్టు నిలబెట్టుకున్న వామపక్షం

- తొమ్మిదేళ్ల తర్వాత ఏబీవీపీ పాగా
- జాయింట్ సెక్రటరీ పోస్ట్ కైవసం

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (జేఎన్‌యూఎస్‌యూ) ఎన్నికల్లో వామపక్షాలు మరోమారు సత్తా చాటాయి. కీలకమైన నాలుగు పదవులకు గాను మూడింటిని కైవసం చేసుకున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ ఏబీవీపీకి తొమ్మిదేళ్ల తర్వాత జాయింట్ సెక్రటరీ పోస్టు దక్కించుకోగలిగింది. జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల కమిషన్ సోమవారం ఉదయం ప్రకటించిన ఫలితాల్లో ప్రెసిడెంట్ పదవిని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ)కు చెందిన నితీశ్ కుమార్ గెలుచుకున్నారు. ఈయనకు 1,702 ఓట్లు పడగా సమీప ప్రత్యర్థి ఏబీవీపీకి చెందిన శిఖా స్వరాజ్‌కు 1,430 ఓట్లు దక్కాయి. ఎస్ఎఫ్ఐకి చెందిన తయ్యబా అహ్మద్ 918 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. వైస్ ప్రెసిడెంట్‌గా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్(డీఎస్ఎఫ్)బలపరిచిన మనీషా 1,150 ఓట్లతో విజయం సాధించారు. ఏబీవీపీ అభ్యర్థికి 1,116 ఓట్లు దక్కాయి. జనరల్ సెక్రటరీ పదవిని గెలుచుకున్న డీఎస్ఎఫ్‌కు చెందిన ముంతేహా ఫతిమాకు 1,520 ఓట్లు రాగా ప్రత్యర్థి, ఏబీవీపీకి చెందిన కునాల్ రాయ్‌కి 1,406 ఓట్లొచ్చాయి. అదేవిధంగా, ఏబీవీపీ అభ్యర్థి వైభవ్ మీనా 1,518 ఓట్లతో జాయింట్ సెక్రటరీ పదవిని గెలుచుకున్నారు. సమీప ప్రత్యర్థి ఏఐఎస్ఏకు చెందిన నరేశ్ కుమార్‌కు 1,433 ఓట్లు, ప్రోగ్రెసివ్ స్టూడెంట్ అసోసియేషన్(పీఎస్ఏ) అభ్యర్థి నిగమ్ కుమారికి 1,256 ఓట్లు పడ్డాయి.



వైస్ ప్రెసిడెంట్ మనీషా, ప్రెసిడెంట్ నితీశ్



సంయుక్త కార్యదర్శి వైభవ్ సంబరాలు

2015-16 తర్వాత

చిట్టచివరిసారిగా 2015–16 జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల్లో ఏబీవీపీ అభ్యర్థి సౌరవ్ శర్మ జాయింట్ సెక్రటరీగా గెలుపొందారు. ఆ తర్వాత ఆ పదవి దక్కడం ఇదే మొదటిసారి. అదేవిధంగా, 2000–01 ఎన్నికల్లో ఏబీవీపీకి చెందిన సందీప్ మహాపాత్ర జేఎన్‌యూఎస్‌యూ ప్రెసిడెంట్ అయ్యారు. ఆ తర్వాత మళ్లీ ఏబీవీపీ ఆ పదవిని ఇప్పటి వరకు గెలుచుకోలేకపోయింది.

తహవ్వుర్ రాణా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడుల కేసులో కీలక నిందితుడు తహవ్వుర్ రాణా కస్టడీని ఎన్ఐఏ కోర్టు మరో 12 రోజులు పొడిగించింది. 18 రోజుల కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ప్రత్యేక కోర్టు జడ్జి చందర్ జిత్ సింగ్ ఎదుట ఎన్ఐఏ హాజరు పరిచింది. ముఖానికి ముసుగు తొడిగిన రాణాను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య కోర్టుకు తీసుకువచ్చారు. తమ వద్ద ఉన్న కీలకమైన పత్రాలపై అతడి నుంచి సమాచారం రాబట్టాల్సి ఉందని ఎన్ఐఏ తెలిపింది. కస్టడీ సమయంలో సాధించిన దర్యాప్తు పురోగతిని జడ్జికి ప్రత్యేకంగా వివరించింది. విచారణలో అతడు తమకు సహకరించడం లేదని ఎన్ఐఏ లాయర్లు వాదించారు. ఎన్ఐఏ అధికారుల సమక్షంలోనే అతడు లాయర్‌ను కలుసుకోవాల్సి ఉంటుందని తెలిపింది.

రఫేల్ ఒప్పందంపై భారత్, ఫ్రాన్స్ సంతకాలు

న్యూఢిల్లీ: భారత నావికాదళం కోసం ఫ్రాన్సు నుంచి 26 రఫేల్ (మెరైన్)యుద్ధ విమానాలను రూ.64 వేల కోట్లతో కేంద్రం కొనుగోలు చేయనుంది. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సోమవారం వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఫ్రాన్స్ రక్షణ రంగ కంపెనీ డసో ఏవియేషన్ నుంచి కొనుగోలు చేయనున్న విమానాలను ఐఎన్ఎస్ అరిహంత్‌పై మోహరించనున్నారు. ప్రధాని మోదీ సారథ్యంలోని కేబినెట్ కమిటీ ఈ డీల్‌కు మూడు వారాల క్రితమే పచ్చజెండా ఊపింది. ఐదేళ్ల తర్వాత యుద్ధ విమానాల రాక మొదలు కానుంది. అనుబంధ ఆయుధ వ్యవస్థలు, విడిభాగాలతోపాటు విమానాల తయారీ సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం భారత్‌కు బదిలీ చేయనుంది.

మే 7న నూతన పోప్ ఎన్నిక

వాటికన్ సిటీ: నూతన పోప్ ఎన్నిక ప్రక్రియకు ముహూర్తం ఖరారైంది. మే 7వ తేదీన వాటికన్ సిటీలోని సిస్టిన్ చాపెల్‌లో జరిగే కార్యక్రమంలో రహస్య ఓటింగ్ జరగనుంది. ప్రపంచ దేశాల నుంచి తరలిరానున్న సుమారు 135 కార్డినల్స్ ఈ ప్రక్రియలో భాగస్వాములు కానున్నారు. దాదాపు 12 ఏళ్లపాటు కేథలిక్కుల మత పెద్దగా కొనసాగిన పోప్ ఫ్రాన్సిస్ ఈ నెల 21వ తేదీన కన్నుమూయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. పోప్ ఎన్నిక ప్రక్రియ ఎన్ని రోజులు కొనసాగుతుందనే విషయంలో స్పష్టత లేదు. గతంలో 2005, 2013ల్లో రెండు రోజుల వ్యవధిలోనే తదుపరి పోప్ ఎవరనే విషయం తేలిపోయింది. మే 7వ తేదీన కార్డినల్స్ ముందుగా సెయింట్ పీటర్స్ బసిలికాలో జరిగే సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారని, అనంతరం ఓటింగ్‌కు అర్హులైన వారంతా సిస్టిన్ చాపెల్ రహస్య విధానంలో జరిగే ఓటింగ్‌లో పాల్గొంటారని వాటికన్ ప్రతినిధి మాటియో బ్రూనీ చెప్పారు. లోపలికి వెళ్లిన వారికి నూతన పోప్ ఎన్నికయ్యే వరకు బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలుండవు. మొదటి రోజు మధ్యాహ్నం జరిగే ఓటింగ్‌లో కార్డినల్స్ ఒకే ఒక్కసారి ఓటేస్తారు. ఫలితం తేలకుంటే తర్వాత రోజుల్లో నాలుగుసార్లు చొప్పున ఓటేయాల్సి ఉంటుంది. మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు సాధించిన వారే నూతన పోప్ అవుతారు. ఇందుకు కొంత సమయం పడుతుంది. మూడో రోజూ ఫలితం తేలకుంటే ప్రార్థనల కోసం విరామమిచ్చి మరోసారి ఓటింగ్ ప్రక్రియ చేపడతారు. ఎన్నిక నేపథ్యంలో సోమవారం పర్యాటకులను బయటకు పంపించేసి వాటికన్ అధికారులు సిస్టిన్ చాపెల్‌కు తాళాలు వేశారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



బాధిత మహిళలకు సత్వర న్యాయం
వివిధ రకాలు మోసపోయిన బాధిత మహిళలకు మహిళా కమిషన్ అండగా ఉంటుందని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ అన్నారు. -8లో



ఇన్‌స్పైర్డ్ జ్యువెలరీ..
ఇటీవలి కాలంలో ఆభరణాల ప్రపంచంలో 'థీమ్ ఆధారిత జ్యువెలరీ' ట్రెండ్ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 37.0/26.0
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

రేపు 'సారథి' ప్రారంభం

సికింద్రాబాద్ ఆర్టీఏలో ప్రారంభించనున్న మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలను మరింత సులభతరం చేసే లక్ష్యంతో చేపట్టిన అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ 'వాహన్ సారథి' ఈ నెల 30వ తేదీన సికింద్రాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రారంభం కానుంది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సారథిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వాహనాల వివరాల నమోదు కోసం ఇప్పటికే ఢిల్లీ కేంద్రంగా 'వాహన్' పోర్టల్ సేవలను అందజేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా 'సారథి'ని నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని మొత్తం వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను ఈ పోర్టల్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా వాహనదారులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లినప్పుడు ఎన్‌ఓసీలతో నిమిత్తం లేకుండా నేరుగా కొత్త ప్రాంతంలో డ్రైవింగ్ లైసెన్సులను పొందవచ్చు. 'సారథి' ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల వివరాలను పొందేందుకు అవకాశం ఉంటుంది. అలాగే దీని సేవలను మరింత విస్తృతం చేసి ఇంటి నుంచే లెర్నింగ్ లైసెన్సుల కోసం పరీక్షలు రాసి ఎల్‌ఎల్‌ఆర్‌లు పొందేవిధంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం సికింద్రాబాద్ ఆర్టీఏలో అందుబాటులోకి రానున్న సారథి సేవలను దశలవారీగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాలకు, జిల్లా కేంద్రాలకు విస్తరించనున్నారు.

మిధాని సీఎండీ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణ మూర్తి

సంతోష్‌నగర్: మిశ్రు ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎస్.వి.ఎస్. నారాయణ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ మూర్తి మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో విశాఖ పట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, బెంగళూరులోని ఐఐఎస్సీ నుంచి పీజీ, ఐఐటీ–బొంబాయి నుంచి పీహెచ్‌డీ డిగ్రీలు పొందారు. 1993లో త్రివేండ్రంలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రంలో చేరారు. అక్కడ ఆయన అల్ట్రా హైస్ట్రెంగ్త్ స్టీల్స్, టైటానియం మిశ్రమ లోహాలు, సూపర్ అల్లాయ్‌లు, అల్యూమినియం మిశ్రమ లోహాల అభివృద్ధిపై విస్తృతంగా పరిశోధనలు చేశారు. డాక్టర్ నారాయణ మూర్తి భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ నుండి యంగ్ మెటలర్జిస్ట్ అవార్డు (2001), మెటలర్జిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు (2018)లు అందుకున్నారు.

సిటీలో ఇక సన్న బియ్యం

మే నెల బియ్యం కోటా విడుదల



సాక్షి, సిటీబ్యూరో: నగర ఆహార భద్రత (రేషన్) కార్డు లబ్ధి కుటుంబాలకు శుభవార్త. మే నెల కోటా నుంచి సన్న బియ్యం పంపిణీ కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ నెల కోటా కింద సన్న బియ్యం పంపిణీ జరిగినా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా హైదరాబాద్ కార్డు దారులకు సన్నబియ్యం లభించలేదు. దొడ్డు బియ్యం నుంచి సన్నబియ్యం కోటా మారడంతో ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి లభించలేదు. దీంతో ఎప్పటి మాదిరిగా దొడ్డి బియ్యం పంపిణీ జరిగింది. కొందరు లబ్ధి కుటుంబాలు పోర్టబిలిటి కింద శివారులో రంగారెడ్డి, మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా పరిధిలో సన్న బియ్యం కోటాను డ్రా చేసుకున్నారు. మరికొందరు దొడ్డు బియ్యం డ్రా చేసినట్లు అధికార గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో మే నెల కోటా కింద సన్న బియ్యం విడుదలైంది. దీంతో నెలవారీ బియ్యం కోటా రేషన్ షాపులకు చేరుతోంది. ఒకటో తేదీ నుంచి పంపిణీ ప్రారంభిస్తారు.



పది నెలలు.. నలుగురు కమిషనర్లు!

ఒకడుగు ముందుకు..రెండడుగులు వెనక్కు చందంగా జీహెచ్‌ఎంసీ పరిస్థితి

గాడిన పడని అభివృద్ధి

తరచూ మారుతున్న కమిషనర్లతో ఆగమాగం

రాజధాని నగరంగా..తెలంగాణకు తలమానికంగా కీలకపాత్ర పోషిస్తున్న హైదరాబాద్ మహానగరంపై ప్రభుత్వం శీతకన్ను వేస్తోందా..అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు. మహానగరాభివృద్ధిలో కీలకమైన జీహెచ్‌ఎంసీ నిర్వహణ తీరునే ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. తరచుగా కమిషనర్లను మార్చడం..అభివృద్ధి పనులు నిలిచిపోవడం..నిధుల కొరత కారణంగా జీహెచ్‌ఎంసీ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇలా చేయడంలో ప్రభుత్వం ఉద్దేశం ఏంటో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.
– సాక్షి, సిటీబ్యూరో

బహుశా..ఎలాగూ రెండో, అంతకంటే ఎక్కువో కార్పొరేషన్లు చేసే యోచనలో ఉన్నందున కాబోలు ప్రభుత్వం జీహెచ్‌ఎంసీపై పెద్దగా శ్రద్ధ చూపుతున్నట్లు లేదు. పది నెలల వ్యవధిలోనే నలుగురు కమిషనర్లు రావడం అందుకు నిదర్శనమంటున్నారు జీహెచ్‌ఎంసీ గురించి తెలిసిన వారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేప్పటికి కమిషనర్‌గా ఉన్న రోనాల్డ్‌రాస్ నుంచి మొదలు పెడితే ఇప్పటి వరకు ముగ్గురు కమిషనర్లు మారారు. గత సంవత్సరం ఆగస్టులో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమ్రపాలి ఏపీకి వెళ్లాల్సి రావడంతో, అక్టోబర్‌లో అదనపు కమిషనర్‌గా నియమించిన ఇలంబర్తిని నవంబర్ 14 నుంచి రెగ్యులర్ కమిషనర్‌గా నియమించారు. ఐదు నెలల్లోనే ఆయన్ను బదిలీ చేసి ఆర్‌వీ కర్ణన్‌ను తాజాగా నియమించారు. కారణాలేవైనా తరచూ కమిషనర్లు మారుతుండటంతో పరిస్థితి గందరగోళంగా మారింది. 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్లతో ఉన్న జీహెచ్‌ఎంసీలో ఆరు వేల మందికి పైగా రెగ్యులర్ ఉద్యోగులున్నారు. ఔట్‌సోర్సింగ్, ఇతరత్రా వెరసి 30 వేల మంది వరకున్నారు. ఇంతపెద్ద వ్యవస్థను అర్థం చేసుకోవడానికే కనీసం ఆర్నెళ్లు పడుతుంది. ఆలోగానే మారిస్తే.. కొత్తగా వచ్చేవారికి అదే పరిస్థితి ఎదురవుతుంది.

తనదైన శైలితో..

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ నుంచి బదిలీ అయిన ఇలంబర్తి.. గతంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవంతో కావచ్చు పాలనలో లోపాల్ని, ఇష్టారీతిన జరుగుతున్న వ్యవహారాల్ని, పెచ్చరిల్లిన అవినీతిని అడ్డుకునేందుకు నిశ్శబ్దంగానే పలు కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాదు.. సంస్థ ఆస్తులెన్నో తెలియని దిక్కుమాలిన స్థితిలో ఉన్న జీహెచ్‌ఎంసీని చక్కదిద్దే చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆధునిక సాంకేతికతతో అంగుళం కూడా తేడా రాకుండా జీహెచ్‌ఎంసీ ఆస్తుల్ని గుర్తించే పనుల్ని చేపట్టారు. ఇంజినీరింగ్ పనుల్లో, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో లోపాలకు అడ్డుకట్ట వేశారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లలో అవకతవకల నివారణకు చర్యలు చేపట్టారు. స్ట్రీట్‌లైట్స్, సీఆర్‌ఎంపీ పనుల్లో అడ్డగోలు చెల్లింపులను గుర్తించి కట్టడి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఉన్నాయి. అవన్నీ గాడిన పడి ఒక దశకు రాకముందే ఆయన్ను బదిలీ చేయడంతో..కొత్త కమిషనర్‌కు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

వదలరు.. కదలరు

సుదీర్ఘకాలంగా జీహెచ్‌ఎంసీలో పాతుకుపోయిన వారి కొందరి ఆట కట్టించేందుకు తగిన చర్యలు తీసుకున్నారు.రిటైరయ్యాక సైతం జీహెచ్‌ఎంసీలో కొనసాగుతున్న వారందరినీ పంపించాలని, ఒకవేళ వారి సేవలు నిజంగా అవసరమైతే అందుకు కారణాలు తెలపాలని,ప్రభుత్వం అనుమతించాక తిరిగి కొనసాగించాలని గత నెలలో ప్రభుత్వం సూచించినప్పటికీ, జీహెచ్‌ఎంసీలో మాత్రం ఎక్కడివారక్కడే ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు ఇరవై మంది సేవలు మళ్లీ అవసరమని కోరినప్పటికీ, ప్రభుత్వం నుంచి అనుమతి రాకుండానే వారు కొనసాగుతూనే ఉన్నారు. మిగతా ప్రభుత్వ విభాగాల్లో ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక అలాంటి వారు కొనసాగుతుండగా, జీహెచ్‌ఎంసీలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తుండటం ఈ సందర్భంగా గమనార్హం. అలా కొనసాగుతున్న వారిలో కొందరు జీహెచ్‌ఎంసీకి పనులు చేయడం కంటే, జీహెచ్‌ఎంసీని అడ్డుపెట్టుకొని సొంత ప్రయోజనాల కోసం సాగిస్తున్న 'ప్రైవేట్' దందానే ఎక్కువని జీహెచ్‌ఎంసీ వర్గాల్లో వినిపిస్తోంది.

ఇప్పుడిప్పుడే..

ఇలంబర్తి చేపట్టిన కొన్ని చర్యలు తొలుత అర్థం కాకపోయినప్పటికీ, కనిపిస్తున్న ఫలితాలతో జీహెచ్‌ఎంసీ మెరుగవుతోందనుకుంటున్న తరుణంలో బదిలీ కావడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి సైతం జీహెచ్‌ఎంసీని అర్థం చేసుకొని, గాడిలో పెట్టే తరుణంలోనే జీహెచ్‌ఎంసీ నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. ప్రభుత్వానికి అప్పట్లో వారిని పంపించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడలాంటి పరిస్థితి లేకున్నా ఇలంబర్తి బదిలీతో జీహెచ్‌ఎంసీ పరిస్థితి ఏం కానుందో వేచి చూడాల్సిందే !

డిజిటల్ డిస్‌ప్లే ప్రకటనలు

కొత్త కేటగిరీగా ప్రవేశపెట్టనున్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: దుకాణాలు, బ్యాంకులు, సంస్థల వంటి వాటిల్లో కొత్తగా ఎల్‌ఈడీ డిజిటల్ స్టాటిక్ బోర్డులు (ప్రకటనలు) అనుమతించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. వాటికి సంబంధించి ప్రభుత్వం ప్రకటనల పాలసీ తెచ్చేంతవరకు అందుకు అనుమతించాల్సిందిగా కోరుతూ పాలకమండలి ఆమోదం పొందేందుకు వీలుగా అంశాన్ని స్టాండింగ్ కమిటీ ముందుంచింది. జీహెచ్‌ఎంసీ నుంచి లైసెన్సు పొందిన ఏ సంస్థ అయినా, దుకాణమైనా తాము ఏర్పాటు చేసుకున్న బోర్డులకు ప్రకటన పన్ను చెల్లించాల్సి ఉంటుంది. బోర్డును ఉంచడమే ప్రకటనగా భావిస్తూ జీహెచ్‌ఎంసీ ప్రకటనల పన్ను వసూలు చేస్తోంది. సదరు బోర్డులకు ఏర్పాటు చేసుకునే లైటింగ్, తదితర అంశాలను బట్టి నిర్ణీత ధరల్లో ప్రకటనల పన్ను వసూలు చేస్తుంది.

రొటేటింగ్ ప్రకటలకు నో..

2020లో అప్పటి ప్రభుత్వం కదలాడే, వలయాకారంగా తిరిగే (రొటేటింగ్) లైటింగ్ ప్రకటనలతో వాహనదారుల దృష్టి మళ్లి ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని భావించి వాటిని నిరోధిస్తూ ఒక జీఓ తెచ్చింది. రొటేటింగ్‌వి కాకుండా స్థిరంగా ఉండే (స్టాటిక్) ఎల్‌ఈడీ డిజిటల్ ప్రకటనలకు అనుమతించాలని పలు దుకాణాలు, బ్యాంకులు, ఇతరత్రా సంస్థల నుంచి తమకు విజ్ఞప్తులు అందినట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. అంతేకాదు, కొందరు అలాంటి వాటిని ఏర్పాటు చేసుకున్నట్లు కూడా తెలిపింది. అయినప్పటికీ, వాటికి సంబంధించి ఎలాంటి పాలసీ, కేటగిరీ లేకపోవడంతో వాటి నుంచి ప్రకటనల పన్ను వసూలు చేయడం లేదని తెలుపుతూ, వాటికి సంబంధించి ప్రభుత్వం కొత్త పాలసీని తెచ్చేంత వరకు వాటి నుంచి ప్రకటనల పన్ను వసూలుకు అనుమతించాల్సిందిగా కోరింది. ప్రయోగాత్మకంగా ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఎంజే కాలేజీల వద్ద ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలపై ప్రకటనల రొటేషన్ పది సెకన్లకు మించకుండా డిజిటల్ స్టాటిక్ ఎల్‌ఈడీ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో ద్వారా అనుమతివ్వడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రకటన రొటేషన్ పది సెకన్లకు మించకుండా నాలుగు కేటగిరీల్లో (ఎస్, ఎ,బీ,సీ)అనుమతించాల్సిందిగా ప్రతిపాదనల్లో పేర్కొంది. అందుకుగాను సంవత్సరానికి ప్రకటల పన్ను చదరపు మీటరుకు ఎస్,ఎ కేటగిరీలకు రూ. 5,500, బీ కేటగిరీకి రూ.5,250గా, సీ కేటగిరీకి రూ.5,000గా నిర్ణయించింది. ఉల్లంఘనలకు పాల్పడితే ప్రకటనల పన్నుకు పదిరెట్ల పెనాల్టీ విధించనున్నట్లు పేర్కొంది.

లేఔట్ స్వరూపాన్ని మారిస్తే చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

- సోమవారం ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులు
- దివ్యానగర్ లేఔట్‌లో హైడ్రా ఠాణా ఏర్పాటుకు వినతి

సాక్షి, సిటీబ్యూరో: అనుమతి పొందే సమయంలో ఉన్న విధంగానే లే ఔట్ ఉండాలని, దాన్ని స్వరూపాన్ని మార్చవద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు. ఎవరికి వారు తమ అవసరాలకు అనుగుణంగా లే ఔట్ రూపాన్ని మార్చేస్తూ రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుద్ధ భవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన బాధితులు 63 ఫిర్యాదులు చేశారు. గచ్చిబౌలిలోని సర్వే నం. 124, 125ల్లో 20 ఎకరాల్లో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ కాలనీ లే ఔట్ ఉంది. ఇందులో రహదారులు, పార్కుల హద్దులు చెరిపేసిన సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు వాణిజ్యపరంగా వినియోగించుకుంటున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ లే ఔట్‌లోని ప్లాట్లు, రహదారులు చూపాలని, వాటిని పునరుద్ధరించాలని అభ్యర్థించారు. పోచారం మున్సిపాలిటీలోని దివ్యానగర్ లేఔట్‌లో కూడా రహదారులను ఆక్రమించి షెడ్లు, నిర్మాణాలు నల్ల మల్లారెడ్డి చేపట్టారని ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. తనకు అనుకూలంగా దివ్యానగర్ లేఔట్‌ను మార్చుకుని ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారని వాపోయారు. 200 ఎకరాల దివ్యానగర్ లేఔట్ చుట్టూ ఉన్న ప్రహరీని తొలగించి రహదారులకు అడ్డంకులు లేకుండా చేసిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ లేఔట్‌లో హైడ్రా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన స్థలాన్ని తామే ఇస్తామని భూ యజమానులు హనుమంతరెడ్డి, జైపాల్‌రెడ్డితో పాటు పలువురు కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కొండాపూర్, మసీదుబండ సీఎంసీ ఎన్‌క్లేవ్‌లో కూడా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ఆసిఫ్ పటేల్ అనే వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కొందరు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తౌతానికుంటలో మట్టి నింపి భగీరథమ్మ చెరువుకు



వెళ్లే వరద కాలువలు మూసేయడంతో తమ నివాసాలను వర్షపు నీరు ముంచెత్తుతోందని గ్రీన్ గ్రేస్ రెసిడెంట్స్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అన్నోజిగూడ గ్రామం సర్వే నం .9,10లోని పది ఎకరాల లే ఔట్‌లో పార్కుకు ఎకరం కేటాయించగా..ఇప్పుడు అక్కడ కూడా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు.

హైడ్రా పేరుతో నకిలీ ఎక్స్ ఖాతా...

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హైడ్రా పేరుతో ఓ నకిలీ హ్యాండిల్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హైడ్రా వారియర్స్ పేరు, డీఆర్‌ఎఫ్ లోగోతో ఉన్న దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. తమ అధికారిక హ్యాండిల్ కొత్త హైడ్రా లోగోతో ఉందని స్పష్టం చేశారు. నకిలీ హ్యాండిల్‌లో కొందరు ఆదివారం నాటి బీఆర్‌ఎస్ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై విమర్శలు చేశారు. దీంతో ఈ నకిలీ హ్యాండిల్‌పై హైడ్రా ఆరా తీస్తోంది. అధికారిక చిహ్నాలను వాడటంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని యోచిస్తోంది.

చంపేసి..లిఫ్ట్ గుంతలో పడేసి..

హిమాయత్‌నగర్‌లో గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య

కవాడిగూడ: గుర్తుతెలియని ఓ యువకుడిని దారుణంగా హత్య చేసి...సమీప భవనంలోని లిఫ్ట్ గుంతలో శవాన్ని పడేసి వెళ్లిన ఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 8లో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ఆ యువకుడిని గుర్తు తెలియని దుండగులు ముందుగా బండరాయితో మోది హత్య చేశారు. అనంతరం మృతదేహన్ని బట్టలో చుట్టి ప్లాజా అపార్ట్‌మెంట్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకు పక్కనే ఉన్న లిఫ్ట్ గుంతలో పడేసి పారిపోయారు. సోమవారం ఉదయం అపార్ట్‌మెంట్ ప్రాంగణాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన సిబ్బంది రక్తపు మరకలు, దుస్తులు పడి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే దోమలగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అపార్ట్‌మెంట్‌లో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ పక్కనే ఉన్న లిఫ్ట్‌లో 32 సంవత్సరాల యువకుడి మృతదేహం నగ్నంగా పడి ఉంది. వెంటనే సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, గాంధీనగర్ డివిజన్ ఇన్‌చార్జీ ఏసీపీ గురురాఘవేంద్ర దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐలు నిరంజన్, సాయిచంద్‌లు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేశారు.



హత్యకు గురైన యువకుడి మృతదేహం

వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా ప్రతి నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో హత్య జరగడం సంచలనం సృష్టించింది. కాగా స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తుతెలియని యువకుడు ఆదివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో భోజనం చేసి పంజాబ్ నేషనల్ బ్యాంక్ షట్టర్ ముందు నిద్రపోగా.. మద్యం లేదా గంజాయి మత్తులో ఉన్నకొంత మంది దుండగులు అతని వద్దకు వచ్చి నిద్రలేపి పక్క వీధిలోకి తీసుకెళ్లి ఘర్షణ పడ్డారని తెలిసింది. ఈ క్రమంలోనే హత్య జరిగినట్లు భావిస్తున్నారు. ఈ సంఘటన అర్ధ రాత్రి రెండు నుంచి మూడు గంటల మధ్య జరిగినట్లు సమాచారం.

నకిలీ పత్రాలతో నివసిస్తున్న బంగ్లాదేశీయుడి అరెస్ట్



రషీల్ షేక్

పోచారం: నకిలీ పత్రాలు సృష్టించి నివాసం ఉంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన యువకుడిని రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం..బంగ్లాదేశ్‌కు చెందిన రషీల్ షేక్ అలియాస్ ఎండీ రషీల్ (31) నకిలీ పత్రాలు సృష్టించి చౌదరిగూడలోని వెంకటసాయి ప్రేమనగర్ (మక్త) ప్లాట్ నెంబర్–36లో ఏడేళ్లుగా నివసిస్తున్నాడు. ఇతని గురించి సబ్ ఇన్‌స్పెక్టర్ శివకృష్ణకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి రషీల్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద లభించిన 2 ఫోన్లు, భారతీయ ఆధార్, ఓటర్, పాన్ కార్డులు, కోవిడ్–19 టీకా తీసుకున్న ధృవపత్రం, బంగ్లాదేశ్‌కు చెందిన ఓటరు కార్డు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఓ ముస్లిం యువతిని పెళ్లి చేసుకొని చార్మినార్‌లో బంగారు నగల తయారీ కేంద్రంలో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

అసలుకే ఎసరు!

రేషన్ కార్డులో ఒకరికి బదులు మరొకరి పేర్ల తొలగింపు



అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని గోల్నాక అశోక్‌నగర్‌కు చెందిన ఆహార భద్రత (రేషన్) కార్డుదారు జ్యోతి తన కుమార్తె సాగరిక పెళ్లి కావడంతో గత రెండు నెలల క్రితం ఆమె పేరు తొలగించాలని పౌర సరఫరా శాఖకు దరఖాస్తు చేసుకుంది. వారం రోజుల వ్యవధిలో అధికారులు పేరు తొలగించారు. అయితే కుమార్తె పేరు బదులు దరఖాస్తుదారురాలైన తల్లి పేరును తొలగించారు. సంబంధిత అధికారులను సంప్రదిస్తే మళ్లీ కార్డులో పేరు చేరుస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రెండు నెలలు గడుస్తున్నా..తొలగించిన పేరు మాత్రం తిరిగి చేర్చే సూచనలు కనపించడం లేదు. ఇది ఒక జ్యోతి సమస్య కాదు..దరఖాస్తు దారుల్లో ఒకరి బదులు మరొకరి పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

పౌరసరఫరాల శాఖకు సభ్యుల తొలగింపులకే ఆప్షన్...

- కొత్త సభ్యుల ఆమోదం, పాత సభ్యుల పునరుద్ధరణకు నో ఆప్షన్..
- 8 ఏళ్లుగా ఇదే పరిస్థితి.. ఇక ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చేంతవరకు ఆగాల్సిందే..
- అప్పటివరకు రేషన్ కోటా కట్.. గగ్గోలు పెడుతున్న పేద కుటుంబాలు

సాక్షి, సిటీబ్యూరో:

కొత్త రేషన్ కార్డు మంజూరు దేవుడెరుగు..పాత కార్డులోని పేర్ల తొలగింపుతో పరిస్థితి గందరగోళంగా తయారైంది. రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఒకరి పేరు బదులు మరొకరి పేర్లు తొలగింపునకు గురవుతోంది. మరికొందరికి కొత్త రేషన్ కార్డు కోసం పేరు తొలగిస్తే ..కొత్తది రాకపోగా పాతదాంట్లోనూ కోటా కట్ అవుతోంది. కొత్త కార్డులో పేర్ల నమోదు కోసం పాత వాటిలో తొలగింపునకు దరఖాస్తు తప్పడం లేదు. దరఖాస్తును సరిగ్గా పరిశీలించని పౌరసరఫరాల శాఖ సిబ్బంది తొలగించాల్సిన యూనిట్‌కు బదులు దరఖాస్తుదారుల పేర్లు తొలగించడం విస్మయానికి గురిచేస్తోంది. వివాహ బంధాలతో కొత్తగా ఏర్పాటైన కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. తల్లిదండ్రుల కుటుంబం కార్డుల్లో పేర్లు రద్దయితే కానీ, కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లేకుండా పోయింది. కుటుంబం రేషన్ కార్డుల నుంచి తమ పేర్లను తొలగించుకునేందుకు పౌరసరఫరాల శాఖ సర్కిల్ ఆఫీస్‌లకు క్యూ కట్టి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుకుంటున్నారు. దీంతో సంబంధిత సిబ్బంది ఒక సభ్యుడికి బదులు మరో సభ్యుడి పేరు తొలగిస్తుండటంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

రెండుశాతం వరకు ..

గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల నుంచి రేషన్‌కార్డులో పేర్ల తొలగింపునకు సంబంధించి సుమారు రెండు లక్షలపైగా ఆఫ్‌లైన్ దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. అందులో రెండు శాతం వరకు సభ్యుల పేర్ల తొలగింపులో తికమక జరిగినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రేటర్ మొత్తం మీద సుమారు పన్నెండు అర్బన్ సర్కిళ్ల పరిధిలో 12,34,873 కార్డులు అందులో 42,72,820 మంది లబ్ధిదారులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో మరో ఐదు లక్షల కార్డులు, 17 లక్షల మంది వరకు లబ్ధిదారులు ఉన్నారు. అందులో మొత్తం మీద సుమారు 10 శాతం కుటుంబాల్లోని సభ్యులు పెళ్లిల్లు చేసుకోవడంతో కొత్త కుటుంబాలు ఏర్పాటయ్యాయి. తాజాగా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండంతో కొత్త కుటుంబాలకు ఆసక్తి పెరిగింది. కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసేందుకు పాత కార్డులోని తమ పేర్లను తొలగించాలని దరఖాస్తు చేస్తున్నారు. కానీ వీటి తొలగింపు గందరగోళంగా తయారైంది.

ఎదురు చూపులే..

పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గత ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డులోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతున్నా..కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఈ వ్యవధిలో ఉమ్మడి కుటుంబాలు రెండు, మూడుగా ఏర్పడగా, మరోవైపు కుటుంబంలో మరి కొందరు కొత్త సభ్యులుగా చేరారు. పాత రేషన్ కార్డులో కొత్త సభ్యుల చేర్పుల ప్రక్రియ పెండింగ్‌లో మగ్గుతోంది. గ్రేటర్ పరిధిలో సుమారు మూడు లక్షల కుటుంబాలు తొమ్మిది లక్షల కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగిస్తూనే.. ఆమోదించే ఆప్షన్‌ను మాత్రం ప్రభుత్వం నిలిపివేసింది. రేషన్ కార్డులోని సభ్యుల తొలగింపు నిరంతరం ప్రక్రియగా సాగుతోంది. అమోదం లేక పోవడంతో నిరుపేద కుటుంబాలు మీ సేవ, సివిల్ సప్‌లై ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఆమోదించే ఆప్షన్ ఇచ్చేంతవరకు ఆగాల్సి ఉంటుంది. రేషన్ కార్డులో పేర్ల తొలగింపునకు గురైన యూనిట్ల నెలవారి కోటా కట్ కావడంతో పేద కుటుంబాలు గగ్గోలు పెడుతున్నాయి.

ఒప్పుకోకపోతే మొహంపై యాసిడ్ పోస్తా..

వివాహితకు వరుసకు సోదరుడి బెదిరింపులు

బంజారాహిల్స్: వివాహితపై కన్నేసిన ఆమెకు వరుసకు సోదరుడైన యువకుడు తన గదికి వచ్చి కోరిక తీర్చకపోతే మొహంపై యాసిడ్ పోస్తానంటూ బెదిరించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌లో నివసించే మహిళకు (26)కు ముగ్గురు సంతానం. ఆమెకు భర్తకు దూరపు బంధువైన నవీన్ అనే యువకుడు నగరంలోనే ఉంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తరచూ ఇంటికి వచ్చే అతను ఆమెతో మాటలు కలుపుతూ తన కోరికను బయటపెట్టేవాడు. తాను అడిగింది ఇవ్వకపోతే పరువు తీస్తానంటూ బెదిరించేవాడు. రెండు నెలల క్రితం బాధితురాలు ఈ విషయం తనకు భర్తకు చెప్పడంతో అప్పటి నుంచి నవీన్ ఆమెకు ఫోన్ చేయడం మానేశాడు. ఈ నెల 26న కొందరి వద్ద నవీన్ ఆమెపై అసభ్యకరంగా ప్రచారం చేశాడు. ఆమె పనిచేస్తున్న సెలూన్‌కు వెళ్లి నువ్వు బయటకు వస్తావా..? నన్ను లోపలికి రమ్మంటావా? అంటూ బెదిరించాడు. తాను బయటకు రానని చెప్పడంతో నువ్వు నా గదికి రాకపోతే మొహంపై యాసిడ్ పోసి చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు నవీన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ రివాల్వర్‌తో బెదిరించి రూ.5.25 లక్షలు దోపిడీ

ఆరుగురు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఐ సతీష్

దుండిగల్: నకిలీ రివాల్వర్‌తో ఓ వ్యక్తిని బెదిరించి రూ.5.25 లక్షలను దోచుకున్న ముఠాను దుండిగల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. దుండిగల్ డీఐ సతీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లి అపర్ణ సెనిటరీ ప్రాంతానికి చెందిన బలగం వినోద్ కుమార్ అతని స్నేహితుడు తరుణ్ గతంలో స్టార్టప్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. అయితే సదరు సంస్థలో వినోద్ రూ. 50 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉండగా అదే సమయంలో అతడికి న్యూజిలాండ్‌లో ఉద్యోగం రావడంతో పెట్టుబడి డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోయాడు. ఇటీవల అతను నగరానికి తిరిగి వచ్చాడు. న్యూజిలాండ్ వెళ్లిన వినోద్ పెద్ద డబ్బులు సంపాదించాడని భావించిన తరుణ్ అతడిని బెదిరిస్తే సులువుగా డబ్బులు రాబట్టవచ్చునని భావించాడు. ఇందులో భాగంగా తన స్నేహితులైన హైదారాబాద్‌కు చెందిన సాయి కృష్ణ యాదవ్, వివేక్ రాజ్ సింగ్, సంగారెడ్డికి చెందిన సందీప్, మణిదీప్, దేవేందర్, సుమంత్, మనోజ్‌లను ఉసిగొల్పాడు. దీంతో వారు వినోద్‌ను కిడ్నాప్ చేసేందుకు పథకం రూపొందించారు. ఇందులో భాగంగా తరుణ్ మినహా మిగతా వారంతా ఈ నెల 23న కొంపల్లిలోని వినోద్ ఇంటి వద్ద కాపు కాశారు. కారులో బయటికి వెళ్తున్న వినోద్‌ను వెంబడించి బౌరంపేటలోని స్నేక్ పార్క్ వద్ద అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న నకిలీ రివాల్వర్‌తో అతడిని బెదిరించి తమతో పాటు మేడ్చల్ జిల్లా కండ్లకోయకు తీసుకెళ్లారు. క్రిప్టో కరెన్సీలో వచ్చిన డబ్బులను తమకు ఇవ్వాలని డిమాండ్ చేయగా, తాను బిట్ కాయిన్లలో ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదని చెప్పడంతో అతడిని బెదిరించి అకౌంట్‌లో ఉన్న రూ.5.25 లక్షలను తమ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. మరుసటి రోజు ఉదయం అతడిని జేఎన్‌టీయూలో వదిలి పారిపోయారు. ఆ తర్వాత పలు మార్లు వినోద్‌కు ఫోన్లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తుండడంతో బాధితుడు దుండిగల్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం నిందితులు సాయి కృష్ణ యాదవ్, సందీప్, మణిదీప్, వివేక్ రాజ్ సింగ్, దేవేందర్‌గౌడ్, సుమంత్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.5.25 లక్షల నగదు, నకిలీ రివాల్వర్, కత్తి, కారు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారులు తరుణ్, మనోజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

లాటరీ పేరుతో లాగేశారు!

- నగరవాసి నుంచి రూ.3.18 లక్షలు స్వాహా
- కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సుదీర్ఘకాలం తర్వాత లాటరీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. కేరళ లాటరీ పేరుతో నగరవాసికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.3.18 లక్షలు కాజేశారు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి (76) ఫేస్‌బుక్‌లో లాటరీ పేరుతో ప్రకటన కనిపించింది. ఆయన దానిని క్లిక్ చేసిన వెంటనే... వాట్సాప్‌కు రూట్ అయింది. ఆపై బాధితుడితో సంప్రదింపులు ప్రారంభించిన సైబర్ నేరగాళ్లు కేరళ ప్రభుత్వం ఏడాదికి ఒకసారి నిర్వహించే డ్రా అంటూ నమ్మించారు. వీరి వలలో పడిన బాధితుడు మూడు టిక్కెట్లు ఖరీదు చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు రెండు టిక్కెట్లు డ్రాలో ఎంపికైనట్లు, రూ.5 లక్షలు, రూ.12 లక్షలు చొప్పున ప్రైజ్ మనీ రానున్నట్లు మెసేజ్ వచ్చింది. ఆపై మళ్లీ సంప్రదించిన నేరగాళ్లు ఆ మొత్తం తీసుకోవాలంటూ తొలుత కొన్ని ట్యాక్స్‌లు, రిఫండబుల్ చార్జీలు చెల్లించాలన్నారు. ఇలా రకరకాల పేర్లు చెప్పి రూ.3,18,148 కాజేశారు. మరికొంత మొత్తం డిమాండ్ చేయడంతో బాధితుడు ఇవ్వనని చెప్పాడు. అప్పటి నుంచి ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకున్న నేరగాళ్లు స్పందించట్లేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

దుబాయ్‌లో వ్యాపారినని చెప్పి..

- నగర వాసికి నిలువు దోపిడీ
- కోర్టు ఆదేశాల మేరకు నిందితురాలిపై కేసు నమోదు

ఫిలింనగర్: తాను యూఏఈ సిటిజన్‌నని, తనకు దుబాయ్‌లో వ్యాపారాలు ఉన్నాయని, ప్రముఖ సినీ హీరోలు తన కజిన్స్ అని నమ్మించి హైదరాబాద్‌కు చెందిన ఓ బడా పారిశ్రామికవేత్తను పెళ్లి చేసుకుని అడ్డదారిలో రూ. కోట్లు నొక్కేసి రోడ్డు పాలు చేసిన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి సబ్జాకాలనీకి చెందిన సయ్యద్ హసన్ అలీ మేనిఫెస్ట్ సొల్యూషన్స్, మేనిఫెస్ట్ డెవలపర్స్, కాన్సెప్ట్ వన్ టెక్నాలజీ ఎండీగా వ్యవహరిస్తున్నాడు. 2021లో అతడికి టిండర్ ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ద్వారా ఓ యువతితో పరిచయం ఏర్పడింది. తాను దుబాయ్‌లో ఉంటానని, వ్యాపారాలు ఉన్నాయని, తన బాయ్‌ఫ్రెండ్‌తో వచ్చిన విబేధాల వల్ల తన తల్లితో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చినట్లు చెప్పింది. ఇద్దరూ మాట్లాడుకునేందుకు హైటెక్ సిటీలోని ఓ స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసి హసన్ ఆలీని అక్కడికి రప్పించింది. ఇద్దరూ వ్యాపార లావాదేవీలు, కుటుంబ విషయాలు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత 2022లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం వారికి హుస్సేనీ అలంలో నిఖా జరిగింది. ఇద్దరూ కలిసి ఫిలింనగర్‌లో ఓ ఫ్లాట్‌ను తీసుకుని కాపురం ఉన్నారు. ఇదే సమయంలో ఆమె భర్త హసన్ అలీకి చెందిన బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఆస్తులు, వ్యాపారాలకు సంబంధించిన వివరాలు సేకరించింది. మెల్లగా అతడి నుంచి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించింది. రూ.2 కోట్లు ఒకసారి, ఆ తర్వాత పలు మార్లు రూ.కోట్లు తన అకౌంట్‌లోకి బదిలీ చేసుకుంది. హసన్ ఆలీ ఇంట్లో లేని సమయంలో ఐఫోన్ పాస్‌వర్డ్ తెలుసుకుని అందులో నుంచి నేరుగా డబ్బులను తన అకౌంట్‌లోకి బదిలీ చేసుకునేది. అంతేగాక తన తల్లికి ఓ ఫ్లాట్ కొనుగోలు చేసి ఇచ్చింది. ఈ డబ్బుల వ్యవహారంలో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె వివరాలపై ఆరా తీసిన హసన్ ఆలీకి ఆమెకు అప్పటికే యూఏఈలో పెళ్లి జరిగిందని, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఓ బ్యాంక్‌ను మోసగించిన ఘటనలో యూఏఈలో తొమ్మిది నెలలు జైలు శిక్ష కూడా అనుభవించిందని, యూఏఈకి రాకపోకలు నిషేధించినట్లు తేలింది. దీంతో అతను తనను మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలంటూ ఫిలింనగర్ పోలీసులకు గత సెప్టెంబర్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు మహిళలపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల దొంగల బీభత్సం

- మంద వద్ద కావలాగా ఉన్న కానిస్టేబుల్‌పై కత్తులతో దాడి
- మరో వ్యక్తిని సైతం గాయపర్చిన దుండగులు
- రూ.5 వేల నగదు, 30 గొర్రెలు అపహరణ
- కేసు నమోదు చేసిన పోలీసులు


గాయపడ్డ కానిస్టేబుల్ నవీన్


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హయత్‌నగర్: గొర్రెల మంద వద్ద కాపలాగా పడుకున్న ఓ కానిస్టేబుల్‌తో పాటు అతని బావమరిదిపై కత్తులతో దాడి చేసిన గుర్తు తెలియని వ్యక్తులు 30 గొర్రెలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కొహెడ గ్రామానికి చెందిన రాసూరి నవీన్ కుషాయిగూడ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. వీరికి 250 వరకు గొర్రెలు ఉన్నాయి. నవీన్ తండ్రి శ్రీశైలం వీటిని కాసేవాడు. ఇటీవల అతడికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రిలో చేరాడు. దీంతో ఆదివారం రాత్రి నవీన్, అతని బావమరిది శ్రీకాంత్ గ్రామ సమీపంలోని బాల్‌రెడ్డి పొలం వద్ద ఉన్న గొర్రెల మంద వద్దకు కాపలాగా వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున అక్కడికి వచ్చిన తొమ్మిది మంది గుర్తు తెలియని వ్యక్తులు నవీన్, శ్రీకాంత్ ఫోన్లు లాక్కున్నారు. అనంతరం కత్తులతో నవీన్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో అతని తల, కన్ను, భుజంపై గాయాలయ్యాయి. శ్రీకాంత్ ముఖంపై కొట్టడంతో కంటికి తీవ్ర గాయమైంది. వీరు తేరుకునే లోపు రూ.5 వేల నగదు లాక్కున్న దుండగులు 30 గొర్రెలను బొలేరో వాహనంలో వేసుకుని పారిపోయారు. అనంతరం గ్రామానికి వెళ్లిన బాధితులు స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు.

నిందితులను పట్టుకుంటాం..

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. దుండగులు హిందీలో మాట్లాడారని, బొలేరో వాహనాన్ని గుర్తించేందుకు సీసీ టీవీలను పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపండి

శాంతి చర్చల పీస్ కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఆపరేషన్ కగార్‌ను ఆపాలని శాంతి చర్చల పీస్ కమిటీ చైర్మన్, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి సీపీఐ (మావోయిస్టు) పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండా ఆదివాసీలపై దమనకాండకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షుడు జంపన్న మాట్లాడుతూ ఆదివాసుల సంక్షేమం దృష్ట్యా ఇరు పక్షాలు శాంతిని పాటించాలన్నారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఆదివాసులను నిర్వాసితులను చేస్తూ ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఐదు ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను కాలరాస్తూ పెసా, 1/70 చట్టాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. కార్యక్రమంలో పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు, పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్, డీఎస్‌ఏ రాష్ట్ర కోకన్వీనర్ గణేశ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అవమానిస్తున్నాడని..

బావను హత్య చేసిన బావమరిది


శ్యాంసన్‌రాజ్ మృతదేహం

బౌద్ధనగర్: అందరిలో అవమానిస్తూ అవమానిస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తి తన బావను హత్య చేసిన సంఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముషీరాబాద్‌కు చెందిన రుక్కాల శ్యాంసన్‌రాజ్ (38) పదేళ్ల క్రితం భార్యా పిల్లలను వదిలేసి ఫిష్ మార్కెట్‌లో పనిచేస్తూ ఫుట్‌పాత్‌పై ఉంటున్నాడు. కొన్నేళ్ల క్రితం లోన్ రికవరీ చేసే లాజరస్‌కు శ్యాంసన్ సోదరిని ఇచ్చి వివాహం జరిపించారు. ఇద్దరూ కలిసి తరచూ మద్యం తాగేవారు. అందరితో కలిసి ఉన్నప్పుడు శ్యాంసన్ రాజ్ లాజరస్‌ను అవమానించేలా మాట్లాడేవాడు. ఆదివారం రాత్రి వారు పార్శీగుట్ట ఎదురుగా ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం భవనంపై కూర్చుని మద్యం సేవించారు. అదే సందర్భంగా శ్యాంసన్‌రాజ్ లాజరస్‌ను అవమానించడంతో ఆగ్రహానికి లోనైన లాజరస్ అక్కడే ఉన్న ఇనుపరాడ్‌తో శ్యాంసన్‌రాజ్ తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం దీనిని గుర్తించిన స్థానికులు 100 డయల్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనుమానితుల జాబితాలో ఉన్న లాజరస్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం. కాగా పోలీసులు ఇంకా విచారణ కొనసాగుతుందని నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఘటనా స్థలాన్ని అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ పరిశీలించారు.

బాధిత మహిళలకు సత్వర న్యాయం చేయాలి

కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్..


సమస్యలు తెలుసుకుంటున్న జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్

సనత్‌నగర్: బాధిత మహిళలకు మహిళా కమిషన్ అండగా ఉంటుందని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ అన్నారు. సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్ వేదికగా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ అధ్యక్షతన మహిళా జన్ సున్వాయి (బహిరంగ విచారణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా 40 వరకు వాక్ ఇన్ ఫిర్యాదులు రాగా పబ్లిక్ హియరింగ్ వేదికకు హాజరైన 31 మంది మహిళల సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. కొన్ని కేసుల్లో బాధితులు రాజీపడగా, ఆ కేసుల్లో ఏ విధంగా రాజీపడ్డారని అధికారులను కమిషన్ చైర్‌పర్సన్ ప్రశ్నించారు. మహిళా జన్ సున్వాయి దృష్టికి వచ్చిన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే కమిషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. హక్కులు, చట్టాలపై సదస్సుల ద్వారా మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కమిషన్‌కు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి బాధిత మహిళల నుంచి వేల సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయన్నారు. మహిళలు పడుతున్న బాధలు, కష్టాలు, వారి సమస్యల సత్వర పరిష్కారం కోసం కమిషన్ నేరుగా బాధితుల వద్దకే రావడం జరుగుతుందని తెలిపారు. గృహహింస కేసులు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపులు, చైల్డ్ కస్టడీ కేసులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలు తదితర కేసులు ప్రధానంగా కమిషన్ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. కమిషన్ పరిధిలోని హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో 2022 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న 31 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేశామన్నారు. జిల్లాల్లోని అన్ని శాఖల అధికారులు ఎక్కడా అశ్రద్ధ చూపకుండా మహిళా కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని రాష్ట్రాల్లో నెలలో నాలుగు సార్లు కమిషన్ బాధిత మహిళల వద్దకు వెళ్లి వారికి సత్వర న్యాయం చేసి అండగా నిలుస్తుందన్నారు. పెండింగ్ కేసులపై నివేదిక రూపంలో తమకు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, మహిళా సంక్షేమ శాఖ సంచాలకులు నిర్మల క్రాంతి వెస్లీ, అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య, జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, బాధిత మహిళా కుటుంబాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు మృతిచెందిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై హసీనా కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బార్కాస్ సలాల ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆసీఫ్ (40) పెయింటర్‌గా పని చేసేవాడు. ఆదివారం తను తన స్నేహితులు మరో ఇద్దరితో కలిసి చింతల్‌కు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఫారూక్ నగర్ డిపోకు చెందిన బస్సును ఎక్కారు. ఇద్దరు స్నేహితులు నాంపల్లి వద్ద దిగిపోగా ఆసిఫ్ బస్సులోనే ఉన్నాడు. అఫ్జల్‌గంజ్ మలుపు వద్ద అతను సీటు పైనుంచి పడిపోవడంతో తోటి ప్రయాణికులు అతన్ని లేపి సీటుపై కూర్చొబెట్టారు. రాత్రి 11 గంటలకు బస్సు డిపోకు చేరుకున్న తర్వాత సిబ్బంది అతడిని నిద్రలేపేందుకు యత్నించగా స్పందించలేదు. దీంతో వారు పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బ్రేక్‌డౌన్ అయిన కారును ఢీకొట్టిన మరో కారు...

పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఘటన


ఇండికా కారును ఢీకొట్టిన స్విఫ్ట్ డిజైర్

రాజేంద్రనగర్: పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై బ్రేక్‌డౌన్ అయిన కారును వేగంగా దూసుకొచ్చిన మరో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వేగానికి బ్రేక్ డౌన్ అయిన కారు పల్టీ కొట్టి ఎక్స్‌ప్రెస్ వే ప్రహరీని ఢీకొట్టింది. మరింత వేగంగా ఢీకొట్టి ఉంటే కారు ఎక్స్‌ప్రెస్ వేపై నుంచి కింది రోడ్డుపై పడి ఉండేది. ఈ సంఘటనలో కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన మహ్మద్ నియాజ్ తన ఇండికా కారులో ఎక్స్‌ప్రెస్ వే మీదుగా మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వెళుతున్నాడు. పిల్లర్ నంబర్ 257 వద్దకు రాగానే కారు బ్రేక్‌డౌన్ అయ్యింది. ముందుకు కదలలేని స్థితిలో ఉండటంతో కారును అలాగే పార్కు చేసి సూచిక బోర్డు పెట్టేందుకు కిందికి దిగాడు. ఇదే సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారులో శంషాబాద్ వైపు వెళుతున్న సయ్యద్ అమీరుద్దీన్ కారు బ్రేక్‌డౌన్ అయిన విషయాన్ని గుర్తించక వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. దీంతో కారు పల్టీ కొట్టి ఎక్స్‌ప్రెస్ వే ప్రహరీ దిమ్మెను తాకింది. మరికొంత వేగంగా ఢీకొట్టి ఉంటే కారు ఎగిరి కింద పడి ఉండేది. ఈ ఘటనలో సయ్యద్ అమీరుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ వేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న యువకుడి అరెస్ట్

వెంగళరావునగర్: ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్ పీఎస్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం రాత్రి ఎస్ఐ అవినాష్ బాబు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రత్నదీప్ మార్కెట్ సమీపంలో యూసుఫ్‌గూడ నివాసి కె.శివ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పోలీసులు అతడిని విచారించగా అంగీకరించాడు. అతడిని అదుపులోకి తీసుకుని ఫోన్, రూ.23 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'నా భర్తను చంపుతామంటూ మెసేజ్‌లు చేస్తున్నారు'

బంజారాహిల్స్: తన భర్తను చంపుతామంటూ వాయిస్ మెసేజ్‌లు పంపిస్తున్న వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఓ మహిళ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని మేఫెయిర్ అపార్ట్‌మెంట్‌లో ఉండే సయ్యద్ ఫిజ్జాబానో, సయ్యద్ మొహమ్మద్ అలందర్ జాఫెరి దంపతులు. తన భర్త హత్యకు కుట్ర జరిగిందంటూ సయ్యద్ మొహమ్మద్ అలందరి జాఫెరి ఈ నెల 9న పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉండగానే మీర్ మెహదీ అలీ అనే వ్యక్తి ప్రోద్బలంతో ముజాహెద్ అలీ బఖారీ, సయ్యద్ అలీ అబ్బాస్ బఖారీలు తమ సెల్‌ఫోన్ నుంచి కాల్ చేసి నీ భర్తను చంపుతామని బెదిరించడమే కాకుండా వాయిస్, టెక్ట్స్ మెసేజ్‌లు పంపించారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి




ఫిలింనగర్: ఫిలింనగర్ వినాయకనగర్‌లో ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌కు లేఖ రాశారు. షేక్‌పేట మండల పరిధిలోని ఫిలినగర్ వినాయకనగర్‌లో నారాయణమ్మ, తాతి రాములు, శ్రీశైలం, బాబురావుతో పాటు మరి కొంతమంది ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని, పూజలు చేస్తూ కావాలనే కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆమె ఇన్‌స్పెక్టర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉత్సాహంగా వార్షిక వినోదం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వార్షిక వినోద కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని ఉల్లాసంగా గడిపారు. సిబ్బందిలో నైతికత, సానుకూల పని వాతావరణాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జేహెచ్‌పీఎస్ హైదరాబాద్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి, రాంపల్లి ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు ప్రదర్శనలు ఉత్సాహాన్ని నింపాయి.

సందడిగా 'ఐస్ క్రీమ్ టేస్టింగ్ చాలెంజ్'



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఐస్ క్రీమ్ లవర్స్ అంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. కళ్లకు గంతలు కట్టుకుని ఐస్ క్రీమ్ రుచి చూసి.. దాని ఫ్లేవర్ చెప్పేందుకు పోటీ పడ్డారు. నగరంలోని ఎర్రమంజిల్ నెక్స్ట్ ప్రీమియా మాల్ వేదికగా హైబిజ్ టీవీ, ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ది గ్రేట్ ఇండియన్ ఐస్ క్రీం టేస్టింగ్ చాలెంజ్ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి నటి, నిర్మాత సుమయారెడ్డి, మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతిరెడ్డి, ఆర్జే శేఖర్ బాషా, నటి, బిగ్ బాస్ ఫేం శ్వేతావర్మ, హైబిజ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ గోపాల్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. శృతి రూ.లక్ష, విధాత్రి రూ.50 వేలు, యశస్వి రూ.25 వేల నగదు బహుమతులు గెలుచుకున్నారు.

బడా బాబుల ఇలాకా..
సర్కార్ జాగాల కబ్జా

ఇప్పటికే కోట్లాది రూపాయల స్థలాల స్వాధీనం

- కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు
- మరికొద్ది రోజులు కూల్చివేతలు ఉంటాయంటున్న అధికారులు
- జీహెచ్ఎంసీ కూడా దృష్టిసారించాలని డిమాండ్







బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను కూల్చివేస్తూ..

బంజారాహిల్స్: ఖాళీ జాగా ఉంది కదా..! అని దర్జాగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారు.. రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు.. సొసైటీ ప్రతినిధులకు మామూళ్లు ముట్టజెప్పి ఆక్రమించిన స్థలంలో అడ్డదారుల్లో క్రమబద్ధీకరించుకున్నారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు కళ్లు తెరవడంతో కళ్ల ముందే నిర్మాణాలు కూలిపోతుండటంతో లబోదిబోమంటున్నారు. ఇది షేక్‌పేట మండలం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12 ఎమ్మెల్యే కాలనీలో చోటుచేసుకున్న ఘటన.

- 10 రోజుల నుంచి ఎమ్మెల్యే కాలనీలో కొంతమంది ప్లాట్‌దారులు తమ ఇళ్ల వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు. ఒక్కొక్కరు 300 గజాల నుంచి 1200 గజాల దాకా అడ్డంగా ఆక్రమించేశారు. అంతటితో ఊరుకోకుండా ఇళ్లు కూడా కట్టుకున్నారు. లక్షలాది రూపాయలకు అద్దెలకు కూడా ఇచ్చారు. ఈ మధ్యనే ఓ స్థలం స్వాధీనం చేసుకున్న క్రమంలో రెవెన్యూ అధికారులకు ఈ కబ్జాల పర్వం కళ్లముందే కనిపించింది. దీంతో రికార్డులు పరిశీలించగా సుమారు 20 మంది వరకు ప్లాట్‌దారులు తమ ఇళ్ల వెనుక ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు.
- రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తుంటే ఒక్కొక్కరి కబ్జాల పర్వం వెలుగు చూస్తుండటంతో షేక్‌పేట మండల రెవెన్యూ అధికారుల కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఒక్కొక్క ప్లాట్ యజమాని సుమారుగా రూ.6 నుంచి రూ.10 కోట్ల విలువ చేసే సర్కారు స్థలాలు కబ్జా చేసి తమ ప్లాట్‌లో కలిపేసుకున్నట్లుగా గుర్తించారు. ఎమ్మెల్యేల కోసం రోడ్డు నంబర్–12లో శ్రీవెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పేరుతో 100 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇందులో 300–450 గజాల ప్లాట్లు ఏర్పాటు చేసి అప్పట్లోనే ఎమ్మెల్యేలకు కేటాయించారు. అయితే చాలామంది ఎమ్మెల్యేలు వీటిని అమ్ముకున్నారు.
- వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ ప్లాట్లను కొనుగోలు చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. ప్లాట్ల వెనుక పార్కుల కోసం కేటాయించిన స్థలాలను కొంతమంది, ఖాళీగా ఉన్న సర్కార్ జాగాలను మరి కొంత మంది కబ్జా చేశారు. షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి కొద్ది రోజుల నుంచి ఎమ్మెల్యే కాలనీ రికార్డుల చిట్టాను వెలికి తీస్తుండగా ఈ కబ్జా బాగోతం బయటపడింది.
- ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన ప్లాట్లదారులు ప్లాట్ నంబర్ పక్కన 'బై' నంబర్లు వేసుకుంటూ ఈ కబ్జాలకు పాల్పడ్డారు. ఇప్పటికే 10 ప్లాట్లకు సంబంధించిన ఆక్రమణలను, ప్రహరీగోడలను నేలమట్టం చేశారు. పలువురు ఇళ్ల వెనుక ఆక్రమించుకున్న స్థలంలో స్విమ్మింగ్ పూల్ నిర్మించుకోగా మరికొంతమంది మినీ గార్డెన్లు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ఏకంగా ఇళ్లే నిర్మించారు. ఇప్పటి వరకు సుమారు 3,000 గజాల ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరికొద్ది రోజులు కూల్చివేతలు ఉంటాయని అధికారులు తెలిపారు.
- ఇప్పటికే రూ.60 కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోగా, రాబోయే రోజుల్లో ఇంకా కూల్చివేతలు ఉంటాయని, స్వాధీనం చేసుకున్న స్థలాల చుట్టూ ఫెన్సింగ్ వేస్తామని, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కాలనీలో సుమారు 60–70 ప్లాట్ల వెనుక ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసినట్లుగా ఇప్పటికే జీహెచ్ఎంసీ, కలెక్టర్ కార్యాలయం, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనికి తోడు జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండానే ఆక్రమించిన ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించారనే ఫిర్యాదులు ఉన్నాయి. జీహెచ్ఎంసీ కూడా దృష్టి సారిస్తే ఎమ్మెల్యే కాలనీలో అక్రమ నిర్మాణాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

4న వివాహ పరిచయ వేదిక

వీరశైవ లింగాయత్, జంగమ మహేశ్వర యువతీయువకుల కోసం..

హిమాయత్‌నగర్: వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయ వేదికను విశ్వలింగాయత్ మ్యారేజ్ బ్యూరో ఆధ్వర్యంలో వచ్చేనెల 4వ తేదీన మలక్‌పేట, శుభకరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు వసారం శ్రీనివాస్ తెలిపారు. వీరశైవ లింగాయత్, జంగమ మహేశ్వర యువతీయువకులు వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందన్నారు. తల్లిదండ్రులతో కలిసి పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 92463 59842.

ఆపదలో ఆదుకునే సీఎంఆర్‌ఎఫ్



ఎన్బీటీనగర్‌కు చెందిన బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా భరోసా ఇస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తన నివాసం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్సలు పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా చితికిపోయిన వారు అనారోగ్యానికి గురైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గాయత్రీహిల్స్ రోడ్డు దుస్థితిపై 'ఎక్స్'లో ఫిర్యాదు



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10 గాయత్రీహిల్స్ రోడ్డులో పేరుకుపోయిన మట్టి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–10 నుంచి గాయత్రీహిల్స్‌కు వెళ్లే దారిలో మట్టి తేలి దుమ్ము లేస్తోందని, ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారుల కళ్లలో దమ్ము పడటంతో పాటు బైక్‌లు స్కిడ్ అవుతూ ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారని, త్వరగా రోడ్డు వేయాలంటూ స్థానికులు 'ఎక్స్'లో జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పదేళ్లుగా ఈ రోడ్డంతా మట్టి కొట్టుకుపోయి గుంతలు తేలి ఫుట్‌పాత్ కనుమరుగై చెత్తా చెదారం పేరుకుపోయి దుమ్ముతో అవస్థలు పడుతున్నామని ఆరోపించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కమిషనర్‌కు ఈ మేరకు సమస్యను పోస్ట్ చేశారు. ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, ఇటీవల ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోండి



కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

- ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: గ్రేటర్‌లో 30 లక్షలకు పైగా బీసీలు ఉంటారని, కానీ ఇప్పటి వరకు రాజీవ్ యువ వికాసం, బీసీ రుణాల పథకానికి లక్ష మంది వరకు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిసి తాను ఆశ్చర్యపోయానని ఖైరతాబాద్ ఎమ్మెలే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసం వద్ద షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా బీసీలు రుణాలు పొంది ఆర్థికంగా వృద్ధి చెందాలని, గడువు పూర్తయినప్పటికీ ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకుంటే తాను ఉన్నతాధికారులతో మాట్లాడి వారికి రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా షాదీముబారక్ 23 మందికి, 14 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు కార్యక్రమంలో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, కార్పొరేటర్ సంగీతా యాదవ్, మాజీ కార్పొరేటర్ బి.భారతి నాయక్, మామిడి నర్సింగ్‌రావు, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

- వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా

బంజారాహిల్స్: కొన్ని రోజులుగా కొనసాగుతున్న అంబేడ్కర్ వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు ధర్నా చేస్తున్న అంబేడ్కర్ విగ్రహ ప్రాంతానికి వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వచ్చారు. ధర్నాలో ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. వారి న్యాయమైన డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వారితో చర్చలు జరపాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు కే.అవినాష్, ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్, సలహాదారులు యాదగిరి, కాసం విజయ్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, కోశాధికారి వై.కుమార్, కాంట్రాక్ట్ అధ్యాపకులు కోటేశ్వరరావు, పడాల లక్ష్మణ్, సునీల్‌కుమార్, విజయ ఉషశ్రీ, శ్రీవేణి, అరుణ సిద్ధాంతి, కురుమేటి దయాకర్, నర్సయ్య భట్టు తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి ఏదీ?



వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి తదితరులు

శ్రీనగర్‌కాలనీ: మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నెలకొల్పి దాదాపు 50 ఏళ్లు గడుస్తున్నా సొసైటీలో సరైన అభివృద్ధి లేకపోవడం ఆలోచించాల్సిన విషయమని, పిల్లలకు ఆట స్థలం, రీడింగ్ రూమ్, మహిళలకు ప్రత్యేక విభాగం, దేవాలయ సముదాయాలు లేకపోగా ఇప్పటికీ కొత్త నిర్మాణాలు చేపట్టకపోవడం శోచనీయమని హౌసింగ్ సొసైటీ మెండర్ డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో అభివృద్ధికి నోచుకోకపోవడానికి పలు అంశాలను ప్రస్తావిస్తూ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి బి.వెంకటేష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సభ్యులు డాక్టర్ ఎస్వీ ప్రసాద్, కే.తులసీదాస్, పీఎస్ఎన్ మూర్తి, హనుమంతరావు, అంజిరెడ్డి, శేషగిరిరావు, కుటుంబరావు, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాసయ్యకు దళితరత్న అవార్డు



మాసయ్యకు దళితరత్న అవార్డు అందజేస్తున్న దండు లక్ష్మణ్ తదితరులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీకి చెందిన వై.మాసయ్యకు దళిత రత్న అవార్డు లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. ఫిలింనగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్ చేతులమీదుగా ఈ అవార్డు అందజేశారు. సమాజంలో దళితుల అభ్యున్నతికి మాసయ్య చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఇచ్చినట్లు వారు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి

హిమాయత్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన పథకంలో పని చేసే వంట కార్మికులకు ప్రభుత్వం రూ.10వేల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కేవలం రూ.3 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, అందులో కేంద్ర ప్రభుత్వమే రూ.600 ఇస్తుందన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది నెలల బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు కరుణకుమారి, రాములు, చక్రపాణి, రాంమూర్తి, లక్ష్మణ్, ముంతాజ్, రామకృష్ణ, వెంకటేశ్, ప్రమీల, భారతి, నాందేవ్, పద్మ, సరస్వతి, సుమలత, యశ్వంత్, రేఖ, కాంతమ్మ, సోఫియా, సంగీత, సరిత, సాయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

కడుపునిండా భోజనం

నడి నెత్తిన భానుడు తాండవం చేస్తున్న వేళ.. లక్డీకాపూల్‌లోని నీలోఫర్ ఆస్పత్రి వద్ద అన్నదాతలు ఇలా ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారి కడుపు నింపుతున్నారు.. అక్కడ భోజనం చేసిన వృద్ధులు, మహిళలు మీ కడుపు సల్లగుండా అంటూ దీవించి వెళ్తున్నారు.. ఆకలితో ఉన్న వారు ఎండను సైతం లెక్కచేయకుండా కడుపు నిండా భోజనం చేస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, బంజారాహిల్స్



సబ్‌ఇంజినీర్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు

హిమాయత్‌నగర్: డిప్లొమా అర్హతతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో) 2017 డిసెంబర్ 28న 174 సబ్‌ఇంజినీర్(ఎలక్ట్రికల్) పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను వారి నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ కేసును తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుని నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరామని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు డాక్టర్ సీహెచ్ భద్ర, చల్లూరి శ్రీనివాస్, చల్లూరి రాంబాబు, శివకుమార్, పి.ప్రహ్లాద్, జూపాక శ్రీనివాస్, ఎంఎస్ఆర్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా జీతాలు ఇవ్వాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న శిశువిహార్ వర్కర్స్ యూనియన్ నేతలు

వెంగళరావునగర్: శిశువిహార్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలకు ప్రతినెలా జీతాలు చెల్లించాలని వర్కర్స్ యూనియన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని శిశువిహార్‌లో విధులు నిర్వర్తించే ఆయాలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు ప్రతినెలా 7వ తేదీ లోపు జీతాలివ్వాలని అన్నారు. లేదంటే వచ్చేనెల 2వ తేదీ నుంచి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సుశీల, శ్యామల, కవిత, సోమలక్ష్మి, లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రూపులుగా విడిపోయి గొడవ

- నలుగురికి గాయాలు
- నడి రోడ్డుపై న్యూసెన్స్
- అందరిపై కేసు నమోదు

ఫిలింనగర్: రెండు గ్రూపుల మధ్య గొడవలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో టోలిచౌకి ఎస్ఏకాలనీలో రెండు గ్రూపులు గొడవ పడుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ స్థానికంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండటంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజేంద్రనగర్‌కు చెందిన షేక్ షోయబ్, ఎస్ఏకాలనీకి చెందిన మహ్మద్ ఫైజల్ అఫాన్, అబ్దుల్ అజర్ ఒక గ్రూపుగా, రెండో గ్రూపులో సయ్యద్ అహ్మద్, ఒమెర్, అఫ్సర్, సయ్యద్ ఆసీఫుద్దీన్, అనఫ్ హుస్సేన్ తదితరులు రెండు గ్రూపులుగా విడిపోయి తీవ్రంగా గొడవ పడుతుండగా పలువురికి రక్తస్రావం జరిగింది. నడి రోడ్డులో స్థానికంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరందరిపై కేసు నమోదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి



అభివాదం చేస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో దాదాపు 8 లక్షల జనాభా ఉన్న ఎరుక కులస్తులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రూ.100 కోట్లు నిధులు విడుదల చేయాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎరుకల కులస్తులకు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల కులస్తులపై దాడులు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. ఎరుకల మహిళలకు ఇందిరా మహిళ శక్తి పథకంలో అవకాశం కల్పించాలన్నారు. ఎరుకల స్థితిగతులపై కమిటీ ఏర్పాటు చేసి ఎరుకల అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తిరుపతి, సంపత్, సహాయ కార్యదర్శులు కుమారస్వామి, రేవెల్లి తిరుపతి, కెమసారం రాజు, ఎల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంస్కృతిక రంగంపై మక్కువ అవసరం



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

హిమాయత్‌నగర్: విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక రంగంలో మక్కువ పెంచుకుని ప్రతిభ చాటాలని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ అన్నారు. నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కల్చరల్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం సోమవారం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను పరిరక్షించుకోవాలన్నారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాపోలు శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ గిరిధర్, డాక్టర్ సీవీఎల్ నారాయణ, డాక్టర్ గడ్డం ఆదాము, డాక్టర్ మనోజ్ కుమార్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో తనిఖీలు



చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్‌పీఎఫ్ అధికారులు

కుషాయిగూడ: జమ్మూ, కశ్మీర్ పహల్గాం ఘటన నేపథ్యంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) బలగాలు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. టెర్మినల్ పరిసరాలతోపాటు టికెట్ కౌంటర్లు, ఫ్లాట్‌ఫాంలు, వెయిటింగ్‌హాల్స్‌లో ప్రయాణికుల బ్యాగులను క్షుణంగా తనిఖీ చేశారు. రెడ్ అలర్ట్‌లో భాగంగా రైల్వే టెర్మినల్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రయాణికులకు భరోసా కల్పించినట్లు ఆర్‌పీఎఫ్ సీఐ ఆర్కే మీనా, ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో ఎలాంటి పేలుడు, ఇతర వస్తువులు లభించలేదని వారు పేర్కొన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో భద్రత మరింత పెంచనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

దారి చూపినందుకు ధన్యవాదాలు

రంగనాథ్‌ను కలిసిన శ్రీ రంగాపురం కాలనీవాసులు



సాక్షి, సిటీబ్యూరో: రహదారుల కబ్జాపై ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన ఏడు కాలనీలకు దారి చూపిన హైడ్రాను ఆయా కాలనీవాసులు అభినందించారు. సోమవారం ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసిన కాలనీవాసులు శాలువాతో సత్కరించారు. ప్రధాన రహదారి మూతపడటంతో అంబులెన్సులు, స్కూల్ బస్సులు రాలేని పరిస్థితుల్లో 20 ఏళ్లుగా అవస్థలు పడ్డామని, ఇప్పుడు హైడ్రా చర్యలతో ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ గ్రామంలోని శ్రీ రంగాపురం కాలనీలో 45 అడుగుల ప్రధాన రహదారిపై అడ్డంగా కొందరు ప్రహరీ కట్టారు. కాలనీవాసుల ఫిర్యాదుతో స్పందించిన హైడ్రా ఈ నెల 19న దాన్ని తొలగించింది. దీంతో యాపిల్ ఎవెన్యూ, శ్రీరంగాపురం, సాయినాథ్ కాలనీ, సుందరయ్య కాలనీ, శ్రీ శ్రీనివాస కాలనీ, ఇందిరమ్మ కాలనీ-1, ఇందిరమ్మ కాలనీ-2 వాసులు హైడ్రా కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు చెప్పారు.

నగరంలో నేడు

- టీఎంబీఎం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు రవీంద్రభారతిలో కల్చరల్ ప్రోగ్రామ్స్ జరుగుతాయి.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్-2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారుడు నరేందర్‌రెడ్డి గీసిన చిత్రాలను ది ఎటర్నల్ మిస్మరైజ్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బేగంపేట్‌లోని పర్యాటక భవన్‌లో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల సమస్యలపై ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది.
- రసరంజని గ్రూప్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో తెలుగు నాటక ప్రదర్శన జరుగుతుంది.
- చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాజ గానసభలో సాయంత్రం 4 గంటలకు బంగారు తెలంగాణ జానపద ఆర్ట్స్ అకాడమీ ఐకాన్ అవార్డు ప్రదానోత్సవం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఆ నొప్పులు భరించలేం..!

- అవసరం లేకున్నా ప్రివెంటబుల్ సి-సెక్షన్లు
- విద్యావంతులే ఆపరేషన్ కోరుతున్నారు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో 3 రెట్లు ఎక్కువ
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5లో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: గర్భిణులకు ప్రసవాలు చేయడం వైద్యులకు సవాలుగా మారింది. ప్రసవ వేదన భరించలేక ఆపరేషన్లు చేయాలంటూ వైద్యులపై అనవసరపు ఒత్తిడి తీసుకువస్తున్నారు. 'ఆ నొప్పులు నా కూతురు భరించలేదు. ఈ రోజు మంచి రోజు ఉంది. ఈ సమయంలో సీ-సెక్షన్ చేయండి. ఈ తేదీ మాకు కలిసొస్తుంది'అంటూ ప్రసవాల సమయంలో గర్భిణుల తల్లిదండ్రులు ఆపరేషన్ల కోసం వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ రకమైన శస్త్రచికిత్సల్లో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5లో తేలింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు చేయాలని వైద్యులకు ప్రభుత్వం నిర్దేశిస్తుండగా, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రం ఈ తరహా సీ-సెక్షన్లకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి ప్రివెంటబుల్ సీ సెక్షన్లలో ఉన్నత విద్యావంతులే అధిక శాతం ఉంటున్నారు. ఈ పరిస్థితులు ఆర్థిక భారంతోపాటు తల్లీ, పిల్లల భవిష్యత్తు ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

తెలంగాణలోనే అధికం..

దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 21,499 మంది ప్రసవాలను అధ్యయనం చేయగా పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. మొత్తం సీ-సెక్షన్లు 44.3 శాతం ఉండగా, అందులో నిరోధించదగిన సీ-సెక్షన్లు 13.9 శాతం ఉన్నాయి. అత్యల్పంగా 3.1 శాతం ప్రివెంటబుల్ సీ-సెక్షన్‌లో కేరళ ఉండగా, తెలంగాణలో 8.4 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో 5.4 శాతం, కర్ణాటక 6.2 శాతం, తమిళనాడులో 7 శాతం నిరోధించదగిన సీ-సెక్షన్లు ఉన్నాయి. సీ-సెక్షన్ ప్రసవాల నిష్పత్తి, ప్రివెంటబుల్ సీ-సెక్షన్ డెలివరీలు 25 ఏళ్ల నుంచి 34 ఏళ్ల వయసు గల తల్లుల్లో ఎక్కువగా ఉంటున్నాయి.

విద్యాధికుల్లోనూ ఈ తరహా పోకడలు..

నిరోధించదగిన సీ-సెక్షన్లలో నిరక్షరాస్యులతో పోల్చితే విద్యావంతులే సుమారు 30 శాతం ఎక్కువగా ఉన్నారు. ధనవంతులు, నిరుద్యోగ మహిళలు, ప్రైవేటు హెల్త్ కేర్ సదుపాయాలు ఉన్నచోట ఈ తరహా పోకడలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులతో పోల్చితే ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ తరహా ప్రివెంటబుల్ సీ-సెక్షన్లు మూడు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఫలితంగా ప్రసవ ఖర్చులు పెరుగుతున్నాయి. అనవసరమైన శస్త్రచికిత్సల వల్ల తల్లీ, పిల్లల ఆరోగ్యం భవిష్యత్తులో సంక్లిష్టంగా మారే ప్రమాదముంది. అధిక రక్తస్రావం అనేది ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అత్యంత సాధారణ సమస్యగా కనిపిస్తోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)తో పోల్చితే ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో సీ-సెక్షన్ ప్రసవాలు 17 శాతం పెరగడం గమనార్హం.

అవసరం లేదన్నా వినడంలేదు..

'సాధారణ ప్రసవం చేయిస్తాం. అంతవరకు ఎదురుచూడాలి'అని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చెబుతున్నా, అందుకు గర్భిణి కుటుంబ సభ్యులు సిద్ధంగా లేరని పలువురు వైద్యులు పేర్కొంటున్నారు. ఆ నొప్పులను భరించలేనని గర్భిణి చెబుతుండగా, వారి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు సైతం శస్త్రచికిత్స కోసం వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే వైద్యులతో వాగ్వాదానికి దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. గర్భిణి పౌష్టికాహారం తీసుకుని, నిత్యం తగినంత వ్యాయామం చేస్తే సరైన సమయంలో సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుత కాలంలో పట్టణ ప్రాంతాల్లోని గర్భిణుల్లో వ్యాయామం నామమాత్రంగానే ఉంటుందని పేర్కొంటున్నారు. ఫలితంగా ప్రసవ సమయంలో నొప్పులు ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

30న హెచ్‌ఎంఏటీ హోమియో ఫెస్ట్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డా.కె.గోపాలకృష్ణ, డా.జి.దుర్గాప్రసాద్

హిమాయత్‌నగర్: హోమియో వైద్య పితామహుడు డా.శామ్యూల్ హానిమన్ 270వ జయంతి పురస్కరించుకొని హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(హెచ్ఎంఏటీ) ఆధ్వర్యంలో హోమియో ఫెస్ట్-2025 కార్యక్రమాన్ని ఈ నెల 30న ఖైరతాబాద్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో జరుపుతున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కె.గోపాలకృష్ణ, డాక్టర్ జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేఎన్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డా.పి.వి.నందకుమార్‌రెడ్డి, సి.బి.ఐ మాజీ ఉప సంచాలకులు వి.వి.లక్ష్మీనారాయణ హాజరు కానున్నారని వెల్లడించారు. హోమియో వైద్య విద్యార్థుల్లో క్లినికల్ సామర్థ్యాలతోపాటు, సృజనాత్మక శక్తిని, పోటీతత్వాన్ని అలవాటు చేయడమే ఈ ఫెస్ట్ ఉద్దేశమని అన్నారు. ప్రముఖ హోమియో వైద్యనిపుణులు డా.జి.జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డా.వేణుగోపాల్ గౌరీ, డా.మధు వారణాసి, డా.గౌతమ్, డా.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీడీఏ కమిషనర్‌గా శశాంక బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కమిషనర్‌గా కె.శశాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ శివార్లలో నాలుగో నగరాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీడీఏను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పెట్టుబడుల నగరంగా ఈ ప్రాంతాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సర్కారు శశాంకను తొలి కమిషనర్‌గా నియమించింది. గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన శశాంక అనుభవం ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన నియామకానికి మొగ్గు చూపింది. ఈ క్రమంలోనే నానక్‌రాంగూడలోని స్టేట్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్స్ ఆఫీస్‌లో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కన్హా శాంతివనంలో నేటి నుంచి బాబూజీ జయంతి వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: శ్రీ రామచంద్ర మిషన్ గురు పరంపరలో రెండో బాబూజీ మహారాజ్ 125వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో ఈ నెల 29 నుంచి మే 1 వరకు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నామని మిషన్ అధ్యక్షుడు దాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల ఈ కార్యక్రమాల్లో సామూహిక ఆధ్యాత్మిక జాగృతి, సార్వత్రిక సోదరభావం, ఆత్మపరిశీలన, ఇతర బోధనల ఔన్నత్యాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏకాత్మ అభియాన్ మిషన్‌లో భాగంగా 65 వేల గ్రామాల్లో 12 కోట్ల మందికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కన్హా మ్యూజిక్ ఫెస్టివల్ రెండో ఎడిషన్‌లో ప్రసిద్ధ గాయకులు పండిట్ శారంగ్ దేవ్, మిశ్రా తదితర గాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారని తెలిపారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

అంబర్‌పేట: శ్రీరమణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు కాంగ్రెస్ శ్రేణులు సన్నాహాలు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసే విగ్రహం గతంలో పంజాగుట్టలో ఏర్పాటు చేసేందుకు మాజీ ఎంపీ వి.హనుమంతారావు సిద్ధం చేశారు. అప్పట్లో అక్కడ విగ్రహం ఏర్పాటు చేయడం వివాదం కావడంతో ఆ విగ్రహాన్ని అప్పటి ప్రభుత్వం గోషామహల్ భద్రపరిచారు. అదే విగ్రహాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు శ్రీరమణ చౌరస్తాలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగనుంది.

ప్రజావాణి ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు



లక్డీకాపూల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిశీలించాలని సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 67 వినతులు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు చంద్రకాంత్ రెడ్డి, సరోజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి రావు, రఘు ప్రసాద్, గీతా రాధిక, సత్యనారాయణ, అడిషనల్ సీసీపీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి



శిక్షణలో పాల్గొన్న జీహెచ్ఎంసీ ఇంజనీర్లతో మంత్రి సీతక్క, ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తదితరులు

నూతన ఇంజనీర్లకు మంత్రి సీతక్క సూచన

రాయదుర్గం: ఉద్యోగాన్ని కాపాడుకోవాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జీహెచ్ఎంసీ నూతన ఇంజనీర్లకు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జీహెచ్ఎంసీలో నూతనంగా నియమించిన వివిధ సర్కిళ్ల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల రెండో బ్యాచ్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) సీఈఓ దివ్యాదేవరాజన్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో ఇంజనీరింగ్ అధికారుల పాత్ర గణనీయమైందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అభ్యర్థులందరికీ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ద్వారా శిక్షణ ఇస్తున్నందుకు తమకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీలు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నరేష్, నాగమల్లేశ్వరరావు, 30 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

లాలాగూడ రైల్వే ఆసుపత్రికి 50 వీల్‌చైర్లు



గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రాం ప్రసాద్, 3150 రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి ఇతర రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ సోమవారం లాలాగూడలోని కేంద్రీయ రైల్వే ఆసుపత్రికి 50 వీల్‌చైర్‌లను విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ పేదల కోసం వివిధ సేవా కార్యకలాపాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఇందులో భాగంగా లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌కు 50 వీల్ చైర్‌లను విరాళంగా ఇవ్వడంలో రోటరీ క్లబ్ చూపిన చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, దక్షిణ మధ్య రైల్వే మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివనాగ ప్రసాద్, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి, జిల్లా



టాలెంట్ హంట్‌లో సర్టిఫికెట్లు పొందిన దివ్యాంగ విద్యార్థులతో అతిథులు

పారా ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాల సాధనే లక్ష్యం

ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

రాయదుర్గం: భారతదేశంలో 2028లో జరిగే పారా ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాల కృష్ణ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ క్యాంపస్‌లో రీజియన్ స్థాయి తొమ్మిదవ దివ్యాంగుల టాలెంట్ హంట్, ట్రైనింగ్ క్యాంప్ ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో 100 పతకాలు సంపాదించిన దాని కంటే పారా ఒలింపిక్స్‌లో 100 పతకాలు సంపాదిస్తే భారత కీర్తి ప్రతిష్టలు ఎంతగానో పరిఢవిల్లుతాయంటూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వస్తున్నామన్నారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ మల్లవరపు బాలలత మాట్లాడుతూ తాను కూడా ప్రత్యేక అవసరాలు కలిగిన మహిళనేనని, కానీ ప్రత్యేక అవసరాలను రెండోశక్తిగా భావించి ముందుకు వెళ్లానని అన్నారు. అనంతరం టాలెంట్ హంట్‌లో పాల్గొన్న విద్యార్థులంతా అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత, ఏఎంఎఫ్ ట్రస్ట్ ప్రతినిధి శోభు యార్లగడ్డ, ఎపిస్టిమో విద్యాలయ డైరెక్టర్ పద్మ కొల్లి, హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్లు సాగరిక, నాగభూషణం, జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ డి.విజయభాస్కర్, భోపాల్, చండీగఢ్, పుణె, హైదరాబాద్ రీజియన్ పరిధిలోని జేఎన్‌వీల విద్యార్థులు, జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ క్యాంప్

- జూన్ 6 వరకు నిర్వహణ
- పాల్గొనే విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగా, జుంబా డ్యాన్సులో శిక్షణ



వేసవి క్రీడా శిక్షణ శిబిరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివసేనా రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే ఒకటవ తేదీ నుంచి జంట నగరాల్లోని అన్ని స్టేడియాలతోపాటు 33 జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎల్బీస్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ, క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరాలు జరుగుతాయని వెల్లడించారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగా, జుంబా డ్యాన్స్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిబిరాలలో పాల్గొనబోయే క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వేసవి శిబిరాలలో అసిస్టెంట్ కోచ్‌లుగా సేవలందించే వారికి గౌరవ వేతనం పెంచుతామన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలు పేద, మధ్య తరగతి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపులు రెడీ

స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ కింది ప్రాంతాలో..

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో నగరంలో స్పోర్ట్స్ అథారిటీ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు ప్రారంభం అవుతున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 6 వరకు దిగువ ప్రాంతాల్లో ఈ కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఎక్కడ ఏ క్రీడలు, ఇతరత్రా పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు లేదా https://satgasc.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఎల్‌బీ స్టేడియం (9866229937)
సైక్లింగ్ వెలోడ్రోమ్ (9848464642)
షూటింగ్ రేంజ్, యూసఫ్‌గూడ (9052126394)
స్పోర్ట్స్ కాంప్లెక్స్, గచ్చిబౌలి (9000033100)
జింఖానాగ్రౌండ్స్ (9866317310)
వాటర్‌స్పోర్ట్స్, హుస్సేన్‌సాగర్ (8297611617)
కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం (9849312195)
ఇండోర్ స్టేడియం సరూర్‌నగర్ (9866317303)

జీహెచ్ఎంసీలో..

జీహెచ్ఎంసీ ప్రతియేటా నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపులు ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా ప్రారంభించారు. ప్రైవేట్ కోచింగ్ సంస్థలతో పోలిస్తే జీహెచ్ఎంసీలో తక్కువ ఫీజులకే కోచింగ్ లభిస్తుండటం, జీహెచ్ఎంసీ క్యాంపుల నుంచే ఎందరో జాతీయ క్రీడాకారులుగా ఎదగడం తెలిసిందే. ప్రతియేటా దాదాపు 45 రోజులపాటు జీహెచ్ఎంసీ ఈ క్యాంపులను నిర్వహిస్తుంది.

యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయండి



ఉన్నత విద్యామండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకుల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొ.శ్రీరాం వెంకటేష్‌కు అధ్యాపకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మతేజ, పరుశురాం, వేల్పుల కుమార్, ఉపేందర్, విజయేందర్ రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, వినీత పాండే, కృష్ణవేణి, కవిత, కృష్ణయ్య, తిరుపతి పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా గ్రామీణ మహిళలు

స్త్రీశక్తి అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి సీతక్క

మాదాపూర్: వడ్డీలేని రుణాలు ఇస్తూ గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి , స్త్రీ సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. సోమవారం హెచ్ఐసీసీలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో స్త్రీశక్తి అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ పలు రంగాల్లో స్త్రీశక్తిని గుర్తించి అవార్డులతో సత్కరిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. పట్టణ మహిళలనే గుర్తించి అవార్డులను ఇస్తుంటారని కాని గ్రామీణ స్వయం సహాయక బృందాల సభ్యుల విజయాలను గుర్తించి వారికి అవార్డులను ఇస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఐదుగురు మహిళా సంఘ సభ్యులకు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంతో సెర్ప్ ఏర్పాటు చేశామని, సెర్ప్ ద్వారా మహిళా సంఘాలకు రూ.20లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వడ్డీలేని రుణాలను ఇస్తూ గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. శిల్పారామంలో రూ.300 కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు కేటాయించినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా బస్సులకు ఓనర్లుగా మారుస్తున్నామని, వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను మహిళలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పపువ్వు లడ్డుకు జాతీయ గుర్తింపు తెచ్చిన కుమ్రంబాగు భాయ్ స్త్రీశక్తి అవార్డు అందుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) అధ్యక్షుడు బలరాం బాబు అల్లా , స్త్రీశక్తి అవార్డుల కన్వీనర్ విశాలరెడ్డి ఉయ్యాల, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, జ్యూరీ సభ్యులు , టీసీఈఐ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 29 ఏప్రిల్ 2025



ది ఎటర్నల్ మెస్మరైజర్ ప్రదర్శన ప్రారంభం

మాదాపూర్ : చిత్రకళాకారుడు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకళాకారుడు నరేందర్‌రెడ్డి వేసిన చిత్రాలను ది ఎటర్నల్ మెస్మరైజర్ పేరిట సోమవారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మే 4 వరకూ నిర్వహించనున్న ప్రదర్శనలో 40 చిత్రాలు అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. దేవతామూర్తుల విగ్రహాలు, శాంతికి నిదర్శన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

గిరిజన కళలపై వేసవి శిబిరం



సాక్షి, సిటీబ్యూరో : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థలో గిరిజన కళలపై పాఠశాల విద్యార్థులకు సోమవారం వేసవి శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని గిరిజన గురుకుల సంస్థల కార్యదర్శి సీతాలక్ష్మి ప్రారంభించారు. విద్యార్థులు గిరిజన కళలు, సంస్కృతిపై అవగాహన, సాధికారత పెంచుకోవాలని హితవు పలికారు. తొలిసారి గిరిజన కళలపై హైదరాబాద్‌లో వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ సీతారామ్, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల, గిరిజన మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ, ఇంజనీర్ హేమలత, ఆర్గనైజర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మర్.. స్టైల్స్..

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సీజన్‌ను పురస్కరించుకుని ప్రత్యేక ఫ్యాషన్ ఉత్పత్తుల ప్రదర్శన హైలైఫ్.. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటైంది. దేశ వ్యాప్తంగా ఫ్యాషన్ బ్రాండ్స్ పాల్గొన్న ఈ ప్రదర్శనను సినీనటి హెబ్బా పటేల్ సోమవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో అత్యాధునిక శైలి ఆభరణాలు, దుస్తులు, యాక్సెసరీస్ తదితర ఉత్పత్తులు అందించే 350 బ్రాండ్స్ పాల్గొంటున్నాయని, ప్రదర్శన ఈ నెల 30వ తేదీ వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.







ఆభరణం అంటే మగువల అందాన్ని పెంచడానికి విభిన్న సృజనాత్మక రూపాల్లో తయారు చేయడమే. ఈ విషయం అందరికీ తెలిసిన విషయమే. అయితే ఇటీవల కాలంలో ఆభరణాల ప్రపంచంలో ఒక కొత్త ధోరణి చెలామణి అవుతోంది. 'థీమ్ ఆధారిత ఆభరణాలు' అనే ఈ ట్రెండ్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. హైదరాబాద్ నగరంలో కూడా ఇది విస్తృతంగా ఆదరణ పొందుతోంది. ముఖ్యంగా ప్రకృతి, ఋతువుల సౌందర్యానికి ప్రతిగా రూపొందించిన ఆభరణాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రముఖ ఆభరణ బ్రాండ్లు ఈ కొత్త ధోరణిని స్వీకరించి, ప్రతి ఆభరణంలోనూ ప్రకృతిసౌందర్యాన్ని బంధించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని బ్రాండ్‌లు ప్రత్యేకంగా రూపొందించిన కళాఖండాలు, కశ్మీర్ ఋతువుల మాయాజాలాన్ని ప్రతిబింబిస్తూ మార్కెట్‌లోకి వస్తున్నాయి. అది బంగారమా, వజ్రమా అనే తేడా లేకుండా వ్యాపార విలువతో పాటు ఆభరణంలోని థీమ్‌ను, వైవిధ్యాన్ని, వినూతనత్వాన్ని ఆస్వాదిస్తున్నారు నగరవాసులు. - సాక్షి, సిటీబ్యూరో

ఇన్‌స్పైర్డ్ జ్యువెలరీ..

ఆభరణాల సృజనాత్మకత వెనక ఒక కథ

- ప్రస్తుత ట్రెండ్‌గా జ్యువెలరీ మేకింగ్
- ప్రకృతి, మనస్తత్వాలు తదితర కథలు చెబుతున్న ఆభరణాలు
- జ్యువెలరీ డిజైనింగ్‌లో నూతన ఒరవడి
- ఈ నూతన సంస్కృతికి నగరంలోనూ పెరిగిన ఆదరణ

ఆభరణాల తయారీలోని హస్తకళ వైవిధ్యానికి థీమ్ ఆధారిత జ్యువెలరీ మరింత హంగులను అద్దుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ట్రెండింగ్‌లో ఉన్న కొన్ని ఆభరణ సౌందర్యాలు.

ఋతువుల కవిత్వం తాకిన కళ..

'ఈ లోయ గుండా నడిచిన ప్రతిసారీ, ఋతువులు తమ పాటలు పాడతాయి' అనే భావనతో ఒక కవిత్వ సృష్టిలాంటి ఆభరణాలు అలరిస్తున్నాయి. చినార్ ఆకుల నృత్యం నుంచి మంచుతో కప్పబడిన పైన్ చెట్ల పరవశం వరకూ ప్రతి ఆభరణం ప్రకృతి గాథను చెబుతోంది. శరదృతువులో చినార్ ఆకులు గాలిలో ఊగే తీరు, తెల్లటి మంచుతో అలంకరించిన దృశ్యాలను ప్రతిబింబించే చెవిపోగులు, లాకెట్లు, రౌండ్ కట్‌లో తెల్ల వజ్రాలతో తయారైన కశ్మీర్ శీతాకాలపు నిర్మలత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి.



ప్రకృతిని ధరించే సోయగాలు..


ఈ కొత్త థీమ్ ఆధారిత ఆభరణాలు ప్రకృతిని మించిన అందాలుగా అందుబాటులోకి వస్తున్నాయి. ఋతువుల స్వభావాన్ని, కశ్మీర్ వంటి సుందర ప్రదేశాలను ప్రతిబింబించేలా తయారు చేస్తున్న ఆభరణాలు నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. అధునాతన సంప్రదాయానికి వినూతనత్వాన్ని జోడిస్తున్న ఈ కళాఖండాలు ప్రస్తుత జీవన శైలి, ఫ్యాషన్ ప్రపంచానికి ప్రకృతితో కూడిన కొత్త పంథాను పరిచయం చేస్తున్నాయి.

శీతాకాలపు మాయాజాలం..

శీతాకాలపు అందాల్లో మునిగిపోయిన పైన్ చెట్లు, కిరణాలపై మెరిసే వజ్రాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన నెక్లెస్‌లు, చెవిపోగులు శీతాకాలపు సౌందర్యానికి నిదర్శనంగా తయారు చేస్తున్నారు. నెమ్మదిగా వెలిసే శీతాకాలం మొదలు వికసించే వసంతానికి మధ్య మార్పును చూపించే ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

వసంతపు వర్ణ విహారం..

వసంత ఋతువులో కశ్మీర్ లోయను అలంకరించే తులిప్ పువ్వుల కాంతిని పసుపు వజ్రాలు, గులాబీ క్వార్ట్జ్ రత్నాలతో తయారు చేసిన ట్టుగా ప్రతిబింబిస్తున్నాయి. తులిప్ పువ్వుల వర్ణాలను దృశ్యాన్ని చేస్తున్నట్లుగా చెవిపోగులు, నెక్లెస్‌లు ప్రతి రూపంలో ప్రకృతి ఉత్సాహాన్ని తీసుకొస్తున్నాయి.



సృష్టి కథను ఆభరణాల్లో వర్ణిస్తూ..

'ఇప్పటికీ మిగిలి ఉన్న స్వర్గం' అనే భావన ఆధారంగా రూపొందించిన ఈ కొన్ని కలెక్షన్ కశ్మీర్ లోయల శాశ్వత అందాన్ని మిళితం చేస్తూ అందమైన కథగా చెబుతున్నాయి. బంగారం పై తయారు చేసిన చినార్ ఆకులు, వజ్రాల కాంతిలో మెరిసే తులిప్ పువ్వులు, కాలానికి అర్థం చెప్పకనే చెబుతున్నాయి.



మై ఎంబ్రేస్.. మగువల ఆలోచనలు..



ప్రస్తుత తరుణంలో ఆభరణాలను అందం కోసమే కాకుండా ఒక కళాత్మక జీవనానికి నిదర్శనంగా ధరిస్తున్నారు మగువలు. దీనికి అనుగుణంగానే ఆభరణాల తయారీ కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. ఇందులో భాగంగానే జోయా ఆధ్వర్యంలో మై ఎంబ్రేస్ అనే థీమ్‌తో.. సాధారణంగా మహిళలు జీవితంలో ఎన్ని పాత్రలు పోషించినా, వారి జీవితానికి పరమార్థంగా 'తనను తాను ఆలింగనం చేసుకునేలా' అందమైన జ్యువెలరీ రూపొందించాం. మగువ ఆలోచనలు, ఆనందాలు సార్థకం అయ్యేలా తనకు తాను ప్రాధాన్యత ఇచ్చుకునేలా సృష్టించిన ఈ ఆభరణాలు నగరంలోని జ్యువెల్ లవర్స్‌ను ఆకర్షిస్తున్నాయి. - అమన్‌ప్రీత్ అహ్లువాలియా, జోయా బిజినెస్ హెడ్



పక్షుల నేస్తం..

- రక్షణకు కృషి చేస్తున్న శివ సాయి కిరణ్
- నీరు, ఆహారం అందిస్తూ తన వంతు సాయం



కాచిగూడ : కుహు కుహు రాగాలు, కిల కిల రవాలు ఎంత విన సొంపుగా ఉంటాయో కదా.. ఎన్ని మానసిక చికాకులున్నా ఇట్టే మాయమై మనసుకు సాంత్వన చేకూరుతుంది. పిచ్చుకలు, పక్షుల గురించి తెలియని వారుండరు. ఇంట్లోనో.. పెరట్లోనో.. పొలాల్లోనో తారస పడుతుంటాయి. అయితే పక్షుల సంఖ్య వేగంగా తగ్గుతోంది. చెట్ల నరికివేత, సెల్‌ఫోన్ల రేడియేషన్‌తో పక్షులకు గడ్డు కాలం ఏర్పడుతోంది. పిచ్చుకల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. సెల్‌ఫోన్ల రేడియేషన్, ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్ల నుంచి వెలువడే క్లోరో ఫ్లోరో కార్బన్స్, చెట్ల నరికివేత తదితర కారణాలతో అవి కనుమరుగవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న ఈ పక్షిజాతి పట్ల ఇప్పుడిప్పుడే చైతన్యం పెరుగుతోంది.

పక్షులకు అండగా..

పక్షుల జాతి జాతి అంతరించి పోకుండా పక్షి ప్రేమికులు కృషి చేస్తున్నారు. అంబర్‌పేటకు చెందిన ఓ పక్షి ప్రేమికుడు శివ సాయి కిరణ్ పక్షుల రక్షణకు తన వంతు కృషి చేస్తూ అందరి మన్ననలూ పొందుతున్నారు. చిన్ననాటి నుంచి పక్షులంటే ఆయనకు ప్రాణం. ఉస్మానియా యూనివర్సిటీ ఆక్సిజన్ పార్కులో పక్షుల కోసం ప్రతి రోజూ నీటిని, వాటికి కావాల్సిన ఆహారాన్ని తీసుకెళ్లి అందిస్తున్నారు. గత 12 సంవత్సరాలుగా పక్షుల రక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు.







విద్యార్థుల ర్యాంప్ వాక్

ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌లో 'సొలస్టా-2025' పేరిట వార్షిక గ్రాడ్యుయేషన్ ఫ్యాషన్ షో

రాయదుర్గం : ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో 'సొలస్టా-2025' పేరిట వార్షిక గ్రాడ్యుయేషన్ షో సోమవారం సాయంత్రం నిర్వహించారు. విద్యార్థినులు రూపొందించిన వస్త్రాలను, పాదరక్షలు ధరించి ఫ్యాషన్ షో నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల సృజనాత్మకతలోనూ, నైపుణ్యంలో కొత్త బెంచ్‌మార్క్ నెలకొల్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆవిష్కరించిన పలు ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచి అబ్బురపరిచారు. రానున్న తరానికి ఇది కొత్త అధ్యాయం అనిపించేలా వారి డిజైన్లు, మోడల్స్, ఉత్పత్తులు ఉన్నాయని పలువురు కొనియాడారు. ఈ సొలస్టా-2025 ఫ్యాషన్ షో తమ విద్యార్థుల ప్రతిభకు, నిబద్ధతకు నిదర్శనమని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. మార్వీ అండ్ సెలబ్రేటెడ్ ఫ్యాషన్ సైకోథెరపిస్ట్, సీఈఓ దీప్తిరెడ్డికోతా, డీఎల్ఎం స్టూడియో క్రియేటివ్ డైరెక్టర్ మానస, మిస్ యూనివర్స్-ఆంధ్రప్రదేశ్-2024 చందన జయరామ్, ఆగ్రా సీఎఫ్‌టీఐ మాజీ డైరెక్టర్ సనాతన్ సాహూ, క్లాన్ షూస్ సీనియర్ ప్రొడక్ట్ డిజైనర్ నందకిషోర్, ఓపీపీఓ ఇండియా మాజీ హెడ్ ఆఫ్ డిజైన్ మున్వర్‌ఖాన్, వి ఫుట్‌వేర్ ఎండీ జే మురళీకృష్ణలు స్టార్ స్టడెడ్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

నిధుల సమీకరణకు ఫ్యాషన్ షో..

దేశ సరిహద్దు ప్రాంతాల్లో పాఠశాలల అభివృద్ధి కోసం కృషి



సనత్‌నగర్: గ్లోరియస్ మిస్ అండ్ మిసెస్ ఇండియా, రాయల్ మిస్టర్ ఇండియా వేడుకలను ఈ నెల 29, 30 తేదీల్లో సోమాజీగూడలోని ది పార్కు హోటల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ బిల్డింగ్స్‌లో సోమవారం సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఫౌండర్ అండ్ డైరెక్టర్స్ స్నేహల్‌తో పాటు క్రాంతి, సబీనా, రిని, చతుర్వేది హాజరై వివరాలను వెల్లడించారు. జేసీఐ సికింద్రాబాద్ ప్యారడైజ్ మద్దతులో ఎస్ఎస్‌కే క్రియేషన్స్ ఆధ్వర్యంలో గ్లోరియస్ మిస్ అండ్ మిసెస్ ఇండియా, రాయల్ మిస్టర్ ఇండియా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది కేవలం అందాల పోటీ కాదని, ఇది ఒక లక్ష్యంతో ఏర్పడిన మిషన్ అని పేర్కొన్నారు. ఉమంగ్ ఫౌండేషన్, భారత సైన్యంతో కలిసి దేశ సరిహద్దు ప్రాంతాల్లోని పిల్లల కోసం పాఠశాలలు నిర్మించేందుకు నిధులు సమీకరిస్తున్నామన్నారు. పది సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా తెలంగాణ జేసీఐ తరపున పాఠశాలల అభివృద్ధికి నిధుల సమీకరణ చేపడుతున్నామన్నారు. కాగా ఈ కార్యక్రమంలో అందాల భామలు ర్యాంప్‌వ్యాక్ చేసి ఆకట్టుకున్నారు.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
29-4-2025

'పద్మభూషణ్' శ్రీజేశ్... 'పద్మశ్రీ' అశ్విన్...

భారత పురుషుల హాకీ జట్టు మాజీ కెప్టెన్, మేటి గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ (కేరళ) దేశ అత్యున్నత మూడో పౌర పురస్కారం 'పద్మభూషణ్'ను... భారత మేటి క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ (తమిళనాడు) దేశ అత్యున్నత నాలుగో పౌర పురస్కారం 'పద్మ శ్రీ'ని స్వీకరించారు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. 1956లో ధ్యాన్‌చంద్ తర్వాత 'పద్మభూషణ్' అవార్డు గెల్చుకున్న రెండో హాకీ ప్లేయర్ శ్రీజేశే కావడం విశేషం. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు నెగ్గిన భారత హాకీ జట్టుకు శ్రీజేశ్ గోల్‌కీపర్‌గా వ్యవహరించాడు. మరోవైపు అశ్విన్ భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో కలిపి మొత్తం 287 మ్యాచ్‌లు ఆడి 665 వికెట్లు పడగొట్టాడు.





"చాలా ఆనందంగా ఉంది. ఐపీఎల్‌లో ఆడిన మూడో ఇన్నింగ్స్‌లోనే సెంచరీ చేయడం సంతోషం. మూడు, నాలుగు నెలల నుంచి పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కింది. నేను బౌలర్లు ఎవరనే విషయాన్ని పెద్దగా పట్టించుకోను. కేవలం బంతి మీదే దృష్టి పెడతా. యశస్వి జైస్వాల్‌తో కలిసి బ్యాటింగ్ చేయడం సౌకర్యవంతంగా ఉంటుంది. అవసరమైనప్పుడు సలహాలు ఇవ్వడంతో పాటు ఆత్మవిశ్వాసం నింపుతాడు. టీంతో బ్యాటింగ్ చేయడం సులువవుతుంది. ఐపీఎల్‌లో సెంచరీ చేయాలన్నది నా కల. క్రీజులో అడుగు పెట్టాక భయపడను. అసలు వేరే ఏ అంశాలను పట్టించుకోను. కేవలం నా ఆటపైనే దృష్టి పెడతా.

-వైభవ్ సూర్యవంశీ

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వైభవ్

విధ్వంసంలో వైభవం



కళ్లు చెదిరే ఆటతో చరిత్రకెక్కిన వైభవ్ సూర్యవంశీ

- ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (17 బంతుల్లో), సెంచరీ (35 బంతుల్లో) చేసిన భారత ప్లేయర్‌గా రికార్డు
- 210 పరుగుల లక్ష్యం 15.5 ఓవర్లలోనే ఉఫ్
- 8 వికెట్ల తేడాతో రాజస్తాన్ జయభేరి

సచిన్ వేగాన్ని ఆరాధించాం. సెహ్వాగ్ దూకుడును చూశాం. రో'హిట్స్'ను ఆస్వాదించాం. కోహ్లి 'షో'కు ముచ్చటపడ్డాం. వీళ్లందరూ ప్రొఫెషనల్ క్రికెటర్లు. కానీ వైభవ్ సూర్యవంశీ మాత్రం కాదు. 14 ఏళ్ల ఈ కుర్రాడు ఓ అనామకుడు. ఇంకా చెప్పాలంటే ఈ మ్యాచ్‌కు ముందు బహుశా చాలా మందికి అతనెవరో తెలియదు. కానీ తెలుసుకుంటారు. నెట్టింట గూగుల్‌లో సెర్చ్ చేస్తారు. 'లైక్'లు కొట్టే షాట్లను ఫోన్ కెమెరాల్లో బంధించారు. 'షేర్' చేసే సమయం ఇవ్వనంతగా సిక్స్‌ల 'షో' చూశారు. 35 బంతుల సెంచరీకి 'సబ్‌స్క్రయిబ్' అయిపోయారు. ఐపీఎల్ కొత్త వైభవానికి పండగ చేసుకున్నారు.

జైపూర్: ఐపీఎల్ 2008లో పుట్టింది. లీగ్ పుట్టిన మూడేళ్ల (2011లో) తర్వాత లోకం చూసిన బుడ్డాడిని పురుడు పోసిన కొద్దిమందే చూశారు! 14 ఏళ్ల తిరిగేసరికి ఇప్పుడా కుర్రాడిని మొత్తం క్రికెట్ ప్రపంచమే చూసి మురిసింది. అ బుడ్డాడు... ఇప్పటి కుర్రాడు... వైభవ్ సూర్యవంశీ. ఐపీఎల్‌లో అతనొక సంచలనం. బ్యాటింగ్ మెరుపులకే వైభోగం. క్రికెట్ ప్రేక్షకులకి కనుల పండగ అతని శతకం. బంతి సిక్స్‌లకే ఫిక్స్ అయినట్లు... అతని బ్యాట్ షాట్‌లకే అలవాటైనట్లు... అతని 'షో'కు బంతులన్నీ దాసోహమైనట్లు అలవోకగా ఆడేశాడు. వైభవ్ (38 బంతుల్లో 101; 7 ఫోర్లు, 11 సిక్స్‌లు) శతకానికి జైపూర్‌లో నిశిరాతిరి కూడా వెలుగులు విరజిమ్మింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీస్కోరు చేసింది. శుబ్‌మన్ గిల్ (50 బంతుల్లో 84; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), జోస్ బట్లర్ (26 బంతుల్లో 50 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. అనంతరం రాజస్తాన్ రాయల్స్ 15.5 ఓవర్లలోనే కేవలం రెండే



యశస్వి జైస్వాల్

వికెట్లు కోల్పోయి 212 పరుగులు చేసి గెలిచింది. యశస్వి జైస్వాల్ (40 బంతుల్లో 70 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగాడు.

ఫిఫ్టీలో 48 పరుగులు... సిక్స్‌లు, ఫోర్లతోనే...

పెద్ద లక్ష్యం... ఛేదించడం కష్టం... ఇలాంటి పరిస్థితుల మధ్య పరుగుల వేట మొదలుపెట్టిన యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ పరుగుల ఉప్పెన చూపెట్టారు. ముఖ్యంగా 14 ఏళ్ల వైభవ్ ఆట ఆసాంతం హైలైట్స్‌నే తలపించింది. సూర్యవంశీ షాట్ల ఎంపిక, సిక్స్‌ల తుఫాన్ ఒక్క మైదానాన్నే కాదు... క్రికెట్ ప్రపంచాన్నే తనవైపు తిప్పుకుంది. జైస్వాల్ పరుగుతో మొదలైన తొలిఓవర్ వైభవ్ సిక్సర్‌తో ఊపందుకుంది. రెండో ఓవర్లో యశస్వి సిక్స్ బాదడంతో రెండు ఓవర్లలో 19 పరుగులు వచ్చాయి. కానీ ఆ తర్వాతే విధ్వంసరచన మొదలైంది. సిరాజ్ మూడో ఓవర్లో జైస్వాల్ 3 ఫోర్లు కొట్టాడు. 3 ఓవర్లలో జట్టు స్కోరు 32. అప్పటికింకా వైభవ్ (9) పది పరుగులైనా చేయలేదు. ఇషాంత్ నాలుగో ఓవర్‌తో అతని షో మ్యాచ్ రూపాన్ని మార్చింది. 6, 6, 4, 0, 6, వైడ్, వైడ్, 4లతో ఏకంగా 28 పరుగులు పిండుకున్నాడు. తర్వాత ఐదో ఓవర్లో జైస్వాల్ బౌండరీ, సింగిల్ తీసివ్వగా, వైభవ్ 6, 0, 6, 4... ఈ బౌండరీతోనే 17 బంతుల్లోనే అతని ఫాస్టెస్ట్ అర్ధసెంచరీ అది కూడా ఐదో ఓవర్లోనే పూర్తయ్యింది. ఇందులో 3 బౌండరీలు, 6 సిక్స్‌లు అంటే 48 పరుగులు మెరుపులే! ఇలా 'పవర్ ప్లే'నే పరుగెత్తుకున్న చందంగా, బౌండరీ లైన్-బంతి ముద్దు ముచ్చటలాడిన విధంగా అతని విధ్వంసం సాగింది.

35 బంతుల్లో భారతీయ శతకం

రాయల్స్ జట్టు 6 ఓవర్లలో 87/0 స్కోరు చేసింది. జైస్వాల్ కొట్టిన వరుస బౌండరీలతో ప్రసిద్ కృష్ణ 8వ ఓవర్లో జట్టు స్కోరు వందను దాటింది. ఇంకా డజను ఓవర్లు మిగిలివుంటే చేయాల్సిన లక్ష్యం (102) సగం కంటే తక్కువగా కరిగింది. ఐపీఎల్ అరంగేట్రం చేసిన కరీమ్ జనత్ వేసిన పదో ఓవర్లో అయితే వైభవ్ వీర బాదుడికి సిక్స్, ఫోర్ పోటీపడినట్లుగా అనిపించింది. 6, 4, 6, 4, 4, 6లతో 30 పరుగుల్ని రాబట్టాడు. 10 ఓవర్లలో 144/0 స్కోరు చేసింది. రషీద్‌ఖాన్ వేసిన మరుసటి ఓవర్లోనే మిడ్‌వికెట్ మీదుగా బాదిన సిక్స్‌తో వైభవ్ సెంచరీ 35 బంతుల్లోనే పూర్తయ్యింది. గేల్ (30 బంతుల్లో) తర్వాత ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన శతకం కాగా... భారత ఆటగాడు కొట్టిన తొలి ఫాస్టెస్ట్ సెంచరీగా పుటలకెక్కింది. 12వ ఓవర్లో వైభవ్‌ను బౌల్డ్ చేయడం ద్వారా ప్రసిద్ కృష్ణ తొలివికెట్‌ను తీశాడు. 166 పరుగుల ఓపెనింగ్ వికెట్‌కు తెరపడింది. నితీశ్ (4) విఫలమైనా... మిగతా లాంఛనాన్ని జైస్వాల్, కెప్టెన్ రియాన్ పరాగ్ (15 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా అంతే వేగంగా ముగించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) పరాగ్ (బి) తీక్షణ 39; గిల్ (సి) పరాగ్ (బి) తీక్షణ 84; బట్లర్ (నాటౌట్) 50; వాషింగ్టన్ సుందర్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ 13; తెవాటియా (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆర్చర్ 9; షారుఖ్ ఖాన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 209. **వికెట్ల పతనం:** 1-93, 2-167, 3-193, 4-202. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-49-1, తీక్షణ 4-0-35-2, యుద్వీర్ 3-0-38-0, సందీప్ శర్మ 4-0-33-1, పరాగ్ 1-0-14-0, హసరంగ 4-0-39-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 70; వైభవ్ (బి) ప్రసిద్ కృష్ణ 101; నితీశ్ రాణా (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ ఖాన్ 4; పరాగ్ (నాటౌట్) 32; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15.5 ఓవర్లలో 2 వికెట్లకు) 212. **వికెట్ల పతనం:** 1-166, 2-171. **బౌలింగ్:** సిరాజ్ 2-0-24-0, ఇషాంత్ 2-0-36-0, సుందర్ 1.5-0-34-0, ప్రసిద్ కృష్ణ 4-0-47-1, రషీద్ 4-0-24-1, కరీమ్ 1-0-30-0, సాయి కిషోర్ 1-0-16-0.

వైభవ్ సూర్యవంశీ రికార్డులు

- టి20 క్రికెట్ చరిత్రలో సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా వైభవ్ (14 ఏళ్ల 32 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు భారత్‌కే చెందిన మహారాష్ట్ర ప్లేయర్ విజయ్ జోల్ (18 ఏళ్ల 118 రోజులు; ముంబైపై 2013లో) పేరిట ఉంది.
- ఐపీఎల్‌లో అర్ధ సెంచరీ, సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా వైభవ్ ఘనత వహించాడు. గతంలో అర్ధ సెంచరీ రికార్డు రియాన్ పరాగ్ (17 ఏళ్ల 175 రోజులు; 2019లో) పేరిట, సెంచరీ రికార్డు మనీశ్ పాండే (19 ఏళ్ల 253 రోజులు; 2009లో) పేరిట నమోదయ్యాయి.
- ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారతీయ ప్లేయర్‌గానూ వైభవ్ గుర్తింపు పొందాడు. యూసుఫ్ పఠాన్ (37 బంతుల్లో ముంబై ఇండియన్స్‌పై 2010లో) పేరిట ఉన్న రికార్డును వైభవ్ బద్దలు కొట్టాడు. క్రిస్ గేల్ (30 బంతుల్లో 2013లో పుణే వారియర్స్‌పై) తర్వాత ఐపీఎల్‌లో రెండో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్ వైభవే కావడం విశేషం.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
బెంగళూరు	10	7	3	0	14	0.521
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
లక్నో	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	9	3	5	1	7	0.212
రాజస్తాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	9	2	7	0	4	-1.302

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × కోల్‌కతా
వేదిక: ఢిల్లీ

రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

సింగిల్ కథ వింటున్నప్పుడు పగలబడి నవ్వుతూనే ఉన్నా

- అల్లు అరవింద్



ఇవానా, కార్తీక్ రాజు, అల్లు అరవింద్, శ్రీవిష్ణు, కేతికా శర్మ

''#సింగిల్ సినిమా కథ వింటున్నప్పుడు పగలబడి నవ్వుతూనే ఉన్నాను. దర్శకుడు కార్తీక్ అంత అద్భుతంగా చెప్పారు. ఈ సినిమాలో శ్రీ విష్ణు, 'వెన్నెల' కిశోర్ కనిపించినప్పుడు నవ్వులు మామూలుగా ఉండవు. '#సింగిల్' ఈ సమ్మర్‌కి యాప్ట్ అయ్యే సినిమా. ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్స్‌లో ఎంజాయ్ చేసే సినిమా ఇది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. శ్రీవిష్ణు హీరోగా కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన చిత్రం '#సింగిల్'. కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించగా, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్ర పోషించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం మే 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో **అల్లు అరవింద్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా ట్రైలర్‌లో కాక్రోచ్ థియరీ వినిపించింది. ఎవరు కూడా అపార్థం చేసుకోకూడదు. అటామిక్ బాంబు పేలినా కూడా బతకగలిగే రెజిలియన్స్ ఉన్న జీవి కాక్రోచ్. ఆ రెజిలియన్స్ క్వాలిటీ గురించి చెప్పడానికే అలా డైలాగ్ (వాళ్ళు లేడీస్ రా.. అంటే కాక్రోచ్స్.. వాళ్ళు చచ్చిపోరు.. మనల్ని చంపుతారు) వాడడం జరిగింది. విశాల్ చంద్రశేఖర్ మా సినిమాకు సంగీతం అందించడం సంతోషంగా ఉంది'' అన్నారు. ''ఆడియన్స్‌ను కడుపుబ్బా నవ్వించాలనే ప్రయత్నంతో ఈ సినిమా చేశాం'' అని తెలిపారు శ్రీవిష్ణు. ''ఈ సినిమాతో గీతా ఆర్ట్స్‌కి ఒక కొత్త జనరేషన్ స్టార్ట్ అయ్యింది.. అందరి సపోర్ట్ కావాలి'' అన్నారు నిర్మాత బన్నీ వాసు. ''శ్రీవిష్ణుగారితో పనిచేయడం ప్రౌడ్ మూమెంట్. అరవింద్ గారితో వర్క్ చేయడం నా అదృష్టం'' అన్నారు కార్తీక్ రాజు. ''మంచి వినోదాత్మక సినిమా ఇది'' అన్నారు విద్యా కొప్పినీడి, భానుప్రతాప్. ఈ వేడుకలో 'వెన్నెల' కిశోర్, మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ చంద్రశేఖర్ మాట్లాడారు.

బాహుబలి రిటర్న్స్



అనుష్క, ప్రభాస్

వెండితెరపైకి బాహుబలి తిరిగొస్తున్నాడు. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన బ్లాక్‌బస్టర్ మూవీ 'బాహుబలి'. అనుష్కా శెట్టి, తమన్నా, రానా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలైన సంగతి తెలిసిందే. తొలిభాగం 'బాహుబలి: ది బిగినింగ్' 2015 జూలై 10న, రెండోభాగం 'బాహుబలి: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న విడుదలయ్యాయి. ఈ రెండు చిత్రాలూ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. కాగా ఈ ఏడాది అక్టోబరులో 'బాహుబలి' సినిమాను రీ-రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతల్లో ఒకరైన శోభు యార్లగడ్డ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ''ఈ ఏడాది అక్టోబరులో 'బాహుబలి' సినిమాను రీ-రిలీజ్ చేయనున్నాం. ఇండియాలోనే కాదు.. ఇంటర్‌నేషనల్‌గా కూడా ఈ రీ-రిలీజ్ ఉంటుంది. కొన్ని సర్‌ప్రైజ్‌లూ ఉంటాయి. బాహుబలి రిటర్న్స్'' అంటూ ఆయన పేర్కొన్నారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్' సినిమా విడుదలై ఎనిమిదేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రీ రిలీజ్ విషయాన్ని మేకర్స్ వెల్లడించినట్లు తెలుస్తోంది. అయితే రీ-రిలీజ్ విడుదల తేదీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు మేకర్స్.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పద్మభూషణ్ అవార్డు అందుకుంటున్న హీరో అజిత్ కుమార్



పద్మభూషణ్ అవార్డు అందుకుంటున్న దర్శకుడు శేఖర్ కపూర్

సరికొత్తగా...



డింపుల్ హయతి

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించనున్నారు. లక్ష్మీ రాధా మోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. శర్వానంద్ కెరీర్‌లోని ఈ 38వ సినిమా 1960ల కాలం నాటి నేపథ్యంతో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్రల సరిహద్దు ప్రాంతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ఉంటుంది. కాగా ఈ సినిమాలోని ఓ కీలక పాత్రకు హీరోయిన్ డింపుల్ హయతిని ఎంపిక చేసినట్లు సోమవారం చిత్రయూనిట్ ప్రకటించింది. ఆమె సరికొత్త పాత్రలో కనిపిస్తారని, కథలో చాలా ముఖ్యమైన పాత్రను డింపుల్ చేయనున్నారని చిత్రబృందం పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

పవర్‌ఫుల్ పాత్రలో...



చార్మీ కౌర్, విజయ్ కుమార్, పూరి జగన్నాథ్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. ఈ సినిమాలో కన్నడ నటుడు విజయ్ కుమార్ నటించనున్నారు. బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శ కత్వం వహించిన 'వీరసింహారెడ్డి'(2023) చిత్రంలో విజయ్ కుమార్ విలన్‌గా తనదైన నటనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక.. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించనున్న ఈ చిత్రంలో నటి టబు కీలక పాత్ర పోషించనున్నారు. కాగా ఈ చిత్రంలో విజయ్ కుమార్ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, పూరి జగన్నాథ్, చార్మీ కౌర్‌లతో విజయ్ కలిసి ఉన్న ఫొటోని విడుదల చేశారు. ''పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబోలో వస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇది. ఈ చిత్రంలో విజయ్ కుమార్ పవర్ ఫుల్ పాత్రని పోషించనున్నారు. విజయ్ సేతుపతి ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రలో కనిపించబోతున్నారు. జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సీఈఓ: విషు రెడ్డి. ఇదిలా ఉంటే.. ఈ మూవీకి 'బెగ్గర్' అనే టైటిల్ అనుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

నమస్కారం సర్.. నా పేరు ముత్తయ్య



'బలగం' సుధాకర్ రెడ్డి

'నమస్కారం సర్.. నా పేరు ముత్తయ్య. నేను నాటకాలు బాగా వేస్తాను సర్.. డైలాగులు కూడా బాగా చెబుతాను.. నాకు ఏదైనా చిన్న వేషం ఉంటే ఇప్పించండి' అంటూ 'బలగం' సుధాకర్ రెడ్డి డైలాగ్‌తో 'ముత్తయ్య' సినిమా ట్రైలర్ ఆరంభమైంది. 'బలగం' సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ముత్తయ్య'. భాస్కర్ మౌర్య దర్శకత్వం వహించారు. హైలైఫ్ ఎంటర్‌టైన్మెంట్, ఫిక్షనరీ ఎంటర్‌టైన్మెంట్ ఎల్ఎల్‌పీ బ్యానర్లపై వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 1 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రముఖ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, ప్రొడ్యూసర్ శోభు యార్లగడ్డ విడుదల చేశారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: దివాకర్ మణి, అసోసియేట్ నిర్మాత: హేమంత్ కుమార్ సీఆర్, కెమేరా: దివాకర్ మణి, సంగీతం: కార్తీక్ రోడ్రిగ్స్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వెంకట్ కృష్ణ.

ప్రేమ... త్యాగం



భవ్యశ్రీ, హరికృష్ణ

ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల నేపథ్యంలో టీఎస్ఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తిరుపతి శ్రీనివాసరావు ఓ చిత్రం నిర్మిస్తున్నారు. ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరికృష్ణ హీరోగా, భవ్య శ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆదినారాయణ పినిశెట్టి మాట్లాడుతూ–''వైవిధ్యమైన ప్రేమ కథను ఈ సినిమాలో చూపించనున్నాం. గతంలో ఈ బ్యానర్‌లో రూపొందిన 'తికమక తాండ, కోబలి' చిత్రాలకు ఆదరణ లభించింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మూడో చిత్రం కూడా అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు. ''కంటెంట్ బాగా నచ్చి ఈ సినిమా నిర్మిస్తున్నాను'' అని తిరుపతి శ్రీనివాసరావు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ రవిరామ్, కెమేరా: విపిన్ వి.రాజ్

క్రైమ్... థ్రిల్



వంశీ కృష్ణ

వంశీ కృష్ణ, రియాజ్ ఖాన్, దినేష్, కలాసి సెల్వన్, గాయత్రి రీమ తదితరులు నటించిన తమిళ చిత్రం 'రాక్కదన్'. బేబీ బి. దివిష శ్రీ, మాస్టర్ ఆశ్రిత్ సమర్పణలో కె. హైమావతి తెలుగులో 'క్రిమినల్ 123' పేరుతో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. కె.గీత ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. దినేష్ కలై దర్శకత్వంలో రూపొందింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 'క్రిమినల్ 123'ని కేజేఆర్ పిక్చర్స్ రామకృష్ణ, కిశోర్, జయబాబు విడుదల చేయనున్నారు. ''మంచి క్రైమ్ థ్రిల్లర్‌గా తమిళంలో 'రాక్కదన్' విజయం సొంతం చేసుకుంది. మే మొదటి వారంలో విడుదల కానున్న తెలుగు వెర్షన్ కూడా ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.



కొత్త పింఛన్లలో

దివ్యాంగులకు, వితంతువులకు ప్రాధాన్యం

అర్హులను గుర్తించాలని సెర్ప్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

సాక్షి, హైదరాబాద్ : కొత్త పింఛన్ల కేటాయింపులో దివ్యాంగులు, వితంతువులకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని సోమవారం అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించినట్టు సమాచారం. కొత్త పింఛన్ల కోసం గతం నుంచే 5.20 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇదీ నేపథ్యం...

కొంతకాలంగా కొత్త పింఛన్ల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వివిధ స్థాయిల్లో అధికారులందరికీ వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర కేటగిరీల వారు మొరపెట్టుకుంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ పరంగా నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల కోసం మాత్రమే దరఖాస్తులు స్వీకరించినా, పింఛన్ల కోసం కూడా పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలోనూ పింఛన్ల కోసం దరఖాస్తు చేస్తున్నవారు కూడా పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. కొత్త పింఛన్ల దరఖాస్తునకు సంబంధించి 2022 ఆగస్టు నుంచి ఆసరా పింఛన్ల ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులో లేకుండా పోయింది. మూడున్నరేళ్లుగా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వివిధ కేటగిరీల వారు నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన పేరిట వివిధ వర్గాల ప్రజల నుంచి తీసుకుంటున్న దరఖాస్తులు, ఇతర రూపాల్లో వచ్చిన వినతులు కలిపితే చేయూత పింఛన్ల కోసం వచ్చినవే ఆరు లక్షల దాకా ఉన్నట్టుగా అధికార వర్గాల సమాచారం.

ప్రస్తుతం వివిధ కేటగిరీల కింద పింఛన్లు పొందుతున్న వారు..

కేటగిరీ	పింఛన్ (నెలకు రూ.)	లబ్ధిదారులు
వృద్ధులు	2,016	15,18,021
వితంతువులు	2,016	15,22,550
దివ్యాంగులు	4,016	4,90,044
బీడీ కార్మికులు	2,016	4,22,425
ఒంటరి మహిళలు	2,016	1,40,456
గీత కార్మికులు	2,016	62,635
నేత కార్మికులు	2,016	35,623
ఎయిడ్స్ రోగులు	2,016	34,254
బోదకాలు బాధితులు	2,016	17,403
డయాలసిస్ రోగులు	2,016	4,105
బీడీ టేకేదార్లు	2,016	3,825

సామాజికవర్గం వారీగా పింఛన్‌దారులు

సామాజికవర్గం	సంఖ్య (లక్షల్లో)	శాతం
బీసీలు	23.30	54.8
ఎస్సీలు	6.72	15.8
ఓసీలు	6.19	14.6
ఎస్టీలు	3.46	8.1
మైనార్టీలు	2.83	6.7



వరల్డ్ రికార్డ్స్‌తో విజయోత్సవ సభ

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో

కూచిపూడి నృత్యం

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలుగువారి సొంతమైన కూచిపూడి శాస్త్రీయ నృత్యం అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతలు సాధించడమే కాకుండా ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చెరగని స్థానం సంపాదించుకుంది. ప్రఖ్యాత జాతీయ సాంస్కృతిక సంస్థ 'భారత్ ఆర్ట్స్ అకాడమీ' ఇందుకు పూనుకోవడం విశేషం. భారత్ ఆర్ట్స్ అకాడమీ 24 డిసెంబర్ 2023లో హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 400 మంది కూచిపూడి నాట్యగురువులు తమ 4,218 మంది శిష్యులతో ఒకేసారి ఏకధాటిగా 15 నిమిషాలపాటు కూచిపూడి జనుత శబ్దం అంశాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశిష్ట అతిథులు, ప్రేక్షకుల సమక్షంలో అత్యంత అద్భుతంగా కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించడంతో భారత్ ఆర్ట్స్ అకాడమీ పేరును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు ప్రకటించారు. సదరు పత్రాన్ని ముఖ్యఅతిథుల చేతులమీదుగా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు లయన్ డాక్టర్ కె.వి.రమణారావు, లయన్ లలితరావులకు అందజేశారు. ఇటీవలే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుంచి సంబంధిత ఒరిజినల్స్ అందడంతో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో అతిథుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ జ్ఞాపికలు, కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

30న శ్రీవారి సేవ

ఆన్‌లైన్ కోటా విడుదల

అమల్లోకి కొత్తగా గ్రూప్ లీడర్ సేవ



తిరుమల: శ్రీవారి సేవ జూన్ నెల ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 30న టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. శ్రీవారి సేవ నాణ్యతను మెరుగుపరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు శ్రీ సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు) వంటి ఆధ్యాత్మిక సంస్థలను సందర్శించి అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకువచ్చింది. ఈ మార్పులు ఏప్రిల్ 30న కొత్తగా రూపొందించిన అప్లికేషన్ ద్వారా అమల్లోకి రానున్నాయి. శ్రీవారి సేవ (తిరుమల, తిరుపతి) జనరల్ కోటాను ఉదయం 11 గంటలకు, నవనీత సేవ (మహిళలకు మాత్రమే) మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ (పురుషులకు మాత్రమే) మధ్యాహ్నం ఒంటి గంటకు, గ్రూప్ లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించిన సేవ) మధ్యాహ్నం 2 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

గ్రూప్ లీడర్లుగా సీనియర్ సేవకులు

గ్రూప్ లీడర్స్‌గా పిలిచే ఈ సేవకు 45–70 ఏళ్లలోపు ఉన్న వారు తమ పేరును నమోదు చేసుకోవచ్చు. వీరు 15 రోజులు, నెల లేదా 3 నెలల వ్యవధిలో సేవ చేయడానికి ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. వీరు శ్రీవారి సేవకుల పనిని పర్యవేక్షించడం, సేవకు వచ్చిన వారి హాజరు తీసుకోవడం, ప్రతి ఒక్క సేవకుని/సేవకురాలి పనితీరును మూల్యాంకనం చేయడం వంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాగే, కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన పురుషులకు పరకామణి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చని తెలిపింది.

భూదాన్ భూముల కేసులో ఈడీ మెరుపు దాడులు

- నిందితుల ఇళ్లపై వేకువజాము నుంచి సాయంత్రం దాకా ఏకకాలంలో సోదాలు
- రూ. 9.5 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, కీలక పత్రాలు, సుమారు 40 లగ్జరీ కార్లు స్వాధీనం
- ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అమోయ్ కుమార్ సహా పలువురిని విచారించిన ఈడీ



తనిఖీల కోసం యాకుత్‌పురాలోని షర్ఫన్ ఇంట్లోకి వెళ్తున్న ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో భూదాన్ యజ్ఞ బోర్డు భూముల కుంభకోణానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం హైదరాబాద్ పాతబస్తీలో మెరుపు దాడులు చేపట్టారు. మీర్‌పేట్, విరాట్‌నగర్, సంతోష్‌నగర్, యాకుత్‌పురాతోపాటు మొయినాబాద్, బంజారాహిల్స్‌లో నివసిస్తున్న నిందితులు షర్ఫన్, మునావర్‌ఖాన్, ముజఫర్ హుస్సేన్‌ఖాన్, ఖదీరున్నీసా, ఎంఏ సుకూర్ ఇళ్లలో సీఆర్పీఎఫ్ బలగాల రక్షణతో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పదుల సంఖ్యలో అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సుకూర్ ఇంట్లోంచి రూ. 9.5 లక్షల నగదు, మునావర్ ఖాన్‌కు చెందిన సుమారు 40 ఖరీదైన కార్లు, భూదాన్ భూముల ఆస్తుల పత్రాలతోపాటు మరికొందరి ఇళ్ల నుంచి విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 181లోని భూదాన్ భూముల్లో 42 ఎకరాల 33 గుంటల అక్రమ రిజిస్ట్రేషన్‌పై మెహదీపట్నానికి చెందిన దస్తగిర్ షరీఫ్ అనే వ్యక్తి రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు 2023లో మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఇందులో మనీలాండరింగ్ కోణంపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్, మహేశ్వరం మాజీ ఆర్డీఓ వెంకటాచారి, మాజీ తహసీల్దార్ జ్యోతిని గతేడాది అక్టోబర్‌లోనే విచారించిన ఈడీ.. ఇప్పటివరకు సేకరించిన ఆధారాల మేరకు సోమవారం మళ్లీ సోదాలు చేపట్టింది.

ఫేషియల్ రికగ్నిషన్ హాజరుతో ఆందోళన వద్దు

- దీనితో అధ్యాపకుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగదు
- ఎన్ఎంసీ దేశవ్యాప్తంగా అమలు చేస్తోంది
- డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మే ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్న ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ముఖ హాజరు విధానం)పై భయాందోళనలు అక్కర్లేదని రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. ఈ విధానం అమలును నిలిపేయాలంటూ తెలంగాణ ప్రభుత్వ వైద్య కళాశాలల అధ్యాపకులు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ)తోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసిన నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు ఉన్న బయో మెట్రిక్ విధానం స్థానంలో ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్ఎంసీ ఈనెల 16న దీనికి సంబంధించి సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. ఈ విధానంలో వైద్యుల వ్యక్తిగత గోప్యతకు ఏమాత్రం భంగం కలగదని పేర్కొన్నారు. ముఖహాజరు విధానం అమలు చేయాలనే నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్ఎంసీ ఈ విధానాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తోందని తెలిపారు. కొన్ని వైద్య కళాశాలల్లో హాజరు విషయంలో అక్రమాలు జరుగుతున్నట్లు తెలియడంతో, ఎన్ఎంసీ ముఖహాజరు విధానాన్ని అమల్లో తీసుకువచ్చిందన్నారు. ఇందులో వంద శాతం కచ్చితత్వం ఉంటుందన్నారు.

ఐఏఎస్‌లు పరుగులు పెట్టాల్సిందే

- ప్రభుత్వ లక్ష్యాల సాధనకే కొత్త సీఎస్ నేతృత్వంలో కొత్త జట్టు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, లక్ష్యాలకు తగ్గట్టుగా ఫలితాల సాధన కోసం ఐఏఎస్ అధికారులందరూ ఉరుకులు పరుగులు పెట్టాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సత్వర సాధనలో భాగంగానే తాజాగా భారీ సంఖ్యలో సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసి పలు కీలక శాఖలకు కొత్త కార్యదర్శులను నియమించామని చెప్పారు. ఆదివారం బదిలీ అయిన పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో సోమవారం నగరంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్త సీఎస్ నేతృత్వంలో రాష్ట్ర పాలన యంత్రాంగం అత్యంత సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా కొత్త జట్టుకు రూపకల్పన చేశామని సీఎం చెప్పారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ నది ప్రక్షాళన, పట్టణాభివృద్ధి, ఇందిరమ్మ గృహ నిర్మాణం వంటి ప్రభుత్వ ప్రాధాన్య అంశాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అన్నారు. కాగా కొందరు జూనియర్ ఐఏఎస్ అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.


కొత్త సీఎస్‌గా నియమితులైన నేపథ్యంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రామకృష్ణారావు

సరిహద్దుల్లోనూ ఇంత ఉద్రిక్తత లేదు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య
- అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కొనసాగింపు



సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ విషయంలో ఉన్నంత ఉద్రిక్తత సరిహద్దుల్లోనూ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏపీ మద్యం అమ్మకాల వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల తరఫు సీనియర్ న్యాయవాదులను ఉద్దేశించి జస్టిస్ పార్దీవాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం పక్షాన ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా.. పిటిషనర్ పీవీ మిథున్‌రెడ్డి తరఫున అభిషేక్ మను సింఘ్వి, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేయడానికి తమకు రెండు వారాల సమయం కావాలని సింఘ్వి కోరారు. అప్పటివరకు కేసు విచారణ చేపట్టొద్దని విజ్ఞప్తి చేశారు. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి ధర్మాసనం మూడు వారాల పాటు గడువు ఇచ్చినప్పటికీ.. బెయిల్ పిటిషన్‌ను రోహత్గీ వ్యతిరేకిస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. తమకు కౌంటర్ అఫిడవిట్ ఇవ్వకుండా ప్రభుత్వ తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం .. ఈ వ్యవహారంలో పిటిషనర్ మిథున్‌రెడ్డి విచారణాధికారి ముందు హాజరయ్యారా? మిమ్మల్ని ప్రశ్నించారా? అని అడిగింది. ఇప్పటికే విచారణకు హాజరయ్యారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. అనంతరం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు ఆయనను అరెస్ట్ చేయొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణను ధర్మాసనం కొనసాగించింది.

ఐఐఎం కోల్‌కతా ఆధ్వర్యంలో

'సెర్ప్' సిబ్బందికి శిక్షణ

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ మహిళల జీవనోపాధి పెంపుదల, పేదరిక నిర్మూలనకు అనుసరించాల్సిన వ్యూహాలపై గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కోల్‌కతా ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో ఆయా అంశాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. జిల్లా అదనపు డీఆర్డీవోలు, ప్రాజెక్ట్ మేనేజర్లు మొత్తం 70 మంది ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ శిక్షణ పొందుతున్న వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున వ్యయం అవుతున్నట్టు అధికారవర్గాల సమాచారం. ఇక్కడ శిక్షణ పొందిన అధికారులు.. మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి క్షేత్రస్థాయి వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. సెర్ప్ సిబ్బందికి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు సోమవారం మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో మహిళా సాధికారత లక్ష్యసాధనతో పాటు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకెళుతున్నట్టుగా సీతక్క వెల్లడించారు.

నేడు బీజేపీ పదాధికారులు, జిల్లా అధ్యక్షుల భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్వహిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈ భేటీలో బీజేపీ సంఘటన–సంరచన కార్యక్రమంతో పాటు రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ హాజరవుతారని తెలిపారు. సోమవారం ప్రేమేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏడాదికోసారి సభలతో ప్రజల్లో కనిపించడం, అడ్డగోలుగా మాట్లాడి ప్రజల్లో చర్చకు పురిగొల్పడమే కేసీఆర్ మోడల్ అని మండిపడ్డారు. గతంలో సభలతో విజయం సాధించామనే భ్రమలో మునిగి, ఇప్పుడు కూడా అదే భ్రమలో విహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. వరంగల్ బహిరంగసభతో బీఆర్‌ఎస్‌లో అంతర్గత కల్లోలం ప్రారంభమైందని, ఆ పార్టీలో ఎలాంటి సామాజిక న్యాయం లేదని ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు.


పెద్దకాపర్తి గ్రామంలో బెల్ట్ షాపులను తొలగించాలని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

మా ఊరిలో బెల్ట్ షాపులను తొలగించండి

- నల్లగొండ జిల్లా పెద్దకాపర్తిలో మహిళల డిమాండ్
- గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన

చిట్యాల: తమ గ్రామంలో బెల్ట్‌షాపులను తొలగించాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో మహిళలు ఆందోళనకు దిగారు.బెల్ట్ షాపుల కారణంగా తమ గ్రామంలోని పురుషులు మద్యానికి బానిసలుగా మారి అనారోగ్యానికి గురవుతున్నారని, అంతేకాక తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే గ్రామంలోని బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళలంతా సోమవారం నిరసనకు దిగారు. గ్రామంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్దకాపర్తి గ్రామంలోని బెల్ట్ షాపులను తొలగించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీస్‌శాఖతో పాటు ఎక్సైజ్ శాఖ సహకరించాలని వారు కోరారు. తమ గ్రామంలో సుమారు 13 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయని, వీటిలో నిరంతరాయంగా మద్యం అమ్మకాలను చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలోని కొందరు పురుషులు మద్యానికి డబ్బుల కోసం ఇంట్లో బియ్యంతో పాటు ఇతర వస్తువులను అమ్ముకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మే 5వ తేదీ లోపు గ్రామంలోని బెల్ట్ షాపులను తొలగించాలని, లేనిపక్షంలో పోలీస్‌శాఖ సహకారంతో దాడులు చేస్తామని మహిళలు హెచ్చరించారు.

కారుణ్య డీమ్డ్ వర్సిటీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ 'సస్టైయినబుల్ ఎయిర్ అండ్ స్పేస్ టెక్నాలజీస్'పై ఏప్రిల్ 24 నుంచి 26 వరకు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు ఒకే వేదికపై వచ్చి సస్టైయినబుల్ ఏరోస్పేస్ సిస్టమ్‌లోని పురోగతిపై చర్చించారు. 'ఏరో ఇంజన్ సవాళ్లు–టెక్నాలజీ అభివృద్ధి' అనే అంశంపై ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ రెండ్రోజుల కాన్ఫరెన్స్‌లో 145 పరిశోధన పత్రాలు ప్రదర్శించారు. కాన్ఫరెన్స్‌లో ముఖ్య అతిథులుగా ఇజ్రాయెల్‌లోని ఏరియల్ యూనివర్సిటీ నుంచి ఏషర్ యహలోమ్, డీఆర్‌డీవో అసోసియేట్ డైరెక్టర్ అజయ్ ప్రతాప్, అబుదాబికి చెందిన నెట్జర్ గ్లోబల్ అలయన్స్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఫిలిప్ ఫణికర్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

భద్రకాళి చెరువు పూడికతీతకు టెండర్లు

- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భద్రకాళి చెరువులో పూడికతీత కోసం స్వల్పకాలిక టెండర్లు పిలవాలని మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జలసౌధలో అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. భద్రకాళి చెరువులో 21 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక ఉందని అంచనా వేయగా... ఇందులో 3 లక్షల క్యూబిక్ మీటర్లు భద్రకాళి ఆలయం కోసం వినియోగించుకోనుండగా... మరో 3 లక్షల క్యూబిక్ మీటర్లు ఇటుకల తయారీ పరిశ్రమ తీసుకెళ్లనుందని, ఇక మిగిలిన 15 లక్షల క్యూబిక్ మీటర్లను తీయడానికి స్వల్పకాలిక టెండర్లు పిలవాలని సమావేశంలో నిర్ణయించారు. తొలగించిన పూడికను ప్రభుత్వ భూముల్లో నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినీరెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, పలువురు ఈఎన్సీలు పాల్గొన్నారు.

కొత్త పోలీసు బాస్ ఎవరో?

ఇప్పటికే 8 మంది సీనియర్ ఐపీఎస్‌ల జాబితా యూపీఎస్సీకి పంపిన సర్కార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీసు శాఖకు కొత్త బాస్ ఎవరన్న అంశంపై చర్చ ఊపందుకుంది. పూర్తిస్థాయి డీజీపీ (హెడ్‌ఆఫ్‌పోలీస్ ఫోర్స్–హెచ్‌ఓపీఎఫ్) ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. మొత్తం 8 మంది డైరెక్టర్ జనరల్ (డీజీ) ర్యాంకులోని సీనియర్ ఐపీఎస్‌ల జాబితాను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపింది. అర్హతల ఆధారంగా జాబితాలోంచి ముగ్గురి పేర్లను సూచిస్తూ యూపీఎస్సీ ఆ జాబితాను తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి రానుంది. ఆ ముగ్గురి నుంచి ఒకరిని డీజీపీగా ఎంపిక చేయాల్సి ఉంటుంది. కేంద్రానికి పంపిన జాబితాలో రవిగుప్తా (1990 బ్యాచ్), సీవీ ఆనంద్ (1991 బ్యాచ్), డా.జితేందర్ (1992 బ్యాచ్), ఆప్టే వినాయక్ ప్రభాకర్ (1994 బ్యాచ్), కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి (1994 బ్యాచ్), బి. శివధర్‌రెడ్డి (1994 బ్యాచ్), డా. సౌమ్యా మిశ్రా (1994 బ్యాచ్), శిఖా గోయల్ (1994 బ్యాచ్) పేర్లు ఉన్నాయి. వారిలో ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రవిగుప్తా ఈ ఏడాది డిసెంబర్ 19న రిటైర్ కానున్నారు. సీవీ ఆనంద్‌కు 2028 జూన్ వరకు సర్వీస్ ఉంది. ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న డా.జితేందర్ ఈ ఏడాది సెప్టెంబర్ 6న, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఈ ఏడాది ఆగస్టు 5న పదవీవిరమణ పొందనున్నారు. అదేవిధంగా కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేస్తున్న ఆప్టే వినాయక్ ప్రభాకర్ 2029 అక్టోబర్ వరకు సర్వీస్‌లో ఉండనున్నారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీజీగా కొనసాగుతున్న బి. శివధర్‌రెడ్డి 2026 ఏప్రిల్ 28న పదవీ విరమణ పొందనున్నారు. అదే బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌లు డా.సౌమ్యా మిశ్రా 2027 డిసెంబర్ 30న, శిఖాగోయల్ 2029 మార్చి వరకు సర్వీస్‌లో కొనసాగనున్నారు.

డీజీపీ ఎంపికలో ప్రధానాంశాలివీ ...

- డీజీపీగా బాధ్యతలు స్వీకరించాలంటే ఐపీఎస్‌గా 25 నుంచి 30 ఏళ్ల సర్వీస్ కలిగి ఉండాలి.
- డీజీపీ ఎంప్యానల్‌మెంట్ జాబితా యూపీఎస్సీకి పంపే సమయానికి కనీసం ఆరు నెలల సర్వీస్ మిగిలి ఉండాలి.
- పోలీస్‌శాఖలో ఉత్తమ పనితీరు కనబర్చిన ట్రాక్ రికార్డుతోపాటు శాంతిభద్రతలు, క్రైం ఇన్వెస్టిగేషన్, ఇంటెలిజెన్స్, ఎకనామిక్ అఫెన్స్ వింగ్ వంటి కీలక విభాగాల్లో పనిచేసిన అనుభవం కలిగి ఉండాలి.

స్టాక్ మార్కెట్లు

(సోమవారం రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,006	289
80,218	24,329

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,226	▽	158
డోజోన్స్	39,916	▽	197
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,417	△	2
డాక్స్	22,272	△	29
షాంఘై	3,288	▽	7
నికాయ్	35,840	△	134

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.ల్లో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.90	85.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.10	115.02
€	యూరో	ఎస్‌బీఐ	95.67	98.37
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.85	60.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.46	55.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.52	67.92
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.79	23.32
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.27	24.03
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.78	12.60

అల్ట్రాటెక్ సిమెంట్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 2,475 కోట్లు
- షేరుకి రూ. 77.5 డివిడెండ్



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ గతేడాది(2024–25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి–మార్చి(క్యూ4)లో రూ. 2,475 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,259 కోట్ల లాభం సాధించింది. ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 23,063 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 20,419 కోట్ల ఆదాయం నమోదైంది. ఈ కాలంలో 41.02 మిలియన్ టన్నుల అమ్మకాలు నమోదయ్యాయి. వాటాదారులకు షేరుకి రూ. 77.5 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాలు 135.83 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరాయి. దక్షిణాదిలోని ఇండియా సిమెంట్స్, రస్ అల్ ఖయ్మా, యూఏఈ సంస్థ ఆర్ఏకేడబ్ల్యూసీటీ కొనుగోళ్ల నేపథ్యంలో ఫలితాలు పోల్చతగదని కంపెనీ పేర్కొంది. గతేడాది రూ. 6,040 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 76,699 కోట్లను అధిగమించింది. ఈ కాలంలో ఇతర సంస్థల కొనుగోళ్లు, విస్తరణతో కలిపి వార్షికంగా 42.6 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని జత చేసుకుంది.

ఫలితాల నేపథ్యంలో అల్ట్రాటెక్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం క్షీణించి రూ. 12,018 వద్ద ముగిసింది.

పరిశ్రమలు డీలా..

- మార్చిలో ఐఐపీ 3 శాతంగా నమోదు
- తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల పేలవ పనితీరు



న్యూఢిల్లీ: దేశీ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి స్థిరంగా కొనసాగుతోంది. ఫిబ్రవరిలో నమోదైన 2.7 శాతంతో పోలిస్తే మార్చిలో పెద్దగా మార్పులు లేకుండా 3 శాతంగా నమోదైంది. తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల పేలవ పనితీరు కారణంగా గత ఆర్థిక సంవత్సరం మార్చిలో నమోదైన 5.5 శాతం పోలిస్తే మాత్రం తగ్గింది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఐఐపీ వృద్ధి నాలుగేళ్ల కనిష్టమైన 4 శాతానికి నెమ్మదించింది. 2023–24లో ఇది 5.9 శాతంగా, 2020–21లో ఏకంగా మైనస్ 8.4 శాతంగా నమోదైంది. 2021–22లో 11.4 శాతంగా, 2022–23లో 5.2 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) ప్రకారం ఈ ఏడాది మార్చిలో తయారీ రంగ వృద్ధి 5.9 శాతం నుంచి (వార్షికంగా) 3 శాతానికి, మైనింగ్ ఉత్పత్తి 1.3 శాతం నుంచి 0.4 శాతానికి, విద్యుదుత్పత్తి 8.6 శాతం నుంచి 6.3 శాతానికి నెమ్మదించింది. ఐఐపీ గణాంకాలను 28వ తారీఖున విడుదల చేయడం ఇదే ప్రథమం. ఇప్పటివరకు నెల ముగిసిన ఆరు వారాల తర్వాత ప్రతి నెల 12వ తారీఖున విడుదల చేసేవారు. ఇకపై నాలుగు వారాల తేడాతో ప్రకటిస్తారు.

రూ.1,000 తగ్గిన బంగారం

- ఢిల్లీలో రూ.98,400
- రూ.1,400 పడిపోయిన వెండి ధర



న్యూఢిల్లీ: బలహీన అంతర్జాతీయ సంకేతాలతో పసిడి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నది. సోమవారం ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,000 నష్టపోయి రూ.98,400కు దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం ఇంతే మేర తగ్గి రూ.97,900 వద్ద స్థిరపడింది. యూఎస్–చైనా వాణిజ్య ఉద్రిక్తతలు కొంత చల్లబడుతుండడంతో సురక్షిత సాధనంగా బంగారానికి డిమాండ్ తగ్గుతున్నట్టు అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. కొన్ని రకాల అమెరికా దిగుమతులను 125 శాతం టారిఫ్‌ల నుంచి మినహాయిస్తున్నట్టు గత శుక్రవారం చైనా ప్రకటించడం గమనార్హం. దీనికి తోడు మానిటరీ పాలసీలో తక్షణ మార్పులు అవసరం లేదంటూ యూఎస్ ఫెడ్ అధికారులు ఇచ్చిన సంకేతాలు కూడా బంగారం డిమాండ్‌పై ప్రభావం చూపించినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో మాత్రం బంగారం ఔన్స్‌కు 38 డాలర్ల వరకు పెరిగి 3,336 డాలర్ల వద్ద ఉంది. మరోవైపు ఢిల్లీలో వెండి కిలోకి రూ.1,400 నష్టపోయి రూ.98,500 వద్ద స్థిరపడింది.

ఐఆర్‌ఎఫ్‌సీ లాభం నేలచూపు

- క్యూ4లో రూ. 1,667 కోట్లు
- రూ. 60,000 కోట్ల సమీకరణకు సై




ముంబై: రైల్వే రంగ ఫైనాన్స్ కంపెనీ ఐఆర్‌ఎఫ్‌సీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో ప్రభుత్వ రంగ సంస్థ నికర లాభం 3 శాతం నీరసించి రూ. 1,667 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,717 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,478 కోట్ల నుంచి రూ. 6,723 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 4,761 కోట్ల నుంచి రూ. 5,042 కోట్లకు పెరిగాయి. కాగా.. దేశ, విదేశీ మార్కెట్ల నుంచి రూ. 60,000 కోట్లవరకూ పెట్టుబడులు సమీకరించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. ఇందుకు వీలుగా ప్రయివేట్ ప్లేస్‌మెంట్ లేదా పబ్లిక్ ఇష్యూ ద్వారా పన్నురహిత బాండ్లు, సాధారణ బాండ్లు జారీ చేయనుంది. వీటిలో క్యాపిటల్ గెయిన్ బాండ్లు, ప్రభుత్వ హామీగల బాండ్లు తదితరాలున్నట్లు కంపెనీ పేర్కొంది. వివిధ మార్గాలలో చౌకగా పెట్టుబడులను సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఐఆర్‌ఎఫ్‌సీ షేరు బీఎస్‌ఈలో 1.2% లాభంతో రూ. 127 వద్ద ముగిసింది.

మళ్లీ బుల్ దౌడ్!

- సెన్సెక్స్ 1,006 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 289 పాయింట్లు
- సూచీల ర్యాలీకి రిలయన్స్ మద్దతు
- విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల దన్ను

ముంబై: ప్రైవేటు రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్చి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో స్టాక్ సూచీలు సోమవారం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 1,006 పాయింట్లు పెరిగి 80,218 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 289 పాయింట్లు బలపడి 24,329 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న స్టాక్ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,109 పాయింట్లు ఎగసి 80,322 వద్ద, నిఫ్టీ 316 పాయింట్లు దూసుకెళ్లి 24,355 వద్ద గరిష్టాలు తాకాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



- **బీఎస్‌ఈలో** రంగాల వారీగా సూచీల్లో ఇంధన 3%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 3%, క్యాపిటల్ గూడ్స్ 2%, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకెక్స్, రియల్టీ సూచీలు ఒకటిన్నర శాతం చొప్పున రాణించాయి. ఐటీ షేర్లు ఒత్తిడికి లోనవడంతో ఐటీ ఇండెక్సు 0.19% నష్టపోయింది. మిడ్‌క్యాప్ 1.34% పెరగ్గా, స్మాల్ క్యాప్ సూచీ 0.39 శాతం లాభపడింది.
- మార్చి క్వార్టర్ త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాల ప్రకటనతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రాణించింది. బీఎస్‌ఈలో 5.27% పెరిగి 1,369 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 5.75% బలపడి రూ.1,375 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.92,629 కోట్లు పెరిగి రూ.18.51 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో షేరు వాటాయే 400 పాయింట్లు.
- ఎస్ఎంఎల్ ఇసుజులో రూ.555 కోట్లకు సమానమైన(58.96%) వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 2.50% శాతం పెరిగి రూ.2930 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 3% లాభపడి రూ.2943 వద్ద గరిష్టాన్ని తాకింది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 18 పైసలు బలపడి 85.23 స్థాయి వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో బుల్లిష్ ట్రెండ్ దేశీయ కరెన్సీ బలోపేతానికి కారణమయ్యాయి.

టీవీఎస్ మోటార్ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 698 కోట్లు
- ఆదాయం రూ. 11,474 కోట్లు
- 12.16 లక్షల వాహనాలు విక్రయం

ముంబై: ద్విచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 69 శాతం జంప్‌చేసి రూ. 698 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 412 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,899 కోట్ల నుంచి రూ. 11,474 కోట్లకు బలపడింది. ఎగుమతులతో కలిపి మొత్తం ద్విచక్ర, త్రిచక్ర వాహన అమ్మకాలు 14 శాతం ఎగసి 12.16 లక్షల యూనిట్లకు చేరాయి. ఎలక్ట్రిక్ వాహన అమ్మకాలు 54 శాతం జంప్‌చేసి 76,000 యూనిట్లను తాకాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,779 కోట్ల నుంచి రూ. 2,380 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం సైతం రూ. 44,159 కోట్లకు ఎగసింది.



ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ మోటార్ షేరు 2.5% ఎగసి రూ. 2,804 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

అక్షయ తృతీయ ఆఫర్లు షురూ | మహిళలకు ఉద్యోగాల బూమ్

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్‌లో 934 పోస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎండీసీ) లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ ఎంప్లాయ్(సీఈ)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 934.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, బీఈ, డిప్లొమా, ఐటీఐ, పీజీ, సీఏ, ఎంఏ, ఎంబీఏ/పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 50 ఏళ్లు ఉండాలి.
» వేతనం:నెలకు పోస్ట్ కోడ్ సీఈ–2 నుంచి సీఈ–10కు రూ.40,000 నుంచి రూ.1,70,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 08.05.2025
» వెబ్‌సైట్: https://nmdcsteel.nmdc.co.in

ఎన్ఐ-ఎంఎస్ఎంఈ హైదరాబాద్‌లో 66 మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో,స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎన్ఐ-ఎంఎస్ఎంఈ).. ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్,అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 66.
» పోస్టుల వివరాలు: మేనేజర్(ఈడీసీ), అసిస్టెంట్ మేనేజర్(ఈడీసీ).
» అర్హత: మేనేజ్‌మెంట్/కామర్స్ లేదా ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం తదితర నైపుణ్యాలు ఉండాలి.
» వయసు: మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 27 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: గూగుల్ లింక్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 10.05.2025.
» వెబ్‌సైట్: www.nimsme.gov.in

డబ్ల్యూబీపీడీసీఎల్‌లో 114 పోస్టులు

వెస్ట్ బెంగాల్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(డబ్ల్యూబీపీడీసీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య:114
» పోస్టుల వివరాలు: ఏజెంట్ అండర్ టీఈడబ్ల్యూబీ-1, జూనియర్ కన్సల్టెంట్-3, డిప్యూటీ కన్సల్టెంట్-1, సేఫ్టీ ఆఫీసర్-1, బ్లాస్టింగ్ ఇన్‌ఛార్జ్ అండర్ డీపీడీహెచ్-1, అసిస్టెంట్ మైన్స్ సూపరింటెండెంట్ అండర్ డీపీడీహెచ్-1, సూపర్‌వైజింగ్ ఆఫీసర్-1, హెల్త్ ఆఫీసర్ అండర్ డీపీడీహెచ్-1, సూపరింటెండెంట్(ఈ-ఎం) అండర్ డీపీడీహెచ్-1, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ అండర్ డీపీడీహెచ్-1, మ్యాగజైన్ ఇన్‌ఛార్జ్-4, సూపర్‌వైజర్-12, సీనియర్ ఎగ్జిక్యూటివ్-4, స్పెషల్ ఆఫీసర్-5, అసోసియేట్-73, అసిస్టెంట్ మ్యాగజైన్-3, ఇన్‌స్ట్రక్టర్-1.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, బీఈ,ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, పీజీడీఎం, పీజీ డిప్లొమా, డిప్లొమా, ఐటీఐ, ఇంటర్, పదో తరగతిలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు:01.04.2025 నాటికి 63ఏళ్లు ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 05.05.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.05.2025
» వెబ్‌సైట్: https://www.wbpdcl.co.in

ఐఐటీ మద్రాస్‌లో 23 నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) మద్రాస్‌లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 23.
» పోస్టుల వివరాలు: లైబ్రేరియన్-01, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్-01, డిప్యూటీ రిజిస్ట్రార్-02, టెక్నికల్ ఆఫీసర్-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్-02, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-01, జూనియర్ సూపరింటెండెంట్-05, జూనియర్ అసిస్టెంట్-10.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్, టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు 45 ఏళ్లు, జేటీఎస్, జేఎస్ పోస్టులకు 32 ఏళ్లు, జూనియర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ప్రొఫెషనల్ కాంపిటెన్స్ టెస్ట్,స్కిల్ టెస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 19.05.2025.
» వెబ్‌సైట్: https://recruit.iitm.ac.in

» యూజీసీ-నెట్ జూన్ నోటిఫికేషన్ విడుదల
» మొత్తం 85 సబ్జెక్టులలో నెట్ పరీక్ష నిర్వహణ
» కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష
» జేఆర్‌ఎఫ్‌తోపాటు బోధన కెరీర్, పీహెచ్‌డీ ప్రవేశాలకు మార్గం

నెట్‌తో బోధన, పరిశోధన

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. ప్రతి ఏటా రెండుసార్లు జాతీయ స్థాయిలో నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)ను నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో విజయం సాధించడం ద్వారా బోధన రంగంలో కెరీర్, అదేవిధంగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు అవకాశం లభిస్తుంది. నెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపితే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) సొంతమవుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. తాజాగా యూజీసీ-నెట్ 2025 జూన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ నెట్ వివరాలు, ఈ పరీక్షతో ప్రయోజనాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



తాజా నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 85 సబ్జెక్టులలో యూజీసీ నెట్ జూన్–2025ను నిర్వహించనున్నారు. వీటిల్లో ఎకనామిక్స్, హిస్టరీ, హ్యూమన్ రైట్స్ అండ్ డ్యూటీస్, ఇండియన్ కల్చర్ తదితర ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్, లింగ్విస్టిక్ సబ్జెక్ట్‌లతో పాటు కంప్యూటర్ సైన్స్,క్రిమినాలజీ,మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ సబ్జెక్ట్‌లు కూడా ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా హిందూ స్టడీస్ సబ్జెక్టును చేర్చారు. పీజీ స్థాయిలో చదివిన స్పెషలైజేషన్‌కు అనుగుణంగా.. ఆయా పేపర్లకు హాజరయ్యే అర్హత లభిస్తుంది.

అర్హత

పీజీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు లభిస్తుంది. పీజీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

జేఆర్‌ఎఫ్ అభ్యర్థులకు 2025, జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీ–ఎన్‌సీఎల్, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాల అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

మూడు కేటగిరీలుగా

- యూజీసీ–నెట్‌ను జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అడ్మిషన్ టు పీహెచ్‌డీ, అడ్మిషన్ టు పీహెచ్‌డీ..ఇలా మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరవ్వాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్న వారు జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తిలో స్థిరపడాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అడ్మిషన్ టు పీహెచ్‌డీ ప్రాథమ్యాన్ని ఎంచుకుంటే సరిపోతుంది.
- పీహెచ్‌డీలో ప్రవేశం మాత్రమే కోరుకునే వారు అడ్మిషన్ టు పీహెచ్‌డీ కేటగిరీని ఎంచుకోవాలి.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లుగా పరీక్ష

- యూజీసీ నెట్ పరీక్షను ప్రతి సబ్జెక్ట్‌లోనూ రెండు పేపర్లు(పేపర్1,పేపర్ 2)గా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహించనున్నారు.
- పేపర్–1కు అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి.
- పేపర్–2ను అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా యూజీసీ నెట్‌లో అర్హత ఉన్న సబ్జెక్ట్‌కు హాజరుకావాలి. ఉదాహరణకు పీజీ స్థాయిలో హిస్టరీ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు హిస్టరీ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

300 మార్కులు

యూజీసీ నెట్‌ను రెండు పేపర్లుగా మొత్తం 300 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–1 టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–100 మార్కులకు, పేపర్–2 సబ్జెక్ట్ సంబంధిత పేపర్ 100 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌కు సంబంధించి రెండు కేటగిరీల అభ్యర్థులు(జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్) ఉత్తీర్ణత సాధించాలంటే.. తాము రాసిన పేపర్లలో కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు పొందాలి.

ఆరు శాతం మంది ఎంపిక

యూజీసీ నెట్‌కు మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే ఉత్తీర్ణులుగా ప్రకటించనున్నారు. జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలోనూ కనీస అర్హత మార్కుల శాతం ఆధారంగా ఉత్తీర్ణుల జాబితా రూపొందిస్తారు. దీనికి సంబంధించి పలు స్లాట్లలో పరీక్షను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

వెయిటేజీ విధానం

యూజీసీ నెట్‌లో రెండో కేటగిరీ(అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అడ్మిషన్ టు పీహెచ్‌డీ), మూడో కేటగిరీ (అడ్మిషన్ టు పీహెచ్‌డీ) అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. నెట్ స్కోర్‌కు 70% వెయిటేజీ ఉంటుంది.

ఆ తర్వాత మలిదశలో యూనివర్సిటీలు, ఉన్నత విద్య సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూ ప్రక్రియకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు. ఈ రెండు కేటగిరీల్లో ఉత్తీర్ణత సాధించిన వారి స్కోర్ కాల పరిమితి ఏడాది మాత్రమే.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, మే 7
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2025, మే 9, 10 తేదీల్లో
- యూజీసీ నెట్ తేదీలు: 2025, జూన్ 21 నుంచి 30 వరకు
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://ugcnet.nta.nic.in

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో సులభంగా అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం.. అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ. 67 వేలు బేసిక్ పే చెల్లించే విధంగా యూజీసీ నిర్ణయించింది.
- జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో మూడేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా ప్రతి నెలా ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- మొదటి రెండేళ్లు జేఆర్‌ఎఫ్ హోదాలో నెలకు రూ.37 వేల ఫెలోషిప్ లభిస్తుంది.
- జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్‌ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.42 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్, ఎస్‌ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించే అవకాశం ఉంది.
- సైంటిస్ట్‌లుగా ఎంపికైన వారు గ్రేడ్ ఆధారంగా ప్రారంభంలోనే నెలకు రూ.80వేల వేతనం పొందొచ్చు.
- ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

యూజీసీ నెట్‌లో విజయం సాధించేందుకు అభ్యర్థులు పరిశోధనల పట్ల ఆసక్తితోపాటు సబ్జెక్ట్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.

పేపర్-1

అభ్యర్థులందరికీ ఉమ్మడి పేపర్‌గా నిర్దేశించిన పేపర్–1లో టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాల(టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలు

పేపర్–2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ప్రశ్నలు పీజీ స్థాయిలో ఉంటాయి. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా సిలబస్ అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి.

పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేటప్పుడు ప్రాక్టికల్ థింకింగ్, అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతున్నాయి. దీంతోపాటు క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్‌ను పెంచుకుంటే పరీక్ష ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–ఫిజిక్స్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

క్లుప్తంగా...

చర్లపల్లి-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి-తిరుపతి మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 7వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు ఈ రైళ్ల రాకపోకలు సాగించనున్నాయి. చర్లపల్లి-తిరుపతి (07251/07252) రైలు సాయంత్రం 6.50 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.55 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.55 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. అలాగే కాచిగూడ-నాగర్‌సోల్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్(07435/07436)ను జూన్ నెలాఖరు వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఈఏపీ సెట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ఈఏపీ సెట్) మంగళవారం నుంచి మొదలవుతుంది. ఈనెల 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్ సెట్ జరుగుతుంది. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ సెట్ జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 3,06,796 మంది ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అగ్రి, ఫార్మా విభాగానికి 86,498 మంది, ఇంజనీరింగ్ 2,20,049 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు సెట్లకు 254 మంది దరఖాస్తు చేశారు. ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఏపీ సెట్ కో-కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. తొలి రోజు 112 కేంద్రాల్లో జరిగే సెట్‌కు 28,870 మంది హాజరవుతారని తెలిపారు. తొలి రోజు సెట్ పేపర్‌ను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ టీకే రెడ్డి విడుదల చేస్తారు. జేఎన్టీయూహెచ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ కూడా హాజరవుతారు.

శ్రవణ్‌రావుకు మధ్యంతర రక్షణ కొనసాగింపు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు అరువెల శ్రవణ్‌రావుకు మే 9 వరకు మధ్యంతర రక్షణను సుప్రీంకోర్టు కొనసాగించింది. శ్రవణ్‌రావును అరెస్ట్ చేయకుండా కల్పించిన మధ్యంతర రక్షణ తొలగించాలంటూ తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో శ్రవణ్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని శ్రవణ్‌రావు తరఫు న్యాయవాది దామా శేషాద్రినాయుడు కోరారు. దీంతో తదుపరి విచారణను మే 9వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. అప్పటివరకు శ్రవణ్‌రావుకు మధ్యంతర రక్షణను జస్టిస్ నాగరత్న ధర్మాసనం కొనసాగించింది.

వడదెబ్బతో ఇద్దరు మృతి

ధర్మసాగర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడదెబ్బతో ఇద్దరు మృతిచెందారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన దువ్వల రాజయ్య (75) ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లొచ్చి దాహంగా ఉందని మంచినీళ్లు తాగాడు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయాడు. మహబూబాబాద్ జిల్లా లక్ష్మతండాలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో కూలీగా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన తులసి ముత్రా (59) వడదెబ్బతో మృతిచెందాడు.

ఏఐనా.. అంటే..



సాక్షి, స్పెషల్ డెస్క్: ఓవైపు అగ్ర దేశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వాడకం విస్తృతంగా కొనసాగుతుంటే ఆ దేశాలతో అన్ని రంగాల్లో పోటీపడుతున్న భారత్ మాత్రం ఏఐని అందిపుచ్చుకోవడంలో ఇంకా ప్రారంభ స్థాయిలోనే ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఏకంగా 60% మంది భారతీయులకు ఏఐ గురించి తెలియదని టెక్నాలజీ దిగ్గజం గూగుల్, మార్కెట్ పరిశోధన సంస్థ కాంటార్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం తేల్చింది. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో కేవలం 31% మందే జనరేటివ్ ఏఐ సాధనాలను వినియోగిస్తున్నారు.

జీవితాల మెరుగుదల కోసం..

అత్యధికులకు ఇప్పటికీ ఏఐ గురించి తెలియకపోయినా తమ జీవితాలను మెరుగుపరచుకోవడానికి ఏఐ వంటి సాధనాలను ఉపయోగించాలనే కోరిక ఎక్కువ మందిలో ఉంది. మరింత ఉత్పాదకత పొందాలని 72% మంది, సృజనాత్మకతను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని 77% మంది, మరింత సమర్థంగా సమాచారాన్ని తెలియజేయాలని 73% మంది చూస్తున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా రాణించడానికి సహాయపడే సాధనాన్ని 75 శాతం మంది కోరుకుంటున్నారు.

ప్రారంభించడమూ తెలియదు..

పనిప్రదేశం లేదా తరగతి గదికి మించి భారతీయులు రోజువారీ పనుల్లో కూడా సహాయం కోసం ఆసక్తిగా ఉన్నారు. ప్రయాణ ప్రణాళిక నుంచి బడ్జెట్‌లను నిర్వహించడం వరకు 76% మంది తమ సమయం ఆదా చేయడంలో సహాయం కోరుకుంటున్నారు. పిల్లలకు హోంవర్క్‌లో చేదోడు లేదా వంట వంటి కొత్త అభిరుచులను అన్వేషించడం.. ఇలా రోజువారీ జీవితంలో మరింత సృజనాత్మకంగా ఉండాలని 84% మంది ఆశిస్తున్నారు. ఏఐ వినియోగంలో చాలా మంది నిరంతర అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. ఏఐని ఎలా ప్రారంభించాలో 68% మందికి తెలియడంలేదు. అందుకు నైపుణ్యం లేదా మార్గదర్శకత్వం లేకపోవడాన్ని 52% మంది ఉదహరిస్తున్నారు. అటువంటి అడ్డంకుల కారణంగా వృత్తిపరమైన లేదా సృజనాత్మక ఆకాంక్షను వదులుకున్నామని 61% మంది చెప్పారు.

మార్పు తెచ్చిన జెమినై..

తమ ఏఐ ప్లాట్‌ఫామ్ జెమినైని మొదటగా స్వీకరించినవారు ఇప్పటికే గణనీయంగా ప్రయోజనాలను ఆస్వాదిస్తున్నారని గూగుల్ తెలిపింది. దేశంలోని 92% జెమినై వినియోగదారుల విశ్వాసాన్ని ఈ సాధనం మెరుగుపరిచిందని వెల్లడించింది. ముఖ్యంగా జనరేషన్ జెడ్ (94%), విద్యార్థులు (95%), మహిళల్లో (94%) జెమినై అధిక ప్రభావం ఉందని వివరించింది. ఏఐ వినియోగం 93% మంది వినియోగదార్ల ఉత్పాదకతను పెంచిందని తెలిపింది. సృజనాత్మకంగా ఆలోచించడంలో 85% మందికి సహాయపడిందని గూగుల్ వివరించింది.

గూగుల్-కాంటార్ తాజా అధ్యయనం..

ఆర్మూరు-జగిత్యాల హైవేకు ఓకే

'పీఎం ప్రయారిటీ లిస్టు'లో చోటు ఫలితం

- అటవీ, పర్యావరణ అనుమతులు జారీ... త్వరలో టెండర్లు
- మూడేళ్లలో నాలుగు వరుసల రోడ్డు సిద్ధం



మంచిర్యాల శివారు శ్రీరాంపూర్ వద్ద ఎన్‌హెచ్ 63లో నిర్మించిన ఈ ఇంటర్‌ఛేంజ్‌తో ప్రతిపాదిత రోడ్డు అనుసంధానమవుతుంది

ప్యాకేజీ1:	ఆర్మూరు నుంచి మెట్‌పల్లి 35.9 కి.మీ
ప్యాకేజీ2:	మెట్‌పల్లి నుంచి జగిత్యాల 28.7 కి.మీ.
ప్యాకేజీ3:	జగిత్యాల నుంచి రాయపట్నం 31.9 కి.మీ.
ప్యాకేజీ4:	రాయపట్నం నుంచి మంచిర్యాల 35.39 కి.మీ.

సాక్షి, హైదరాబాద్: ఎన్నోఏళ్లుగా ఎదురుచూపులకే పరిమితమైన ఆర్మూరు-జగిత్యాల-మంచిర్యాల హైవేకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి కార్యాలయ సూచన మేరకు ఆ రోడ్డు నిర్మాణానికి వీలుగా అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. ఇక టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించటమే తరువాయి. మూడేళ్లలో ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది. దేశంలోనే కీలక జాతీయ రహదారిగా ఉన్న ఎన్‌హెచ్ 63ను కేంద్రం నాలుగు వరుసలుగా విస్తరిస్తోంది. ఇది మహారాష్ట్రలోని దౌండ్ వద్ద మొదలై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మీదుగా 1,065 కి.మీ. కొనసాగి ఒడిశాలోని కోరాపుట్‌లో ముగుస్తుంది. తెలంగాణలో బోధన్-నిజామాబాద్-ఆర్మూరు-మెట్‌పల్లి-కోరుట్ల-జగిత్యాల-లక్సెట్టిపేట-ధర్మపురి-మంచిర్యాల-చెన్నూరు మీదుగా సాగుతుంది. ఇందులో నిజామాబాద్ నుంచి ఆర్మూరు శివారులోని ఎన్‌హెచ్ 44 వరకు, తిరిగి మంచిర్యాల దాటిన తర్వాత ఉండే ఎన్‌హెచ్ 363 నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చెన్నూరు వరకు రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని జాతీయ రహదారుల విభాగం విస్తరిస్తోంది. ఆ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఆర్మూరు నుంచి మంచిర్యాల వరకు కీలక నిర్మాణం అయినందున దాన్ని ఎన్‌హెచ్ఏఐకి అప్పగించారు. ఆర్మూరు-మంచిర్యాల రోడ్డు పట్టణాలు, గ్రామాల మీదుగా కొనసాగుతున్నందున, దాన్ని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించాలని తొలుత నిర్ణయించారు. ఇందుకు భారీగా ప్రైవేట్ భూములు సేకరించాల్సి రావటంతో రైతులు ఎదురు తిరిగారు. దీంతో ఊళ్లున్న ప్రాంతాల్లో బైపాస్‌లు నిర్మించి మిగతా పాత రోడ్డును విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. మధ్యలో ఓ పర్యాయం టెండర్లు పిలిచినా.. చివరకు సాంకేతిక కారణాలతో రద్దు చేసుకున్నారు.

ప్రధాని కార్యాలయ దృష్టికి రావటంతో..

మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం, దేశవ్యాప్తంగా జాప్యం జరుగుతూ వస్తున్న కీలక రహదారులను వేగంగా పూర్తి చేసేలా జాబితాను రూపొందించింది. మొత్తం 3 వేల కి.మీ. నిడివి ఉండే రోడ్లను ఇందులో చేర్చారు. తెలంగాణ నుంచి జగిత్యాల-కరీంనగర్, ఆర్మూరు-మంచిర్యాల రోడ్లను చేర్చారు. వీటిని స్వయంగా ప్రధాని కార్యాలయం పర్యవేక్షిస్తుంది. ఈ మేరకు ఈ రోడ్లకు లైన్‌క్లియర్ అయ్యింది.

యాక్సెస్ కంట్రోల్డా...కాదా?

ఆర్మూరు నుంచి మంచిర్యాల వరకు రోడ్డు నిడివి 131.8 కి.మీ. ఇందులో పలు పట్టణాలు, పెద్ద గ్రామాలున్నందున చాలా ప్రాంతాల్లో బైపాస్‌లను నిర్మించనున్నారు. ఆర్మూరు, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేట, మంచిర్యాల పట్టణాల వద్ద 6 కి.మీ. నుంచి 12 కి.మీ. మేర భారీ బైపాస్‌లు ఉంటాయి. ఇవి కాకుండా మరో ఎనిమిది ప్రాంతాల్లో చిన్న బైపాస్‌లు నిర్మిస్తారు. మొత్తంలో 105 కి.మీ. బైపాస్‌లే ఉండటంతో గ్రీన్‌ఫీల్డ్ హైవేగానే ఉండనుంది. దీన్ని యాక్సెస్ కంట్రోల్డ్ తరహాలో నిర్మించాలని ప్రతిపాదించినా, కేంద్రం ఇంకా దానికి అనుమతి ఇవ్వలేదు. ఈ రోడ్డుమీద టోల్‌బూత్‌లు ఉంటాయి. వాహనాల సంఖ్య అన్ని ప్రాంతాల్లో ఎక్కువగా లేదు. యాక్సెస్ కంట్రోల్డ్ పద్ధతిలో అయితే, నిర్ధారిత ప్రాంతాలలో మినహా మధ్యలో ఎక్కడా వేరే వాహనాలు ఈ రోడ్డు మీదకు చేరే వీలుండదు. దీంతో టోల్ ఆదాయం తగ్గుతుందని కేంద్రం భావిస్తోంది. బైపాస్‌ల కోసం 500 హెక్టార్ల భూమిని సేకరించారు. ఇందుకే రూ.900 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఇక వంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్ఓబీలు దాదాపు 46 వరకు ఉంటాయి. ఈ మొత్తం ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇది 45 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. మధ్యలో సెంట్రల్ మీడియన్, రెండువైపులా పేవ్డ్ షోల్డర్స్ దారి ఉంటుంది. ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 61లను అనుసంధానిస్తుంది.



నా కొడుకు పుట్టుక నుంచే నడువలేదు..కింద కూసోలేదు. 30 ఏళ్ల వయసు వచ్చినా సంటి పిల్లగాడి లెక్క సేవలు చేయాలె. వచ్చే పింఛన్ డైపర్లకు కూడా సరిపోతలేదు. కూలికి పోతేనే కుటుంబం గడిచేది. కిరాయి ఇంటికి జీరో కరెంటు బిల్లు వస్తలేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. ఏ ఆసరా లేదు. కొడుకు గోస సూడలేక పోతన్న. సాదుడు కష్టమైతంది. ఆదుకోండి.. లేదంటే కొడుకును సంపుండి..

గ్రీవెన్స్‌లో ఓ కన్నతల్లి కన్నీటి పర్యంతం

నా కొడుకును సంపేయండి

జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కురుమవాడకు చెందిన పర్శ మల్లయ్య-లక్ష్మి దంపతులకు కుమారుడు సాయి, కూతురు ఉన్నారు. కొడుకు వయసు ప్రస్తుతం 30 సంవత్సరాలు. పుట్టుకతోనే కాళ్లు, చేతులు చచ్చుబడి పోయి కనీసం కూర్చోలేని పరిస్థితి. తండ్రి ఎంసీహెచ్‌లో వాటర్‌మెన్‌గా.. తల్లి సాయిబాబా ఆలయంలో కూలి చేస్తూ పిల్లలను పోషించుకుంటున్నారు. ఇద్దరూ పనికి వెళితేనే కుటుంబం గడిచేది. ఇద్దరూ పనులకు పోతే కొడుకుని ఇంట్లో ఉంచి వెళ్లాల్సిందే. ప్రభుత్వం నుంచి వచ్చే దివ్యాంగుల పింఛన్ రూ.4వేలు డైపర్లకు సైతం సరిపోవడం లేదు. మందులు, నెలవారి వైద్య ఖర్చులకు అప్పులు చేస్తున్నారు. అద్దె ఇంట్లో కాలం గడుపుతున్నారు. సర్కారు ఇచ్చే జీరో కరెంటు బిల్లుకు దరఖాస్తు చేసినా వస్తలేదు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు పెట్టినా మంజూరు కాలేదు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మల్లయ్య తన కొడుకును భుజాన ఎత్తుకొని వచ్చారు. 'మేము ప్రభుత్వ పథకాలకు అర్హులం కాదా.. మంజూరు చేయకుంటే నా కొడుకును సంపేయండి' అంటూ కొడుకు సాయిని అక్కడే పడుకోబెట్టిన తల్లి లక్ష్మి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఎదుట బోరున విలపించింది. స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి వీరి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

జనగామ

కుమారుడికి తల్లి చిత్రహింసలు

జగిత్యాలక్రైం: కన్న తల్లే తన కొడుకును చిత్రహింసలకు గురిచేస్తుండటంతో స్థానికులు ఆ అరాచకాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో స్పందించిన సఖీ కేంద్రం నిర్వాహకులు ఆ బాలుడిని చేరదీశారు. జగిత్యాల పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన ఆంజనేయులు, రమ దంపతులకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆంజనేయులు జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. రమ తులసీనగర్‌లో బాబుతో ఉంటోంది. దంపతుల మధ్య గొడవల నేపథ్యంలో ఆంజనేయులు గల్ఫ్ నుంచి ఫోన్ చేస్తూ రమను మానసికంగా వేధిస్తుండటంతో ఆగ్రహానికి గురైన రమ తన కుమారుడిని నాలుగు రోజులుగా విచక్షణారహితంగా కొడుతూ చిత్రహింసలకు గురిచేస్తోంది. దీంతో ఇరుగు, పొరుగువారు చూసి కలత చెంది, రమ దాష్టీకాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో జిల్లా బాలసంరక్షణ అధికారి హరీశ్.. తులసీనగర్‌కు చేరుకుని బాలుడిని చేరదీసి సఖీ కేంద్రానికి తరలించారు.



బాలుడిని తంతున్న తల్లి

జ్యుడీషియల్ అభ్యర్థులకు తెలుగు తప్పనిసరి

- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకానికి అర్హత సాధించేందుకు తెలుగులో ప్రావీణ్యాన్ని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తెలంగాణ జ్యుడీషియల్ సర్వీస్ అభ్యర్థులకు తెలుగు ప్రావీణ్యం తప్పనిసరి అని స్పష్టం చేసింది. తెలంగాణ జ్యుడీషియల్ (సర్వీస్ అండ్ కేడర్) రూల్స్-2023 ద్వారా ఉర్దూను మినహాయించారని పిటిషనర్ మహ్మద్ షుజాత్ హుస్సేన్ లేవనెత్తిన వాదనను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. పరీక్షల్లో ఉర్దూని మినహాయించలేదని, తెలుగులో ప్రావీణ్యం కలిగి ఉండాలన్న నిబంధనను చేర్చామని తెలంగాణ ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చింది. కాగా ఈ పిటిషన్‌కు సంబంధించి గతంలో పిటిషనర్ వాదనను తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చడంతో హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేశారు. అయితే హైకోర్టు తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించింది. జూన్ 2023లో అమల్లోకి వచ్చిన నియమాల ప్రకారం తెలంగాణ జ్యుడీషియల్ సర్వీస్ అభ్యర్థులు తప్పనిసరిగా తెలుగులో ప్రావీణ్యత సాధించి ఉండాలి. అయితే తను విద్యాభ్యాసం మొత్తం ఉర్దూ మీడియంలోనే జరిగిందని... న్యాయ సేవ నియామకం కోసం నిబంధనల ప్రకారం ఉర్దూలో ప్రావీణ్యత అవకాశాన్ని కల్పించాలని పిటిషనర్ వాదించారు. ఉర్దూ తెలంగాణ సంస్కృతిలో భాగమని, తెలంగాణ అధికార భాషల చట్టం-1966 ప్రకారం ఉర్దూ రెండో అధికార భాషగా గుర్తింపు పొందిందన్నారు. అయితే, రాష్ట్రంలో అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అనే వాస్తవం ఆధారంగా రాష్ట్రం తీసుకున్న నిర్ణయం విధానపరమైనదని పేర్కొన్న తెలంగాణ హైకోర్టు అతని పిటిషన్‌ను తిరస్కరించిన విషయం తెలిసిందే.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయండి

- హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసిన టీజీపీఎస్సీ.. రేపు ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టే అవకాశం



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 నియామకాలను నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని, ఈ దశలో నియామకాలను అడ్డుకోవడం సరికాదని చెప్పింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో నిరాశ నిండిపోయిందని పేర్కొంది. ఈ నెల 17న సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేయాలని కోరింది. ఈ అప్పీల్‌పై ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట్ శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో కలిపి 19 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. గ్రూప్-1 నియామకాలను నిలిపివేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అయితే, ప్రస్తుతం నడుస్తున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మాత్రం కొనసాగించుకోవచ్చని వెసులుబాటు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీల్ దాఖలు చేసింది.

అప్పీల్‌లో పేర్కొన్న వివరాలు: టీజీపీఎస్సీ తరఫున అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి (లీగల్) ఆర్.సుమతి అప్పీల్ దాఖలు చేశారు. '2024, అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో జరిగాయి. తొలుత 45 సెంటర్లు గుర్తించాక అభ్యర్థుల నిష్పత్తి సౌకర్యాల ఆధారంగా మరో సెంటర్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. పరీక్షలు పూర్తయ్యాక సూపరింటెండెంట్ల సమాచారం మేరకు హాజరైన వారి సంఖ్య 21,075 అని వెల్లడించాం. ఆ తర్వాత ఓఎంఆర్ షీట్లు, నామినల్ రోల్స్ పరిశీలించాక ఆ సంఖ్య 21,085 అని తేలింది. బి.పూజితారెడ్డి రీకౌంటింగ్‌లో తేడా ఉందని, 60 మార్కులు తగ్గాయని వినతి పత్రం సమర్పించారు. దీనిని పరిశీలిస్తే కౌంటింగ్‌కు ముందు ఆ తర్వాత కూడా ఆమెకు 422.5 మార్కులే వచ్చాయి. వినతి పత్రంలో మార్కులను తారుమారు చేసి ఇచ్చారు. దీనిపై కమిషన్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఆ అభ్యర్థి హైకోర్టుకు రాలేదు.. ఆమె తరఫున ఇతరులు కోర్టుకు వచ్చారు. మూల్యాంకనం కోసం ప్రొఫెసర్లను సబ్జెక్టుల వారీగా ఎంపిక చేశాం. వాళ్ల వివరాలు బయటకు వెల్లడిస్తే బెదిరింపులకు ఆస్కారం ఉంటుంది. ఊహాజనిత ఆరోపణలతో పిటిషన్ వేశారు. అందువల్ల సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలి' అని అప్పీల్‌లో పేర్కొన్నారు.

తప్పుడు పత్రాలతో పిటిషన్లు వేస్తారా?

గ్రూప్-1 అభ్యర్థులకు రూ.20 వేల జరిమానా విధించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్

తప్పుడు పత్రాలతో పిటిషన్లు వేస్తారా అంటూ కొందరు గ్రూప్-1 అభ్యర్థులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్ దాఖలు చేసిన 19 మందికి కలిపి రూ.20 వేల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని హైకోర్టు న్యాయమూర్తుల కోర్టు మాస్టర్స్, వ్యక్తిగత కార్యదర్శుల సంఘానికి అందజేయాలని ఆదేశించింది. అలాగే ఫేక్ డాక్యుమెంట్లతో పిటిషన్ వేసిన వారిపై ప్రాసిక్యూషన్ విచారణ ప్రారంభించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్-1)కు స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, మెమోకు, వెబ్‌సైట్‌లో పేర్కొన్న మార్కులకు వ్యత్యాసాలున్నాయని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ముత్తయ్యతోపాటు 19 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పారదర్శకత లేకుండా నిర్వహించిన మెయిన్స్ పరీక్షల మూల్యాంకనాన్ని రద్దు చేసి, తిరిగి పత్రాలను దిద్దేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం విచారణ చేపట్టారు. టీజీపీఎస్సీ తరఫున స్టాండింగ్ కౌన్సెల్ పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్లు తప్పుడు పత్రాలతో పిటిషన్ వేశారు. మార్కులను కూడా తప్పుగా పేర్కొన్నారు. దీనిపై కోర్టుకు వివరణ ఇవ్వాలి. తప్పుడు పత్రాలతో కోర్టును తప్పు దారి పట్టించేందుకు యత్నించారు' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తప్పుడు డాక్యుమెంట్లు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పిటిషన్‌ను కొట్టివేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం 29-4-2025

ప్రకృతి ప్రసాదం ఇప్పపూవు



అంగోరుగూడెంలో ఇప్పపూలు ఆరబెడుతున్న గొత్తికోయలు

గిరిజనులకు జీవనాధారం

ఆదివాసీల్లో ఇప్పపూల సేకరణ సందడి

ఏటా వేసవిలో మూడు నెలలు ఉపాధి

కరకగూడెం: గిరిజనుల జీవనయానం ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అడవులు, చెట్లు, పూలు వారి జీవన విధానంలో భాగమైపోయాయి. ఇందులో భాగంగానే ఇప్పపూలకు ప్రాధాన్యత ఉంది. ఈ పూల వినియోగం దేవతల కాలం నుంచే ఉందని నమ్ముతారు. శ్రీరామచంద్రుడికి ఇప్పపూలతో చేసిన లడ్డూ ప్రసాదం ప్రీతిపాత్రమైనదని రామాయణం చెబుతోంది. కాలాలు మారినా, ప్రాంతాలు వేరైనా ఇప్పపూల విలువ మాత్రం తగ్గలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఆదివాసీలకు ఇది ఆహారంగానే కాక జీవనోపాధికి ప్రధాన ఆధారంగా నిలుస్తోంది.

అడవితల్లి ఒడిలో..

వేసవి వచ్చిందంటే చాలు అడవితల్లి ఒడిలో ఇప్ప పూలు కనువిందు చేస్తాయి. ఈ పూలతో మూడు నెలలపాటు గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. తెల్లవారుజామునే గొత్తికోయలు గుంపులుగా సమీప అటవీ ప్రాంతానికి చేరుకుని నేల రాలిన ఇప్పపూలను సేకరిస్తారు. ఆపై ఇంటికి తీసుకొచ్చి ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత కొందరు నేరుగా తింటే.. మరికొందరు తీపి పదార్థాలు, సారాయి తయారు చేసుకుంటారు. అంతేకాకుండా ఇప్ప పూలను అమ్మి జీవనోపాధి పొందుతారు. అనేక పండుగలు, వేడుకల్లోనూ ఇప్పపూలను ఉపయోగించడం వారి సంప్రదాయానికి చిహ్నంలా భావిస్తారు. అయితే, ఇప్పపూలకు ఇక్కడ సరైన ధర లభించక దళారులను ఆశ్రయిస్తుండటంతో వారు అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రస్తుతం కేజీ ఇప్పపూల ధర రూ.30 ఉందని జీసీసీ అధికారులు చెబుతున్నారు.



అటవీ ప్రాంతంలో ఇప్పపూలను సేకరిస్తున్న మహిళ

అడవి సంరక్షణ..
ఇప్ప పువ్వు పరిరక్షణ

పోడు సాగు, ఇతర కారణాలతో ఇప్ప చెట్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. తద్వారా గిరిజనుల జీవనోపాధిపై ప్రభావం పడుతోంది. అడవులను సంరక్షించడం, ఇప్ప చెట్లను పెంచడాన్ని ప్రాముఖ్యతగా గుర్తిస్తే ఈ ప్రమాదం నుంచి బయటపడొచ్చని అంటున్నారు. తద్వారా ప్రకృతి వరం భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండి.. గిరిజనుల జీవనోపాధి కూడా సురక్షితమవుతుంది.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం

ఇప్ప పూలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. వీటిని నిర్ణీత మోతాదులో, సరైన పద్ధతిలో ఉపయోగించడం ముఖ్యం. ఇప్ప పూలలో సహజ చక్కెర, విటమిన్లు (ముఖ్యంగా విటమిన్ సీ, బీ కాంప్లెక్స్), ఖనిజాలే(కాల్షియం, ఇనుము, పొటాషియం వంటివి) కాక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది జీర్ణ క్రియను మెరుగుపరచడంలో సాయపడుతుంది. అలాగే ఇప్ప పూలతో తీసిన నూనె వాడితే చర్మానికి తేమను అందిస్తుంది. చర్మ సంబంధిత సమస్యలను కూడా తగ్గిస్తుందని గిరిజనుల నమ్మిక. ఇది శ్వాసకోశ సమస్యలకు ఉపశమనం కలిగించడంతోపాటు రోగనిరోధక శక్తిని పెంచడంలో సాయపడుతుందని చెబుతారు.

ఏటా మాకు జీవనోపాధి



వేసవిలో తెల్లవారుజామునే కుటుంబమంతా అడవికి వెళ్తాము. రాలిన ఇప్ప పూలను సేకరించి ఎండలో ఆరబెడతాం. ఆ తర్వాత వాటితో లడ్డూలు, ఇతర వంటలు చేసుకుంటాం. మిగిలిన పూలను అమ్మి కొద్దోగొప్పో డబ్బు సంపాదిస్తాం.
– కొమరం నర్సక్క, కొత్తగూడెం, కరకగూడెం మండలం

సరైన ధర కల్పించాలి



కష్టాల నడుమ సేకరించిన ఇప్ప పూవుకు సరైన ధర కల్పించాలి. గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు గుర్తింపు ఇచ్చి మార్కెటింగ్‌కు సాయపడాలి. తద్వారా గిరిజనుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, వారి సంస్కృతి కొనసాగుతుంది.
– తోలెం రమేశ్, ఆధార్ ఫౌండేషన్ అధ్యక్షుడు

కల్పవృక్షం వంటిది..



ఇప్ప పువ్వు మాకు వరం. ఈ చెట్లు మాకు కల్పవృక్షాలు. పండుగలు, పెళ్లిళ్ల వంటి శుభకార్యాల్లో ఇప్పపూలను ఉపయోగిస్తాం. ఇది మాకు ఆదాయాన్ని ఇస్తుంది. అమ్మడం ద్వారా వచ్చే డబ్బుతో మా అవసరాలు తీర్చుకుంటాం.
– తోలెం లక్ష్మి, నర్సాపురం, కరకగూడెం మండలం

కేసీఆర్, కేటీఆర్ అధికార దాహానికి పరాకాష్ట

రజతోత్సవ సభపై కాసం వెంకటేశ్వర్లు విమర్శ



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ కేసీఆర్, కేటీఆర్ అధికార దాహానికి పరాకాష్ట సభగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అభివర్ణించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను అధికారానికి దూరంచేసి, ఫామ్‌హౌస్‌కే పరిమితం చేసినా, ఆయన రాచరిక మనస్తత్వాన్ని విడిచిపెట్టలేక అదే అహంభావంతో మాట్లాడారని మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ సభలో కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ ఖండిస్తోందన్నారు. తెలంగాణకు 11 పైసలు కూడా ఇవ్వలేదని చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ కట్టుబడి ఉంటారా అని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను ఆధారాలతో సహా రుజువు చేస్తే కేసీఆర్ ముక్కు నేలకురాసి క్షమాపణ చెబుతారా అని నిలదీశారు. రాష్ట్రానికి కేంద్రం రూ. 11 లక్షల కోట్ల నిధులు కేటాయించిన విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గణాంకాలతో సహా వివరించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు సమాచారం పంపించారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు నక్సలైట్ల పక్షాన మాట్లాడి, వారి జెండాలను భుజానికెత్తుకోవడం ఒక అలవాటుగా మారిపోయిందని కాసం విమర్శించారు.

పార్టీ నుంచి నేతలు వెళ్లిపోతారన్న భయంతో సభపెట్టారు

మాజీ ఎంపీ హనుమంతరావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబం నాంపల్లి దర్గా దగ్గర అడుక్కునేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విలన్ అని కేసీఆర్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడుతూ ఎల్కతుర్తి సభ డ్యామేజ్ కంట్రోల్ సభ అని, పార్టీ నుంచి నేతలు వెళ్లిపోతారేమోననే భయంతో ఆ సభను పెట్టారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నన్ని రోజులు కేసీఆర్ తప్పుల మీద తప్పులు చేశారని, నియంతలాగా పాలించారని, అందుకే ప్రజలు ఆయన్ను తిరస్కరించారని వీహెచ్ చెప్పారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ విలన్ అయిందా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు.

సమగ్ర ప్రణాళికతో నిధుల ఖర్చు

అధికారులకు మంత్రి సీతక్క సూచన

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితేనే నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవచ్చని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, కార్పొరేషన్ చైర్మన్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు బడ్జెట్ కేటాయింపులు, వినియోగంపై పలు సూచనలు చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉన్న అన్ని విభాగాలు నిర్దిష్ట గడువును నిర్ణయించుకుని ప్రణాళికతో పనులు చేయాలన్నారు. చివరి నిమిషంలో ప్రణాళికలు మార్చుకోవడంతో కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు బడ్జెట్‌ను వినియోగించుకునే విధంగా ప్రతి మూడు నెలలకోసారి సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పిల్లల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని, దత్తత ఇచ్చేలోపు పిల్లల సంరక్షణ బాధ్యతను స్వీకరించేందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలని అన్నారు. దివ్యాంగులకు అత్యవసరమైన శస్త్రచికిత్సలను ప్రభుత్వమే చేయిస్తుందని, ఇందుకు అనుగుణంగా దివ్యాంగులను గుర్తించి సర్జరీ ఏర్పాట్లు చేయాలని సీతక్క ఆదేశించారు. రాజీవ్ యువవికాస పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం కోటా కేటాయిస్తున్నామన్నారు. కుటుంబంలో దివ్యాంగులుంటే.. వారి పేరు మీదే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే అంశం పరిశీలనలో ఉందన్నారు. ఈ సమావేశంలో మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, టీజీ ఫుడ్స్ చైర్మన్ ఎంఏ ఫహీం, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మహిళలు భిన్న వ్యాపారాలు చేసేలా ప్రోత్సహించాలి

గ్రామాల్లో మహిళా రక్షక టీములుగా ఎస్‌హెచ్‌జీలు

- అంగన్‌వాడీ భవన నిర్మాణ ఖర్చును రూ.15 లక్షలకు పెంచే యోచన
- పీఆర్‌ఆర్‌డీ అధికారుల వర్క్‌షాపులో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: మహిళా సంఘాలు భిన్న వ్యాపారాలు నిర్వహించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్‌డీవో) ప్రోత్సహించాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క సూచించారు. గ్రామాల్లో మహిళా రక్షక టీములుగా మహిళా సంఘాలను సిద్ధం చేయాలన్నారు. సామాజిక రుగ్మతలు దురాచారాలు, వేధింపులు, బాల్య వివాహాల నుంచి గ్రామాలను రక్షించే విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. మూస పద్ధతుల్లో కాకుండా మహిళా సంఘాలను మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దేలా, గ్రామాల్లో ఏడాది చేయాల్సిన పనుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు తెలియజేశారు. మే నెలాఖరులోగా ఆ పనులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం పీఆర్ ఆర్‌డీ కమిషనర్ కార్యాలయంలో జెడ్పీ సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవోలు, డీపీఆర్ఈల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌నకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పీఆర్ఆర్డీ సెక్రటరీ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ సృజన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శానిటేషన్, తాగునీరు గ్రామపంచాయతీ సేవలు పంచాయతీ కార్యదర్శుల పనితీరు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, సెర్ప్ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ వర్క్‌షాపులో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి తహసీల్దార్లతో సమన్వయం చేసుకొని స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ఒక్కో అంగన్‌వాడీ భవన నిర్మాణ ఖర్చును రూ.15 లక్షలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, పొలం బాటలు, పంట కాలువల వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మాల్ పంచాయతీకి ఆత్మ నిర్భర్ పంచాయతీ విభాగంలో జాతీయస్థాయిలో ప్రథమ అవార్డు సాధించడాన్ని స్ఫూర్తిగా.. ఇతర గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధి సాధించేలా కృషి చేయాలని అధికారులకు సీతక్క సూచించారు. పీఆర్ సిబ్బంది ఇతర శాఖల్లో పెద్ద ఎత్తున డిప్యుటేషన్లపై పనిచేయడం, దీర్ఘ కాలం సెలవుపై వెళ్లడం వల్ల సిబ్బంది కొరతతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.అందుకే సుదీర్ఘ సెలవుపై వెళ్లడం, డిప్యుటేషన్లపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు.

చెత్తసేకరణపై మే 1 నుంచి యాప్

పంచాయతీ కార్యదర్శుల పనితీరును డీపీవోలు నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం పెంచేలా అధికారులు పనిచేయాలని సీతక్క సూచించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా లేదా నమోదు చేయాలని పేర్కొన్నారు. అందుకోసం ప్రత్యేక యాప్ మే 1 నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గ్రామాల్లో చేపట్టే పనులపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. విధి నిర్వహణలో బాగా పనిచేసే జిల్లాల అధికారులను గుర్తించి సన్మానిస్తామని చెప్పారు. గతేడాది మాదిరిగా కాకుండా వీలైనంత త్వరగా పనుల జాతర చేపట్టాలన్నారు. మే చివర్లో పనులు మొదలుపెట్టేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తామని సీతక్క వెల్లడించారు. హడావుడిగా చివర్లో పనులు చేపట్టడం వల్ల అనుకున్న ఫలితాలు రావట్లేదన్నారు. అందుకే శాఖాపరంగా చేయాల్సిన పనులను వెంటనే గుర్తిస్తే మంజూరీ ఇస్తామని తెలిపారు. మాల్ పంచాయతీకి అవార్డు దక్కిన నేపథ్యంలో సంబంధిత అధికారులను మంత్రి సన్మానించారు.

ప్రైవేటు ఆస్పత్రుల స్కానింగ్ దందా

తనిఖీలకు వెళ్లిన డీఎంహెచ్‌ఓకు బెదిరింపులు

గట్టు వామనరావుకు పట్టిన గతి పడుతుందని హెచ్చరిక

పెద్దపల్లి డీహెచ్‌ఎంవో పట్ల గోదావరిఖనిలోని ఓ స్కానింగ్ సెంటర్ దురుసు ప్రవర్తన

సాక్షి, హైదరాబాద్: ఆ స్కానింగ్ సెంటర్‌కు జిల్లా వైద్యాధికారి అనుమతి లేదు. అయినా అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేసి, రిపోర్టులు ఇస్తారు. పెద్దఎత్తున డబ్బులు వసూలు చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఎవరైనా అధికారి సాహసం చేసి, తనిఖీకి వెళితే.. సదరు అధికారిని ముప్పుతిప్పలు పెట్టి, చివరికు కేసులు పెడుతున్నారు. చంపేస్తామని బెదిరిస్తున్నారు. ఇలాంటి సంఘటనే శనివారం పెద్దపల్లి జిల్లాలో జరిగింది. వైద్యారోగ్య శాఖలో సంచలనం సృష్టించిన ఈ స్కానింగ్ దందాలో ఏకంగా ప్రజా ప్రతినిధులు, వైద్యులు ఉండడం గమనార్హం.



అనుమతి లేకుండా....

గోదావరిఖనిలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా గర్భంలో ఉన్న శిశువు ఆడనో, మగనో ముందే చెబుతూ రూ. వేలల్లో దోచుకుంటున్నారన్న సమాచారం మేరకు పెద్దపల్లి డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్న ప్రసన్న శనివారం ఉదయం సిబ్బందితో కలిసి తనిఖీకి వెళ్లారు. అయితే డీఎంహెచ్‌ఓ తనిఖీకి వచ్చినట్టు తెలియగానే డాక్టర్లు, యజమానులు కనిపించకుండా పోయారు. అక్కడున్న టెక్నీషియన్, రిసెప్షనిస్టు, ఇతర సిబ్బంది డీఎంహెచ్‌ఓను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అసలు స్కానింగ్ మిషీన్ లేదని ఓసారి, స్కానింగ్ మిషన్ ఉన్నా, స్కానింగ్‌లు చేయడం లేదని, స్కానర్ ఉన్న రూం తప్ప మిగతా రూంలు తిప్పుతూ టైం పాస్ చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌ఓ తనిఖీ చేయాల్సిందేనని పట్టు పట్టడంతోపాటు రిసెప్షనిస్టును బలవంతంగా తీసుకొని స్కానింగ్ మిషీన్ ఉన్న రూంకు తీసుకెళ్లారు. దీంతో హాస్పిటల్ సిబ్బంది, పోలీసుల ముందే డీఎంహెచ్‌ఓ పట్ల అభ్యంతరకరంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో అనుమతి లేని స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేసి వెళ్లగా, డాక్టర్ అయిన మాజీ మేయర్, ఇద్దరు వైద్యులు, మాజీ కార్పొరేటర్లు నేరుగా డీఎంహెచ్‌ఓను బెదిరించారు. గతంలో మంథని ప్రాంతంలో హత్యకు గురైన గట్టు వామనరావు దంపతులను నరికి చంపిన తరహాలో హత్య చేస్తామని కూడా బెదిరించారట. దీంతో డీఎంహెచ్‌ఓ భయపడి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి గంట సేపు తలదాచుకున్నారు. ఆ తర్వాత డీఎంహెచ్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని పోలీసులు మాజీ మేయర్ అనిల్‌కుమార్, వైద్యులు డాక్టర్ నాగిరెడ్డి, క్యాస శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మహంకాళిపై కేసులు నమోదు చేశారు. కాగా దళితురాలైన రిసెప్షనిస్టుపై దాడి చేశారని డీఎంహెచ్‌ఓపై కూడా కేసు నమోదు చేశారు. కాగా గతంలో పెద్దపల్లి జిల్లాలోనే ధర్మారంలో అనుమతి లేని ఓ స్కానింగ్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ మూసివేయడం గమనార్హం.

డీఎంహెచ్‌ఓపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: టీజీజీడీఏ రాష్ట్ర కమిటీ

గోదావరిఖనిలో ఓ స్కానింగ్ సెంటర్ తనిఖీకి వెళ్లిన పెద్దపెల్లి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నప్రసన్నపై దౌర్జన్యం చేయడం పట్ల తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) తీవ్రంగా ఖండించింది. విధి నిర్వహణలో ఉన్న మహిళా డీఎంహెచ్‌ఓ పట్ల అగౌరవంగా వ్యవహరించడం, వాదనకు దిగడం, విధులు నిర్వర్తించకుండా ఆటంకం కలిగించడం దారుణమని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లల్లు ప్రసాద రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఆర్కే రాహుఫ్ ఒక ప్రకటనలో విమర్శించారు.



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ది ఎటర్నల్ మిస్మరైజర్ చిత్రప్రదర్శనను తిలకిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి. చిత్రకళాకారుడు నరేందర్‌రెడ్డి ఈ చిత్రాలను వేశారు.

విదేశీ పక్షులకు ఆతిథ్యం ఆత్మీయం



చేపల కోసం వేట



నీరు ఉండే ప్రాంతంలో చేపల కోసం కొంగల నిరీక్షణ

నదిలో నీరు ఉండే ప్రాంతంలో పక్షులు

కొన్ని తెల్ల కొంగలు.. మరికొన్ని నల్ల కొంగలు తుంగభద్రా నదీ తీరంలో సందడి చేస్తున్నారు. నల్ల కొంగలు విదేశాల నుంచి విహరిస్తూ వచ్చాయి. వీటితో తెల్ల కొంగల కలసి సంచరిస్తున్నాయి. తుంగభద్ర నదిలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గుంతల్లో నీరు కనిపిస్తోంది. ఆ నీటిలో చేపలను వేటాడేందుకు ఇవి గుంపులుగా నిరీక్షిస్తున్నాయి. కర్నూలు జిల్లాలోని ఈ దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఏబీవీ క్వాష్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

తీర్పు వాయిదా

సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోళ్ల వ్యవహారంలో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. తీర్పు వెలువరించేంత వరకు విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. నిఘా పరికరాల కొనుగోళ్ల వ్యవహారంలో గతంలో నిఘాధిపతిగా ఉన్న ఏబీవీ భారీ అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా, ఏబీ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. నిఘా పరికరాల కొనుగోళ్ల వ్యవహారంలో పిటిషనర్ పాత్ర ఏమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థకే నిఘా పరికరాల కొనుగోళ్ల టెండర్ ప్రక్రియను అప్పగించినట్లు చెప్పారు. పిటిషనర్ కుమారుడికి అయాచిత లబ్ధి చేకూర్చారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఏసీబీ తరఫు న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపిస్తూ..దర్యాప్తు పూర్తి చేసి అధికారులు ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. పిటిషనర్‌కు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఏసీబీకి పట్టుబడిన శ్రీకాళహస్తి సర్వేయర్

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సర్వేయర్ పురుషోత్తంరెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. చంద్రశేఖర్‌రెడ్డి అనే సీనియర్ సిటిజన్ శ్రీకాళహస్తి పట్టణంలోని ఊరందూరుకు వెళ్లే మార్గంలో ఉన్న విశాలాక్షి నగర్‌లో 2000 సంవత్సరంలో 75 సెంట్లు భూమిని కొన్నాడు. దానిని క్రమబద్ధీకరించేందుకు ఫిబ్రవరి 20న తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించగా సర్వేయర్ రూ. 30వేలు లంచం అడిగారు. దీంతో చంద్రశేఖరరెడ్డి ఏసీబీని సంప్రదించారు. ఏసీబీ అధికారులు శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయంలో సర్వేయర్ పురుషోత్తంరెడ్డి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఛత్రపతి దర్బార్ చూసొద్దాం రండి!


- శ్రీశైలంలో శివాజీ స్ఫూర్తి కేంద్రం ప్రత్యేకం
- ఆకట్టుకుంటున్న పట్టాభిషక్తుడైన శివాజీ, మంత్రి మండలి కాంస్య విగ్రహాలు
- జీవితచరిత్రపై ఫైబర్ మెటీరియల్‌తో త్రీడీ చిత్రాలు
- రాజస్థాన్ మెటీరియల్‌తో 'శివాజీ ధ్యాన కేంద్రం' నిర్మాణం



శివాజీ నిర్మించిన ఉత్తర గోపురం

సందర్శన సమయం :
ఉదయం 6.30 నుంచి
రాత్రి 7.30
గంటల వరకు

ప్రవేశ టికెట్ :
ఒక్కొక్కరికి రూ. 10





శివాజీ స్ఫూర్తి కేంద్రం



శివాజీ జీవిత చరిత్ర ఉట్టి పడేలా ఏర్పాటు చేసిన త్రీడీ చిత్రాలు



శ్రీశైల ఆలయంలో భ్రమరాంబాదేవి శివాజీకి ఖడ్గం బహూకరించేలా విగ్రహం

శ్రీశైలం టెంపుల్: శ్రీగిరిలో వెలసిన మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులు క్షేత్ర పరిధిలో సందర్శించే స్థలాల్లో శివాజీ స్ఫూర్తి కేంద్రం ఒకటి. దక్షిణ భారత దేశంపై దండయాత్రకు వచ్చిన మొఘలు చక్రవర్తులను మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ తరిమికొట్టారు. ఆయనకు శ్రీశైల క్షేత్రానికి ఎంతో అనుబంధం ఉంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ 1630లో జన్మించగా హిందూ సామ్రాజ్య స్థాపన కోసం తన 16వ ఏటా నుంచి యుద్ధాలు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా 1677లో దక్షిణ భారతదేశం నుంచి దండయాత్ర మొదలు పెట్టి ముందుగా శ్రీశైలం చేరుకున్నారు. స్వతహాగా అమ్మవారి భక్తుడైన ఆయన అమ్మవారి దర్శనార్థం శ్రీశైలంలోనే 10 రోజుల పాటు బస చేశారు. శ్రీశైలంలో ప్రస్తుతం నిర్మించిన ధ్యాన కేంద్రం ప్రదేశంలో ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేసుకుని ధ్యానం చేశారు. ఆయన సాధనకు మెచ్చిన భ్రమరాంబాదేవి సాక్షాత్కరించి దివ్య ఖడ్గాన్ని శివాజీకి ప్రసాదించారని, అందుకు సాక్ష్యంగా ఇప్పటికీ శ్రీశైల ఆలయ ప్రాంగణంలో విగ్రహం కూడా ఉంది. శ్రీశైల ఆలయ ఉత్తర గోపురాన్ని శివాజీ 1677లో శ్రీశైలయానికి వచ్చినప్పుడు తన సైన్యంతో నిర్మించారని తెలుస్తోంది. రామచంద్ర పంత్ అనే తన మంత్రిని సుమారు 2 ఏళ్ల పాటు శ్రీశైలంలోనే ఉంచి గోపుర నిర్మాణాన్ని పూర్తి చేయించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. శివాజీ ధ్యానం చేసిన ప్రాచీన కట్టడం శిథిలం కావడం అక్కడే శివాజీ ధ్యాన మందిరాన్ని నిర్మించారు. ఛత్రపతి శివాజీ బస చేసిన ప్రదేశంలో ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించారు.



ధ్యాన కేంద్రంలో తపస్సు చేస్తున్నట్లుగా..



ధ్యాన మందిరంలో ఛత్రపతి ఖడ్గం, తలపాగా



త్రీడీ చిత్రాలను సందర్శిస్తున్న పర్యాటకులు

శివాజీ స్ఫూర్తి కేంద్రం విశేషాలు ఇవి..

- 1975లో శ్రీ శివాజీ మెమోరియల్ కమిటీ ఏర్పాటయ్యింది. 1983లో శివాజీ స్ఫూర్తి కేంద్రానికి అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి వసంత దాదా పాటిల్ శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి అంచలంచెలుగా నిర్మిస్తూ వచ్చారు. 1994లో పట్టాభిషక్తుడైన శివాజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 2004లో నిర్మాణాలు అన్ని పూర్తయి భక్తులకు అందుబాటులోకి వచ్చింది.
- ఈ కేంద్రంలో పట్టాభిషిక్తుడైన ఛత్రపతి శివాజీ క్యాంస విగ్రహం ఏర్పాటు చేశారు. అలాగే 10 మందితో కూడిన శివాజీ మంత్రి మండలి సాక్షాత్కరించేలా దర్బార్ నెలకొల్పారు. శివాజీ జీవిత చరిత్రను పర్యాటకులు తెలుసుకునేలా ఫైబర్ మెటీరియల్‌తో 23 బ్లాక్‌లలో త్రీడీ చిత్రాలు ఏర్పాటు చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కనడ భాషలలో జీవిత చరిత్ర విశేషాలను వివరించారు.
- దర్బార్ హాల్‌పక్కనే శివాజీ ధ్యానం చేసుకున్న ప్రదేశంగా ధ్యాన కేంద్రాన్ని నిర్మించారు. ధ్యాన కేంద్రాన్ని పూర్తి రాజస్థాన్ మెటీరియల్‌తో నిర్మించారు. ఈ మందిరం పెద్ద కోటను తలపిస్తుండడంతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ధ్యాన కేంద్రంలో శివాజీ ధాన్య ముద్రలో ఉన్న విగ్రహంతో పాటు శివాజీ వినియోగించిన ఖడ్గాన్ని చూడవచ్చు.
- శివాజీ కాంస్య విగ్రహాన్ని ముంబాయిలో తయారు చేయించారు. జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ (శిల్పాలు తయారు చేసే) కళాశాలలో ఈ విగ్రహాన్ని ఖాన్ విల్ ఖర్ అనే శిల్పి తయారు చేశారు. ఛత్రంతో కలిపి 12 అడుగుల ఎత్తుతో, 4.5 టన్నుల బరువుతో ఈ కాంస్య విగ్రహాన్ని తయారు చేయించారు.
- శివాజీని ఎప్పుడు గుర్రం పైనే చూస్తాం. కానీ శ్రీశైలంలో మాత్రం సింహాసనంపై కూర్చుని, శివాజీ దరహాసంతో కనిపిస్తారు. శివాజీపైన (ఛత్రం) గొడుగు ఉండడం విశేషం.
- 2021లో పుణెకు చెందిన చిత్ర కల్పక్ శిల్ప కళాశాలలో దర్బార్‌హాల్‌లో శివాజీ జీవిత విశేషాలతో ఫైబర్ మెటీరియల్‌తో త్రీడీ పిక్చర్స్‌ను తయారు చేయించి ఏర్పాటు చేశారు.

ఎల్‌ఈడీ లైట్లతో ప్రమాదం

- ఇష్టానుసారంగా వినియోగం
- ద్విచక్రవాహనాలు మొదలుకుని భారీ వాహనాల వరకు
- పట్టించుకోని ఆర్టీఏ శాఖ అధికారులు



కార్లుకు వినియోగించే ఎల్‌ఈడీ లైట్లు



ద్విచక్ర వాహనాలకు ఉపయోగించే ఎల్‌ఈడీ లైట్ల చిత్రం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నిబంధనలకు నీళ్ళొదిలేస్తున్నారు.. కనీస ఆలోచన లేకుండా.. ఇతరుల ప్రాణాలకు ముప్పు అని తెలిసినా.. ఎల్‌ఈడీ లైట్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ద్విచక్ర వాహనాలు మొదలుకుని.. ఆటోలు, లారీలు, ప్రైవేట్ బస్సుల్లో లైట్ల వినియోగం పెచ్చుమీరుతోంది. అయినా పట్టించుకోవాల్సిన రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు మాత్రం మొద్దు నిద్రపోతున్నారు. కొన్నాళ్ళ క్రితం గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం వద్ద ఒక బస్సులో అగ్నిప్రమాదం జరిగింది. అయితే ప్రమాదానికి కారణం తెలిసిన అధికారులు షాక్‌కు గురయ్యారు. నేరుగా ఇంజిన్ నుంచి ఎల్‌ఈడీ లైట్లకు వైర్లు అనుసంధానం చేయటం ద్వారానే ప్రమాదం జరిగిందని గుర్తించారు. ఆ ప్రమాదంలో బస్సు దగ్ధమై, ప్రయాణికులు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వాహనాలకు సంబంధించి ఎల్‌ఈడీ లైట్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధిస్తూ.. కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. భారీ ఫోకస్ వచ్చే లైట్లు వినియోగించటం ద్వారా ఎదురుగా వచ్చే వాహనదారులకు కనపడకపోవటంతోపాటు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు 90శాతం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కేవలం కంపెనీల ఫోకస్ లైట్లు ఇచ్చిన వాటి వరకే వినియోగించాలనేది చట్టం. అదనపు ఫిట్టింగ్‌లు చేయకూడదని స్పష్టంగా నిబంధనలు ఉన్నప్పటికీ.. వాహనదారులు యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు. వాహనాల చట్టం 1988 (మోటార్ వెహికల్ యాక్ట్) ప్రకారం వాహనాల్లో అనుమతించని మార్పుల్లో ఎల్‌ఈడీ లైట్లు వినియోగం ఒకటి. ఈ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం వాహనాల నిర్మాణం, ఫీచర్లలో అనుమతి లేకుండా మార్పులు చేయటం చట్ట విరుద్ధం. ఎల్‌ఈడీ లైట్లు హాలోజెన్ లైట్ల కంటే అధికంగా ప్రకాశిస్తాయి. తద్వారా ఇతర డ్రైవర్‌లకు గందరగోళం ఏర్పడటంతోపాటు, అంధత్వాన్ని కలిగించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పలు రాష్ట్రాల్లో ఆర్టీఏ, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం అధికమైన వాట్స్, అన్ అప్రూవ్డ్ లైట్లు నిషేధించిన పరిస్థితులు ఉన్నాయి. కారుల్లో 75 వాట్స్, లారీలకు 100 వాట్స్, బైక్‌లకు 10 వాట్స్‌లోపు మాత్రమే లైట్ల వినియోగం ఉండాలి.

అడ్డగోలుగా అమ్మకాలు..

మోటార్ వెహికల్ షాపుల్లో ఎల్‌ఈడీ లైట్ల విక్రయాలు చేపట్టకూడదని నిబంధనలు చెబుతున్నాయి ఆయా వాహనాన్ని బట్టి దాని వినియోగానికి సరిపడా వాట్స్ కంటే అధిక ప్రమాణాలు ఉండకూడదని నిబంధనలు ఉన్నాయి. రోడ్డు మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే లైట్లు వినియోగించాలి. అయితే దీనిపై చర్యలు తీసుకునేందుకు ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులకు అధికారం ఉంది. అయినా కనీస చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ఇటీవల కాలంలో కేసులు నమోదు చేసిన పరిస్థితి కూడా లేదని చెబుతున్నారు.

ఎల్‌ఈడీ లైట్లు వినియోగిస్తే చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా హెవీ ఫోకస్ ఉన్న ఎల్‌ఈడీ లైట్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా కేసులు నమోదు చేయటంతోపాటు, వాహనాలను సీజ్ చేస్తాం. అధిక వెలుగు వచ్చే లైట్లు వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ. కంపెనీలు అమర్చిన లైట్లు మినహా ఏ ఒక్కరూ విడిగా ఎల్‌ఈడీ లైట్లు పెట్టుకోకూడదు. ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

–ఎం. రమేష్
(గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ)

జైలు శిక్షకు కూడా అవకాశం

ఆర్టీఏ రూల్ ప్రకారం ఎల్‌ఈడీ లైట్లు వినియోగం చేపడితే వాహనాన్ని సీజ్ చేయటంతోపాటు జరిమానా విధించవచ్చు. జరిమానా రూ.1,000 నుంచి రూ.పదివేల వరకు పడే అవకాశం ఉంది. కొద్ది కాలం క్రితం బెంగుళూరుతో పాటు కర్ణాటక రాష్ట్రంలో కేవలం వారం రోజుల వ్యవధిలో 8వేల కేసులు నమోదు చేశారంటే ఎల్‌ఈడీ లైట్ల వినియోగం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. లైట్ల వినియోగం ద్వారా ఒక్కోసారి జైలు శిక్షకు దారి తీసే అవకాశాలు లేకపోలేదు.

కళావిహీనం.. ఆటపాక కేంద్రం

- నీటి కోసం అల్లాడుతున్న పక్షులు
- నిలిచిన బోటు షికారు
- చెరువు నీటిని నింపడంలో అధికారులు విఫలం



ఆటపాక పక్షుల విహార కేంద్రంలో నీరు లేక నిలిచిన షికారు బోట్లు



చెరువులో నీరు లేక బీటలు వారుతున్న దృశ్యం

కైకలూరు: రాష్ట్రంలో పక్షి ప్రేమికుల స్వర్గధామంగా ఉన్న ఏలూరు జిల్లా ఆటపాక పక్షుల విహార కేంద్రం కళావిహీనంగా మారింది. తీవ్ర నీటి కొరతతో పక్షులు అల్లాడుతున్నాయి. ఆహారం, ఆవాసం కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ఏటా నీటి కొరత ఏర్పడుతుందని తెలిసినా ముందస్తు చర్యలు చేపట్టడంలో అటవీ అధికారులు అలసత్వం వహిస్తున్నారని పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. ఆటపాకలో బోటు షికారు నిలిచిపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు నిరుత్సాహంతో తిరిగి వెళ్తున్నారు. ప్రపంచంలోనే అరుదైన పెలికాన్(గూడబాతు) పక్షులు ఆటపాక పక్షుల కేంద్రానికి సంతానోత్పత్తి కోసం వలస వస్తాయి. దీంతో ఈ కేంద్రాన్ని పెలికాన్ ప్యారడైజ్‌గా పిలుస్తారు. పక్షుల విహారానికి 286 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఇక్కడ అందుబాటులో ఉంది. విదేశీ పక్షుల గూడు నిమిత్తం, సంతానోత్పత్తికి వీలుగా 156 కృత్రిమ ఇనుప స్టాండ్లను అటవీశాఖ ఏర్పాటు చేసింది. కొల్లేరులో సాధారణంగా పెలికాన్, పెయింటెడ్ స్టోర్క్, టీల్స్, నైట్ హెరాన్, కింగ్ ఫిషర్స్, గ్లోబీ ఐబీస్, స్టిల్ట్, షావలర్స్, స్పూన్ బిల్స్ వంటి దాదాపు 189 రకాల పక్షులు విహరిస్తాయని అంచనా. పక్షుల సంతానోత్పత్తికి ఆటపాక పక్షుల కేంద్రం అనుకూలంగా ఉండటంతో ఎక్కువగా పక్షులు విచ్చేస్తున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కేంద్రాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి సర్వత్రా వినిపిస్తున్నాయి.

గట్ల ఎత్తు పెంచాలి

ఆటపాక పక్షుల కేంద్రంలో ప్రధానమైంది విహార చెరువు. కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఈ ప్రాంతంలో తొలగించిన చెరువులన్నింటినీ ఒక్కటిగా చేయడంతో చెరువు విస్తీర్ణం మరింతగా పెరిగింది. సాధారణంగా చెరువులో 6 అడుగులు నీటిని నిల్వ చేసుకోవచ్చు. గట్లు బలహీనంగా ఉండటంతో 4 అడుగులకు మించడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో చెరువు పూర్తిగా అడుగంటుతోంది. పక్షులు ఆహారంగా తీసుకునే చేపలు చనిపోతున్నాయి. చెరువు గట్ల ఎత్తు పెంచాలని ప్రతిపాదనలు పంపుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. మే నెలలో ఏకంగా చెరువు బీటలు వారుతోంది. దీంతో పక్షులకు ఆహార కొరత ఏర్పడడంతో కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవిస్తున్నాయి.

నీటి తరలింపులో జాప్యం

ఏటా పక్షుల కేంద్రం చెరువులో నీటిని నింపడం పెద్ద ప్రహసనంలా మారుతోంది. సమీప కోమటిలంక నాగరాజు డ్రెయిన్ నుంచి పక్షుల కేంద్రం చెరువుకు నీటిని నింపుతారు. వర్షాలు అధికంగా కురిస్తే డ్రెయిన్‌లో నీరు పెరుగుతుంది. ఆ సమయంలో తూములు తీసి చెరువుకు నీటిని పంపుతారు. ప్రస్తుతం నాగరాజు డ్రెయిన్ నీటిలో 8కిపైగా ఉప్పు శాతం ఉందని పరీక్షల్లో తేలింది. ఈ నీటిని నింపితే చెరువులో సహజసిద్ధంగా పెరిగిన చేపలు మరణిస్తాయి. ఈ కారణంతో నీటిని నింపడం లేదు. ఆటపాక గ్రామం పంట కాల్వ నుంచి నీటిని పైపుల ద్వారా నేరుగా పక్షుల కేంద్రం చెరువులోకి తరలించాలని ప్రతిపాదనలు చేస్తున్న ఆచరణ సాధ్యం కావడం లేదు. అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పక్షుల కేంద్రాన్ని స్వయంగా సందర్శించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఆటపాక పక్షుల కేంద్రంలో చెరువు గట్ల ఎత్తు పెంచడానికి ప్రతిపాదనలు పంపించాం. కోమటిలంక సమీప గట్లను మరమ్మతులు చేయించాం. చెరువు విస్తీర్ణం అధికంగా ఉండటంతో పూర్తి స్థాయిలో నీటిని నింపడానికి సాధ్యసాధ్యాలను పరిశీస్తున్నారు. ప్రస్తుతం ఆటపాకలో నీరు అడుగంటింది. బోటు షికారు నిలిపేశాం. చెరువులో పక్షుల ఆహారానికి కొరత లేదు.

– ఎం.రంజిత్‌కుమార్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కైకలూరు.

వేసవికి ముందుగానే నీటిని నింపాలి



వేసవికి ముందుగానే అటవీ అధికారులు ఆటపాక పక్షుల చెరువులో నీటిని నింపాలి. ఆటపాక పంట కాల్వ నుంచి రామాలయం మీదుగా నేరుగా పక్షుల కేంద్రం చెరువుకు అండర్ గ్రౌండ్ పైపులైన్లు ఏర్పాటు చేయాలి. పోల్‌రాజ్ డ్రెయిన్(నాగరాజు కాల్వ) నుంచి వర్షాల సమయంలో నీటిని చెరువులో నింపేందుకు మరిన్ని లాకులను ఏర్పాటు చేయాలి.

– ఎల్ఎస్.భాస్కరరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కట్టు కట్టినా సెట్టవ్వలేదా?



అది రోడ్డు ప్రమాదాలు గానీ, ఇంట్లో ఎత్తు నుంచి పడిపోవడంగానీ బాత్‌రూమ్‌లో జారిపడటం గానీ జరిగినప్పుడు మొదట అందరూ అడిగేది... ఎవరికైనా ఎముకలు విరిగాయా అని. ఇంగ్లిష్‌లో ఫ్రాక్చర్ అని పిలిచే ఈ ఎముకలు విరిగినప్పుడు ఆపరేషన్‌తో విరిగిన ఎముకల్ని దగ్గర చేయడం, ప్లేట్స్ వేయడం, సిమెంట్ కట్టు వేసి అతికించడానికి ప్రయత్నించడం వంటి వైద్య ప్రక్రియల్ని అనుసరిస్తూ ఉంటారు. విరిగిన ఎముకల్ని దగ్గరగా వచ్చేలా సెట్ చేసినప్పుడు చాలామందిలో సరిగ్గా అతుక్కునే ఎముకలు కొందరిలో అంతగా సెట్ కాకపోవచ్చు. దాంతో ఎముకలు సరిగా సెట్ కాలేదనీ, అతుక్కోలేదనీ కొందరు ఫిర్యాదు చేస్తుంటారు. ఇలాంటి కేసులనే ఫెయిల్యూర్ ఆర్థోపెడిక్స్ అని సాధారణ ప్రజలు చెబుతున్నప్పటికీ... వాస్తవానికి ఇలా సరిగా సెట్ కాని సందర్భాల్లో దీన్ని 'నాన్ యూనియన్ ఆఫ్ ఫ్రాక్చర్'గా చెబుతున్నారు. ఇలా సరిగా అతకనప్పుడు ఎముకలు ఉన్న సదరు అవయవం సరిగా పనిచేయకపోవడం, నొప్పి రావడంతో పాటు కొన్నిసార్లు ఆ కండిషన్ ప్రాణాంతకం కావడం అనే ముప్పు కూడా రావచ్చు. ఇలా ఎముకలు సరిగా అతకని సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన చికిత్సల వంటి పలు అంశాల గురించి తెలుసుకుందాం.



డాక్టర్ బాలవర్ధన్ రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్
ఆర్థోపెడిక్ సర్జన్

వాటంతటవే అతుక్కునే ఎముకలు...

విరిగిన ఎముక సరిగా అతకకపోవడం జరిగినప్పుడు అందుకు కారణాలూ, అందులో ఇన్‌వాల్వ్ అయిన అంశాలూ ఎన్నో ఉండవచ్చు. ఉదాహరణకు ఒక ఎముక రెండుగా విరిగినప్పుడు దాన్ని సరిగా కూర్చలేకపోతే (సెట్ చేయలేకపోతే) ఆ కండిషన్‌ను 'ఇన్‌సఫిషియెంట్ రిడక్షన్' అంటారు. అలాంటి పరిస్థితుల్లో విరిగిన ఎముక చక్కగా అతకదు. ఫలితంగా పూర్తిగా, సరిగా నయం కాదు. ఆ పరిస్థితినే 'నాన్‌యూనియన్' అంటారు.

ఏదైనా ఎముక విరిగినప్పుడు వాటిని సరిగా అమర్చి పెట్టి అలా కాలానికి వదిలేస్తే అవి వాటంతట అవే కుదురుకుని చక్కగా అతుక్కునే శక్తిని ప్రకృతి ఎముకకు ఇచ్చింది. అందుకే విరిగిన ఎముకను సరిగా సెట్ చేసి (అమర్చి) అలా వదిలేస్తే కాలం గడిచే కొద్దీ ఎముక దానంతట అదే నయమవుతుంది. ఇందుకు కావల్సినదల్లా ఆ విరిగిన ఆ ఎముక ముక్కల్ని సరిగా కూర్చడం / పేర్చడంలో నైపుణ్యమే. అయితే కొన్ని సందర్భాల్లో కాస్తంత ప్రత్యేక శ్రద్ధ, కొద్దిపాటి చికిత్స మాత్రం అవసరమవుతాయి. అందుకే చాలా సందర్భాల్లో అత్యంత నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స జరగకపోయినా ఎముకలు కుదురుకుంటాయి. ఎముకకు ఉన్న ఈ గుణం మూలానే కొన్నిచోట్ల సంప్రదాయ వైద్యం పేరిట ఎముకలను సెట్ చేసేవారూ ఎముకల్ని అతకగలుగుతుంటారు.

తనంతట తానే అతుక్కునే సామర్థ్యం ఎముకకు ఉన్నప్పటికీ నిపుణులైన వైద్యుల అవసరం ఎందుకు అవసరమంటే... విరిగిన ఎముకలకు కట్టు కట్టి పూర్తిగా సెట్ అయ్యేందుకు వదలాలంటే విరిగిన ప్రదేశంలో అవి సరిగా అమరేట్టుగా ఉంచడమన్నది చాలా ప్రధానం. ఇది సరిగా జరగకపోతే విరిగిన ఎముక సరిగా (ఖచ్చితంగా) అతుక్కోకపోవచ్చు లేదా నయం కావడమన్నది చాలా ఆలస్యంగా జరగవచ్చు. ఇలా ఎముక అతుక్కోవడంలో జాప్యం జరిగితే దాన్ని 'డిలేయ్‌డ్ యూనియన్' అంటారు. ఈ పరిస్థితిని కొందరు ఎదుర్కొంటారు. ఇక కొందరిలో ఎముక సరిగా అతకనే అతకదు. ఈ పరిస్థితిని 'నాన్ యూనియన్' అంటారు.

విరిగిన ఎముకలు అతుక్కోవడంలో ఎదురయ్యే సమస్యలివి...

విరిగిన ఎముక నయమయ్యే సమయంలో ఇతరత్రా అనేక సమస్యలు ఎదురుకావచ్చు. అసలు ఒక ఎముక అతుక్కోనేలేదని ఎప్పుడు చెప్పవచ్చంటే...

- మూడు నుంచి ఆర్నెల్ల తర్వాత కూడా విరిగిన ఎముక అతుక్కోకుండా ఉంటే దాన్ని ఎముక అతుక్కోవడంలో ఆలస్యం (డిలేయ్‌డ్ యూనియన్)గా చెప్పవచ్చు. ఒకవేళ ఆర్నెల్ల తర్వాత కూడా అతుక్కోకపోతే దాన్ని 'నాన్‌యూనియన్'గా పేర్కొనవచ్చు.
- ఒక చోట ఎముక అతకడంలో తీవ్రమైన ఆలస్యం జరుగుతోందంటే అక్కడ ఎముక అతుక్కోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అర్థం. జాప్యం తీవ్రంగా ఉందంటే దాన్ని కొంతమేర అతకని ఎముక (నాన్‌యూనియన్)గానే పరిగణించాల్సి ఉంటుంది.
- రెండుగా విరిగిన భాగాలు ఒకదానితో ఒకటి అతుక్కుపోయినప్పటికీ అది సరిగా ఖచ్చితమైన రీతిలో కూర్చినట్టుగా అతుక్కోకపోతే దాన్ని 'మాల్ యూనియన్' అంటారు. సాధారణంగా ఎముక సరిగ్గా రెండు ముక్కలుగా విరిగినప్పుడు దాన్ని సరిగా కూర్చుండబెట్టినప్పుడు సరిగానే అతుక్కుంటుంది. అయితే కొన్నిసార్లు దెబ్బ చాలా బలంగా పడి కొన్ని ఎముక విరిగిన చోట ముక్కలుగా అయిపోవడం వల్ల అతికించే ప్రక్రియలో ఖచ్చితంగా కూర్చలేని పరిస్థితులు ఏర్పడవచ్చు. దాని వల్ల ఎముక నిడివి కాస్త తగ్గవచ్చు. దీన్ని 'ఇన్‌సఫిషియెంట్ రిడక్షన్'గా పేర్కొంటారు.

పైన వివరించిన పరిస్థితులు ఏవైనప్పటికీ విరిగిన ఎముక సరిగా అతకకపోయినా లేదా అతుక్కోవడంలో ఆలస్యం జరిగినా బాధితులు అనేక సమస్యలు ఎదుర్కొంటారు.

అతుక్కోకపోవడమన్నది చాలా కొద్దిమందిలోనే...

ఫ్రాక్చర్ అయినవాళ్లలో కేవలం ఒక శాతం కేసుల్లోనే ఎముక అసలు అతుక్కోకపోవడం (నాన్-యూనియన్) జరుగుతుంటుంది. ఇలాంటి పరిస్థితి చాలా వరకు కాళ్ల ఎముకల విషయంలోనే ఎక్కువ. ఎందుకంటే కాలి ఎముక విరిగాక మళ్లీ కాళ్లు కదిలించాల్సి వచ్చినప్పుడు తగిలిన చోటే మళ్లీ మళ్లీ దెబ్బలు తగిలే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఈ కండిషన్ పునరావృతమయ్యే అవకాశాలెక్కువ.

- ఎముక సరిగా అతకకపోయినా (నాన్ యూనియన్‌లోనైనా) లేదా ఆలస్యంగా అతికినా (డిలేయ్‌డ్ యూనియన్‌లో) కనిపించే సాధారణ లక్షణాలివి...
- ఎముక విరిగిన చోట (ఫ్రాక్చర్ ప్రాంతంలో) నొప్పి తగ్గకపోవడం లేదా అదే పనిగా నొప్పి వస్తుండటం.
- ఎముక విరిగిన శరీర భాగాన్ని మునుపటిలా ఉపయోగించలేకపోవడం.
- ఎముక ఫ్రాక్చర్ అయిన చోట వాపు (స్వెల్లింగ్) రావడం.
- విరిగిన ఎముకకు సంబంధించిన కీలు (జాయింట్)ను కదల్చలేకపోవడం.
- విరిగిన ఎముక సరిగా అతుక్కోక కాస్త అటు ఇటు కదులుతుండటం.

సరిగా అతుక్కోని భాగాలు ఏవంటే...

నిజానికి శరీరంలోని ఏ ఎముక అయినా సరిగా అతుక్కోకపోవడానికి ఆస్కారం ఉంది. అయితే మన శరీరంలో కొన్ని ఎముకలు మాత్రం ఒక పట్టాన అతుక్కోకుండా ఇబ్బంది పెడుతుంటాయి. అందుకు పలు అంశాలు కారణమవుతుంటాయి. ఉదాహరణకు మిగతా ఎముకలతో పోలిస్తే ఆ ఎముకలకు రక్తసరఫరా సరిగా ఉండకపోవడం వంటివి. అందుకే ఆ ఎముకల విషయంలో తరచూ ఇలాంటి ఇబ్బంది కలుగుతుంది. ఆ ఎముకలు లేదా ఫ్రాక్చర్లు ఏవంటే...

- **టాలస్ ఫ్రాక్చర్** చీలమండ ఎముకల మధ్య ఉండే ఎముకకు అయిన ఫ్రాక్చర్.
- **స్కేఫాయిడ్ ఫ్రాక్చర్** మణికట్టుపై బరువు పడినప్పుడు అయిన ఫ్రాక్చర్‌లు.
- **ఫిఫ్త్ మెటాటార్సల్ (జోన్స్ ఫ్రాక్చర్)** అరికాలిలో ఉండే ఎముకల్లో ఒకటైన ఈ ఎముక ఫ్రాక్చర్ అయినప్పుడు అతుక్కోవడం ఒకింత కష్టం కావచ్చు.



- **లాటెరల్ కాండైల్ హ్యూమరస్ ఫ్రాక్చర్ :** మోచేతిలో బయటి వైపు ఉండే ఎముక విరిగితే దాన్ని లాటరల్ కాండైల్ హ్యూమరస్ ఫ్రాక్చర్ అంటారు. ఇది సరిగ్గా అతుక్కోవడంలో కొన్ని ఇబ్బందులు రావచ్చు.
- **ఫీమోరల్ నెక్ ఫ్రాక్చర్ :** తుంటి ఎముకలో తొడలో ఉండే కాలి ఎముక సరిగ్గా ఓ గిన్నెలాంటి భాగంలో బంతిలా కూర్చుంటుంది. ఈ బంతికీ, మిగతా ఎముకకూ మధ్య ఉండే సన్నటి భాగం (నెక్) విరిగినప్పుడు అది అంత త్వరగా సెట్ కాకపోవచ్చు.
- **ఫ్రాక్చర్ డిస్టల్ ఒన్ థర్డ్ టిబియా** కాలి ఎముకల్లో మోకాలి కింద ఉండే ఎముకల్లో రెండు భాగాలుంటాయి. అందులో ఒకటి టిబియా. ఈ టిబియా సరిగ్గా మధ్యకు కాకుండా రెండింట మూడు వంతులు ఒకవైపు... మూడోవంతు మరో వైపు ఉండేలా విరిగితే అతుక్కోవడం కాస్త కష్టం కావచ్చు.

డిలేయ్‌డ్ యూనియన్ / నాన్ యూనియన్‌కు కారణాలు

- ఎముక విరిగిన చోట కణజాలం కూడా తీవ్రంగా దెబ్బతినడం.
- ఎముక విరిగిన చోట మృదు కణజాలానికి కోలుకోలేనంత నష్టం జరగడం.
- ఎముక సరిగా అతకని ప్రాంతానికి తగినంత రక్తసరఫరా జరగకపోవడం.
- ఎముక సరిగా అతకని ప్రాంతంలో ఇన్ఫెక్షన్ రావడం.
- విరిగిన ఎముకను తగినంత సేపు కదలకుండా ఉంచకపోవడం. సపోర్టు తగినంతగా లభించకపోవడం (ఇన్‌సఫిషియెంట్ స్ప్లింటేజ్).
- రెండు ఎముకలు అతుక్కునేలా తగినంత ఒత్తిడి (కంప్రెషన్) కలిగించకపోవడం (ఒక ఎముక మరో ఎముకపై జారకుండా ఉండేలా... ఒకదానితో మరొకటి సరిగ్గా అమరిపోయేలా లేదా కలిసిపోయేలా ఉపయోగించే గరిష్ఠ ఒత్తిడిని కంప్రెషన్ అంటారు).

అవసరమైన పరీక్షలు

విరిగిన ఎముక సరిగా అతుక్కుందా లేక సరిగా అతుక్కోలేదా లేదా అతుక్కునే ప్రక్రియ ఆలస్యం అవుతోందా అన్న విషయాన్ని నిర్ధారణ చేయడానికి ఎక్స్-రే పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఎముక అతుక్కోకపోవడానికి కారణాలు

ఎముక అసలే అతుక్కోకపోవడాన్ని నాన్‌యూనియన్ అంటారు. సాధారణంగా ఆలస్యంగా అతుక్కోడానికి కారణమయ్యే అంశాలే ఎముక అసలు అతుక్కోకపోవడానికీ చాలావరకు కారణం కావచ్చు. దానితో పాటు మరికొన్ని కారణాలూ ఉండవచ్చు. అవేమిటంటే...

- **క్యాలస్ బ్రిడ్జ్ ఏర్పడకపోవడం :** రెండు ఎముకలు అతికించేందుకు దగ్గర చేసినప్పుడు వాటి మధ్య కొంత గ్యాప్ రావడం. దీని గురించి ఇంగ్లిష్‌లో చెప్పాలంటే... టూ లార్జ్ స్పేస్ ఫర్ ఫార్మేషన్ ఆఫ్ క్యాలస్ బ్రిడ్జ్‌గా దీన్ని పేర్కొంటారు... అంటే ఎముక అతుక్కునే ముందర రెండు ముక్కల మధ్య ఒక బ్రిడ్జిలాంటిది ఏర్పడుతుంది. దాన్నే 'క్యాలస్ బ్రిడ్జ్' అంటారు. గ్యాప్ రావడం వల్ల అది ఏర్పడదు.
- **ఇంటర్‌పొజిషన్ ఆఫ్ సాఫ్ట్ టిష్యూ :** అతుక్కోవాల్సిన రెండు ఎముకల మధ్య మృదుకణజాలం అడ్డుగా రావడం వల్ల ఎముక అతుక్కోదు. ఇలా జరగడాన్ని ఇంటర్‌పొజిషన్ ఆఫ్ సాఫ్ట్ టిష్యూ గా పేర్కొంటారు.

ఎముకలు అతకని పరిస్థితి నివారణ ఇలా...

శస్త్రచికిత్స రహిత విధానాలు

ఇందులో సర్జరీ లేకుండానే క్యాల్షియమ్ సప్లిమెంటేషన్ ఇవ్వడం, తొడుగులు వంటి ఉపకరణాలను అమర్చడం వంటి ప్రక్రియలను అవలంబిస్తారు.

చికిత్స

ఎముకలు సరిగా అతుక్కోకపోవడం లేదా ఆలస్యంగా అతుక్కోవడం వంటి సమస్య ఎదురైనప్పుడు అందుకు కారణమైన అంశాలను చూడాల్సి ఉంటుంది. కారణాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. ఎముక అతుక్కోవడంలో ఆలస్యం జరిగినప్పుడు ఎముక పెరిగేలా బోన్‌గ్రాఫ్ట్ వంటి ప్రక్రియలను కూడా అవలంబించాల్సి రావచ్చు.

శస్త్రచికిత్స

ఎముక సరిగా అతకని చోట బాధితులకు అవసరమైన శస్త్రచికిత్సను చేయడం.

ఇక ఎముక సరిగా అతకకపోవడం వంటి పరిస్థితిని నివారించడానికి...

- ఇలాంటి పరిస్థితిని నివారించాలంటే... ఎముక ఫ్రాక్చర్ అయిన వ్యక్తికి పొగతాగే అలవాటు ఉంటే దాన్ని తప్పనిసరిగా మానేయాలి.
- డాక్టర్ చెప్పిన చికిత్స ప్రక్రియను తప్పనిసరిగా అనుసరించాలి.
- అన్ని పోషకాలు అందేలా అన్ని పోషకాలు ఉన్న ఆహారాన్ని వేళకు తింటుండాలి.
- పొగతాగేవారు, స్థూలకాయులు, మధుమేహం (డయాబెటిస్) సమస్య ఉన్నవారిలో నాన్-యూనియన్‌కు అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఈ సమస్యలున్నవారు మరింత జాగ్రత్తగా ఉంటూ డాక్టర్ చెప్పే అని సూచనలనూ పాటించాల్సి ఉంటుంది.

వ్యాపార 'పద్మా'లు...

సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రతిష్టాత్మక 'పద్మ' పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జైడస్ లైఫ్‌సైన్సెస్ చైర్‌పర్సన్ పంకజ్ పటేల్ పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మశ్రీ గ్రహీతల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ చైర్‌పర్సన్ అరుంధతి భట్టాచార్య, పారిశ్రామికవేత్త పవన్ కుమార్ గోయెంకా ఉన్నారు. సుజుకీ మోటర్ మాజీ చీఫ్, దివంగత ఒసాము సుజుకీకి (మరణానంతరం) ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని సుజుకీ మోటర్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అందుకున్నారు. (చిత్రాలు ఎడమ నుంచి వరుసగా)






బిజినెస్ రీల్

తెలుగు రాష్ట్రాల్లో జియో ఎయిర్‌ఫైబర్ హవా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) విభాగానికి సంబంధించి జియో ఎయిర్‌ఫైబర్ జోరు కొనసాగుతోంది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాల ప్రకారం 2025 ఫిబ్రవరి నాటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో 5జీ ఎఫ్‌డబ్ల్యూఏలో ఎయిర్‌ఫైబర్ 85 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌ఫైబర్ యాక్టివ్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య జనవరిలో 4,27,439గా ఉండగా, ఫిబ్రవరిలో 4,58,372కి చేరింది. పోటీ సంస్థ భారతి ఎయిర్‌టెల్ యూజర్ల సంఖ్య ఫిబ్రవరిలో 95,164గా ఉంది. 5జీ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చుకోవడం, అందుబాటు ధరల్లో ప్లాన్లను అందించడం, మారుమూల ప్రాంతాలకు కూడా హై–స్పీడ్ కనెక్టివిటీని అందించడం వంటి అంశాలు సర్వీసులను విస్తరించడానికి తోడ్పడుతున్నాయని సంస్థ తెలిపింది.

ఆంధ్రప్రదేశ్‌లో బంధన్ బ్యాంక్ రెండు శాఖలు



కోల్‌కతా: ప్రైవేట్ రంగ బంధన్ బ్యాంక్ తమ కార్యకలాపాలను గణనీయంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా రెండు శాఖలు ప్రారంభించింది. అలాగే ఒరిస్సాలో ఏడు, బీహార్..జార్ఖండ్‌లలో చెరి మూడు, చత్తీస్‌గఢ్‌లో ఒకటి చొప్పున ఈ విడతలో మొత్తం 16 శాఖలు ప్రారంభించింది. సుస్థిర వృద్ధిపై ప్రధానంగా దృష్టి పెడుతూ, కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన వినూత్న సొల్యూషన్స్‌ను అందిస్తున్నామని బ్యాంక్ ఎండీ పార్థ ప్రతిమ్ సేన్‌గుప్తా ఈ సందర్భంగా తెలిపారు. కొత్తగా మొదలుపెట్టిన 16 శాఖలతో కలిపి బ్రాంచీల సంఖ్య 1,730కి చేరినట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-4-2025

విశాఖ	430-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	435-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
RELIANCE	1,366.30	5.07
SUNPHARMA	1,842.20	3.07
JSWSTEEL	1,058.30	2.91
BEL	305.3	2.59
DRREDDY	1,202.40	2.35

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	621.6	-5.13
ETERNAL	226.7	-0.92
ULTRACEMCO	12,128.00	-0.89
HCLTECH	1,550.00	-0.65
HINDUNILVR	2,317.60	-0.63

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,643
ఎన్ఎస్ఈ	90,099
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,72,089
ఎఫ్ఐఐ	+ 2,474
డీఐఐ	+ 2,817

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.00 (రాత్రి 11.30కు)	$ 63.11 (క్రితం ముగింపు)
బ్రెంట్	64.72 (రాత్రి 11.30కు)	$ 65.80 (క్రితం ముగింపు)

అక్షయ తృతీయ ఆఫర్లు షురూ

- బంగారం ధరల్లో డిస్కౌంట్
- తయారీ చార్జీల్లోనూ రాయితీలు
- అమ్మకాలు పెంచుకునే వ్యూహాలు

కోల్‌కతా: బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరిన తరుణంలో అక్షయ తృతీయ అమ్మకాలు తగ్గకుండా జ్యుయలర్లు మార్కెటింగ్ సన్నాహాలు మొదలుపెట్టారు. మరిన్ని అమ్మకాలు సాధించేందుకు వీలుగా డిస్కౌంట్‌లు, ఇతర ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ఈ నెల 30న అక్షయ తృతీయ (వైశాఖ శుద్ధ తదియ) అన్న విషయం తెలిసిందే. ఏటా ఆ రోజున బంగారం కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది ముందుకు వస్తుంటారు. ఈ ఏడాది అధిక ధరల నేపథ్యంలో అమ్మకాలపై మిశ్రమ అంచనాలు వ్యక్తమవుతుండడం గమనార్హం. దీంతో ప్రముఖ బ్రాండ్లు తనిష్క్, సెంకో గోల్డ్, ఎంపీ జ్యుయలర్స్, పీసీ చంద్ర జ్యుయలర్స్ ఇప్పటికే ఆఫర్లను ప్రకటించాయి.

- టాటా బ్రాండ్ తనిష్క్ బంగారం ఆభరణాల తయారీ చార్జీల్లో 20 శాతం తగ్గింపు ఇస్తున్నట్టు ప్రకటించింది.
- బంగారం ధరపై రూ.350 డిస్కౌంట్‌ను సెంకో గోల్డ్ ఆఫర్ చేస్తోంది. అలాగే తయారీ చార్జీల్లో 30 శాతం రాయితీ ఇస్తోంది. డైమండ్ ఆభరణాలపై తయారీ చార్జీల్లో 100 శాతం డిస్కౌంట్ ప్రకటించింది.



- ఎంపీ జ్యుయలర్స్ గ్రాము బంగారంపై రూ.300 డిస్కౌంట్ ప్రకటించింది. తయారీ చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తోంది.
- పీసీ చంద్ర జ్యుయలర్స్ గ్రాము బంగారంపై రూ.200.. తయారీ చార్జీల్లో 15 శాతం తగ్గింపు ఇస్తున్నట్టు తెలిపింది. డైమండ్ జ్యుయలరీపై 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది.

మంచి డిమాండ్ ఉంటుంది..

"అక్షయ తృతీయ సందర్భంగా అమ్మకాలు మంచిగా ఉంటాయని అంచనా వేస్తున్నాం. ఎందుకంటే వినియోగదారుల్లో బంగారం పట్ల విశ్వాసం బలంగా ఉంది''అని అంజలి జ్యుయలర్స్ డైరెక్టర్ అనర్ఘ ఉట్టియ చౌదరి తెలిపారు. దీంతో తయారీ చార్జీల్లో రాయితీలు ఇస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో బంగారాన్ని సురక్షిత సాధనంగా చూస్తున్నట్టు చెప్పారు. దీంతో బంగారంపై మరింత పెట్టుబడులకు కొనుగోలుదారులు మొగ్గు చూపించొచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితులే కొనసాగితే బంగారం ధరలు స్వల్పకాలంలో మరో 5–7 శాతం వరకు పెరగొచ్చని.. సమీప కాలంలో దిద్దుబాటు అవకాశాలు కనిపించడం లేదన్నారు. ధరలు పెరగడంతో అమ్మకాల పరిమాణం తగ్గినట్టు సెంకో గోల్డ్ ఎండీ, సీఈవో సువాంకర్ సేన్ తెలిపారు. అయితే అక్షయ తృతీయ సందర్భంగా కొనుగోళ్ల డిమాండ్ బలంగా ఉండొచ్చన్న అంచనాతో ఉన్నారు. ముత్యాలు, రత్నాలను చేర్చడం ద్వారా వివాహ ఆభరణాల ధరలను 25–30 శాతం వరకు తగ్గించే చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

జియో ఫైనాన్స్ యూజర్లకు గోల్డెన్ ఆఫర్

ముంబై: అక్షయ తృతీయను పురస్కరించుకుని పసిడి కొనుగోళ్లకు సంబంధించి జియో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. జియోఫైనాన్స్, మైజియో యాప్ యూజర్లకు జియో గోల్డ్ 24కే డేస్ ఆఫర్ ప్రకటించింది. దీని ప్రకారం ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు రూ. 1,000 నుంచి రూ. 9,999 వరకు విలువ చేసే డిజిటల్ గోల్డ్‌ను కొనుగోలు చేసే వారు జియోగోల్డ్1 కోడ్‌ను ఉపయోగించి అదనంగా 1 శాతం పసిడిని ఉచితంగా దక్కించుకోవచ్చు. రూ. 10,000కు మించిన కొనుగోళ్లపై జియోగోల్డ్‌ఎట్100 ప్రోమో కోడ్‌తో 2 శాతం పసిడి అందుకోవచ్చు. ఆఫర్ వ్యవధిలో ఒక్కో యూజరు 10 లావాదేవీల వరకు, గరిష్టంగా రూ. 21,000 వరకు విలువ చేసే పసిడిని పొందవచ్చు. గోల్డ్ సిప్‌లు కాకుండా ఏకమొత్తంగా చేసే పసిడి కొనుగోళ్లకు ఇది వర్తిస్తుంది.

యాపిల్ యాప్ స్టోర్ ద్వారా రూ. 44 వేల కోట్ల విక్రయాలు



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్ యాప్ స్టోర్ ద్వారా గతేడాది రూ. 44,447 కోట్ల విలువ చేసే డెవలపర్ల బిల్లింగులు, విక్రయాలు (ఉత్పత్తులు, సేవలు) నమోదయ్యాయి. యాపిల్‌కి కమీషన్లలాంటివి లేకుండా ఇందులో 94 శాతం భాగం నేరుగా డెవలపర్లు, వ్యాపార సంస్థలకే లభించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్)కి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ్ పింగళి నిర్వహించిన అధ్యయన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం గత అయిదేళ్లలో భారతీయ డెవలపర్లకు అంతర్జాతీయంగా వచ్చే ఆదాయాలు రెట్టింపయ్యాయి. ఫుడ్ డెలివరీ, ట్రావెల్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర రంగాలకు చెందిన యాప్‌ల వినియోగం గణనీయంగా పెరిగింది. గతేడాది భారతీయ డెవలపర్ల ఆదాయాల్లో దాదాపు 80 శాతం వాటా ఇతర దేశాల్లోని యూజర్ల నుంచే వచ్చింది. ఏడాది పొడవున యాప్ స్టోర్ నుంచి 75.5 కోట్ల సార్లు మన డెవలపర్ల యాప్‌లను యూజర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

ఆటో విడిభాగాలకు టారిఫ్‌ల సెగ

- రూ. 4.5 వేల కోట్ల ఆదాయానికి గండి
- ఇక్రా అంచనా

న్యూఢిల్లీ: టారిఫ్‌ల వల్ల ఎగుమతులు మందగించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ఆటో విడిభాగాల తయారీ సంస్థల ఆదాయాలు సుమారు రూ. 4,500 కోట్ల మేర క్షీణించవచ్చని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 3 లక్షల కోట్లుగా పరిశ్రమ ఆదాయం నమోదైందని, ఒకవేళ టారిఫ్‌ల వివాదం వల్ల అమెరికాకు ఎగుమతులు మధ్యస్థ–గరిష్ట సింగిల్ డిజిట్ స్థాయిలో క్షీణించిన పక్షంలో 2025–26లో ఆదాయ వృద్ధి 6–8 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంది. గతంలో ఇది 8–10 శాతంగా ఉండొచ్చని ఇక్రా అంచనా వేసింది. భారీ టారిఫ్‌ల వల్ల సరఫరా వ్యవస్థపై అదనంగా రూ. 9,000 కోట్ల భారం పడుతుందని, దీన్ని అమెరికా వినియోగదారులు, అక్కడి దిగుమతిదారులు, భారతీయ ఎగుమతిదారులు భరించాల్సి వస్తుందని వివరించింది. సరఫరాదారు ప్రాధాన్యత, పోటీ, సాంకేతిక ప్రాధాన్యత అంశాలను బట్టి వారు ఎంత మేర భారాన్ని బదలాయించగలరనేది ఆధారపడి ఉంటుందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షంషేర్ దివాన్ తెలిపారు. ఒకవేళ అదనపు టారిఫ్ వ్యయాల్లో 30–50 శాతాన్ని భారతీయ ఆటో విడిభాగాల ఎగుమతిదారులు భరించే పక్షంలో సుమారు రూ. 2,700–4,500 కోట్ల భారం మోయాల్సి వస్తుందని వివరించారు. ఇది పరిశ్రమ నిర్వహణ లాభాల్లో 3–6 శాతమని, ఆటో విడిభాగాల ఎగుమతిదార్ల నిర్వహణ లాభాల్లో 10–15 శాతం అని పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ మొత్తం ఆదాయాల్లో అమెరికా వాటా సుమారు 8 శాతంగా నమోదైంది. 2020–24 మధ్య కాలంలో అమెరికాకు ఆటో విడిభాగాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15 శాతం స్థాయిలో పెరిగాయి. ఇంజిన్లు, ఎలక్ట్రికల్ కాంపొనెంట్లులాంటి కీలకమైన ఆటోమొబైల్ విడిభాగాలపై మే 3 నుంచి అమల్లోకి వచ్చేలా అమెరికా 25 శాతం టారిఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్ ఎగుమతి చేసే విడిభాగాల్లో దాదాపు 65 శాతం కాంపొనెంట్లు 25 శాతం టారిఫ్‌ల కేటగిరీలోకి వస్తాయి.



ఏటీఎంలలో రూ. 100, 200 నోట్లను పెంచండి

బ్యాంకులకు, ఆర్‌బీఐ సూచన

న్యూఢిల్లీ: ప్రజలకు రూ. 100, రూ. 200 నోట్లు మరింతగా అందుబాటులో ఉండేలా ఏటీఎంలలో ఆయా డినామినేషన్ నోట్ల లభ్యతను మరింతగా పెంచాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించింది. దశలవారీగా ఈ ఆదేశాలను అమలు చేయాలని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు ఒక సర్క్యులర్‌లో సూచించింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి 75 శాతం ఏటీఎంలలో కనీసం ఒక్క క్యాసెట్‌లోనైనా రూ. 100 లేదా రూ. 200 నోట్లు ఉండేలా చూడాలని తెలిపింది. 2026 మార్చి 31 నాటికి దీన్ని 90 శాతం ఏటీఎంలకు పెంచాలని పేర్కొంది.

తయారీని బలోపేతం చేసేందుకు కమిటీ

న్యూఢిల్లీ: ప్రతిపాదిత జాతీయ తయారీ కార్యక్రమం రూపురేఖలను ఖరారు చేయడానికి వీలుగా ప్రభుత్వం ఓ అంతర్ మంత్రిత్వ కమిటీని నియమించింది. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం చైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీ భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు నిర్వహించనున్నట్టు ఓ అధికారి తెలిపారు. భారత్‌లో తయారీని మరింత ప్రోత్సహించేందుకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం లోగడే ప్రకటించడం గమనార్హం. దీన్ని ఇప్పుడు ఆచరణలోకి తీసుకొచ్చింది. వ్యాపార నిర్వహణ వ్యయాలు తగ్గించడం, భవిష్యత్‌కు అనుగుణమైన ఉద్యోగులను సిద్ధం చేయడం, ఎంఎస్ఎంఈని బలోపేతం చేయడం, టెక్నాలజీ లభ్యత, నాణ్యమైన ఉత్పత్తులు.. అనే ఐదు అంశాలపై ఈ కమిటీని కీలక సిఫారసులు చేయనుంది.

యూట్యూబ్ కంట్రీ ఎండీగా గుంజన్ సోని

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ భారత విభాగం ఎండీగా గుంజన్ సోని నియమితులయ్యారు. ఆమె గతంలో జలోరా, స్టార్ ఇండియా, మింత్రా వంటి సంస్థల్లో కీలక హోదాల్లో సేవలు అందించారు.

బిజినెస్, టెక్నాలజీ, మార్కెటింగ్, ఈ–కామర్స్ తదితర విభాగాల్లో రెండు దశాబ్దాలపైగా అనుభవం ఉంది. సింగపూర్‌కి చెందిన జలోరాలో గత ఆరేళ్లుగా ఆమె గ్రూప్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. కొత్త కేటగిరీలు, ఆవిష్కరణలను ప్రవేశపెట్టడంలో కీలకంగా వ్యవహరించారు. స్టార్ ఇండియాలో ఈవీపీగా, మింత్రాలో సీఎంవోగా వ్యవహరించినందున ఆమెకు భారతీయ మీడియా, మార్కెటింగ్ రంగాల్లో కూడా గణనీయంగా అనుభవం ఉందని సంస్థ తెలిపింది. అంతక్రితం ఆమె మెకిన్సేలో పార్ట్‌నర్‌గా వ్యవహరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీ అయిన సీబీఆర్ఈ గ్రూప్ బోర్డులో ఉన్నారు.

మార్చి త్రైమాసిక ఫలితాలు

పీఎన్‌బీ హౌసింగ్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 550 కోట్లు
- షేరుకి రూ. 5 డివిడెండ్

న్యూఢిల్లీ: గృహ రుణ రంగ సంస్థ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 550 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 439 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,814 కోట్ల నుంచి రూ. 2,037 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 5 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. వడ్డీ ఆదాయం రూ. 1,693 కోట్ల నుంచి రూ. 1,906 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 16 శాతం పుంజుకుని రూ. 734 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.65 శాతంనుంచి 3.75 శాతానికి మెరుగయ్యాయి. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) ఫ్లాట్‌గా 1.08 శాతంవద్ద నిలవగా.. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 13 శాతం వృద్ధితో రూ. 80,397 కోట్లకు చేరాయి. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 1,936 కోట్లయ్యింది. 2023–24లో రూ. 1,508 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 7,024 కోట్ల నుంచి రూ. 7,661 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ హౌసింగ్ బీఎస్ఈలో 1.6 శాతం లాభంతో రూ. 987 వద్ద ముగిసింది.

యుకో బ్యాంక్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 666 కోట్లు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ సంస్థ యుకో బ్యాంక్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ. 666 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 538 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,984 కోట్ల నుంచి రూ. 8,136 కోట్లకు ఎగసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం రూ. 1,671 కోట్ల నుంచి రూ. 2,468 కోట్లకు జంప్‌చేసింది. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 3.46 శాతం నుంచి 2.69 శాతానికి దిగిరాగా.. నికర ఎన్‌పీఏలు 0.89 శాతం నుంచి 0.5 శాతానికి తగ్గాయి. క్యూ4లో ప్రభుత్వ వాటా 95.39 శాతం నుంచి 90.95 శాతానికి క్షీణించింది.

ఫలితాల నేపథ్యంలో యుకో బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1.7 శాతం లాభంతో రూ. 31 వద్ద ముగిసింది.

ఐడీబీఐ బ్యాంక్ లాభం అప్

- క్యూ4లో రూ. 2,051 కోట్లు
- షేరుకి రూ. 5 డివిడెండ్



న్యూఢిల్లీ: పీఎస్‌యూ బీమా దిగ్గజం ఎల్ఐసీ నియంత్రణలోని ఐడీబీఐ బ్యాంక్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 2,051 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,628 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,887 కోట్ల నుంచి రూ. 9,035 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం నామమాత్ర క్షీణతతో రూ. 6,979 కోట్లకు పరిమితమైంది. వాటాదారులకు షేరుకి రూ. 2.1 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 7,515 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 5,634 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 30,037 కోట్ల నుంచి రూ. 33,826 కోట్లకు ఎగసింది. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 4.53 శాతం నుంచి 2.98 శాతానికి దిగిరాగా.. నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.15 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఐడీబీఐ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 2.1 శాతం లాభంతో రూ. 83 వద్ద ముగిసింది.

ఆదిత్య బిర్లా ఏఎంసీ లాభం ఓకే

- క్యూ4లో రూ. 228 కోట్లు
- షేరుకి రూ. 24 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 9 శాతం వృద్ధితో రూ. 228 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 208 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం ఎగసి రూ. 429 కోట్లకు చేరింది. 2023–24 క్యూ4లో రూ. 366 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 24 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో ఏబీ ఏఎంసీ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 642 వద్ద ముగిసింది.

మహిళలకు ఉద్యోగాల బూమ్

- జనవరి–మార్చి మధ్య అధిక నియామకాలు
- ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ ఆప్నా వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో ఉద్యోగ దరఖాస్తులు (నియామకాలు) గణనీయంగా పెరిగినట్టు.. ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం పెరిగినట్టు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ ఆప్నా వెల్లడించింది. సౌకర్యవంతమైన పని నమూనాలు, టైర్–2, 3 పట్టణాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆప్నా ఒక నివేదికను విడుదల చేసింది. జనవరి–మార్చి మధ్య 1.81 కోట్ల ఉద్యోగ దరఖాస్తులు వచ్చాయని, గతేడాది మొదటి మూడు నెలలతో పోల్చితే 30 శాతం పెరిగినట్టు తెలిపింది. బీపీవో, ఫైనాన్స్, హెచ్ఆర్ తదితర విభాగాల్లో నియామకాలు పెరగడం, ఆర్థిక వ్యవస్థ పట్ల ఆశావహ పరిస్థితులకు ఈ గణాంకాలు నిదర్శమని పేర్కొంది. ముఖ్యంగా మహిళల నుంచి దరఖాస్తులు 23 శాతం పెరిగి 62 లక్షలుగా ఉన్నాయి. మొత్తం దరఖాస్తుల్లో ఫ్రెషర్ల (ఉద్యోగానికి కొత్త/అనుభవం లేని) నుంచి వచ్చినవి 66 లక్షలు ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 46 శాతం పెరిగాయి. చండీగఢ్, ఇండోర్, జమ్‌షెడ్‌పూర్ తదితర టైర్ 2, 3 పట్టణాల నుంచి అధిక దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా ఆప్నా ప్లాట్‌ఫామ్‌పై 3.1 లక్షల జాబ్ పోస్టింగ్‌లు నమోదయ్యాయి. 2024 క్యూ1తో పోల్చితే 26% పెరిగాయి. చిన్న, మధ్య తరహా సంస్థల నుంచి ఎక్కువగా ఉన్నాయి.

వరంగల్‌లో పెరుగుతున్న టెక్ నియామకాలు

ఎల్ఐసీ, పేటీఎం, డెల్హివరీ, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థల నుంచే లక్ష నియామకాలు జరిగాయి. ఇవి మెట్రోలకు బయట ఇతర పట్టణాల్లోనూ నియామకాలు చేపట్టాయి. సాఫ్ట్‌వేర్/వెబ్ డెవలపర్ ఉద్యోగాలకు పోస్టింగ్‌లు 65 శాతం మేర పెరిగాయి. ఈ పోస్టులకు ఫ్రెషర్ల నుంచి 42 శాతం అధికంగా దరఖాస్తులు రావడం గమనార్హం. ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, బిజినెస్ ఇంటెలిజెన్స్ తదితర ఉద్యోగాల్లో నిపుణుల అవసరం పెరిగింది. ఇక కొత్త నియామకాల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. జైపూర్ లక్నో, రాజ్‌కోట్, వరంగల్ టెక్నాలజీ ఉద్యోగ నియామకాల్లో కీలక కేంద్రాలుగా అవతరిస్తున్నట్టు ఆప్నా నివేదిక వెల్లడించింది. ఈ పట్టణాల్లో 30–50 శాతం వృద్ధి కనిపించినట్టు పేర్కొంది. దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 2030 నాటికి ట్రిలియన్ డాలర్లకు చేరుకునే విషయంలో టైర్ 2, 3 పట్టణాలు కీలక పాత్ర పోషించనున్నట్టు తెలిపింది.


సాక్షి ప్లస్
మంగళవారం | 29-4-2025

ఐపీఎల్‌లో 94 మ్యాచ్‌లు!

2028 సీజన్ నుంచి అమలు చేసే అవకాశం

- ఈసారి కొత్త చాంపియన్‌ను చూడొచ్చు
- ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ వ్యాఖ్య





అరుణ్ ధుమాల్

న్యూఢిల్లీ: మండు వేసవిలో అభిమానులకు క్రికెట్ విందు పంచుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మరింత విస్తరించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం లీగ్‌లో 10 జట్లు 74 మ్యాచ్‌లు ఆడుతున్నాయి. అయితే ఇందులో 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి తమ గ్రూప్‌లోని జట్లతో రెండేసి మ్యాచ్‌లు, ఇతర గ్రూప్‌లోని జట్లతో ఒక్కో మ్యాచ్ నిర్వహిస్తున్నారు. దీంతో సీజన్‌లో ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడుతోంది. 2022లో గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు ఐపీఎల్‌లో భాగమైనప్పటి నుంచి ఇదే ఫార్మాట్ కొనసాగుతోంది. అయితే ప్రతి జట్టు మరో జట్టుతో ఇంటా, బయట మ్యాచ్‌లు ఆడితే ఆ సంఖ్య 94కు చేరనుంది. గత కొంతకాలంగా దీనిపై చర్చ నడుస్తుండగా... తదుపరి ప్రసార హక్కుల సర్కిల్ నుంచి దీన్ని ప్రారంభించే అవకాశం ఉందని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ అన్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ అంశంపై కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం లీగ్ ప్రసార హక్కుల ఒప్పందం గడువు 2027 వరకు ఉంది. ఆ తర్వాత 2028 నుంచి కొత్త సర్కిల్‌లో ప్రసారదారులతో చర్చించిన అనంతరం మ్యాచ్‌లను పెంచే అంశాన్ని పరిశీలిస్తామని ధుమల్ అన్నారు. కాగా, ఫ్రాంచైజీలో సంఖ్య పెంచే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. మ్యాచ్‌ల సంఖ్య పెంచితే... అంతర్జాతీయ షెడ్యూల్ నుంచి మరికొంత సమయం కావాల్సి ఉంటుంది. గత మూడు సీజన్‌లను చూసుకుంటే... లీగ్ రెండు నెలలకు మించి సాగింది. మరో 20 మ్యాచ్‌లు పెరిగితే కనీసం రెండు వారాల సమయం అవసరమవుతుంది... ఈ నేపథ్యంలో అరుణ్ ధుమాల్ చేసిన వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే...

- ఐపీఎల్‌లో మ్యాచ్‌లు పెంచే అంశంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)తో చర్చిస్తాం. బీసీసీఐ దీనిపై స్పష్టతతో ఉంది. ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్లు, టి20లు, ఫ్రాంచైజీ క్రికెట్‌కు సంబంధించి అభిమానుల ఆసక్తి మారుతోంది. దీనిపై మరింత అధ్యయనం చేసి లీగ్ వాటాదారులకు గరిష్ట విలువ చేకూరే విధంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
- ప్రతి జట్టు, మరో జట్టుతో రెండేసి మ్యాచ్‌లు ఆడితే మొత్తం సీజన్‌లో 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్ల నేపథ్యంలో ఇప్పటికిప్పుడు అన్ని మ్యాచ్‌లు పెంచడం సాధ్యం కాకపోవచ్చు. కానీ గత కొన్నేళ్లుగా మారుతున్న పరిస్థితులను గమనిస్తే అతి త్వరలో మ్యాచ్‌ల సంఖ్య పెంచే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుంది.
- ఈ ఏడాది టీమిండియా షెడ్యూల్ చాలా బీజీగా ఉంది. ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' అనంతరం చాంపియన్స్ ట్రోఫీ... ఇప్పుడు ఐపీఎల్. ఇలాంటి సందర్భంలో ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లోనే మ్యాచ్‌ల సంఖ్య 74 నుంచి 84కు పెంచడంలో అర్థం లేదు. కానీ ఏదో ఒక రోజు అది జరగక మానదు.
- వచ్చే ఏడాది ఫ్యూచర్ టూర్ ప్లాన్ (ఎఫ్‌టీపీ) సమయంలో దీనిపై మరింత చర్చ జరిగే అవకాశం ఉంది. లీగ్‌లోని ఎక్కువ ఫ్రాంచైజీలు 94 మ్యాచ్‌ల నిర్వహణ వైపు మొగ్గుచూపుతున్నాయి. అయితే ప్రసారదారుల అభిప్రాయం కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది.
- ప్రస్తుతానికి లీగ్‌లో జట్లను పెంచే ఆలోచన లేదు. 10 అనేది మంచి సంఖ్యే. అన్నీ జట్లు నాణ్యమైన ఆట ఆడుతున్నాయి. ఇలాంటి సమయంలో మరిన్ని కొత్త ఫ్రాంచైజీలను తీసుకొచ్చే ఆలోచన లేదు. భవిష్యత్తులో చూద్దాం.
- ఐపీఎల్ 18వ సీజన్‌లో కొత్త చాంపియన్ అవతరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు మంచి ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ రేసులో ముందు వరుసలో ఉన్నాయి. కొత్త జట్టు చాంపియన్‌గా నిలిస్తే అందరికీ సంతోషమే.
- లీగ్ ఆరంభం నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి సాధిస్తోంది. గతేడాదికి ఈ ఏడాదికి పోల్చుకుంటే ఐపీఎల్ విలువ మరింత పెరిగింది. తాజా సీజన్‌లో నమోదవుతున్న వీక్షణలే అందుకు నిదర్శనం. ప్రేక్షకుల ఆదరణే దీనికి ప్రధాన కారణం. మున్ముందు కూడా ఇదే పురోభివృద్ధి ఖాయం.

ఐపీఎల్ పరిణామక్రమం

ఏడాది	రోజులు	జట్లు	మ్యాచ్‌లు	డే–మ్యాచ్‌లు
2008	44	8	59	15
2009	36	8	59	59
2010	44	8	60	17
2011	50	10	74	25
2012	53	9	76	25
2013	53	9	76	25
2014	46	8	60	20
2015	46	8	60	16
2016	50	8	60	12
2017	46	8	60	12
2018	50	8	60	12
2019	50	8	60	12
2020	52	8	60	10
2021	49	8	60	11
2022	64	10	74	12
2023	60	10	74	18
2024	65	10	74	12
2025	64	10	74	12

నోట్: వేర్వేరు కారణాలతో ఐపీఎల్ 2009 సీజన్‌ను దక్షిణాఫ్రికాలో... 2020 సీజన్‌ను యూఏఈలో నిర్వహించారు. 2014, 2021లో భారత్‌తో పాటు యూఏఈలో మ్యాచ్‌లు నిర్వహించారు.

ప్రతి బంధకాలేంటి!

- సాధారణంగా ఐపీఎల్ సీజన్ ఆరంభమైన సమయంతో పాటు... ముగింపు దశకు చేరుకున్నప్పుడు ఎక్కువ మంది వీక్షిస్తారు. సీజన్ మధ్యలో వీక్షకుల సంఖ్య తగ్గుతోంది. ఈ నేపథ్యంలో... లీగ్‌ను మరింత పొడిగిస్తే అభిమానుల ఆసక్తి సన్నగిల్లే ప్రమాదం ఉంది.
- వారాంతాలతో పోల్చుకుంటే... మిగిలిన రోజుల్లో అటు మైదానాలతో పాటు ఇటు ప్రసార మాధ్యమాల్లోనూ ఎక్కువ మంది మ్యాచ్‌లపై ఆసక్తి చూపడం లేదు.
- ప్రస్తుతం ఐపీఎల్ సమయంలో వేరే ప్రధాన అంతర్జాతీయ మ్యాచ్‌లేవి జరగడం లేదు. అందుకు తగ్గట్లు అంతర్జాతీయ క్యాలెండర్‌ను రూపొందిస్తున్నారు. లీగ్‌లో 94 మ్యాచ్‌లు నిర్వహించాలంటే అంతర్జాతీయ క్యాలెండర్‌లో మరో 2 వారాలు ఐపీఎల్‌కు కేటాయించాల్సి ఉంటుంది.
- ఐపీఎల్ 18వ సీజన్‌లో 12 'డబుల్ హెడర్స్' నిర్వహిస్తున్నారు. మ్యాచ్‌ల సంఖ్య పెంచితే వారాంతాల్లో నిర్వహించే రెండేసి మ్యాచ్‌ల సంఖ్య కూడా పెంచాల్సి ఉంటుంది. మధ్యాహ్నం ప్రారంభమయ్యే మ్యాచ్‌లకు పెద్దగా ఆదరణ ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే డబుల్ హెడర్‌లు తక్కువ ఉండాలని ప్రసారదారులు కోరుతున్నారు.

జింబాబ్వే 227/9

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు


నిక్ వెల్చ్, సీన్ విలియమ్స్

చట్టోగ్రామ్ (బంగ్లాదేశ్): నాలుగేళ్ల విరామం తర్వాత టెస్టు మ్యాచ్ నెగ్గిన జింబాబ్వే జట్టు... అదే నిలకడ కొనసాగించలేకపోతోంది. బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా సోమవారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే బ్యాటర్లు తడబడ్డారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పర్యాటక జట్టు... తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. నిక్ వెల్చ్ (133 బంతుల్లో 54; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), సీన్ విలియమ్స్ (166 బంతుల్లో 67; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో రాణించారు. ఈ ఇద్దరు సాధికారికంగా ఆడటంతో ఒకదశలో 162/2తో పటిష్ట స్థితిలో నిలిచిన జింబాబ్వే... ఆ తర్వాత విరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. బంగ్లాదేశ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (5/60) విజృంభించడంతో జింబాబ్వే బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. బ్రియాన్ బెనెట్ (21), బెన్ కరెన్ (21) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ ఇర్విన్ (5), వెస్లీ మధెవెరె (15), వెల్లింగ్టన్ మసకద్జ (6), రిచర్డ్ (0) విఫలమయ్యారు. వికెట్ కీపర్ ట్సిగా (18 బ్యాటింగ్)తో పాటు బ్లెస్సింగ్ ముజరబానీ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తైజుల్ ధాటికి జింబాబ్వే 55 పరుగుల వ్యవధిలో ఏడు వికెట్లు కోల్పోయింది. టెస్టు క్రికెట్‌లో అతడికిది 16వసారి ఐదు వికెట్ల ప్రదర్శన. నయీమ్ హసన్ 2 వికెట్లు పడగొట్టాడు.



ఐదేళ్ల తర్వాత...

ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ టైటిల్ నెగ్గిన లివర్‌పూల్ క్లబ్

లండన్: ప్రతిష్టాత్మక ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) టైటిల్‌ను రెండోసారి లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు సొంతం చేసుకుంది. ఈ సీజన్‌లో మరో నాలుగు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే లివర్‌పూల్ జట్టుకు టైటిల్ ఖరారు కావడం విశేషం. టోటెన్‌హామ్ క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో లివర్‌పూల్ 5–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించడంతో ఆ జట్టుకు అధికారికంగా టైటిల్ ఖాయమైంది. ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్‌లో లివర్‌పూల్ జట్టు తొలిసారి 2019–2020 సీజన్‌లో విజేతగా అవతరించింది. కాగా 2024–2025 సీజన్‌లో లివర్‌పూల్ జోరు మీదుంది. మొత్తం 20 జట్లు ఈపీఎల్‌లో పోటీపడుతున్నాయి. ఇంటా, బయట పద్ధతిలో ఒక్కో జట్టు 38 మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 34 మ్యాచ్‌లు ముగిశాయి. మే 25వ తేదీతో సీజన్ ముగుస్తుంది. లివర్‌పూల్ జట్టు 34 మ్యాచ్‌లు ఆడి 25 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఏడు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది మొత్తం 80 గోల్స్ చేసిన లివర్‌పూల్ ప్రత్యర్థి జట్లకు 32 గోల్స్ సమర్పించుకుంది. ఓవరాల్‌గా 82 పాయింట్లతో లివర్‌పూల్ అగ్రస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న అర్సెనల్ జట్టుకు తొలి స్థానంలో ఉన్న లివర్‌పూల్ జట్టు మధ్య 15 పాయింట్ల వ్యత్యాసం ఉంది. మిగిలిన చివరి నాలుగు మ్యాచ్‌ల్లో లివర్‌పూల్ జట్టు ఓడిపోయి, అర్సెనల్ జట్టు నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచినా అగ్రస్థానంలో ఉన్న లివర్‌పూల్ జట్టును అందుకోవడం సాధ్యంకాదు. ప్రస్తుత సీజన్‌లోని లివర్‌పూల్ జట్టులో ఇంగ్లండ్‌కు చెందిన ఏడుగురు ఆటగాళ్లు సభ్యులుగా ఉండగా, మిగతా సభ్యులు విదేశీ ఆటగాళ్లు. ఈజిప్ట్‌కు చెందిన స్టార్ ఫార్వర్డ్, లివర్‌పూల్ కీలక సభ్యుడు మొహమ్మద్ సలా ఈ సీజన్‌లో 28 గోల్స్ చేసి ఈపీఎల్ టాప్ గోల్ స్కోరర్‌గా ఉన్నాడు. ఓవరాల్‌గా ఇంగ్లిష్ ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్‌షిప్‌లో లివర్‌పూల్ జట్టుకిది 20వ టైటిల్ కావడం విశేషం. ఈ క్రమంలో అత్యధికంగా 20 సార్లు ఇంగ్లిష్ ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్‌గా నిలిచిన మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్ రికార్డును లివర్‌పూల్ జట్టు సమం చేసింది.

విజేతగా నిలిచిన లివర్‌పూల్ జట్టు సభ్యులు: విర్జిల్ వాన్ డిక్ (కెప్టెన్; నెదర్లాండ్స్), అలీసన్ బెకర్ (బ్రెజిల్), జో గోమెజ్, కర్టిస్ జోన్స్, హార్వే ఇలియట్, ట్రెంట్ అర్నాల్డ్, జారెల్ క్వాన్‌సా, టైలర్ మోర్టన్, హార్వే డేవిస్ (ఇంగ్లండ్), వటారు ఎండో (జపాన్), ఇబ్రహిమా కొనాటె (ఫ్రాన్స్), లుయిస్ డియాజ్ (కొలంబియా), డొమినిక్ జొబోస్లా (హంగేరి), డార్విన్ నునెజ్ (ఉరుగ్వే), అలెక్సిస్ అలిస్టర్ (అర్జెంటీనా), మొహమ్మద్ సలా (ఈజిప్ట్), ఫెడరికో చియాసా (ఇటలీ), కోడీ గాప్కో (నెదర్లాండ్స్), డీగో జోటా (పోర్చుగల్), కొస్టాస్ సిమికాస్ (గ్రీస్), ఆండ్రూ రాబర్ట్‌సన్ (స్కాట్లాండ్), రియాన్ గ్రావెన్‌బెర్చ్ (నెదర్లాండ్స్), విటెజ్‌స్లావ్ జరోస్ (చెక్ రిపబ్లిక్), కెలెర్ (ఐర్లాండ్), కానర్ బ్రాడ్లీ (నార్తర్న్ ఐర్లాండ్).

కరెంటు కోతలతో..

మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ మ్యాచ్‌లు రద్దు



బార్సిలోనా: సాధారణంగా వర్షం కారణంగానో, వెలుతురులేమి కారణంగానో, ఫ్లడ్ లైట్లు పనిచేయకనో మ్యాచ్‌లు రద్దు కావడం పరిపాటే. కానీ విద్యుత్ సరఫరా లేక ప్రధాన టోర్నమెంట్ నిలిచిపోవడం మాత్రం అరుదే. అలాంటి సంఘటన మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో చోటు చేసుకుంది. ఏటీపీ మాస్టర్స్–1000 టోర్నీలో సోమవారం మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మనోలో సాంటానా స్టేడియంలో రెండు సింగిల్స్, ఒక డబుల్స్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఒక్కసారిగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఆ సమయంలో పురుషుల సింగిల్స్‌లో గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా), జాకబ్ పియర్స్‌లే (బ్రిటన్) మధ్య మ్యాచ్ 6–4, 5–4తో ఉంది. ఎంతకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో చివరకు మ్యాచ్‌ను రద్దు చేశారు. స్పెయిన్, పోర్చుగల్‌లో గత కొంత కాలంగా విద్యుత్ కొరత ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ లైట్లు, వీధి దీపాలు ఆపేశారు. విద్యుత్‌తో నడిచే రైళ్లు, పలు మెట్రో సర్వీసులు సైతం రద్దు చేశారు. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో మాడ్రిడ్ ఓపెన్‌లో భాగంగా సోమవారం జరగాల్సిన మ్యాచ్‌లన్నింటినీ రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

మరో విజయం లక్ష్యంగా!

నేడు దక్షిణాఫ్రికాతో భారత మహిళల జట్టు 'ఢీ'

- ఉదయం 10 గంటల నుంచి ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం
- ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నీ



కొలంబో: ఆతిథ్య శ్రీలంకపై గెలిచి ముక్కోణపు వన్డే సిరీస్‌లో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు ఇదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఈ సిరీస్‌లో సోమవారం జరిగే పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత్... దక్షిణాఫ్రికాను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. మొదటి మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని రంగాల్లోనూ టీమిండియా ఆధిపత్యం కనబరిచి శ్రీలంకపై అలవోక విజయం సాధించింది. ఇప్పుడు కూడా ఆల్‌రౌండ్ సత్తా చాటాలనే లక్ష్యంతో సఫారీతో సమరానికి సిద్ధమైంది. గత మూడేళ్లుగా వన్డే ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌కు మంచి రికార్డే ఉంది. 2022 మార్చి నుంచి ఇప్పటివరకు మహిళల జట్టు వన్డేల్లో ఓడనే లేదు. చివరిసారిగా సఫారీతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను హర్మన్ బృందానికి 3–0తో క్లీన్‌స్వీప్ చేసిన అనుభవముంది. ఈ నేపథ్యంలో భారత్ తమ జోరుతో మరోసారి దక్షిణాఫ్రికాను కంగుతినిపించే అవకాశాలే ఎక్కువ. స్పిన్‌కు ఇబ్బందిపడే సఫారీ బ్యాటర్లను స్నేహ్ రాణా, దీప్తి శర్మ, నల్లపురెడ్డి శ్రీచరణిలు సులువుగానే చుట్టేయొచ్చు. మంగళవారం ఇదే జరిగితే శ్రీలంకపై సాధించిన ఫలితమే పునరావృతమైనా ఆశ్చర్యం లేదు. పైగా భారత టాప్ ఆర్డర్ అద్భుతమైన ఫామ్‌లో ఉంది. లంకతో జరిగిన పోరులో ఓపెనర్లు ప్రతిక, స్మృతి మంధాన సహా వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్... ఈ ముగ్గురే 148 పరుగుల లక్ష్యాన్ని పూర్తి చేశారు. మహిళల వన్డే ప్రపంచకప్‌కు ముందర భారత్ ఈ స్థాయిలో రాణించడం జట్టు మేనేజ్‌మెంట్‌కు ఎంతో మేలు చేస్తుంది. కోర్ గ్రూప్ నుంచి పకడ్బందీ కూర్పునకు ఇది చక్కని అవకాశమిస్తుంది. మరోవైపు దక్షిణాఫ్రికా పూర్తిగా తీసిపారేసే జట్టు ఎంత మాత్రం కాదు. ఫామ్‌లో ఉన్న సునే లూస్, లౌరా వోల్వార్ట్, నదిన్ డిక్లెర్క్, ట్రియోన్, మసబత క్లాస్ సహా ఆల్‌రౌండర్ అనెరి డెర్క్‌సెన్‌లు భారత్‌ను ఇబ్బంది పెట్టగలరు. కాబట్టి శ్రీలంకతో గెలిచినంత సులువుగా సఫారీని మట్టికరిపిస్తామంటే కుదరదు.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), ప్రతిక, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, జెమీమా, రిచా ఘోష్, దీప్తి శర్మ, కాశ్వీ గౌతమ్, శ్రీచరణి, స్నేహ్ రాణా, అరుంధతీ రెడ్డి. **దక్షిణాఫ్రికా:** వోల్వార్ట్ (కెప్టెన్), తజ్మీన్ బ్రిట్స్, సునే లూస్, డెర్క్‌సెన్, లారా గుడాల్, నదిన్ డిక్లెర్క్, చోల్ ట్రియోన్, సినాలో జాఫ్తా, నొంకులులెకొ లాబా, మసబాత క్లాస్, అయబొంగ కాకా.

18 భారత్, దక్షిణాఫ్రికా మహిళల జట్ల మధ్య ఇప్పటి వరకు 31 వన్డేలు జరిగాయి. 18 మ్యాచ్‌ల్లో భారత జట్టు గెలుపొందగా... 12 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఒక మ్యాచ్ రద్దయింది.

సీఓఈ స్పిన్ బౌలింగ్ కోచ్ రేసులో సునీల్ జోషి!

- ఇంటర్వ్యూకు హాజరైన నలుగురు మాజీ ఆటగాళ్లు
- పోటీలో నూషీన్ అల్ ఖదీర్


సునీల్ జోషి


నూషీన్

న్యూఢిల్లీ: భారత మాజీ స్పిన్నర్ సునీల్ జోషి... బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో జాతీయ క్రికెట్ అకాడమీగా ఉన్న ఈ సెంటర్‌లో సాయిరాజ్ బహుతులే స్పిన్ కోచ్ బాధ్యతలు నిర్వర్తించాడు. ప్రస్తుతం అతడు రాజస్తాన్ రాయల్స్ అసిస్టెంట్ కోచ్‌గా పని చేస్తుండటంతో... ఆ స్థానం ఖాళీ అయింది. దీని కోసం బీసీసీఐ తాజాగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. దీనికి జోషీ హాజరైనట్లు సమాచారం. 54 ఏళ్ల సునీల్ జోషి 1996 నుంచి 2002 మధ్య భారత జట్టు తరఫున 15 టెస్టులు, 69 వన్డేలు ఆడాడు. ప్రస్తుతం రికీ పాంటింగ్‌తో కలిసి ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కోచింగ్ బృందంలో భాగంగా ఉన్నాడు. దేశవాళీల్లో ఉత్తరప్రదేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్... గతంలో బంగ్లాదేశ్ పురుషుల జట్టు స్పిన్ బౌలింగ్ కన్సల్టెంట్‌గానూ వ్యవహరించాడు. సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, క్రికెట్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ అభయ్ కురువిల్లా సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో సునీల్ జోషి పాల్గొన్నాడు. జోషీతో పాటు భారత మహిళల అండర్–19 జట్టు కోచ్, హైదరాబాదీ నూషీన్ అల్ ఖదీర్, రాకేశ్ ధ్రువ్, ప్రీతమ్ గంధే కూడా ఈ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల మహిళల అండర్–19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు నూషీన్ కోచ్‌గా వ్యవహరించింది. జాతీయ మహిళల జట్టు తరఫున 5 టెస్టులు, 78 వన్డేలు ఆడిన నూషీన్‌కు కోచింగ్‌లో మంచి అనుభవం ఉంది. సౌరాష్ట్ర మాజీ లెఫ్టార్మ్ స్పిన్నర్ రాకేశ్, విదర్భ మాజీ ఆఫ్ స్పిన్నర్ ప్రీతమ్ ఇంటర్వ్యూలు కూడా ముగిసినట్లు సమాచారం. 'దరఖాస్తు చేసుకున్న వారిలో అందరికంటే ఎక్కువ అనుభవం సునీల్ జోషి సొంతం. నూషీన్‌కు కూడా కోచింగ్ చాలా అనుభవం ఉంది. అయితే మహిళల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయాలని బోర్డు యోచిస్తోంది. దీంతో అంకితభావం గల సహాయక సిబ్బంది అవసరముంటుంది. స్పిన్ బౌలింగ్ కోచ్ కావాలనుకుంటున్న వారిలో జోషీకే అంతర్జాతీయ టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. ముఖ్యంగా అతడు బెంగళూరుకు చెందిన వాడు' అని ఓ అధికారి వెల్లడించారు.

ఏది పడితే అది మాట్లాడొద్దు

తమ నేతలకు కాంగ్రెస్ పార్టీ హెచ్చరిక

న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు, సంతాపాలు, ప్రతీకార దాడుల డిమాండ్లు వ్యక్తమవుతున్న వేళ తమ నేతలు ఇష్టారీతిన ఏది పడితే అది మాట్లాడకూడదని కాంగ్రెస్ పార్టీ సూచించింది. ఇప్పటికే పలువురు నేతల వ్యాఖ్యలు వివాదాస్పదమై, విమర్శలు వెల్లువెత్తడంతో నష్టపరిహార చర్యలకు కాంగ్రెస్ ఉపక్రమించింది. ఏదేమైనా పాకిస్తాన్‌తో యుద్ధం అక్కర్లేదని కర్ణాటక ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నేత సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు విమర్శలపాలవడం తెల్సిందే. ఇలా పలువురి నేతలు ఇష్టారీతిగా మాట్లాడటంతో కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. పార్టీ నేతల వ్యాఖ్యలపై పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. జాతీయస్థాయిలో ప్రభావం చూపే అత్యంత సున్నితమైన, కీలకమైన ఈ అంశంపై పార్టీ అధిష్టానం వ్యక్తంచేసే అభిప్రాయానికే నేతలంతా కట్టుబడి ఉంటాలని సూచించారు. సొంత అభిప్రాయాలు వ్యక్తంచేస్తూ అనవసర గందరగోళానికి తెరతీయొద్దని అగ్రనేతలు హితవు పలికారు. ''పహల్గాం ఉదంతంపై భిన్న, విరుద్ధ వ్యాఖ్యానాలు చేసే నేతల అభిప్రాయాలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. వాళ్ల ప్రకటనలు పార్టీ వైఖరిని ప్రతిబింబించవు. పార్టీ వైఖరిని కేవలం ఏఐసీసీ పధాధికారులు మాత్రమే వ్యక్తంచేయాలి''అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు. ఈ అంశంలో నేతలను మందలిస్తూ ఒక అధికారిక ప్రకటనచేయాలని పార్టీ భావిస్తోంది. ఉగ్రవాదులు ప్రతి ఒక్కరిని మతం ఏంటి? అని అడిగిన తర్వాతే అంతమొందించారనే వార్తల్లో నిజంలేదని మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వడ్డేటివార్ వ్యాఖ్యానించడం తెల్సిందే. ఇలా ఒకరిద్దరు నేతలు చేసిన వ్యాఖ్యలకు పార్టీ ప్రతిష్ట దెబ్బతినే ప్రమాదం పొంచి ఉండటంతో కాంగ్రెస్ వెంటనే పై విధంగా స్పందించింది.

గుల్మార్గ్‌లో గుర్రాలపై షికారు

సోమవారం జమ్మూ కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో గుర్రాలపై వెళ్తున్న పర్యాటకులు



ఫెన్సింగ్ కింద పాక్కుంటూ వెళ్లి.. గుంతలో దాక్కుని

దాడి నుంచి బయటపడ్డ మైసూరువాసి కథనం

పహల్గాం ఉగ్రవాదుల దాడి ప్రత్యక్ష సాక్షులను ఇంకా వెంటాడుతోంది. ఆ దాడి నుంచి తృటిలో తప్పించుకున్న మైసూరుకు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ తన అనుభవాలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తన కుటుంబంతో పాటు మరో 35-40 మంది ఎలా ప్రాణాలతో బయటపడ్డారో వివరిస్తూ ఆయన రాసిన పోస్టు అందరినీ కదిలిస్తోంది.

'అదో రాక్షస చర్య. స్వర్గ సౌందర్యాన్ని రక్తపు మరకలతో ఎరుపెక్కించిన ఓ భయానక అనుభవం. దాన్నుంచి మేం బయటపడ్డాం. ప్రతికూల వాతావరణం కారణంగా మా పర్యటనను రెండు రోజులు వాయిదా వేసుకుని ఏప్రిల్ 22 మధ్యాహ్నం భార్య, తమ్ముడు, మరదలితో కలిసి కశ్మీర్ వెళ్లాం. నా సోదరుడు ఇండియన్ ఆర్మీలో సీనియర్ అధికారి. మాతో పాటు ట్రిప్‌లో ఉన్నాడు. ఏప్రిల్ 22వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు పహల్గాం పట్టణానికి చేరుకుని.. పోనీ రైడ్‌లో బైసారన్ లోయకు 1:35 గంటలకు చేరుకున్నాము. ఆ గంభీరమైన ప్రకృతి దృశ్యాన్ని ఆస్వాదిస్తూ ఓ కప్పు టీ తాగాం. 2:00 గంటలకు ఫోటోలు తీసుకోవడానికి లేచాం. ప్రవేశ ద్వారం ఎదురుగా ఉన్న దిశలో కదలడం మా అదృష్టం.

పిల్లలు, తల్లిదండ్రుల గురించే ఆందోళన

అలా మేం నలుగురం సంఘటనా స్థలానికి కొన్ని వందల మీటర్ల దూరంలో చెట్ల కింద ఉన్న ఇరుకైన గుంతలోకి వెళ్లాం. మధ్యాహ్నం 3 గంటల వరకు తుపాకీ కాల్పుల శబ్దం లోయలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అక్కడే ఉండాలా? మరోవైపు పరుగెత్తాలా? తెలియడం లేదు. అక్కడ ఉన్నంత సేపు ఇంట్లో ఉన్న మా తల్లిదండ్రులు, పిల్లల గురించి ఆందోళన చెందుతున్నాం. మధ్యాహ్నం 3.40 గంటలకు హెలికాప్టర్ శబ్దం వినిపించింది. భద్రతా దళాలు వచ్చాయని నిర్ధారించుకున్నాక బయటకు వచ్చాం. ఆ తుపాకీ కాల్పులు ఇప్పటికీ మా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఇలాంటి భయానక అనుభవాలు ఎవ్వరికీ రాకూడదని ప్రార్థిస్తున్నా. వారి ఆత్మల కోసం ప్రార్థిస్తున్నా'అని భట్ పేర్కొన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్షణాల్లో రెండు మృతదేహాలు..

ప్రకృతిని ఆస్వాదిస్తూ ఫొటోలు తీసుకుంటుండగా మధ్యాహ్నం 2.25 గంటల సమయంలో మొదటి రెండు తుపాకీ శబ్దాలు వినిపించాయి. ఆ తర్వాత ఒక నిమిషం పాటు నిశ్శబ్దం. ఏం జరిగిందో అందరికీ అర్థమైంది. క్షణాల్లోనే రెండు మృతదేహాలు పడి ఉండటాన్ని చూశాం. ఇది ఉగ్రదాడి అని నా సోదరుడికి తెలిసిపోయింది. తుపాకీ శబ్దాలు పేలాయి. గందరగోళం ఏర్పడింది. జనం బిగ్గరగా అరుస్తూ ప్రాణాల కోసం పరిగెత్తుతున్నారు. మా దిశలో ఒక ఉగ్రవాది రావడాన్ని మేము గమనించాం. పరిస్థితిని అంచనా వేసిన మా తమ్ముడు 35–40 మంది పర్యాటకులతో మమ్మల్ని వ్యతిరేక దిశలో నడిపించాడు. అదృష్టవశాత్తూ ఫెన్సింగ్ కింద ఇరుకైన మార్గం కనబడింది. మాతో పాటు చాలా మంది ప్రజలు కంచె గుండా జారి వేరే మార్గంలో పరిగెత్తడం ప్రారంభించారు. అది కొంచెం లోయలా ఉండటంతో మేం ఎవరికీ కనిపించలేదు.

రికార్డు స్థాయికి ప్రపంచ సైనిక వ్యయం

2024లో 2.7 ట్రిలియన్ డాలర్లు

ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం భారీగా పెరిగింది. మారుతున్న భౌగోళిక, రాజకీయ సంబంధాలు, యుద్ధాల నేపథ్యంలో ప్రభుత్వాలు సైనిక భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి. 2024లో ప్రపంచ దేశాలు సైన్యానికి 2.7 ట్రిలియన్ డాలర్లను ఖర్చు చేశాయి. గాజా, ఉక్రెయిన్‌లపై యుద్ధం నేపథ్యంలో ముఖ్యంగా యూరప్, మధ్యప్రాచ్యంలో ఈ సైనిక వ్యయం అధికంగా పెరిగింది. తాజా వివరాలను స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) నివేదిక తెలిపింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాలు తమ సైనిక వ్యయాన్ని పెంచాయి. 2023తో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఖర్చు 9.4 శాతం పెరిగింది. వరుసగా పదో సంవత్సరం కూడా సైనిక వ్యయంలో పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతలకు అద్దం పడుతోంది.

యూరప్‌లో ఊహించని పెరుగుదల

యూరప్ దేశాల్లో (రష్యాతో సహా) సైనిక వ్యయంలో అధిక పెరుగుదల కనిపించింది.



ఉక్రెయిన్‌లో యుద్ధం, నాటో కూటమి పట్ల అమెరికా నిబద్ధతపై సందేహాల మధ్య 17 శాతం పెరుగుదల నమోదైంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగింపు సమయంలో సైనిక వ్యయాన్ని మించిపోయింది. ఇక రష్యా సైనిక వ్యయం 2024లో 149 బిలియన్ డాలర్లకు చేరుకుంది, ఇది 2023తో పోలిస్తే 38 శాతం పెరిగింది. ఇది రష్యా జీడీపీలో 7.1 శాతం. మొత్తం ప్రభుత్వ వ్యయంలో 19%. ఉక్రెయిన్ మొత్తం సైనిక వ్యయం 2.9 శాతం పెరిగి 64.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది రష్యా వ్యయంలో 43 శాతం కాగా, ఆ దేశ జీడీపీలో 34 శాతం. 2024లో అత్యధిక సైనిక వ్యయం చేసిన దేశం ఉక్రెయిన్. రష్యా చేస్తున్న యుద్ధానికి ఉక్రెయిన్ ప్రస్తుతం తన పన్ను ఆదాయం మొత్తాన్ని సైన్యానికి కేటాయిస్తోంది. జర్మనీ కూడా సైనిక వ్యయాన్ని బాగానే పెంచింది. 28 శాతం పెరిగి, 88.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీంతో ఇది భారతదేశాన్ని అధిగమించి ప్రపంచంలో నాల్గో అతి పెద్ద దేశంగా నిలిచింది. పునరేకీకరణ తరువాత జర్మనీ ఇంతపెద్ద మొత్తంలో ఖర్చు చేయడం ఇదే మొదటిసారి.

వ్యయాన్ని పెంచిన చైనా

సైన్యానికి భారీగా ఖర్చు చేసే ప్రపంచంలోనే రెండో దేశమైన చైనా సైతం తన సైనిక బడ్జెట్‌ను పెంచింది. 7.0 శాతం పెరుగుదలతో చైనా సైనిక వ్యయం 314 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తన సైన్యాన్ని ఆధునీకరించడానికి, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యాలు పెంచుకోవడానికి, అణ్వాయుధాల విస్తరణలో విస్తృతమైన పెట్టుబడులు పెడుతోంది. ఆసియా మొత్తం సైనిక వ్యయంలో సగం వాటాను చైనానే కలిగి ఉంది.

తగ్గేదే లేదన్న అమెరికా

ప్రపంచ పెద్దన్న అమెరికా కూ సైనిక వ్యయంలో వెనుకబడలేదు. మొత్తం ప్రపంచ సైనిక వ్యయంలో అమెరికా వాటా 37 శాతం గమనార్హం. ఇక 2024లో మొత్తం నాటో వ్యయంలో 66 శాతం అమెరికా పెట్టుబడులే. 2024లో 5.7 శాతం పెంచడంతో ఆ దేశ సైనిక వ్యయం 997 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అమెరికా నేతృత్వంలోని కూటమిలోని 32 సభ్యదేశాల మొత్తం సైనిక వ్యయం 1.5 ట్రిలియన్లకు పెరిగింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

2025లో రక్షణకు అత్యధిక బడ్జెట్‌ను కేటాయించిన దేశాలు

అస్థిర, సంక్లిష్ట భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు తమ శక్తిని, పలుకుబడిని చాటుకునేందుకు సైనిక బలగాలను బలోపేతం చేసుకుంటున్నాయి. గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ డేటా ప్రకారం అమెరికా, చైనా, రష్యా, భారత్, సౌదీ అరేబియాలు తమ సైనిక శక్తికి అత్యధిక బడ్జెట్ కేయటాంచిన మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

యూఎస్ – 895 బిలియన్ డాలర్లు
చైనా – 266.85 బిలియన్ డాలర్లు
రష్యా – 126 బిలియన్ డాలర్లు
భారత్ – 75 బిలియన్ డాలర్లు
సౌదీ అరేబియా – 74.76 బిలియన్ డాలర్లు

అంధకారంలో స్పెయిన్, పోర్చుగల్

బార్సిలోనా: యూరప్‌లోని పొరుగుదేశాలు స్పెయిన్, పోర్చుగల్ విద్యుత్ అంతరాయం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. పొరుగున ఉన్న ఫ్రాన్స్ సైతం పాక్షికంగా విద్యుత్ కష్టాల్లో మునిగింది. సైబర్ దాడుల పాత్ర లేదని ప్రభుత్వాలు స్పష్టంచేసినప్పటికీ అసలు కారణాలను మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. కారణాలు తెలీడంలేదని స్పెయిన్ ప్రభుత్వం పేర్కొంది. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో స్పెయిన్, పోర్చుగల్‌లో జనజీవనం హఠాత్తుగా స్తంభించిపోయింది. రోడ్లపై ట్రాఫిక్ సిగ్నళ్లు ఆగిపోవడంతో ట్రాఫిక్ ఆగిపోయింది. ఇళ్లలో, ఆఫీసుల్లో కరెంట్ లేక ఇబ్బందులు ఎక్కువయ్యా యి. ఎత్తయిన భవనాల్లో లిఫ్ట్‌లలో ఇరుక్కున్న వాళ్ల బాధ వర్ణనాతీతం. ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ సేవలకు తీవ్ర విఘాతం కల్గింది. విద్యుత్ రైళ్లు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఎయిర్‌పోర్టుల్లో విమాన టికెట్ల జారీ నిలిచిపోయింది. స్పెయిన్, పోర్చుగల్‌లో మొత్తంగా ఐదు కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు పడ్డట్లు వార్తలొచ్చాయి. సమీప ఫ్రాన్స్‌లోనూ పాక్షికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉత్తర, దక్షిణ స్పెయిన్‌లో కొంతమేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు స్పానిష్ పవర్ గ్రిడ్ నిర్వహణ సంస్థ రెడ్ ఎలక్ట్రికా తెలిపింది. సమస్య పరిష్కారం కోసం అవిశ్రాంతంగా సిబ్బంది శ్రమిస్తున్నారని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ప్రకటించారు. సైబర్ దాడి అవకాశం లేదని పోర్చుగల్ ప్రధాని వ్యాఖ్యానించారు. లిస్బన్‌లో ట్రాఫిక్‌ను పునరుద్ధరించడానికి పోలీసులు విజిల్స్ వేస్తూ, చేతి సంజ్ఞలు చేస్తూ ఆపసోపాలు పడుతున్నారు. స్పెయిన్, పోర్చుగల్ ప్రభుత్వాలు కేబినెట్ సమావేశాలు పెట్టిమరీ పరిస్థితిని సమీక్షించాయి.

4 సార్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నారు!

- కొత్తగా వెలుగులోకి కూంబింగ్ ఆపరేషన్ విషయాలు
- ఉగ్రవాదుల కోసం అన్వేషణ, వేటలో పురోగతి

శ్రీనగర్: పైశాచికంగా అమాయకుల ప్రాణాలను బలిగొని దట్టమైన దక్షిణకశ్మీర్ అడవిలోకి పారిపోయిన ఉగ్రవాదులను తుదముట్టించేందుకు భద్రతా బలగాల వేట కొనసాగుతోంది. స్థానికులు ఇస్తున్న సమాచారం, నిఘా వివరాలతో ఎప్పటికప్పుడు ఉగ్రవాదుల జాడ కోసం వెతుక్కుంటూ వెళ్తున్నా ఆలోపే వాళ్లు అక్కడి నుంచి ఉడాయిస్తున్న ఉదంతాలు జరిగాయన్న అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెలువర్చింది. గత వారం రోజుల వ్యవధిలో ఉగ్రవాదులు చిక్కినట్లే చిక్కి నాలుసార్లు తప్పించుకున్నారని తెలుస్తోంది. ఒకసారి దూరం నుంచి పరస్పర ఎదురుకాల్పులు సైతం జరిగాయని ఆ కథనం పేర్కొంది. ఉగ్రవాదుల అన్వేషణ బృందం కూంబింగ్ ఆపరేషన్‌పై అవగాహన ఉన్న ఒక సైన్యాధికారి ఈ వివరాలను వెల్లడించారు. ''ఇది పిల్లి, ఎలుకల గేమ్‌లా తయారైంది. ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాన్ని దాదాపు చేరుకున్నాం. ఆలోపే వాళ్లు ఉడాయించారు. ఇలా నాలుగుసార్లు జరిగింది. దట్టమైన అడవిలో దూరం నుంచి ఒక వ్యక్తి కనిపించినా సరే వెంటనే వాళ్ల వెనకాలే పరుగెత్తలేం. కొన్ని భౌగోళిక అవాంతరాలు మన కాళ్లకు బంధనాలుగా మారతాయి. మేం త్వరలోనే వాళ్లను పట్టుకుంటాం లేదా అంతమొందిస్తాం. కొద్ది రోజుల్లో ఈ కథ సుఖాంతమవుతుంది''అని ఆ అధికారి అన్నారు.

తొలుత హర్‌పథ్‌నార్ గ్రామంలో..

ఉగ్రవాదుల జాడను తొలుత అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాం తహసిల్‌లోని హర్‌పథ్‌నార్ గ్రామంలో గుర్తించారు. అయితే బలగాలు వచ్చేలోపే సమీప అటవీప్రాంతంలోకి పారిపోయారు. వాళ్లను బలగాలు వెంబడించాయి. అలా కుల్గాం ప్రాంతానికి వచ్చాక ఇరువైపులా కాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత అక్కడి నుంచీ ఉగ్రవాదులు పారిపోయారు. తర్వాత త్రాల్ కొండ అంచు వద్ద, ఆ తర్వాత చివరిసారిగా కోకెర్‌నాగ్ ప్రాంతంలో ఉగ్రవాదుల లొకేషన్‌ను బలగాలు గుర్తించాయి. ప్రస్తుతం కోకెర్‌నాగ్ సమీప అడవుల్లోనే ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలివిగా వ్యవహరిస్తున్న ముష్కరులు

ఆహారం కోసం అడవి నుంచి బయటికొచ్చి సమీప గ్రామాలకు వస్తే ఉగ్రవాదులను మట్టుబెట్టడం సులభం. అలాకాకుండా వాళ్లు ఆయా గ్రామాల్లో తమకు తెల్సిన వ్యక్తుల ద్వారా అడవిలోకే ఆహారం తెప్పించుకునే ప్రయత్నాలు చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో భద్రతాబలగాలకు ఉగ్రవాదులను చుట్టుముట్టే అవకాశం చిక్కుతుంది. ఆ అవకాశం లేకుండా ఉగ్రవాదులు తెలివిగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ''రాత్రి ఒక గ్రామంలో భోజనానికి వెళ్లినట్లు మాకు సమాచారం అందింది. అక్కడికి మేం వెళ్లేలోపే మా రాకను పసిగట్టి వాళ్లు భోజనం చేయకుండా ఆహారాన్ని ఎత్తుకెళ్లిపోయారు''అని సైన్యాధికారి చెప్పారు. ''ఇక్కడ మరో సమస్య ఉంది. అత్యంత ఎత్తయిన పర్వతాలుండే పహల్గాం వెంటే కిష్టవార్ శ్రేణి ఉంది. వేసవికాలం కావడంతో ఇక్కడ మంచు తక్కువగా ఉంది. దీంతో తేలిగ్గా కొండలెక్కి అటువైపు వెళ్లి తప్పించుకోవచ్చు. అటువైపు ఉన్న జమ్మూ అడవులకు వెళ్తే పట్టుకోవడం చాలా కష్టం. జమ్మూ అడవులు మరింత దట్టంగా ఉంటాయి. కిష్టవార్ అడవుల గుండా అటువైపు వెళ్లాలనేదే ఉగ్రవాదుల పథకం కావొచ్చు. ఇప్పటికైతే వాళ్లు ఇంకా దక్షిణ కశ్మీర్‌లోనే ఉన్నారని అంచనావేస్తున్నాం. స్థానికుడు, పర్యాటకుని నుంచి లాక్కున్న రెండు ఫోన్లు ఉగ్రవాదుల వద్ద ఉన్నాయి. వాటిని వాళ్లు ఉపయోగిస్తే అత్యంత ఖచ్చితమైన లొకేషన్ దొరుకుతుంది. దాక్కునే క్రమంలో ఉగ్రవాదులు చేసే ఏ ఒక్క పొరపాటైనా అది వాళ్లకు మరణశాసనమే''అని అధికారి చెప్పారు.

'పహల్గాం'పై పార్లమెంటరీ స్థాయీ సంఘం భేటీ

న్యూఢిల్లీ: పహల్గాం ఘటన నేపథ్యంలో దేశంలో భద్రత ఏర్పాట్లపై సమీక్షలో భాగంగా రక్షణ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం సోమవారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశంలో పాల్గొన్న పలు పార్టీల నేతలు ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండించారు. బీజేపీ నాయకుడు రాధామోహన్ సింగ్ సారథ్యంలో ఈ కమిటీ సమావేశం జరిగింది. పార్లమెంట్ సముదాయం భవనంలో సోమవారం మధ్యాహ్నం సమావేశం మొదలుకాగానే పహల్గాం మృతులకు నివాళిగా రెండు నిమిషాలు సభ్యులంతా మౌనం పాటించారు. సమావేశంలో లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఆప్ నేత సంజయ్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు వీరేంద్ర సింగ్ తదితరులు ఈ భేటీ పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై కమిటీ సభ్యులు సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. రక్షణ వ్యవహారల కమిటీ సమీక్షలో భాగంగా రక్షణరంగ విధాన నిర్ణయాలు, ఆరోగ్యసంరక్షణ కేంద్రాలు, మాజీ సైనికులు, సిబ్బంది వ్యవహారాల అంశాలపైనా చర్చ జరిగింది. ''22నాటి దాడులను కమిటీ సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు'' అని తర్వాత కమిటీ ఛైర్మన్ రాధామోహన్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు.

దౌత్యం ద్వారా ఉద్రిక్తతను తగ్గించుకోండి

తమ్ముడు, పాక్ ప్రధాని షెహబాజ్‌కు నవాజ్ షరీఫ్ సూచన

లాహోర్: పహల్గాం అమానవీయ ఉగ్రదాడి ఘటనను ఇంతవరకూ ఖండించడానికి ముందుకురాని పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఉద్రిక్తతల సమసిపోవాలంటే దౌత్యరాగం ఆలపించాలని తమ్ముడు, పాక్ ప్రధాని షెహబాజ్‌కు సలహా ఇచ్చారు. షరీఫ్ కుమార్తె, పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి మర్యమ్ సైతం ఇంతవరకు ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ''అణ్వస్త్ర సామర్థ్య ఇరు దేశాలు ఈ ఉద్రిక్తతలను తగ్గించుకోవాలి. ఇందుకోసం దౌత్యమార్గాలను ఉపయోగించుకోవాలి''అని షెహబాజ్‌కు షరీఫ్ సూచించారని స్థానిక మీడియా ఒక కథనంలో పేర్కొంది. సింధూ నదీజలాల ఒప్పందం నుంచి భారత్ వైదొలిగిన నేపథ్యంలో తాజా పరిస్థితిపై ఆదివారం లాహోర్‌లో అన్నకు షెహబాజ్ వివరాలు చెప్పిన సందర్భంగా షరీఫ్ ఈ సూచన చేసినట్లు తెలుస్తోంది.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశం?

'ఇండియా' కూటమి పార్టీల మద్దతు కూడగడుతున్న కాంగ్రెస్

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ప్రభుత్వం తీసుకోబోయే భవిష్యత్తు చర్యలను చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని కోరాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఇండియా కూటమిలోని పార్టీల అభిప్రాయాలను కాంగ్రెస్ సేకరిస్తున్నట్లు, ఇప్పటికే కొందరు నేతలను సంప్రదించినట్లు ఢిల్లీ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకున్నాక, దీనిపై కేంద్రానికి లేఖ రాయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బైసారన్‌లో అత్యంత హేయమైన ఉగ్రదాడి తర్వాత కేంద్ర ప్రభుత్వ చర్యలకు అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చిన నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్ ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఉగ్రదాడిని నేపథ్యంలో కేంద్రం చేపట్టే ఏ చర్యకైనా ప్రతిపక్షం మద్దతు ఇస్తుందని ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధ ఇటీవల కేంద్రం ఏర్పాటు చేసిన అఖిలపక్ష భేటీలో ప్రకటించారు. ఈ సమావేశాల్లోనే చాలా ప్రతిపక్ష పార్టీలు కేంద్ర నిఘా వైఫల్యాలపై అనేక ప్రశ్నలు లేవనెత్తాయి. అఖిలపక్ష సమావేశంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) రాజ్యసభ ఎంపీ హారిస్ బీరాన్ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అంశాన్ని ప్రస్తావించారు. దేశం ఐక్యంగా ఉందనే సందేశాన్ని ప్రపంచానికి తెలిజేయాలని, దాడిని ఖండిస్తూ ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానాన్ని ఆమోదించాలని ప్రధాని నరేంద్ర మోదీని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కోరారు. పాకిస్తాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని తెచ్చేందుకు వీలుగా పాలక, ప్రతిపక్ష ఎంపీల ప్రతినిధులను వివిధ ముఖ్యమైన దేశాలకు పంపాలని సిబల్ ప్రభుత్వానికి సూచించారు.

భరత్ భూషణ్ భార్యకు ఎన్ఐఏ 8 ప్రశ్నలు

బెంగళూరు: ఉగ్రదాడి ప్రత్యక్ష సాక్షి, దాడిలో ప్రాణాలు కోల్పోయిన బెంగళూరు వ్యక్తి భరత్ భూషణ్ భార్య సుజాతను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు విచారించారు. దాదాపు 8 గంటలపాటు సాగిన విచారణలో ఎన్ఐఏ అధికారులు సంఘటనల క్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుజాతను 8 ప్రశ్నలడిగి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. 'కశ్మీర్‌కు ఎప్పుడు వెళ్లారు, ఏ సమయానికి చేరుకున్నారు? టెర్రరిస్టులు వచ్చినప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు? భరత్ ఎక్కడ ఉన్నారు? వారు ఏ భాషలో మాట్లాడారు? వారి ముఖాలపై ఏవైనా గుర్తులున్నాయా? వారి ఆయుధాలను చూశారా? అవి ఎలా ఉన్నాయి? వారు మీతో మాట్లాడారా? వాటికి మీరు సమాధానం చెప్పారా?' అని అధికారులు ప్రశ్నించారు. శివమొగ్గకు చెందిన మరో బాధితుడు మంజునాథ్ కుటుంబాన్ని కూడా ఎన్ఐఏ ప్రశ్నించనుంది.

ఓటీటీలో అశ్లీల కంటెంట్‌పై నిషేధంపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీస్

న్యూఢిల్లీ: ఓటీటీ, ఇతర సామాజిక మాధ్యమ వేదికలపై అశ్లీల కంటెంట్‌ను నిషేధించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వం, సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. నేషనల్ కంటెంట్ కంట్రోల్ అథారిటీని ఏర్పాటు చేసి ఓటీటీ, సామాజిక మాధ్యమ వేదికల్లో వచ్చే అశ్లీల కంటెంట్‌ను కట్టడి చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలని ఐదుగురు పిటిషనర్లు కోరారు. చాలా ముఖ్యమైన ఈ అంశం ప్రభుత్వం పరిధిలోకి వస్తుందని, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం విచారణ సంబర్భంగా పేర్కొంది. అయితే, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక అధికారాల్లో జోక్యం చేసుకుంటున్నామంటూ తమపై ఆరోపణలు వస్తున్నాయని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. పిటిషనర్ పేర్కొన్న అంశంపై ప్రభుత్వం ఏదో ఒకటి చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. ఆన్‌లైన్‌లో అశ్లీల కంటెంట్ కట్టడికి ఇప్పటికే కొన్ని నిబంధనలు అమల్లో ఉన్నాయని, మరింత కట్టుదిట్టం చేయాల్సి ఉందని మెహతా ధర్మాసనానికి వివరించారు.

వక్ఫ్ చట్టంపై తాజా పిటిషన్‌కు సుప్రీం నో

న్యూఢిల్లీ: ఇటీవల అమల్లోకి వచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ తాజాగా దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఒకే అంశంపై వందలాదిగా వచ్చే పిటిషన్లపై విచారణ చేపట్టలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం సోమవారం పేర్కొంది. పిటిషన్‌ను ఉపసంహరించుకుని, ఇంటర్‌వెన్షన్ పిటిషన్ వేసుకోవచ్చని పిటిషనర్ అయిన సయ్యద్ అలీ అక్బర్ తరఫు లాయర్‌కు వివరించింది. 'విచారణ కోసం కేవలం ఐదు పిటిషన్లను మాత్రమే స్వీకరిస్తామని ఏప్రిల్ 17వ తేదీనే స్పష్టంగా చెప్పాం. వీటిపై మే 5వ తేదీన విచారణ చేపట్టి, మధ్యంతర ఆదేశాలిస్తాం'అని తెలిపింది. మొత్తం 72 పిటిషన్లకు గాను ఐదింటిని విచారించనున్న ధర్మాసనం అందరికీ కలిపి ముగ్గురు లాయర్లు మాత్రమే వాదనలు వినిపించాలని సూచించడం తెల్సిందే.

పరువు హత్యలకు కఠిన శిక్ష తప్పదు: సుప్రీం

న్యూఢిల్లీ: పరువు హత్యలకు పాల్పడేవారికి కఠిన శిక్షలను విధించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమిళనాడులో 2003లో యువజంటను పొట్టనబెట్టుకున్న కేసులో 11 మందిని దోషులుగా తేల్చడంతోపాటు వారికి విధించిన శిక్షలను సమర్థించింది. ఘటనకు సంబంధించి ఇద్దరు పోలీసులు సహా 11 మందికి 2022లో మద్రాస్ హైకోర్టు విధించిన శిక్షలు సబబేనని జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ ప్రశాంత్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. గ్రామస్తులంతా చూస్తుండగా మురుగేశన్, కన్నగి జంటకు విషమిచ్చి చంపడం దారుణమని వ్యాఖ్యానించింది. దోషుల్లో కన్నగి తండ్రి, సోదరుడు ఉన్నారని పేర్కొంది. దళితుడైన మురుగేశన్, వన్నియార్ వర్గానికి చెందిన కన్నగి 2003లో రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. మురుగేశన్ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని తమిళనాడు ప్రభుత్వం చెల్లించాలని ధర్మాసనం తీర్పు వెలువరించింది. 2003 జూలైలో ఈ దారుణం చోటుచేసుకోగా 2021 సెప్టెంబర్‌లో విచారణ పూర్తి కావడంపై ధర్మాసనం..సాక్షులు ఎదురు తిరగడమే ఇందుకు ముఖ్యకారణంగా కనిపిస్తోందని తెలిపింది. కేసులో బెయిల్‌పై ఉన్న వారు 2వారాల్లోగా లొంగిపోయి మిగతా శిక్షా కాలాన్ని పూర్తి చేయాలంది. ఇద్దరు పోలీసులు సహా మొత్తం 11 మందికి మద్రాస్ హైకోర్టు విధించిన యావజ్జీవ కారాగార జైలుశిక్షలను ధర్మాసనం సమర్థించింది.

రష్యాకు మా సైన్యాన్ని పంపించాం

ఎట్టకేలకు అంగీకరించిన ఉత్తరకొరియా

సియోల్: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు సహాయం చేసేందుకు సైనికులను పంపినట్లు ఉత్తరకొరియా తొలిసారి అంగీకరించింది. ఉ.కొరియా దేశాధినేత ఆదేశాల మేరకు తమ సాయుధ దళాల ఉప విభాగాలు కుర్స్క్‌ను విముక్తం చేసేందుకు యుద్ధంలో పాల్గొన్నాయని ఉత్తరకొరియా సెంట్రల్ మిలటరీ కమిషన్ పేర్కొంది. పరస్పర రక్షణ ఒప్పందానికి అనుగుణంగా ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ సైన్యాన్ని మోహరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఉ.కొరియా, రష్యాల మధ్య దృఢమైన మిలిటెంట్ స్నేహానికి కుర్స్క్ ఆపరేషన్ నిదర్శనమని పేర్కొంది. న్యాయం కోసం పోరాడిన వారంతా హీరోలు, మాతృభూమి గౌరవానికి ప్రతినిధులని కిమ్ వ్యాఖ్యానించారు. అమరులైన సైనికుల కోసం త్వరలోనే రాజధానిలో స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని కిమ్ తెలిపారు.

యెమెన్‌పై అమెరికా వైమానిక దాడులు

68 మంది మృతి, 47 మందికి గాయాలు

సనా: యెమెన్‌పై అమెరికా చేసిన వైమానిక దాడుల్లో 68 మంది మృతి చెందారు. 47 మంది గాయపడ్డారు. ఆఫ్రికన్ వలసదారులను ఉంచిన జైలుపై అమెరికా దాడులు చేసిందని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఆరోపించారు. పేలుడు సంభవించిన దృశ్యాలను చూపించే గ్రాఫిక్ ఫుటేజ్‌ను హౌతీలు విడుదల చేశారు. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ అడెన్‌లోని నౌకలకు పొంచి ఉన్న ముప్పు నుంచి రక్షించేందుకు అమెరికా సైన్యం మార్చి 15 నుంచి 'రఫ్ రైడర్'పేరుతో ఇరాన్ మద్దతు గల హౌతీలపై ప్రతిరోజూ దాడులు చేస్తోంది. అక్రమ వలసదారుల కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికా జరిపిన దాడిలో 68 మంది ఆఫ్రికన్ వలసదారులు మరణించారని సివిల్ డిఫెన్స్ ప్రకటించింది. శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను, క్షతగాత్రులకు సహాయం చేసేందుకు సహాయక సిబ్బంది పనిచేస్తున్న దృశ్యాలను హౌతీ విడుదల చేసింది. ఇథియోపియన్లు, ఇతర ఆఫ్రికా వలసదారులు కొన్నేళ్లుగా యుద్ధంతో అతలాకుతలమైన యెమెన్‌ను వీడి ఉపాధి కోసం సౌదీ అరేబియాకు చేరుకుంటున్నారు. సరిహద్దుల గుండా వలసదారులను అక్రమంగా రవాణా చేయడం ద్వారా హౌతీ తిరుగుబాటుదారులు డబ్బులు సంపాదిస్తున్నారు.

రెండో పరశురాముడిగా పేరొందిన భారతీయ రాజు?

షోడశ మహాజనపదాలు

క్రీ.పూ. 6 శతాబ్దానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆనాటి రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితుల ప్రభావం భారతదేశ చరిత్ర మీద ప్రబలంగా ఉంది. ఈ కాలాన్ని మహాజన పదాల యుగం, బుద్ధ యుగం, రెండో నగరీకరణ యుగం, మౌర్యుల పూర్వ యుగం అనే పలు పేర్లతో పిలుస్తారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా, వేదకాలపు తెగ ఆధారిత జన పదాలకు భిన్నంగా ప్రాంతం ఆధారిత మహాజనపదాలు (ప్రాదేశిక రాజ్యాలు) ఈ యుగంలోనే ఏర్పడ్డాయి. ఈ కాలంలోనే బుద్ధుడు జీవించాడు, సింధూ నాగరికత పట్టణాల తర్వాత మళ్లీ నగరాల ఆవిర్భావం జరిగింది. ఈ యుగం అంతం కాగానే క్రీ.పూ. 325లో మౌర్య సామ్రాజ్యం ఏర్పడినందున దీన్ని మౌర్యుల పూర్వ యుగం అంటారు.

మహాజనపదాల ఆవిర్భావం

క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రపంచంలోని అత్యంత సారవంతమైన మైదానాల్లో ఒకటైన గంగా మైదానం సాగులోకి వచ్చింది. ఈ కాలంలో విస్తృత స్థాయిలో ఇనుమును ఉపయోగించారు. కొత్త వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి వచ్చి వ్యవసాయంలో మిగులు ఏర్పడింది. దీనివల్ల వ్యాపార వాణిజ్యాలు, నగరాలు అభివృద్ధి చెందాయి. పన్నుల వ్యవస్థకు అవకాశం కలిగింది. ఈ పరిణామాలన్నీ కలిసి ఈ యుగంలో 16 పెద్ద ప్రాదేశిక రాజ్యాల ఏర్పాటుకు దారితీశాయి. బౌద్ధ గ్రంథం అంగుత్తర నికాయలో ఈ 16 రాజ్యాల ప్రస్తావన ఉంది.

1. **అంగ:** దీని రాజధాని చంపా. బ్రహ్మదత్తుడిని అంతం చేసి బింబిసారుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
2. **కాశీ:** రాజధాని వారణాసి. ఇది వరుణ, ఆసి నదుల సంగమ ప్రాంతం.
3. **కోసల:** దీని తొలి రాజధాని అయోధ్య. మలి రాజధాని శ్రావస్తి. ఈ రాజులు కాశీని ఆక్రమించారు. రాజ్యం చివరికి మగధలో విలీనమైంది.
4. **వజ్జీ:** రాజధాని వైశాలి. ఇది 8 గణ రాజ్యాలతో కూడిన సమాఖ్య. వైశాలి రాజు చేతకుని కుమార్తె చెల్లనను బింబిసారుడు వివాహం చేసుకున్నాడు. ఈ రాజ్యాన్ని చివరికి అజాతశత్రువు అంతం చేశాడు.
5. **మల్ల:** దీని రాజధానులు కుశినార, పావ. కుశినారలో బుద్ధుడు నిర్యాణం చెందాడు. పావలో మహావీరుడు మరణించాడు. ఈ గణరాజ్యం బుద్ధున్ని బాగా ఆదరించింది. బుద్ధుని శిష్యులు ఆనందుడు, ఉపాలి మొదలైన వారు ఈ రాజ్యానికి చెందినవారే. పావలో సాంతాగార అనే శాసన సభ ఉండేది.
6. **చేది:** రాజధాని సుక్తిమతి, ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో ఉంది.
7. **వత్స:** దీని రాజధాని కౌశాంబి, దీని రాజు ఉదయనుడు బౌద్ధ మతాన్ని ఆదరించాడు. హర్షుని ప్రియదర్శిక, రత్నావళితోపాటు అనేక కథల్లో ఇతడు నాయకుడు. అవంతిరాజు పలాక ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
8. **పాంచాల:** దీని రాజధానులు అహిచ్ఛత్ర, కంపిల్య.
9. **శౌరసేన:** దీని రాజధాని మధుర. గ్రీకు రచనల్లో ఈ రాజ్యాన్ని శౌరసేనాయ్‌గా, రాజధాని మేథోరాగా ప్రస్తావించారు.
10. **మత్స్య:** దీని రాజధాని విరాటనగరం. ఈ రాజ్యమూ మగధలో కలిసిపోయింది.
11. **కురు:** రాజధాని ఇంద్రప్రస్థ. ఆధునిక ఢిల్లీ పరిసరాల్లోని నగరం. రెండో రాజధాని హస్తినాపూర్
12. **అస్సక/అస్మక:** రాజధాని పోదన లేదా పోటన. ఇదే నేటి బోధన్. ఇది షోడష మహాజన పదాల్లోని ఏకైక దక్షిణాది రాజ్యం. ఇది ఆంధ్ర, మహారాష్ట్రలకు విస్తరించింది.
13. **అవంతి:** రాజధానులు ఉజ్జయినీ, మహిష్మతి. నంది వర్ధనుడిని ఓడించి మగధ రాజు శిశునాగుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
14. **గాంధార:** రాజధాని తక్షశిల. ఈ రాజ్యాన్ని పర్షియన్లు ఆక్రమించుకున్నారు.
15. **కాంభోజ:** రాజధాని రాజాపుర.
16. **మగధ:** రాజగృహ (గిరివ్రజ), పాటలీ పుత్ర రాజధానులు.

బుద్ధుని కాలానికి పైన పేర్కొన్న 16 జనపదాల్లో కేవలం నాలుగు రాజ్యాలు మాత్రమే ఉండేవి. అవి.. వత్స, అవంతి, కోసల, మగధ. మిగిలిన రాజ్యాలన్నీ ఈ నాలుగు రాజ్యాల్లో విలీనమైపోయాయి. అయితే క్రీ.పూ. 4వ శతాబ్దాల్లో ఈ నాలుగు రాజ్యాలూ విలీనమై మగధ సామ్రాజ్యం అవతరించింది.

మగధను పాలించిన రాజవంశాలు

క్రీ.పూ. 6వ శతాబ్దం నుంచి క్రీ.పూ. 4వ శతాబ్దం (మౌర్య సామ్రాజ్యం ఏర్పడే) వరకు మగధను మూడు రాజవంశాలు పాలించాయి.

హర్యాంక వంశం (544-413)

బింబిసారుడు: ఇతనితో ప్రారంభమైన మగధ సామ్రాజ్య వాదం అశోకుడి కళింగ యుద్ధం వరకు కొనసాగింది. ఇతడు అంగను జయించి తన కుమారుడు అజాతశత్రువును రాజ ప్రతినిధిగా నియమించాడు. కోసల రాజు ప్రసేనజిత్ చెల్లెలు కోసలదేవిని వివాహం చేసుకుని కాశీని పొందాడు. వైశాలీ లిచ్ఛవీ రాజు చేతకుని కుమార్తె చెల్లనను, పంజాబ్‌ను పాలించే మాద్రా రాకుమార్తె ఖేమాను వివాహం చేసుకోవడం ద్వారా పశ్చిమ, ఉత్తర దిశలో తన రాజ్య విస్తరణ మార్గాన్ని సుగమం చేసుకున్నాడు. తన ప్రధాన శత్రువు చండ ప్రద్యోత మహాసేనుడి వద్దకు తన ఆస్థాన వైద్యుడు జీవకుడిని పంపి కామెర్ల వ్యాధి నుంచి విముక్తున్ని చేసి తన మిత్రునిగా చేసుకున్నాడు. గాంధార రాజు పుష్కర సరీన్ కూడా తన రాయబారిని పంపి బింబిసారుడితో స్నేహం చేసుకున్నాడు. ఇతడు బుద్ధుని సమకాలికుడైనా ఇతడు ఏ మతాన్ని ఆదరించాడనే దానిపై స్పష్టత లేదు. బౌద్ధ, జైన మతాలు రెండూ ఇతన్ని తమ మతానికి చెందినవాడేనని పేర్కొన్నాయి.

అజాతశత్రువు: తండ్రిని హత్య చేసి సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. తీవ్రమైన సామ్రాజ్య వాద విధానాన్ని అవలంబించాడు. కోసలరాజు, తన మేనమామ ప్రసేనజిత్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేశాడు. విజయం సాధించి కోసల రాకుమార్తెను వివాహం చేసుకోవడంతో పాటు కాశీని తిరిగి పొందాడు. వైశాలీ లిచ్ఛవుల నాయకత్వంలోని 36 రాజ్యాల కూటమికి వ్యతిరేకంగా 16 ఏళ్లు యుద్ధం చేసి విజయం సాధించాడు. ఇతడు మొదట జైనాన్ని, తర్వాత బౌద్ధాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

అందుకే బుద్ధున్ని కలిసి తన తండ్రిని చంపిన నేరాన్ని అంగీకరించాడు. వీరి సమావేశానికి సంబంధించిన ఆధారాలు బార్హుత్ శిల్పాల్లో ఉన్నాయి. ఇతని కాలంలో మొదటి బౌద్ధ సంగీతి జరిగింది. అతనికి కునిక అనే బిరుదు ఉంది.

ఉదయనుడు: ఇతడు పాటలీ గ్రామంలోని గంగ, సోన్ నది సంగమ స్థానంలో కోటను నిర్మించాడు. కాబట్టి ఇతడిని పాటలీ పుత్ర నగర నిర్మాతగా భావిస్తారు.

శిశునాగ వంశం (413-364)

శిశునాగుడు: ఉదయనుడి తర్వాత నలుగురు పితృ హంతకులు రాజులుగా వచ్చారు. వీరితో విసిగిపోయిన ప్రజలు కాశీలో రాజప్రతినిధిగా ఉన్న శిశునాగున్ని రాజుగా చేసినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రాజధానిని వైశాలికి మార్చాడు. అవంతి రాజు ప్రద్యోతను ఓడించి అవంతి రాజ్యాన్ని మగధలో కలిపేయడం ఇతని గొప్ప విజయంగా పేర్కొంటారు. దీంతో ఈ రాజ్యాల మధ్య వంద సంవత్సరాలుగా సాగిన వైరం అంతమైంది.

కాలాశోకుడు: ఇతడు రాజధానిని పాటలీపుత్రానికి తిరిగి మార్చాడు. ఇతని కాలంలో రెండో బౌద్ధ సంగీతి జరిగింది. ఇతడిని సేనాపతి మహా పద్మనందుడు హత్య చేసి నంద వంశాన్ని స్థాపించాడు.

నందవంశం (364-321) మగధను పాలించిన అత్యంత బలమైన వంశం నందవంశం.

మహాపద్మనందుడు: ఇతడు శూద్ర మహిళకు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అనేక క్షత్రియ రాజు కుటుంబాలను రూపుమాపి రెండో పరశురాముడిగా ప్రసిద్ధి చెందాడు. ఖారవేలుని హాథిగుంప శిలాశాసనం ప్రకారం ఇతడు కళింగను జయించి విజయ చిహ్నంగా అక్కడి నుంచి జైన తీర్థంకరుని విగ్రహం తెచ్చినట్లు తెలుస్తుంది. ఇతడు ఏకరాట్ అనే బిరుదును ధరించాడు.

ధననందుడు: మహా పద్మనందుడి తర్వాత అతని ఎనిమిది మంది కుమారులు పాలించారు. వారిలో చివరివాడు ధననందుడు. ఇతనికి రెండు లక్షల పదాతి దళం, 20 వేల అశ్విక దళం, 3వేల గజ దళం, 2వేల రథబలం ఉండేది. అలెగ్జాండర్ సేనలు బియాస్‌ను దాటి భారత్‌పై దండెత్తకపోవడానికి వీరి బలసంపత్తి కూడా ఒక కారణం. అయితే ఇతనికి మితిమీరిన ధనకాంక్ష ఉండేదని దానివల్ల ప్రజలను పీడించి వారి మద్దతు కోల్పోవడం వల్ల, ఈ పరిస్థితులను అనువుగా చేసుకొని చంద్రగుప్త మౌర్యుడు ఇతన్ని అంతమొందించి మౌర్య వంశస్థాపన చేశాడు.

బుద్ధయుగంలోని గణతంత్ర రాజ్యాలు

ఈ కాలం నాటి పాళి గ్రంథాల్లో ఆనాడు మనుగడలో ఉన్న కొన్ని గణతంత్ర రాజ్యాల ప్రస్తావన ఉంది. ఈ రాజ్యాల్లో కొన్ని షోడష మహాజనపదాల్లోనూ కనిపిస్తాయి.

- నాటి గణరాజ్యాల్లో ప్రధానమైనవి కపిలవస్తు, కుశినార, పావ, వైశాలి మొదలైనవి.
- కపిలవస్తును శాక్యవంశం పాలించేది. ఇది భారత్‌నేపాల్ సరిహద్దు రాజ్యం. బుద్ధుడు ఈ వంశానికి చెందినవాడు. కోసల రాజు విరుధకుడు ఈ రాజ్యాన్ని అంతం చేసి శాక్యులను ఊచకోత కోశాడు.
- కుశినార, పావ రాజధానులుగా మల్లవంశం పాలించేది. అజాతశత్రువు ఈ రాజ్యాన్ని అంతం చేశాడు. వైశాలి రాజధానిగా లిచ్ఛవీలు పరిపాలించారు. వీరు స్వేచ్ఛా పిపాసులు, యుద్ధ పిపాసులు. అందుకే అజాతశత్రువుకు ఈ రాజ్యాన్ని ఆక్రమించేందుకు 15 సంవత్సరాలు పట్టింది. అజాతశత్రువు ఈ యుద్ధంలో విజయం సాధించినా లిచ్ఛవీలు తీవ్రనష్టాన్ని కలిగించారు. వీరి సమావేశ మందిరం పేరు సాంతాగార, ఇందులో 7707 మంది ప్రతినిధులు పాల్గొనేవారు.

భారతదేశంపై విదేశీ దండయాత్రలు

- షోడష మహా జనపదాల్లోని 16 రాజ్యాల్లో అత్యధిక రాజ్యాలు భారత్‌లోని ప్రధాన భూభాగంలో ఉన్నాయి. వాయవ్య భారతదేశంలో కాంభోజ, గాంధార, మాద్రా రాజ్యాలుండేవి. వీరి మధ్య ఉన్న రాజకీయ అనైక్యత.. పర్షియాను పాలించే ఆకియేనియన్ రాజులు భారత్‌ను ఆక్రమించేందుకు పురిగొల్పింది.

పర్షియన్ దండయాత్రలు

సైరస్: క్రీ.పూ. 6వ శతాబ్దంలో పర్షియారాజు సైరస్ భారత్‌పై దండెత్తి సింధూ నదికి పశ్చిమంలోని కాబూల్ వరకు ఉన్న ప్రాంతాన్నంతా ఆక్రమించాడు. భారత దేశంపై దండయాత్ర చేసిన తొలి విదేశీ పాలకుడు సైరస్. ఇతడు కపీసా అనే నగరాన్ని ధ్వంసం చేసినట్లు కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది.

డేరియస్- 1: సైరస్ మనవడు. ఇతడు సింధూ ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఈ దండయాత్రలో పాల్గొన్న ఇతని సేనాని స్కైలస్. హిరోడోటస్ అనే గ్రీకు చరిత్రకారుడు పర్షియన్ సామ్రాజ్యంలోని 28 సాత్రపిల్లో(రాష్ట్రాల్లో) సింధూ రాష్ట్రం 20వ సాత్రపిగా ఉందని తెలిపాడు.

జెక్సెస్: ఇతని కాలంలో భారత సేనలను గ్రీసులోని తన ప్రత్యర్థులతో పోరాడేందుకు నియమించారు.

డేరియస్-3: అలెగ్జాండర్‌తో పోరాడేందుకు భారతీయ సైనికుల్ని తన సైన్యంలో చేర్చుకున్నాడు. భారత్‌పై పర్షియన్ దండయాత్రల వల్ల భారత్‌కు పర్షియాకు మధ్య వ్యాపార వాణిజ్యాలకు గొప్ప ఊపు లభించింది. పర్షియన్ ప్రభావం వల్లనే భారతీయులు ఖరోష్టి అనే ఒక నూతన లిపిని నేర్చుకున్నారు. మౌర్యుల శిల్పకళ మీద కూడా ఆకియేనియన్ శిల్పకళ ప్రభావం ప్రబలంగా ఉంది. ఇరానియన్ల ద్వారా భారత సంపద గురించి తెలుసుకున్న గ్రీకులు చివరికి అలెగ్జాండర్ నాయత్వంలో భారత్‌పై దాడి చేశారు.

మాసిడోనియన్ దండయాత్రలు

పర్షియన్ల తర్వాత భారత్‌పై దండెత్తిన రెండో విదేశీయులు గ్రీకులు. అలెగ్జాండర్ 20 ఏళ్ల వయసులో క్రీ.పూ. 334లో మాసిడోనియాకు రాజయ్యాడు. 329 నాటికి 3వ డేరియస్‌ను అంతంచేసి పర్షియా సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. 328లో కాబూల్‌ను ఆక్రమించాక 327లో కైబర్ కనుమల ద్వారా హిందూకుష్ పర్వతాలను దాటి భారత్‌లోకి ప్రవేశించాడు. అలెగ్జాండర్ బాక్ట్రియాలో ఉండగా తక్షశిల రాజకుమారుడు అంభి ఆహ్వానం లభించింది. జీలం, చినాబ్ ప్రాంతాల్లోని రాజైన పోరస్‌కు తక్షశిల రాజులకు మధ్య ఉన్న వైరం ఈ ఆహ్వానానికి కారణం. అలెగ్జాండర్ ఓహింద్ వద్ద సింధూ నదిని దాటాడు. క్రీ.పూ. 326కు జీలం నదిని (హైడాస్పస్) చేరాడు. అప్పటికీ తక్షశిలకు రాజుగా ఉన్న అంభి తన మద్దతును అందించాడు. ఇరు సేనలకు కార్లీ మైదాన ప్రాంతంలో భీకర యుద్ధం జరిగింది. పోరస్ ఓడినా అతని ధైర్య సాహసాలు మెచ్చిన అలెగ్జాండర్ అతని రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు. ఈ విజయానికి గుర్తుగా యుద్ధం జరిగిన ప్రదేశంలో బుకెఫాలా, నికేయా నగరాలు నిర్మించాడు. ఈ విజయం తర్వాత అలెగ్జాండర్ బియాస్ నది ఒడ్డుకు చేరుకున్నాడు. బియాస్‌ను దాటి మగధపై దాడి చేయాలని భావించాడు. అప్పటికే సుదీర్ఘ కాలం మాతృభూమికి దూరంగా ఉన్న సేనలు అలెగ్జాండర్ ఆదేశాలను నిరాకరించాయి. దాంతో అలెగ్జాండర్ తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని నియార్కస్ నాయకత్వంలో సముద్ర మార్గం ద్వారా, మరో భాగాన్ని తన స్వీయనాయకత్వంలో భూమార్గం ద్వారా వెనుతిరిగాడు. మార్గమధ్యమంలో బాబిలోనియా వద్ద క్రీ.పూ. 323 జూన్‌లో 33 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్యంతో మరణించాడు. భారతదేశాన్ని జయించాలనే అలెగ్జాండర్ కోరిక పూర్తిగా నెరవేరకపోయినా అనేక అంశాల్లో ఈ దండయాత్ర ప్రభావం ఉంది. ఈ దండయాత్ర వల్ల పంజాబ్, దాని పరిసర ప్రాంతాల్లోని ఆటవిక తెగ లు బలహీన పడ్డాయి. దాంతో చంద్రగుప్త మౌర్యుడు సులువుగా ఆ తెగలను జయించి తన సామ్రాజ్య విస్తరణ చేయగలిగాడు. ఈ దండయాత్ర వల్లనే భారతదేశానికి ఐరోపా దేశాలకు మధ్య భూ, సముద్ర మార్గాలకు అవకాశం కలిగింది. భారత దేశ చరిత్ర రచనలోనూ అలెగ్జాండర్ చరిత్రకారుల రచనలు ఎంతో ఉపయోగపడ్డాయి.

మాదిరి ప్రశ్నలు

1. షోడష మహాజనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం ఏది?
   1) అవంతీ రాజ్యం 2) అస్మక
   3) కాంభోజ 4) శౌరసేన
2. కింది వాటిలో గణతంత్ర రాజ్యం కానిది?
   1) కపిలవస్తు 2) కుశినార
   3) వైశాలి 4) అవంతి
3. కింది వారిలో అజాతశత్రువుకు సమకాలీనులు కానివారు?
   1) బుద్ధుడు 2) మస్కరి గోషల పుత్రుడు
   3) మహావీరుడు 4) నాగసేనుడు
4. అలెగ్జాండర్ ఇండియాపై దండయాత్ర చేసిన సంవత్సరం?
   1) 327 బి.సి. 2) 303 బి.సి.
   3) 302 బి.సి. 4) 298 బి.సి.
5. భారతదేశంపై దండెత్తిన తొలి విదేశీ పాలకుడు?
   1) సైరస్ 2) డేరియస్-1
   3) జెక్సెస్ 4) డేరియస్-3
6. కింది వాటిలో సరికానిది?
   1) బింబి సారుడు - శ్రేణిక
   2) అజాతశత్రువు - కూనిక
   3) కాలాశోకుడు - కాకవరిన్
   4) మహా పద్మనందుడు - అగ్రామ్స్
7. అలెగ్జాండర్‌కు భారతీయ రాజు పోరవునికి (పోరస్) ఏ నది ఒడ్డున యుద్ధం జరిగింది?
   1) జీలం 2) చినాబ్ 3) రావి 4) బియాస్
8. భారతదేశ చరిత్రలో తొలి పితృ హంతకుడిగా పేరున్న రాజు?
   1) బింబిసారుడు 2) అజాతశత్రువు
   3) ధననందుడు 4) అశోకుడు
9. రెండో పరశురాముడిగా పేరొందిన భారతీయ రాజు?
   1) బిందుసారుడు 2) అశోకుడు
   3) మహాపద్మనందుడు 4) అజాతశత్రువు
10. రెండో బౌద్ధ సంగీతి ఏ రాజు పాలనా కాలంలో జరిగింది?
    1) శిశునాగుడు 2) అజాతశత్రువు
    3) కాలాశోకుడు 4) అశోకుడు

సమాధానాలు

1) 2;	2) 4;	3) 4;	4) 1;
5) 1;	6) 4;	7) 1;	8) 2;
9) 3;	10) 3.		

ధ్వని మార్పులను మొదటిసారి తెలిపినవారు?

టెట్+ టీఆర్‌టీ సహా అన్ని రకాల ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు కంటెంట్‌లో 'ధ్వని పరిణామం - అర్థ పరిణామం' తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు వీటిపై ప్రత్యేక దృష్టిని సారించాలి.ఎస్.జి.టి, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) అభ్యర్థులతోపాటు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులు విధిగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు భాషా చరిత్ర' గ్రంథాన్ని సేకరించుకొని చదివితే మంచి మార్కులు సాధించొచ్చు.

ధ్వని పరిణామం

భాషా పరిణామం: భాషా సంబంధమైన రెండు అంశాల్లో మొదటిది శబ్దం. అర్థం మారకుండా శబ్ద రూపం మారొచ్చు. రెండోది అర్థం. శబ్దం మారకుండా అర్థం మారొచ్చు. వీటినే భాషా శాస్త్రజ్ఞులు రెండు విధాలుగా పేర్కొన్నారు. అవి..

1.ధ్వని పరిణామం 2.అర్థ పరిణామం

- భాషా పరిణామంలో చాలా ముఖ్యమైంది ధ్వని పరిణామం.
- భాషలోని ధ్వని మార్పులను మొట్టమొదటి సారి వివరంగా తెలిపినవారు - టాలెమీ (ఇటలీ)

ధ్వని పరిణామం- నిర్వచనం:

- ధ్వనుల స్థానకరణ ప్రయత్నాన్ని, ఉచ్చారణ విధానాన్ని తెలిపేది ధ్వని విజ్ఞానం.
- ఒక భాషలో ఉన్న ఒక ధ్వనులు తర్వాత కాలంలో మార్పు చెందడాన్ని ధ్వని పరిణామం అంటారు.
- భాషలోని పదాల్లో అర్థం స్థిరంగా ఉండి శబ్దం మారడాన్ని శబ్ద పరిణామం లేదా ధ్వని పరిణామం అంటారు.
- ధ్వని పరిణామాన్ని ఆంగ్లంలో Phonetic Change అంటారు.

ధ్వని పరిణామం - భేదాలు

1. **వర్ణ సమీకరణం:** సమీకరణం అంటే కూడిక. రెండు భిన్న వర్ణాలు కలిసి ఏకవర్ణంగా మారడాన్ని వర్ణ సమీకరణం అంటారు. ఇది రెండు రకాలు. అవి..

i. **పూర్వ వర్ణ సమీకరణం:**

ఉదా: గది+లు = గదులు; పది+లు = పదులు
ములికి+లు = ములుకులు,
పలికి+లు= పలుకులు

ii. **పర వర్ణ సమీకరణం:**

ఉదా: గది+కు = గదికి; మది+కు = మదికి
వాని+కు = వానికి ;నది+కు = నదికి

2. **వర్ణ విభేదం:** ఒకే ధ్వనిని గాబరా, తడబాటు వల్ల రెండుసార్లు ఉచ్ఛరించినప్పుడు ఒక ధ్వని స్థానంలో వేరొక ధ్వని రావడాన్ని వర్ణ విభేదం అంటారు. ఇది వర్ణ సమీకరణానికి వ్యతిరేకమైంది.

ఉదా: వచించు + ఇంచు = వచింపించు
ఆవులించు+ ఇంచు = ఆవులింపించు
చూచు + ఇంచు = చూపించు

3. **వర్ణ సమ్మేళనం:** అనేక వర్ణాలు కలిసి ఏకవర్ణంగా రూపొందడమే వర్ణ సమ్మేళనం. దీనినే వర్ణ సంయోగం, వర్ణ సంయోజనం అని కూడా అంటారు.

ఉదా: ఱ, ర > ర; ళ, ల > ల; ణ, న > న

చెఱకు - చెరకు
ఱాయి - రాయి
ఱోలు - రోలు
ముళ్ - ముల్
కల్ - కల్
కణ్ - కన్ను
యాన్ - నేను

4. **వర్ణ వ్యత్యయం:** ఒక పదంలోని వర్ణాలు తారుమారు చెందడమే వర్ణ వ్యత్యయం. దీన్నే స్థాన పరివర్తనం, అక్షర విపర్యం అని కూడా అంటారు.

ఉదా: నవ్వులాట - నవ్వటాల
వారణాసి- వాణారసి
తమాషా - షాతమా
జగదొంగ - గజదొంగ
పారువం - పావురం,
పలుచన - చలుపన
గమనించు - మంచుగని
మోటతోలాలి - తోటమోలాలి

5. **వర్ణాగమం:** సామ్యం వల్ల, ప్రామాణికం కాదనే భావంతో కొత్త వర్ణాలు.. పదాల్లో చేరడాన్ని వర్ణాగమం అంటారు. దీన్నే వర్ణాధిక్యం అని కూడా అంటారు. ఉచ్చారణలో ఏదో కొరత ఉన్నట్లు భావించడం వల్ల ఇలాంటి ఆధిక్యత ఏర్పడుతుంది.

ఉదా: కోలాటం - కోలాటకం, దొంగాటం- దొంగాటకం, నడిరేయి - నడికిరేయి, వేగుచుక్క - వేగురుచుక్క.

6. **వర్ణ లోపం:** ఒక పదం చివర వచ్చిన హల్లు, మరొక పదం మొదట వచ్చినప్పుడు, మొదటిది లోపించడాన్ని వర్ణ లోపం అంటారు. దీన్నే సవర్ణ లోపం, అక్షర లోపం, వర్ణ నాశనం, హల్లోపం అంటారు.



ఉదా: నిప్పు + పుల్ల = నిప్పుల్ల
రెప్ప + పాటు = రెప్పాటు
కంచు + చెంబు = కంచెంబు
రెప్ప + పోటు = రెప్పోటు

7. **అజాదిత్వం:** కొన్ని హల్లులకు ముందు ఉచ్చారణలో అచ్చు చేర్చి పలకడాన్ని అజాదిత్వం అంటారు. దీన్నే స్వర ప్రారంభం అని కూడా పిలుస్తారు.

ఉదా: రథం - అరదం, స్కేలు - ఇస్కేలు
స్కూలు - ఇస్కూలు
స్కూటరు - ఇస్కూటరు
హోళిగ - ఓళిగ

8. **స్వరభక్తి :** భిన్న హల్లుల మధ్య మరో వర్ణం చేరడాన్ని స్వరభక్తి అంటారు. దీన్ని విప్రకర్ష, వికర్ష అని కూడా వ్యవహరిస్తారు.

ఉదా: తర్వాత - తరువాత
మర్యాద - మరియాద
రాత్రి - రాతిరి
పర్వము - పరువము
పల్చన - పలుచన
అల్పము - అలుపము
నిద్ర - నిద్దుర
కల్పము - కలుపము
లగ్నం - లగనము
చంద్రుడు - చందురుడు

9. **తాలవ్యీకరణం:** మూలద్రావిడ భాషలోని పదాది 'క' కారానికి తాలవ్యాచ్చులు పరమైనప్పుడు 'చ' వర్ణంగా మారుతుంది. ఇలా 'క' కారం 'చ' కారంగా మారడాన్ని తాలవ్యీ కరణం అంటారు.

ఉదా: కివి - చెవి, కిళి - చిలుక, కెంపు-చెంపు
కై-చేయి, కెందొవ- చెందొవ, కెఱయ్- చెఱయ్.

10. **లోప దీర్ఘం:** ఉచ్చారణలో ఒక వర్ణం లోపించేటప్పుడు ఏర్పడిన లోపాన్ని పూరించడానికి పూర్వ స్వరం దీర్ఘమవుతుంది. దీన్నే లోప దీర్ఘం లేదా లోప దీర్ఘత అంటారు.

ఉదా: గుర్రములు - గుర్రాలు, చివుకు - చీకు, కంచములు - కంచాలు, వజ్రములు - వజ్రాలు, ముత్యములు - ముత్యాలు, బలపములు - బలపాలు.

11. **అనుచిత విభాగం:** పదాలను తప్పుగా విరిచి వ్యవహరించడాన్ని అనుచిత విభాగం అంటారు.

ఉదా: కిళి + కళ్ = చిలుకలు (చిలుక +లు)
ఎళి + కళ్ = ఎలికలు (ఎలుక+లు)
ఈగలు, గొడుగులు, ఏనుగులు, కొలకులు, బల్లలు.

12. **ద్విత్వ కల్పనం:** కొన్ని పదాల్లో ద్విత్వం లేకపోయినా కల్పించి చెప్పడాన్ని ద్విత్వ కల్పనం అంటారు.

ఉదా: తలక్రిందులు - తల్లక్రిందులు
పడిన - పడ్డ, కొనిన - కొన్న, కలదు -కద్దు, తలడిలు-తల్లడిల్లు, తలమునకలు - తల్లమునకలు, తెలవారు - తెల్లవారు, వలదు - వద్దు.

అర్థ పరిణామం

విపరిమాణం అంటే మార్పు. భాషలో వర్ణాలు, ధ్వనులు, వాక్య నిర్మాణం, వ్యాకరణ నిర్మాణం ఇలా ప్రతిదీ మారినట్లుగా అర్థాలు కూడా మారుతుంటాయి. ఇలా ఆయా పదాలకు సంబంధించిన అర్థాల్లో కాలక్రమంలో కలిగిన మార్పుల్నే అర్థ పరిణామం అని అంటారు. అర్థ బోధనను వివరించేది సెమాంటిక్స్ (Semantics).

అర్థ విపరిమాణం- నిర్వచనం:

1. పదజాలానికి సంబంధించిన అర్థంలో కలిగే మార్పు అర్థ పరిణామం.

– ఆచార్య జి.ఎన్.రెడ్డి

2. భాష కాలక్రమాన మారుతుంది. కాబట్టి ఒక భాషలో కాలక్రమాన వర్ణాలు, వ్యాకరణ నిర్మాణం మారినట్లుగానే పదాల అర్థాలు కూడా మారతాయి. ఒక భాషలోని పదాల అర్థాల్లో వచ్చిన మార్పుని అర్థ పరిణామం అని అంటారు.

– ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం

అర్థ పరిణామంపై ప్రముఖ భాషా శాస్త్రజ్ఞులు ఆచార్య జి.ఎన్.రెడ్డి చేసిన కృషి పలువురి ప్రశంసల్ని పొందింది. ఆయన అ study of Telugu Semantics అనే అంశంపై పరిశోధన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి 1964లో పి.హెచ్.డి డిగ్రీ పొందారు. ఇది గ్రంథరూపంలో 1966లో వచ్చింది. తెలుగు భాషలో అర్థ పరిణామంపై వచ్చిన మొట్టమొదట పరిశోధన గ్రంథం ఇదే.

అర్థ పరిణామం- రకాలు

1897లో ఫ్రెంచి భాషావేత్త మైఖేల్ బ్రెయిల్ 'La Semantique' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఇది అర్థ విజ్ఞానానికి సంబంధించిన మొట్టమొదటి గ్రంథం. ఈ గ్రంథంలో బ్రెయిల్ చెప్పిన అర్థ పరిణామ రీతుల్ని ఆధారంగా చేసుకుని తెలుగు భాషలో జరిగిన అర్థ పరిణామాలను భాషావేత్తలు స్థూలంగా వర్గీకరించారు. అవి:

1. **అర్థ వ్యాకోచం:** అర్థం వ్యాకోచం అవడమే అర్థ వ్యాకోచం. అంటే మొదట పరిమితార్థాన్ని తెలిపే ఒక పదం కాలక్రమంలో విస్తృతార్థాన్ని తెలిపినట్లయితే అది అర్థ వ్యాకోచం.

ఉదా: 1. చెంబు 2. నూనె
3. కమ్మ 4. ధర్మరాజు
5. భీముడు 6. నారదుడు
7. మహారాజు 8. రాక్షసుడు
9. అవధాని 10. గంగ
11. అష్టకష్టాలు 12. అష్టైశ్వర్యాలు
13. తైలం 14. గ్లాసు.

2. **అర్థ సంకోచం:** అర్థం సంకోచం చెందడమే అర్థ సంకోచం. అంటే విశాల అర్థాన్ని బోధించే ఒక పదం సంకుచితార్థాన్ని లేదా తక్కువ అర్థాన్ని బోధిస్తే అది అర్థ సంకోచం.

ఉదా:1. చీర 2. కోక
3. మధు పర్కాలు 4. వస్తాదు
5. ఉద్యోగం 6. తద్దినం
7. ఆరాధ్యుడు 8. సంభావన
9. పెద్ద 10. వ్యవసాయం
11. మృగం 12. శ్రాద్ధం
13. సాంవత్సరీకం 14. నెయ్యి
15. సాహెబు 16. పత్రం

3. **అర్థ గౌరవం:** ప్రాచీన కాలంలో నింద్యార్థంలో వాడిన పదాలు, సామాన్య అర్థంలో వాడిన పదాలు కొన్ని నేడు గౌరవార్థాన్ని సంతరించుకున్నాయి. ఇలా మారడాన్ని అర్థ సౌమ్యత లేదా అర్థోత్కర్ష అంటారు.

ఉదా: 1. సభికులు 2. ముహూర్తం
3. మర్యాద 4. వైతాళికుడు
5. అదృష్టం 6. అంతస్తు

4. **అర్థ గ్రామ్యత:** జన వ్యవహారంలో ఉన్న మౌలిక అర్థానికి నష్టం కలిగి పరిహాసార్థంలో, నిందార్థంలో, నిమ్నార్థంలో పదం వాడితే దాన్ని అర్థ గ్రామ్యత అంటారు. పాత కాలంలోని అర్థం కంటే తర్వాత కాలంలో అర్థం నీచమైంది, చెడ్డది అయితే దాన్ని అర్థాపకర్ష అంటారు.

ఉదా: 1. కర్మ 2. ఛాందసుడు
3. వ్యంగ్యం 4. కంపు
5. సన్యాసి 6. స్వాహా
7. దేవదాసి 8. కళావంతులు
9. కైంకర్యం 10. అసహ్యం
11. సాని 12. విధవ
13. ముండ 14. గ్రహచారం
15. పూజ్యం 16. నిండుకొన్నవి
17. శనిగ్రహం 18. ఘటం

5. **సభ్యోక్తి :** సభలో, కొందరి సమక్షంలో, సంఘంలో, ప్రత్యక్షంగా వాచ్యం చేయడానికి వీలుకాని పదాల అర్థాన్ని పరోక్షంగా లేదా నూతన పదబంధ కల్పనతో తెలియజేసే విధానాన్ని సభ్యోక్తి అంటారు.

ఉదా:

i. **చనిపోవు** : కాలధర్మం, కీర్తిశేషుడు, బాల్చి తన్నాడు, శివైక్యం పొందాడు. స్వర్గస్థుడయ్యాడు, దివంగతుడయ్యాడు, దీర్ఘనిద్ర, నూకలు చెల్లాయి, పరమపదించాడు.

ii. **మూత్ర విసర్జన, మల విసర్జన:** ఒంటికి, రెంటికి, లఘుశంక, గురుశంక, దొడ్డికెళ్లు, చెరువుకెళ్లు, కాల్వకు పోవు, చెంబట్టికెళ్లు, బయటకుపోవు, బహిర్భూమికి పోవు.

iii. **మలం: అశుద్ధం.**

iv. మల విసర్జన ప్రదేశం: పాయిఖానా, దొడ్డి, మరుగుదొడ్డి.

v. కడుపుతో ఉంది (గర్భవతి): ఆవిడ ఉత్తి మనిషి కాదు, నెల తప్పింది.

6. **మృదూక్తి :** కఠిన భావాల్ని, దుఃఖస్ఫోరకమైన అభిప్రాయాన్ని మృదువైన రీతిలో చెప్పడమే మృదూక్తి.

ఉదా: దీపం కొండెక్కింది- దీపం ఆరిపోయింది
సూత్రం పెరిగిపోయింది - తెగిపోయింది.
నల్లపూసలు పెరిగిపోయాయి.

ఎగురుతున్న విమానం నుంచి బాంబు జార విడిస్తే..

ఫిజిక్స్ - యాంత్రికశాస్త్రం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

ప్రక్షేపకం (Projectile)

ఒక వస్తువును భూమి క్షితిజ సమాంతర తలానికి కొంత కోణం చేస్తూ పైకి విసిరినప్పుడు అది పరావలయ మార్గంలో ప్రయాణించి, మరో బిందువు వద్ద భూమిని తాకుతుంది. దీన్నే 'ప్రక్షేపకం' అంటారు. ప్రక్షేపకం ఎల్లప్పుడూ పరావలయ లేదా అర్ధ పరావలయ మార్గంలో ప్రయాణించి భూమిని తాకుతుంది.

వ్యాప్తి (Range): ఒక ప్రక్షేపకం భూమి క్షితిజ సమాంతర దిశలో పొందిన గరిష్ట స్థానభ్రంశాన్ని దాని 'వ్యాప్తి' అంటారు.

ఉదాహరణలు:

- తుపాకీ నుంచి వెలువడే బుల్లెట్ లేదా యుద్ధ ట్యాంక్ నుంచి వెలువడే విస్ఫోటక పదార్థాలు పరావలయ మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని ఛేదిస్తాయి.
- రాకెట్లు, క్షిపణులు కూడా పరావలయ మార్గంలో ప్రయాణించి గమ్య స్థానాన్ని చేరతాయి.
- గమనంలో ఉన్న ఒక వాహనం నుంచి బయటకు విసిరిన ఏ వస్తువైనా పరావలయ లేదా అర్ధ పరావలయ మార్గంలో ప్రయాణించి కింద పడుతుంది.
- గగనతలంలో ఎగురుతున్న జెట్ విమానం నుంచి బాంబును జార విడిస్తే అది పరావలయ లేదా అర్ధ పరావలయ మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని ఛేదిస్తుంది.

ప్రక్షేపకాన్ని 45° కోణంతో విసిరినప్పుడు దాని వ్యాప్తి గరిష్ఠంగా ఉంటుంది. 45° కంటే తక్కువ కోణంతో విసిరినప్పుడు అది పొందే వ్యాప్తి, ఎత్తు తక్కువగా ఉంటాయి. 45° - 90°ల మధ్య ఏదైనా కోణంతో ప్రయోగిస్తే అది చేరే ఎత్తు పెరుగుతుంది, కానీ వ్యాప్తి తగ్గుతుంది. ప్రక్షేపకాన్ని 90°ల కంటే ఎక్కువ కోణంతో ప్రయోగించాలంటే దాన్ని వెనుక దిశలోకి విసిరేయాలని గమనించవచ్చు.

యాంత్రిక శక్తి (Mechanical Energy)

ఒక వస్తువు క్షితి, గతి శక్తుల మొత్తాన్ని 'యాంత్రిక శక్తి' అని అంటారు.

స్థితి శక్తి: ఒక వస్తువుకు దాని స్థితి లేదా స్థానం లేదా నిర్మాణం వల్ల కలిగే శక్తిని 'స్థితి శక్తి' అంటారు.

స్థితి శక్తి (P.E.) = mgh

m = వస్తువు ద్రవ్యరాశి,

g = భూమి గురుత్వ త్వరణం,

h = భూమి ఉపరితలం నుంచి వస్తువు పొందిన ఎత్తు.

ఎత్తు విలువ పెరిగే కొద్దీ వస్తువు స్థితి శక్తి కూడా పెరుగుతుంది.

ఉదాహరణలు:

- రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులలోని నీటికి స్థితిజశక్తి ఉంటుంది.
- చుట్టగా చుట్టిన స్ప్రింగ్‌లోనూ స్థితి శక్తి నిల్వ ఉంటుంది.
- ఒక ధనస్సులో బాణాన్ని అమర్చి విల్లును వెనక్కి లాగినప్పుడు దానికి స్థితిజ శక్తి ఉంటుంది.

గతిజశక్తి: ఒక వస్తువుకు గమనం వల్ల కలిగే శక్తిని 'గతి శక్తి' అంటారు.

$K.E. = \frac{1}{2}mv$

$\therefore$ m = వస్తువు ద్రవ్యరాశి

v = వేగం

వేగం పెరిగే కొద్దీ వస్తువు పొందే గతి శక్తి కూడా పెరుగుతుంది.

ఉదాహరణలు:

- గమనంలో ఉన్న ప్రతి వస్తువుకు గతి శక్తి ఉంటుంది. కదులుతున్న వాహనంలోని వాయు ప్రవాహాలు, నీటి ప్రవాహాలు గతిజ శక్తిని కలిగి ఉంటాయి.

$K.E. = \frac{1}{2}mv^2 \Rightarrow K.E. \propto v^2$

- గమనంలో ఉన్న వస్తువు వేగాన్ని రెండింతలు చేసినప్పుడు దాని గతి శక్తి నాలుగు రెట్లు అవుతుంది.

$K.E. \propto (2v)^2 \Rightarrow K.E. \propto 4v^2$

- గమనంలో ఉన్న వస్తువు వేగాన్ని సగానికి తగ్గించినప్పుడు దాని గతి శక్తి నాలుగు రెట్లు తగ్గుతుంది.

$K.E. = \left(\frac{v}{2}\right)^2 \Rightarrow K.E. \propto \frac{v^2}{4}$

యాంత్రిక శక్తికి ఉదాహరణలు:

యాంత్రిక శక్తి అంటే ఒక వస్తువు ఏక కాలంలో స్థితి , గతి శక్తిని కలిగి ఉంటుంది.



- గగన తలంలో ఎగురుతున్న ప్రతి వస్తువు (విమానాలు, హెలికాప్టర్లు, రాకెట్లు, క్షిపణులు, మేఘాలు, పక్షులు, గాలిపటం, బెలూన్లు) యాంత్రిక శక్తిని కలిగి ఉంటుంది.
- సౌర కుటుంబంలో సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు, గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు యాంత్రిక శక్తి ఉంటుంది.
- పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్లకు కూడా యాంత్రిక శక్తి ఉంటుంది.
- గమనంలో ఉన్న రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి యాంత్రికశక్తిని కలిగి ఉంటాడు.

గమనిక: బావిలోని నీరు, లోయలోని వస్తువు, గని లోపల ఉండే కార్మికుడికి స్థితి శక్తి ఉంటుంది.

- తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు స్థితి శక్తి, భ్రమణ గతి శక్తులు ఉంటాయి.

శక్తి పరివర్తనం

- రిజర్వాయర్‌లో నిలకడగా ఉన్న నీరు కిందికి పడుతున్నప్పుడు దాని స్థితి శక్తి గతిజ శక్తిగా మారుతుంది. ఈ నీటి ప్రవాహానికి ఎదురుగా విద్యుత్ టర్బైన్లను అమరిస్తే.. జనరేటర్‌లో విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్‌ను జల విద్యుత్ (Hydro Electricity) అంటారు.
- గడియారంలో చుట్టగా చుట్టిన స్ప్రింగ్‌కు ఉండే స్థితి శక్తి గడియారంలోని ముల్లు తిరగడానికి కావాల్సిన భ్రమణ గతిజశక్తిగా మారుతుంది.
- బాణంతో కూడిన ధనస్సు విల్లును వెనక్కి లాగితే దానికి స్థితి శక్తి ఉంటుంది. ఇది బాణం కదలడానికి కావాల్సిన గతిజ శక్తిగా మారుతుంది. పక్షులను వేటాడటానికి ఉపయోగించే గులేర్‌లోనూ ఇదే విధమైన శక్తి పరివర్తనం జరుగుతుంది.
- సైకిల్ డైనమోలో యాంత్రిక శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.
- విద్యుత్ మోటార్‌లో విద్యుత్ శక్తి యాంత్రిక శక్తిగా మారుతుంది.
- పరుగెడుతున్న వ్యక్తిలో కండర శక్తి గతిజ శక్తిగా మారుతుంది.
- ఒక వ్యక్తి భవనం, పర్వతం, నిచ్చెన, స్తంభం మొదలైన వాటిపైకి ఎక్కినప్పుడు ఆ వ్యక్తి కండర శక్తి స్థితి శక్తిగా మారుతుంది. కానీ మార్గమధ్యమంలో స్థితి, గతి శక్తులు రెండూ ఉంటాయి.

భ్రమణ చలనం

ఒక వస్తువు స్థిరమైన అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తూ ఉంటే అది భ్రమణ లేదా కోణీయ చలనంలో ఉందని అంటాం. తిరుగుతున్న ఫ్యాన్ రెక్కలు, వాహనం చక్రాలు, సౌరకుటుంబంలోని గ్రహాలు, వాటి ఉపగ్రహాలు కోణీయ చలనాన్ని కలిగి ఉంటాయి.

భ్రమణ చలనంలో ఉన్న ప్రతి వస్తువుకు ఏక కాలంలో రేఖీయ, కోణీయ భౌతిక రాశులు ఉంటాయి.

1. **రేఖీయ స్థానభ్రంశం (Linear displacement):** స్థిరమైన అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమించే ఒక వస్తువు వృత్త పరిధిపై పొందే స్థానభ్రంశాన్ని రేఖీయ స్థానభ్రంశం అంటారు.

   ప్రమాణాలు: సెం.మీ., మీటర్లు.

2. **కోణీయ స్థానభ్రంశం (Angular displacement):** స్థిరమైన అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమించే ఒక వస్తువు వృత్త కేంద్రం వద్ద పొందే స్థానభ్రంశాన్ని కోణీయ స్థానభ్రంశం అంటారు.

   $\theta = \angle BOA$

   ప్రమాణాలు = డిగ్రీ, రేడియన్లు (అంతర్జాతీయ ప్రమాణం)

   రేఖీయ, కోణీయ స్థానభ్రంశాల మధ్య సంబంధం:

   వృత్త చాపం $AB = OA \times \angle BOA$

   $\therefore OA \rightarrow$ వృత్త వ్యాసార్ధం

   $\angle BOA \rightarrow$ వృత్త కేంద్రం వద్ద పొందిన కోణీయ స్థానభ్రంశం.

   $\bar{S} = r\theta$

3. **రేఖీయ వేగం:** స్థిరమైన అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమించే ఒక వస్తువు ఇచ్చిన కాలంలో వృత్త పరిధిపై పొందే స్థానభ్రంశాన్ని 'రేఖీయ వేగం' అంటారు.

   $\bar{V} = \frac{\bar{S}}{t}$

   ప్రమాణాలు: సెం.మీ./ సెకన్, మీ./సెకన్.

4. **కోణీయ వేగం:** స్థిర అక్షం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమించే వస్తువు నియమిత కాలంలో వృత్త కేంద్రం వద్ద పొందే కోణీయ స్థానభ్రంశాన్ని కోణీయ వేగం అంటారు.

   కోణీయ వేగం $(\omega) = \frac{\theta}{t}$

   ప్రమాణాలు: డిగ్రీ/సెకన్, రేడియన్లు/సెకన్

రేఖీయ, కోణీయ వేగాల మధ్య సంబంధం:

$V = r\omega$

- భ్రమణ చలనంలో ఉన్న వస్తువులోని వేర్వేరు కణాలకు వేర్వేరు రేఖీయ వేగాలు ఉంటాయి. కానీ కోణీయ వేగాలు మాత్రం అన్ని కణాలకు సమానంగా ఉంటాయి.

కోణీయ ద్రవ్యవేగం: భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే ద్రవ్యవేగాన్ని కోణీయ ద్రవ్యవేగం అంటారు. L= mvr

ప్రమాణాలు: గ్రామ్-సెం.మీ.^{2}/ సెకన్, కిలోగ్రామ్-మీ.^{2}/ సెకన్

$L = mvr \Rightarrow \frac{L}{r} = mv$

$V \propto \frac{1}{r}$ (ద్రవ్యరాశి స్థిరంగా ఉన్నప్పుడు)

కాబట్టి భ్రమణ చలనంలోని వస్తువు వృత్త వ్యాసార్ధం పెరిగితే దాని రేఖీయ వేగం తగ్గుతుంది.

ఉదా: భూమి చుట్టూ పరిభ్రమించే కృత్రిమ ఉపగ్రహాన్ని అల్ప కక్ష్య నుంచి అధిక కక్ష్యలోకి బదిలీ చేసినప్పుడు.. దాని కక్ష్యా వ్యాసార్ధం పెరుగుతుంది. అందువల్ల ఆ ఉపగ్రహం కక్ష్యావేగం తగ్గుతుంది.


ప్రచోదనం అనువర్తనాలు

- గమనంలో ఉన్న క్రికెట్ బంతిని పట్టుకునే క్రమంలో చేతులను ముందుకు చాచి, వెనక్కి లాగడం వల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. అందువల్ల చేతులకు ఎలాంటి గాయాలు కావు.
- జంపింగ్ పోటీలో.. దూకే ప్రదేశం వద్ద గొయ్యిని తవ్వి, దాంట్లో వరి లేదా రంపపు పొట్టు, ఇసుక, స్పాంజీ మొదలైన వాటితో అమర్చుతారు. అందువల్ల నేలను తాకే సమయంలో కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గడంతో దూకుతున్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు.
- వాహనాల్లో షాక్ అబ్జర్వర్లు (స్ప్రింగ్‌లు) అమర్చుతారు. వాహనం ఎగుడు దిగుడు రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు వీటి వల్ల ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- అతి సున్నితమైన గాజు, పింగాణీ, మట్టి వస్తువులను రవాణా చేసేటప్పుడు వాటి చుట్టూ దూది, గడ్డి, స్పాంజీ, థర్మాకోల్ మొదలైన పదార్థాలను అమర్చుతారు. కాబట్టి ఈ వస్తువులపై ప్రచోదన ప్రభావం తగ్గిపోయి అవి పగలకుండా ఉంటాయి.
- ఒక వ్యక్తి కొంత ఎత్తు నుంచి స్వేచ్ఛగా దృఢమైన తలంపైకి దూకితే.. అతడి శరీర బలాన్నంతా ఆ తలంపై స్వల్పకాలంలో ప్రయోగించడం వల్ల ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉండి తీవ్రమైన గాయాలవుతాయి.
- తగినంత లోతుతో కూడిన నీరున్న బావిలో దూకినప్పుడు కాలపరిమితి పెరగడంతో ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. అందువల్ల దూకిన వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు.
- సుత్తి సాయంతో ఇనుప మేకుపై తక్కువ సమయంలో ఎక్కువ బలాన్ని ప్రయోగించడం వల్ల ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉండి, గోడ లేదా చెక్క దిమ్మలోకి మేకు చొచ్చుకు వెళుతుంది.
- గమనంలో ఉన్న ఒక వాహనం అంతే ద్రవ్యరాశితో విరామస్థితిలో ఉన్న మరో వాహనాన్ని ఢీకొట్టినప్పుడు.. అది విరామస్థితిలో ఉన్న వాహనంపై తక్కువ సమయంలో ఎక్కువ బలాన్ని ప్రయోగిస్తుంది. కాబట్టి ప్రచోదన ప్రభావం వల్ల ఆగి ఉన్న వాహనానికి ఎక్కువ నష్టం జరుగుతుంది.

The facts attributed to my report...

Bank Exams

ENGLISH



Directions: Look at the italicized part of each sentence. Three alternatives are given, if one of them is better than the italicized part, indicate your response. If none of the substitutions improves the sentence, indicate D as your response.

1. They are waiting for Raju since morning.
   A) Have been waiting
   B) were waiting
   C) wait D) no improvement
2. They told me that they were already sold out all their belongings.
   A) Has sold already
   B) had already sold
   C) were already sold
   D) no correction
3. The disparity between the urban and the rural area has widen in the last decade.
   A) Areas has widened
   B) area have widen
   C) area has widened
   D) no alternative
4. He has studied Spanish since four years.
   A) Since four years ago
   B) for four years
   C) from four years
   D) no improvement
5. Roads are wet, it must had rained last night.
   A) Must have been B) must have
   C) would have been
   D) no improvement
6. In winter, nights are more colder than days.
   A) More cold B) colder
   C) coldest D)no improvement
7. It is better to say too little than too much.
   A) Little B) only little
   C) very little D) no improvement
8. A large number of houses has come up around Secunderabad.
   A) Is coming up B) are coming up
   C) had come up D) no improvement
9. The rules of chess require that one made only one move at a time.
   A) Makes B) make
   C) will make D)no improvement
10. Gita enjoys to tell stories to children.
    A) Telling stories
    B) how to tell stories
    C) to narrate stories
    D) no improvement
11. 'Daffodils' have been written by William Wordsworth.
    A) Has been written B) are written
    C) are being written
    D) no improvement
12. By temperament the French are reserved, so they prefer to live in solitude.
    A) French people B) French
    C) some French
    D) no improvement
13. Do not take an umbrella lest you do not get wet.
    A) Lest you should
    B) lest you should not
    C) lest you might not
    D) no improvement
14. He has been working off and on for several years to compile a dictionary.
    A) Regularly B) constantly
    C) on and off
    D) no improvement
15. But for the two incomes, we would be hard out.
    A) Hard upon B) hard up
    C) hard on D) no improvement
16. It is all and one to me whether he lives in Bangalore or Mumbai.
    A) All but one B) all one
    C) one and the same
    D) no improvement
17. The trunk is so heavy that I can hardly carry it.
    A) As B) too C) much
    D) no improvement
18. Most willingly Ravi agreed to go to Mumbai and remain there for a month.
    A) Go to B) on going to
    C) to going D)no improvement
19. Hemanth did not know the answer and I did not neither.
    A) And neither did I
    B) and either did I
    C) and neither have I
    D) no improvement
20. Although her parents warned her of what would happen, she continued to disobey them.
    A) Off B) on
    C) to D) no improvement
21. When new coins were issued, the old ones were called out.
    A) In B) up C) off
    D) no improvement
22. It will depend now on they coming on time.
    A) Their coming
    B) them coming
    C) theirs coming
    D) no improvement
23. He told us the story in a nutshell.
    A) In the nutshell
    B) putting it in a nut
    C) in nutshell D) no correction
24. Ravi is extraordinarily clever at mimicking his friends.
    A) Clever for mimicking
    B) clever in mimicking
    C) clever to mimick
    D) no correction
25. The facts attributed to my report in your paper are wrong.
    A) Attributing towards
    B) attributed against
    C) attribute for D) no correction

Answers:

1) A	2) B	3) A	4) B	5) B
6) B	7) A	8) B	9) A	10) A
11) A	12) D	13) A	14) C	15) B
16) C	17) B	18) B	19) A	20) D
21) C	22) A	23) D	24) B	25) B

PRACTICE TEST

Directions: In each sentence there is a blank) To fill the blank, three words are given below the sentence, which are denoted by (i), (ii) and (iii)) Find out which one can be used to fill up the blank and make the sentence meaningfully complete.

1. This is the common ____ followed by employees in many companies.
   i) Sense ii) practice iii) outcome
   a) Only i b) only ii c) only iii
   d) i and ii only e) ii and iii only
2. In such a ____changing scenario, the outdated methods should be dropped.
   i) Fast ii) speed iii) rapidly
   a) i or ii only b) ii or iii only
   c) i or iii only d) any one
   e) only i
3. He was the first to ____ this novel method in our factory.
   i) Intiate ii) start iii) implement
   a) Only i b) only ii c) only iii
   d) i or ii only e) any one
4. After spending a small amount on medicines, he refunded the entire ____ to his father.
   i) Remained ii) balance
   iii) residual
   a) Only i b) only ii
   c) only iii d) i and iii only
   e) ii and iii only
5. It happened inadvertently; he didn't do it -____.
   i) Deliberately ii) purposefully
   iii) intentionally
   a) Anyone b) i or ii only
   c) i or iii only d) ii or iii only
   e) none of these

In each sentence below one word has been printed in bold. Below the sentence, five words/ groups of words are suggested, one of which can replace the word printed in bold without changing the meaning of the sentence. Find out the appropriate word/ group of words in each case.

6. A very stubborn attitude in life cannot prove helpful.
   a) Uncooperative b) rigid
   c) unsuitable d) unhelpful
   e) inapplicable
7. Travel will familiarize you with new customs.
   a) Adjust b) popularize
   c) satisfy d) influence
   e) acquaint
8. His appearance was extremely misleading.
   a) Attractive b) depressing
   c) deceptive d) sad
   e) normal
9. He was a cunning businessman.
   a) Crafty b) successful
   c) dishonest d) corrupt
   e) respected
10. The affluence of Hindi film actors has no match.
    a) Handsome appearance
    b) brave action c) healthy physique
    d) wealth condition
    e) intelligent deed

Answers:
1) B 2) C 3) E 4) B 5) C 6) B 7) E 8) C 9) A 10) D

Directions: Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in the proper sequence to for m a meaningful paragraph; then answer the questions given below them.

A. There is ample justification for the phenomenon of the description.
B. In the present era also, efforts are being made to rejuvenate Pali.
C. A curious researcher can study them provided he has mastery over Pali language.
D. The Indian tradition describes Buddha as an advocate of analytical method.
E. Pali was perhaps the most commonly used language in those days.
F. This justification is found in several discourses.

1. Which of the following should be the FIRST sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
2. Which of the following should be the SECOND sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
3. Which of the following should be the FOURTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
4. Which of the following should be the FIFTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E
5. Which of the following should be the SIXTH sentence after rearrangement?
   a) A b) B c) C d) D e) E

Directions: In each sentence below four words have been printed in bold which are numbered (a), (b), (c) and (d)) One of these words may be misspelt or inappropriate in the context of the sentence. Find out the wrongly spelt or inappropriate word. The number of that word is the answer. If all four words are correctly spelt than the appropriate answer is (e) i.e) 'All correct')

6. Mary constantly (a) talks about herself irregardless (b) of other people's (c) interests (d)) All correct (e)
7. All roads, hotels (a) and restaurants (b) in the surrounding (c) area were devastated (d) All correct (e)
8. As soon as Gandhi presented (a) his proposal (b) Muni sumoned (c) his advisors (d) All correct (e)
9. The committee (a) is stranded (b) unles (c) the storm lets up (d)) All correct (e)
10. The minister (a) gave an exeptional (b) speech (c) at the inauguration (d)) All correct (e)

Answers:
1) D; 2) A; 3) C; 4) E; 5) B proper sequence is DAFCEB; 6) B proper word is 'regardless'; 7) E; 8) C correct spelling is 'summoned'; 9) C correct spelling is 'unless'; 10) B correct spelling is 'exceptional'